UNIVERSAL LIBRARY
OU_206204
UNIVERSAL LIBRARY

శ్రీ జ్ఞానప్రసూనమాలిక ద్వితీయ ప్రసూనము.

శ్రీరస్తు.

శ్రీనాథమహాకవిచే రచియింపఁబడిన

భీమఖండము అను నామాంతరముగల

శ్రీ భీమేశ్వరపురాణము.

కొత్తపల్లి-అన్నపూర్ణమ్మచే బ్రకటింపఁబడియె.

మూఁడవకూర్పు.

శివుఁడు—"**మణి కొనువాని వెతకదవనిఁ గొనువాఁడె రత్నంబు నరయుఁ గాదె?"

౧౯౨౯.

Copyright Registered.

PRINTED AT THE
BRITISH MODEL PRESS, CHOOLAI, MADRAS.

1929.

శ్రీ.

విజ్ఞప్తి.

ఆంధ్రులారా!

మన భాషయం దనేక కవిసార్వభౌము లనేక కబ్బంబుల వ్రచియించి మించిరి. అవియెల్ల నాఖుశుఘుణశిథిలబంధనాది పీడలచేఁ దఱచుగ నశింపఁగా మిగిలినవి కొన్నియేయున్నవి. తక్కినవి కొన్ని నామమాత్రావశిష్టంబులై గ్రంథాంత గోదాహృతస్వపద్యంబులచే వానిమహిమనూహింపఁజాలు పండితవరేణ్యులమనంబులం గడలేని చింత రగుల్కొనఁ జేయఁ జాలి యున్నవి. ముద్రాయంత్రాద్యుత్తమసాధనానుపపత్తిచేఁ బూర్వ మీపీడ యనివార్యంబై యుండెఁ గాని యిక్కాలంబున నేమో, మిగిలినవానిని భద్రపఱుచుకొని మనకును మన వెనుకటివారికిని భద్రంబొనగూర్పఁదగు నుపాయంబు లనేకము లేర్పడియున్నవి. వీనిని మన మెట్లుపయోగించుచున్నాము? దాన మన భాషయందలి గ్రంథసంచయ మెంత రక్షనొందినయది? యనుట నాలోచింపవలసియున్నది.

ప్రకృతమందు మన భాషయందు విలువకుం దొరకు గ్రంథముల రెండుతెఱంగుల విభజింపనగు. ఉల్లిపొరలవంటి కాగితంబులపైఁ దగిలియుఁ దగులక యచ్చొత్తింపఁబడి తప్పులకుప్పలై యతి దూష్యంబులై నెగడు ‘గుజిలీ’ పుస్తకములు కొన్ని, ఇపుడుండెడు పుస్తకములలో మూఁడుపాళ్లిట్టివియే. వీని వెల సులభమ కాని ఫలము సున్న. వీనియందువర్ణలోపంబులె లెక్కకుమిక్కుటంబులై యున్నవన నిఁకఁ గేవలము పండితవేద్యంబు లగుగణయతిప్రాసాదిలక్షణవైపరీత్యంబుల సంగతి వేఱుగఁ జెప్పవలయునా? దీనికి నుదాహరణంబుగ నిట్టిగ్రంథ మొకదానినుండి యీ క్రిందిపద్యములందున్న రీతిని ముద్రింపించుచున్నాము. చూడుఁడు.

కం.‘‘అటువచ్చినహారుడల్ల, మతటుకునదయ జూచిలేచి తనపీఠిక నా
క్కటనునిచియిష్టబాషలు, నిడియించియతండమగ గౌరినాథునికనియెన్.’’

కం.‘‘సాకారుం డొదలపగని, రాకారుడో యాదిపురుషాకృతి యిపుడుం, గైకొనిన
ఘనుడో యిట్లని, యాకలాత్మజుడైన నలవియె బొగడన్.’’

యిటుగాక మంచికాగితములపై నచ్చొత్తింపఁబడి చదువుటకుముందు చూచుట కింపగునట్లు సంపుటీకరణముగావింపఁబడియుండు నొక కొన్ని గ్రంథంబు లిపుడిపుడు పొడసూపుచున్నయవి. ఇవి పండితపరిష్కృతంబులై నెగడుటచే వీనియందుఁ దప్పులు నంతగఁ గానఁగావు. అయినను వీని వెల యధికమగుటచేఁ బైకనిన ‘గుజిలీ’ పుస్తకములకును వీనికిని సవతిపోరు వాటిల్లఁగాఁ జిన్నతనంబుచే వన్నెకెక్కు నయ్యవి

యే పామరులకు గ్రాహ్యములై మించెడిని. నిష్ప్రయోజనమగు వస్తువునకిడిన యది యెంతయైనను నష్టమేకా యనివిచారము లేక యటుచేసినను గుణగ్రాహులగు కొందఱు మాత్ర మీయుత్తమగ్రంథంబులనె కొనియెదరు. అయిన నట్టివారి సంఖ్య కొద్దియగును గ్రంథముల వెల యధికము కావలయు. ఇందువలన నట్టి యుద్యమములయం దుత్సాహము కొఱవడును. ఈ కొఱఁతను వారింపఁదగు నుపాయమెయ్యది? దీర్ఘాలోచనపై నీ ప్రశ్న కిది తగునుత్తరమని మాకుఁ దోఁచె. అది యెద్దియనిన కొంత నష్టమున కోర్చియైనను 'గుజిలీ' పుస్తకముల విలువయు నొందువానిగుణము నొక్కటఁ గూర్పవలయు. అట్లు చేయుటవలన రెండువిధములైన లాభముకల్గును. తక్కువ వెలఁబెట్టి యీ గ్రంథములఁ బామరులుఁ గొనఁజాలుదురు. దానవారికి వీనికిని 'గుజిలీ' పుస్తకములకుఁ గల తారతమ్యము లేర్పడును. అంత నభ్యాసముచే గుణగ్రాహకత్వమేర్పడ గుణరహితమగు వస్తువులయం దరుచిపుట్టును. ఇది యొక లాభము. గ్రంథముల ముద్రించువారును మునుపటివలె నత్యధికలాభముఁ గోరక కొంతలాభముతోనె తృప్తిఁబొందవలసి వచ్చెను. దాన నుద్గ్రంథముల విలువయుం దగ్గును. ఇది మఱియొక లాభము. ఈ రెండును గూడిన నాంధ్రప్రపంచంబునఁ గల గ్రంథసంఖ్యయుఁ జదువరుల సంఖ్యయు హెచ్చకమానదు.

ధనశాస్త్రసూక్ష్మతల నింతగఁ జర్చించు మేము మాకు నష్టముకలుగు యత్నముం జేయుదుమనియు, దాన నీయుద్యమము కొనసాగదనియుఁ దలఁపవలదు. విశేషలాభమును మేము కోరలేదకాని నష్టమున కేమాత్ర మొడిగట్టలేదు. కావున మా యత్నము సఫలంబగుననుట కెంతమాత్రమును సందియంబులేదు. ఇఁక నది యెట్టిదనుట వివరించెదము కనుఁడు.

«శ్రీజ్ఞానప్రసూనమాలిక» యను పేరఁ గ్రమంబుగఁ బుస్తకరాజిఁ బ్రకటించుచుందుము. మాచేఁ బ్రకటింపఁబడు గ్రంథములెల్ల నునుపుచే మించు దళసరికాగితములపైఁ జక్కగ నచ్చొత్తింపఁబడి పండితపరిష్కృతములై వెలయు. పద్యంబులెల్లఁ బాదమునకొకపఙ్క్తియు యతిస్థానములంగుర్తును గలిగియుండును. సంపుటీకరణమును దృఢముగఁ జేయింతుము. ఇంతచేసియు వెల యించుమించుగ 'గుజిలీ' పుస్తకములకుంబలె యుండునట్లు నియమింతుము!! ఈ కాలపుఁ దేనె లొలుకుమాటలంగల ప్రకటనలచే మోసపోయిన యనేకులు కాలక్రమంబున మాచేఁ బ్రకటింపఁబడు గ్రంథముల గౌరవముఁ గొనియాడఁగలరని నమ్ముచున్నాము. మాకుఁ 'జందాలు' ముందుగఁ బంపనక్కఱలేదు. భాషాభిమానులందఱు నీగ్రంథములం గన్నులారఁ జూచినపిదప నాదరించినఁజాలు.

ఇట్లని విన్నవించు సుజనవిధేయులు,

ర. వేంకటసుబ్బయ్య, ఎమ్. ఏ., క్రో. వేంకటపద్మనాభశాస్త్రి.

శ్రీ.

శ్రీ భీమేశ్వరపురాణము.

పీఠిక.

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకుఁడగు శ్రీకాళహస్తీశ్వరుని యర్ధాంగలక్ష్మియు జగజ్జననియు నగు శ్రీజ్ఞానప్రసూనాంబకు భక్తిమెయి మేమర్పింపఁబూనిన "శ్రీజ్ఞానప్రసూనమాలిక" యందు ద్వితీయప్రసూనముగ నీ భీమఖండ మనునామాంతరముగల శ్రీభీమేశ్వరపురాణముం గూర్చితిమి. ప్రథమప్రసూనమగు శ్రీకాళహస్తిమాహాత్మ్యము నిజవాసనా వెల్లితాంధ్రప్రపంచం బై నెగడసాగి యైదేండ్లైనను ద్వితీయప్రసూన మింతకాలము పొడగానరాకుండుటకుఁ గతం బీగ్రంథమందుఁగల చిక్కులతోడఁ గేవలము ధనాభ్యులముకాని మా యత్నములు ముద్రణాద్యవసరములందవలసగతి నహించుటయ. ఈ గ్రంథముయొక్క ప్రతులు చిక్కుట మిక్కిలి యరుదు.

మహారాజరాజశ్రీ, సమర్థి రంగయ్యసెట్టి బి. ఏ., గారొకప్రతియు, బ్రహ్మశ్రీ, మహారాజరాజశ్రీ, గురుజాడ శ్రీరామమూర్తిపంతులుగారొక ప్రతియు, బ్రహ్మశ్రీ, మహారాజరాజశ్రీ, పోతాప్రగడ బ్రహ్మానందముగారొక ప్రతియు మా కిప్పించిరి. ప్రాచీన పుస్తకభండారమునందు రెండుప్రతులు చిక్కినవి. బ్రహ్మశ్రీ, మహారాజరాజశ్రీ, దర్భా వెంకయ్య బి. ఏ., బి. ఎల్., గారు, సంస్కృతభాషలో ముద్రింపబడియుండు భీమకండంబను గ్రంథంబొకటిని మా కొసంగిరి. వీనిని సహాయముగాఁగొని యీ భీమేశ్వరపురాణంబును మాశక్తికొలఁది సంస్కరించి వ్రాయించి ముద్రింపించినారము.

ఈ గ్రంథమునఁ దొలుదొల్త విఘ్నేశ్వరుని ప్రార్థనలోనె పద్యము వ్రాఁతప్రతులయం దిట్లుండెను:—

ఉ. ఏనిక మోము తెల్లెలుక నెక్కినరావుతుగాచవాసునే
నానియనుంగు పెద్దనవినాయక దేవుఁడుకర్ణతాళజం
ఝానిలమారుతంబున నిరంతరముం బ్రబలాంతరాయసం
తానఖనాఖనాఖనఖదంతముల న్విదళించుగావుతన్.

ఈ పద్యముంకూర్చి మే మెఱింగినపండితుల నందఱనడిగినారము కాని యొక్కొకరును గ్రుక్కలుమ్రింగినవారలె, మార్పులు సూచించినవారలె. అయినను మా

ప్రత మొకటికలదు. అది యేదియందు లేని మేము ప్రకటించు గ్రంథములయం దాయీ గ్రంథకర్త లేపదములు ప్రయోగించియుందురో వానిని సాధ్యమైనంతవఱకు నూహించి వేయవలయుననేకాని మాకుం దెలియనిచోట్ల నుండు నక్షరములఁదీసి పాఱవైచి మాకవిత్వ మితికింపఁగూడ దనుటయే. ఈ నిర్బంధమునకు లోనైన మే మీ వినాయకస్తుతింగల పద్యముంగూర్చి పడినకష్ట మా వినాయకునకే యెఱుక. ఇట్టి కష్టము లీగ్రంథమం దెన్నియో యుండినవి. వానినెల్ల శ్రీజ్ఞానప్రసూనాంబ కరుణ చేతను బెద్దలసహాయమువలనను గడచి నేఁటి కీగ్రంథముఁ బ్రకటింపఁ గంటిమి.

ఇది పంచాశత్ఖండమండితం బగు స్కాందంబులోని యొక ఖండము. భీమఖండము నాఁబడు. గోదావరిజిల్లాలోని దక్షారామము లేక భీమేశ్వరం బనునొకశివస్థల మాహాత్మ్యముం దెలుపునది. ఆస్థలంబునకు దక్షిణకాశియను సంజ్ఞయుఁ గలదు. అది భోగమోక్షదం బని ప్రసిద్ధిఁ గాంచినది. దేవభాషయందు ముప్పదిరెండు సర్గలుగా విభజింపఁబడి యించు మించుగ రెండువేల శ్లోకములుగల యీ గ్రంథమును నాంధ్రంబున శ్రీనాథుఁ డను మహాకవి యేడాశ్వాసముల గ్రంథముగ విరచించె.

శ్రీనాథుఁడు పాకనాటి నియోగిబ్రాహ్మణుఁడు. భారద్వాజసగోత్రుఁడు నాపస్తంబసూత్రుఁడు బ్రాహ్మీవర ప్రసాదలబ్ధుఁడును శివపూజారతుండు. ఈయన తల్లిదండ్రులు భీమాంబయు మారయయు. తాత పద్మపురాణంబును రచించిన కమల నాభామాత్యుఁడు. వీనికిం బ్రమాణంబు లెవ్వియనిన:—

శా. భారద్వాజపవిత్రగోత్రుని శుభా♦పస్తంబసత్సూత్రు వి
ద్యారాజీవభవుండు మారయకుఁ బు♦ణ్యాచార భీమాంబకు
న్గారామైనతనూజు నన్ననఘు శ్రీ♦నాథాఖ్యునిం బిల్చి స
త్కారం బొప్పఁగ గారవించి పలికె♦ న్గంభీరవాక్ప్రౌఢిమన్. నైషధము.

శా. బ్రాహ్మీదత్తవర ప్రసాదుఁడ వురు♦ప్రజ్ఞావిశేషోదయా
జిహ్మస్వాంతుఁడ వీశ్వరార్చనకళా♦శీలుండ వభ్యర్హిత
బ్రహ్మాండాదిమహాపురాణచయతా♦త్పర్యార్థనిర్ధారిత
బ్రహ్మజ్ఞానకళానిధానమవు నీ♦భాగ్యంబుసామాన్యమే. నైషధము.

మ. కనకక్ష్మాధరధీరు వారిధితటీ♦ కాల్పట్టణాధీశ్వరుఁ
ఘనుని న్బద్మపురాణసంగ్రహకళా ♦ కావ్యప్రబంధాధిపుఁ
వినమత్కాకతిసార్వభౌముఁ గవితా♦విద్యాధరుం గొల్తు మా
యనుఁగుందాతఁ బ్రదాత శ్రీకమలనా♦భామాత్య చూడామణిన్. భీమ

ఈ కవిరచించిన గ్రంథములు మే మెఱింగినంతవఱకు నెవ్వియనిన:—

1. నవమరుత్తుచరిత్రము.
2. పండితారాధ్యచరితము; ఇది వేమారెడ్డి సేనానాయకుఁడైన మామిడి ప్రెగ్గడయ్యకు నంకితము.
3. శాలివాహనసప్తశతి.
4. నైషధము, ఇది వేమారెడ్డి సేనానాయకుని తమ్ముఁడైన మంత్రి సింగనకు నంకితము.
5. భీమఖండము; ఇది వీరభద్రరెడ్డి మంత్రియైన బెండపూఁడి యన్నామాత్యున కంకితము.
6. కాశీఖండము; ఇది వీరభద్రరెడ్డి కంకితము.
7. వీథినాటకము.
8. హరవిలాసము; ఇది వేమారెడ్డియొద్ద సుగంధ భాండాగారాధ్యక్షుఁడైయున్న సిరయాల తిప్పయ్య కంకితము.
9. పల్నాటి వీరచరిత్రము.
10. నందనందనచరిత్రము.

వేమారెడ్డియు, వీరభద్రరెడ్డియు నన్నదమ్ములు.

ఈ గ్రంథంబులు వ్రాయఁబడినవరుస కాశీఖండములోని యీ పద్యమువలన నొకింత తెలియును:—

సీ. చిన్నారి పొన్నారి ♦ చిఱుతకూఁకటినాఁడు, రచియించితి మరుత్త♦రాట్చరిత్ర
నూనూఁగుమీసాల ♦ నూత్నయౌవనమున, శాలివాహనసప్త ♦ శతినొడివితి
సంతరించితి నిండు ♦ జవ్వనంబునయందు, హర్షనైషధకావ్య♦మాంధ్రభాషఁ
బ్రౌఢనిర్భరవయః ♦ పరిపాకమునఁగొని, యాడితిభీమనా♦యకునిమహిమఁ
బ్రాయమింతకుమిగులఁగై ♦ వ్రాలకుండఁ, గాశికాఖండమనుమహా♦గ్రంథమేను
దెనుఁగుఁజేసెదఁగర్ణాట ♦ దేశకటక, పద్మవనహేళిశ్రీనాథ ♦ భట్టసుకవి.

ఈ గ్రంథంబులు సంస్కృత జటిలంబులై ముద్దులుగుల్కుశైలిని సలక్షణంబగు భాషను వ్రాయఁబడియున్నవి. ఈ కవివ్రాయు సీసపద్యములు చూడఁ జూడఁ జవులొలుకుచుండును.

ఈయనకవిత్వము మిక్కిలి రసవంతమనుటయం దీయనకుఁ గలిగియుండిన నమ్మకమునకుఁ గాశీఖండము కృతిభర్తయగు వీరభద్రరెడ్డిచెప్పినట్లు వ్రాయఁబడి

యుండు నీ పద్యము నిదర్శనము. ఈకవి తన కావ్యములయం దేయేవిధముగ భాషను బోషింప యత్నించినదియు నీపద్యము తెలుపును:—

సీ. వచియింతు వేములవాడ ♦ భీమనభంగి, నుద్దండలీలనొ ♦ క్కొక్కమాటు
భాషింతు నన్నయ ♦ భట్టుమార్గంబున, నుభయవాక్ప్రౌఢినొ ♦ క్కొక్కమాటు
వాకృత్తు తిక్కయ ♦ జ్వప్రకారము రసా, భ్యుచితబంధముగ నొ ♦ క్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధ ♦ పరమేశ్వరుని తేవ, సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు.

శ్లో. “కాశీఖండ మయఃపిండం నైషధం విద్వదౌషధమ్”

అనునటుల దేవభాషలో మిక్కిలి కఠినములు నాఁ బ్రసిద్ధిఁ గాంచిన కావ్యముల నీ కవిశిఖామణి సాహసించి తెనింగించెనన నీతని సామర్థ్యమునుగుఱించి వేఱు గఁజెప్ప నక్కఱయుండదు. ఈ కవి వ్రాసినగ్రంథములలో గొప్పవియు రసవంతములును ముద్రితములు నగు కాశీఖండము నైషధ మనునవి భాషాంతరీకరణములు తక్కినవియు నారసిచూచినఁ దఱచు దేవభాషలోని యేదో యొక గ్రంథమునం దుండి వ్రాయఁబడినట్లె యేర్పడును. ఎట్లనం బ్రకృతము శ్రీ సరస్వతియను మాసపత్రికయందు ముద్రింపఁబడుచుండు హరవిలాసమున 4-వ యాశ్వాసమున గౌరీతపస్సు, వివాహసందేశము మొదలగు పట్లం జూడుఁడు. కాళిదాసు కుమారసంభవమునకు యథాశ్లోకము భాషాంతరీకరణముగ నుండుట తెలియును. ఈ కవివ్రాసిన భాషాంతరీకరణములు యథాశ్లోకముగ వ్రాయఁబడి యుండలేదు; ఈ విషయమున నీకాలపు భాషాంతరీకరణములగు కుమారసంభవము శాకుంతలాది నాటకములు మొదలగువానితో నివి తులఁదూఁగవు. తనతో సమకాలికుఁడైన బమ్మెరపోతనామాత్యుఁడు మూలము ననుసరించినంతమాత్రముఁగూడ నీకవి యనుసరించియుండ లేదు, దృష్టాంతములం జూడుఁడు:—

23-వ పుట 13-వ పద్యమున “సంతతము దేవవేశ్యాభుజంగుఁడతఁడు” అని యున్నది. దీనికి మూలము “సహిసర్వదేవరాట్” సాధ్యమైనపట్ల నెల్లనిట్లు దేవునకేని గొప్పవారికేని యీ భుజంగత్వముఁ గల్పించుట యీ కవియొక్క గొప్పలోపము. దీనివలననే కృతిపతినింగూర్చి షష్ఠ్యంతములలో “పంచారామవధూటీ పంచాస్త్రవిహారకేలి పాంచాలునకున్” అని వ్రాసెను. ఇది యాకృతిపతికేనిఁ బంచారామవాసినులగు పుణ్యాంగనలకేని గౌరవ జనకంబుగ మాకుఁ దోఁపదు.

23-వ పుట 14-వ పద్యము "అతని నిశ్శ్వాసముల మాత్ర ♦ నానాకావా, వేదములును జరాచర ♦ విశ్వజగము." దీనికి మూలము "భవత్యపాఙ్గమాత్రేణ తస్యసర్వమిదంజగత్."

45-వ పుట 18-వ వచనము. "వేదండవదనశుండాకాండచులికితోన్ముక్తసప్తగోదావర సలిలధారారఘుణాత్కారబృంహిత బ్రహ్మాండగోళంబును" అను దానికి మూలము "సప్తగోదావరతట క్రీడాసక్తస్యశీకరైః। గజాస్యస్య కరోన్ముక్తైః క్లిన్నమార్తాణ్డమణ్డలమ్."

91-వ పుట 153-వ పద్యము "పుండరీకత్వక్స్ర ♦ కాండాతిసుండితి, కటిమండలంబు" దీనికి మూలము "పుణ్డరీకోద్భవ శిరోమాలికాహారశోభితమ్."
ఇందుఁ బుండరీశబ్దము తక్క దానియర్థము సహితము భిన్నము.

ఇట్లున్నను నొక్కొక్క యెడమూలాతిక్రమణమె రసమును మిక్కిలి పోషించినట్లగపడును. సూర్యోదయాది వర్ణనములందును నీకవి నిజకవితాప్రాగల్భ్యము విపులముగఁ దెలిపియున్నాఁడు. వలయునేని 25-వ పుట 30-వ పద్యము. తే. సంజకెంపునుదిమిరపుం ♦ జంపునలుపు, గమిచి బ్రహ్మాండభాండంబు ♦ గరము మెఱసెఁ, బరమపరిపాకదశవృంత ♦ బంధమెడలి, పతనముగు తాటి పంటితోఁ ♦ బ్రతిఘటించి." యను దీనిం జూడుఁడు. ఇట్టివి కొల్లలుగనున్నయవి. కవన మెచ్చుటనేగాని తడవికొనినట్లగపడదు. "ముగురంగూర్చిన ముండదైనమునకుఁ ♦ మోమోట లేదోసువిూ" యను దానివంటి దేశీయములు మంచినీళ్లప్రాయముగ నీకవి వాడును. వేయేల? హారవిలాసమున "గప్పలు, గఱరనరట్కరదవర గట్టనియఱచెఁ" అని కప్పలకూఁతలను గవిత్వమునఁ జేర్చివ్రాసిన యీ మహాకవి శైలియిట్టిట్టి దనవలయునే?

ఇతనికి శైవపక్షపాతము మెండనుట యీతనిచే రచింపఁబడిన గ్రంథములవలననేకాక యీ భీమఖండమునందు శ్రీకూర్మము సర్పపురమునుంగూర్చి మూలమున రెండధ్యాయములు మిక్కిలి విపులంబుగ స్తుతిపాఠములతోడ వ్రాయఁబడియుండ నాంధ్రంబున నీ రెండుస్థలములు నొక్కపద్యమున (29-51) నొక్కొక్క పాదమున నతిసంక్షేపముగ వర్ణింపఁబడుటవలనను దెలిసికొననగును.

88.	137	ముజ్జగంబు
13.	90	
37.	120	ఎల్లఁ శిష్యుల
107.	77	సీమ[illegible].

ఇట్టివి కొన్ని మృగ్యంబులగు ప్రయోగంబు లీకావ్యంబునఁ గనఁబడినవి. ఆంధ్రలక్షణంబు దెఱంగుంబట్టి యివి లక్షణవిరుద్ధంబులన సాహసింపము అఖండ యతి యీకవికి సమ్మతము.

ఉత్తరభాగమునం దేకారణముచేతనో యీ గ్రంథము మిక్కిలి యజాగ్రత్తతో వ్రాయఁబడిన ట్లగపడుచున్నది. ఎట్లనిన:—

54-62 తీర్థముల పేళ్లును వరుసయుఁ గ్రమంబుగ లేదు.

85 వక్త యెవరయినదియు మఱచి వ్రాయఁబడి యున్నది.

106-వ పుట 67-వ పద్యమున అయిదుతరముల పూర్వుల నవలమీఁద, నందఱను గాచు నూర్ధ్వలో♦ కాలయముల దీనికిమూలము "దశపూర్వా౯ దశాపరా౯" అని యున్నది. 10-కి 5 వేసినది సహజోక్తికిని విరుద్ధముగనున్నది.

117-వ పుట 157-వ పద్యము ప్రథమపాదమునఁ బాపములు ప్రబలు ననఁబడియె. 2-వ పాదమున పాపక్షయము పేర్కొనఁబడియె. పాపంబులెట్లు ప్రక్షయం బందునో వ్రాయఁబడియుండ లేదు. మూలమున నీపట్టున "సత్సమాగమ మన్నాను కథాశ్రవణయోగతః । పాపక్షయోభవేద్దేవి" అని యున్నది.

గ్రంథాంతమున యోగవర్ణనముపట్ల మూలాతిక్రమణమును గ్రమభంగమును దండిగఁ గనఁబడుచున్నవి.

ఈ కవి వ్రాసినగ్రంథములలో "వీథినాటకము" అనునది యొకటి పేర్కొని యున్నాముకదా? వీథియనునది దశరూపకములలో నొకటి. శ్రీనాథునకేని యాతని సమకాలికులకేని నాటకములు వ్రాయనేల బుద్ధిపుట్టకపోయెనో యది మిక్కిలి చింత్యము.

ఈకవి భాగవతము నాంధ్రంబున రచియించిన మహాకవియగు బమ్మెరపోతరాజునకు బావమఱంది యందురు. వేంకటగిరిరాజులకు మూలపురుషుఁ డగుచెవిరెడ్డి మొదలు పదవతరమునం బుట్టి రాజ్యమేలిన సర్వజ్ఞసింగమనాయని నతనికి ముందువాఁడైన సింగమనేనిని సందర్శించిన ట్లగపడుటచే నీతనికాలము క్రీస్తు 15-వ శతాబ్దము పూర్వార్ధములోనిది యనవచ్చును. భీమఖండము ప్రథమాశ్వాసము 31-వ వచనమువలన నీ కవినిఁ బాలించిన రెడ్లయాస్థానము రాజమంహేంద్రవరమని యేర్పడుటవలనను నితఁడు తన గ్రంథములనెల్ల రెడ్లకో వారివారికో యంకితమిచ్చి యుండుటవలనను నితని నివాసభూమి రాజమహేంద్రవర మనియె చెప్పవలసి యున్నది. శ్రీనాథుఁడును బోతనామాత్యుఁడును వేంకటగిరి సర్వజ్ఞ సింగమనాయని

యాస్థానకవులని యీసంస్థానవంశ చరిత్రమున వ్రాయఁబడి యున్నదఁటయని బ్రహ్మశ్రీ మహారాజరాజశ్రీ రాయబహదరు కందుకూరి వీరేశలింగము పంతులవారు వ్రాయుచు దానినిఁ దాము విశ్వసింపమని తమ కవులచరిత్రములోఁ దెలిపియున్నారు. "ఈ సర్వజ్ఞసింగమనాయఁడు కావ్యనాటకాలంకారములయందును దర్క-వ్యాకరణాది శాస్త్రములయందును సమర్థుఁడై కావ్యములు వ్రాయుడమునందుఁ బ్రజ్ఞకలవాఁడై సింగభూపాలీయ మనునలంకార గ్రంథమును జేసెను. ఈయన పరాక్రమశాలియై ప్రౌఢదేవరాయలవారి దినములలోఁ బ్రసిద్ధుఁడుగ నుండెను. శ్రీభాగవతముఁ దెనిఁగించిన బమ్మెరపోతరాజనే కవీశ్వరుఁ డీయనమీఁద భోగినీదండకమును జెప్పినాఁడు. నైషధముఁ దెనిఁగించిన శ్రీనాథుండను కవీశ్వరుఁడు సింగమనాయని మీఁదఁ గొన్ని పద్యములఁ జెప్పియున్నాఁడు." అని మాత్రమె యీవంశమువారి వంశవృక్షమునఁ గనఁబడుచున్నది. అయినను దీని నాధారముగఁ గొని యింగ్లీషు భాషలో రాజా టి. రామరావుగారిచే వ్రాయఁబడిన వంశచరిత్రమందుమాత్రమిట్లని యున్నది:—"His Court is said to have been adorned by several poets among whom were Bammera Pota Raju who translated the Bhagavatam in Telugu and Sreenathudu the Telugu translator of Naishadam. Sarvagna Singama Nayudu formed the subject of a composition by the former called Bhoginee Dandakam and of some stray verses by the latter." పోతన శ్రీరామచంద్రుని యాస్థానకవియేకాని సామాన్య నరపతుల నాశ్రయించినవాఁడు కాఁడనుట లోకవిదితము. శ్రీనాథుఁడు తన గ్రంథములను రెడ్లకును వారి మంత్రులకును భాండాగారాధ్యక్షులకును నంకితం బొసఁగి లాభ మపేక్షించినవాఁడై యుండఁగ నతఁ డాస్థానకవియై యుండినచో "ఇమ్మను జేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనమ్ములుఁ గా । సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము వాసి కాలుచే । సమ్మెటపోటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పెనీ । బమ్మెరపోతరాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగ ॥ అని నరాంకితమున కెంతేనియు విముఖుఁడై కేవలముదాసీనుఁడైయున్న బమ్మెరపోతనామాత్యుని నెట్లొ మెప్పించి భోగినీదండకముం గైకొనిన సరసుఁ డగుసింగభూపాలుఁ డితనివలన నొక గ్రంథమేనియు నంకితము నడిగియుండమికిం గారణ మేమియై యుండును? కావున నీవార్త విశ్వసనీయము కానిదే. అయినను శ్రీనాథునకును సింగభూపాలునకును సమాగమము కలిగినదియు వార లొకరియం దొకరు మిగుల గౌరవముంచియుండి రనుటయు విదితంబ. ఎట్లనిన శ్రీనాథుఁడు సింగమనాయని కొలువుకూటంబు దరియం బోవునపు డీలాగు సరస్వతిని నుతించెనఁట.

సీ. దీనారటంకాలఁ ♦ దీర్థమాడించితి, దక్షిణాధీశుము ♦ త్యాలశాలఁ
బలుకుతోడై తాంధ్ర ♦ భాషామహాకావ్య, నైషధగ్రంథసం ♦ దర్భమునకుఁ
బగులఁగొట్టించితు ♦ ద్భటవివాదప్రౌఢి, గౌడడిండిమభట్టు ♦ కంచుఢక్కఁ
జంద్రశేఖరక్రియా ♦ శక్తిరాయలయొద్దఁ, బాదుకొల్పితి సార్వ ♦ భౌమబిరుద
మెటుల మెప్పించెదో నన్ను ♦ నింకమీఁద, రావుసింగమహీపాలు ♦ ధీవిశాలు
నిండుకొలువున నెలకొని ♦ యుండినీవు, సకలసద్గుణనికురుంబ ♦ శారదాంబ.

ఇట్లు నాయనింగారి సన్నిధింజేరి శ్రీనాథుఁడు,

కం. సర్వజ్ఞ నామధేయము, శర్వునకే రావుసింగ ♦ జనపాలునకే
యుర్వింజెల్లును నితరుని, సర్వజ్ఞుం డనుట కుక్క ♦ సామజమనుటే.

యనియెనఁట. అంత నాభూకాంతుం డొకసమస్య నొసంగ దాని నిట్లు పూరించెనఁట.

ఉ. తక్కక రావుసింగవసు ♦ ధాధిపుఁ డర్థుల కిచ్చుచున్నచో
దిక్కులలేనికర్ణుని ద ♦ ధీచిని ఖేచరువేల్పుమ్రానుఁ బెం
పెక్కినకామధేనువు శి ♦ బీంద్రుల నెన్నదు భట్టదిట్టవై
కుక్కనొ నక్కవో ఫణివొ ♦ క్రోఁతివొ పిల్లివొ భూతపిల్లివో.

శ్రీనాథుఁడు సింగమనాయనిఁ జూచినపుడు ముదిమినయసున నుండవలయు. ఏలయన నీవంశమున నెనిమిదవపురుషాంతరమున నుండిన కుమారవేదగిరినాయఁడు మాచారెడ్డిని గొట్టి యాకాలపు దురాచారపద్ధతిని దల దనతమ్ముపడిగలోఁ బొదివించెను. మాచారెడ్డి సోదరుఁ డనవేమారెడ్డి యంతటఁ బగఁబూని యాకుమారవేదగిరినోడించి యాతని తలఁ దెగనఱికి దానిం దనతమ్ముపడిగలోఁ బొదివించెను. ఆ వేదగిరితమ్ముఁడు లింగమనాయఁడు సింగమనాయని పైతరమువాఁ డా యన వేమారెడ్డిం జంపి యతని తలను దనతమ్ముపడిగం బొదిగించినదిగాక సందికంతపోతరాజను కఠారిని సైతముఁ గైకొనెను. ఈ కఠారికై శ్రీనాథుఁడు లింగమనీనిం జేరి.

సీ. జగనొబ్బగండాంక ♦ సంగ్రామనిశ్శంక, జగతీశరాయవే ♦ శ్యాభుజంగ
యఖిలకోటలగొంగ ♦ యరిరాజమదభంగ, మేలందుధరణీశ ♦ మీనజాల
మూరురాయరగండ ♦ మురియురాజులమిండ, యభివృద్ధిమీఱుచౌ ♦ హత్తిమల్ల
ఘనగాయగోవాళ ♦ కామినీపాంచాల, బ్రహ్మాయుశశివంశ ♦ పరశురామ

దండిబిరుదులసురతాని ♦ గుండెదిగుల, భళిరె యల్లయవేముని ♦ పగఱమిండ
రమణమించిన మేదిని ♦ రావుబిరుద, సంగరాటోపమాదయ ♦ లింగభూప.

అనుపద్యమును జదివి దానిని మరలఁ బుచ్చుకొనెను. ఇదియునుఁగాక పైనుదాహరింపఁబడిన "నూనూఁగుమీసాల" యను పద్యమువలన శ్రీనాథుఁడు కాశీఖండము రచించినప్పుడు "ప్రౌఢపర్భరవయఃపరిపాకమును" దాఁటియుండెను. ఆ కాశీఖండ మల్లాడ వీరభద్రారెడ్డి వేంకటగిరి సంస్థానము వారిలోఁ బొమ్మిదవ పురుషాంతరమునం దున్నలింగమ నేని సమకాలికుఁడు. దీనికిఁ బ్రమాణము.

ఉ. బల్లరగండలింగవిభు ♦ పాదమునందుఁ బసిండియందె తా
ఘల్లురుఘల్లుఘల్లురని ♦ ఘల్లని మ్రోయఁగ భీతి గుండియల్
ఝల్లురుఝల్లుఝల్లురని ♦ ఝల్లన నల్లలాడుచుండు రా
యల్లయరెడ్డివేముఁడును ♦ నాతనితమ్ముఁడు వీరభద్రుఁడున్.

ఈకవి సింగమనాయనియొద్దకు రాఁ గతము మృగ్యము.

పైనుదుపఁబడిన "సర్వజ్ఞ నామధేయము" అను పద్యమును సింగమనాయని కొలువులో శ్రీనాథుఁడు చదివి మరలినవెనుక రెడ్లవారతని నిచ్చకాలమారియని యాక్షేపించినట్లును దానికతఁ డాపద్యమున కన్యార్థము కల్పించినట్లును నొక ప్రతీతి బ్రహ్మశ్రీ గురుజాడ శ్రీరామమూర్తిపంతులవారి కవి జీవితములందుఁ గనఁబడుచున్నది. "దీనారటంకాల" యను పద్యముం జదివినవారును "సింగభూపాలీయ" మనునామాంతరముగల 'రసార్ణవసుధాకరా' ద్యగ్రంథకర్తయు రసజ్ఞుఁడునునగు సింగభూపాలునిమహిమ నెఱింగినవారు నీకథ నెంతయు నమ్మరు. 'సర్వజ్ఞ నామధేయము' అని శ్రీనాథుఁడు పొగడినదే నిజమును సలక్షణమును.

ఇంక శ్రీనాథునిఁ బోతనామాత్యునిఁ గూర్చి కొన్ని కథలు కలవు. అవి యన్నియుఁ బోతనామాత్యుని పారలౌకిక ధర్మంబును శ్రీనాథుని యైహికభోగేచ్ఛను దెల్పునవి.

ఇంతటి మహాకవి యయ్యును గొప్పవారియాశ్రయముగలిగియుండియు ననేక గ్రంథముల రచించి యనేకుల కంకిత మిచ్చి లాభముఁ బొందియుండియు శ్రీనాథుఁడు తనయందలి గొప్పలోప మగు స్త్రీలౌల్యము వలనఁ గాఁబోలు నవసానదశయందు మిగుల దారిద్ర్యము ననుభవించినట్లు లీక్రిందిపద్యములు తెల్పుచున్నయవి.

సీ. కవిరాజుకంఠంబుఁ ♦ గౌఁగిలించెనుగదా, పురవీథినెదురెండఁ ♦ బొగడదండ
సార్వభౌమునిభుజా ♦ స్తంభమెక్కెనుగదా, నగరివాకిటినుండు ♦ నల్లగుండు

ఆంధ్రనైషధకర్త ♦ యంఘ్రియుగ్మంబునఁ, దగిలియుండెనుగదా ♦ నిగళయుగము
వీరభద్రారెడ్డి ♦ విద్వాంసుముంజేతి, వియ్యమందెనుగదా ♦ వెదురుగొడియ
కృష్ణవేణమ్మ ♦ గొనిపోయె ♦ నింతఫలము, బిలబిలాక్షులుదినిపోయెఁ ♦ దిలలుఁ బెసలు
బొడ్డుపల్లెను గొడ్డేఱి ♦ మోసపోతి, నెట్లుచెల్లింతుఁ డంకంబు ♦ లేడునూర్లు.

సీ. కాశికావిశ్వేశుఁ ♦ గలిసె వీరారెడ్డి, రత్నాంబరంబు లే ♦ రాయఁడిచ్చుఁ
గైలాసగిరిఁ బండె ♦ మైలారు విభుఁడేగి, దినవెచ్చ మేరాజు ♦ తీర్పఁగలఁడు
రంభఁ గూడెఁ దెనుంగు ♦ రాయరాహుత్తుండు, కస్తురి కేరాజుఁ ♦ బ్రస్తుతింతు
స్వర్గస్థుఁ డయ్యె వి♦స్సనమంత్రి మఱి హేమ, పాత్రాన్న మెవ్వని♦పంక్తిఁగలదు
భాస్కరుఁడుమున్నె దేవుని♦పాలికరిగెఁ, గలియుగంబుననిఁకనుండఁ ♦ గష్టమనుచు
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ ♦ డమరపురికి, దివిజకవివరుగుండియ ♦ దిగ్గురనఁగ.

విషయసూచిక.

ప్రథమాశ్వాసము.

విషయములు.		పుటలు.
౧	ఇష్టదేవతా ప్రార్థనము	౧
౨	పురాతన కవీంద్రగుణకీర్తనము	౨
౩	కుకవి నిరాకరణము	౩
౪	ఉపోద్ఘాతము..	,,
౫	వేమభూపాలుని వంశావతారవర్ణనము	౫
౬	కృతినాయక వంశావతారవర్ణనము..	౭
౭	షష్ఠ్యంతములు	౧౨
౮	దక్షారామపురవర్ణనము..	౧౩
౯	కథాప్రారంభము..	౨౦

ద్వితీయాశ్వాసము.

౧౦	సూర్యాస్తమయవర్ణనము	౨౪
౧౧	చంద్రోదయవర్ణనము	౨౬
౧౨	సూర్యోదయవర్ణనము	౨౭
౧౩	వ్యాసమహర్షి యాత్రకు వెడలుట	,,
౧౪	పీఠికాపుర వర్ణనము	౨౮
౧౫	కుమారారామ వర్ణనము	౩౦
౧౬	సర్పపుర వర్ణనము	,,
౧౭	అగస్త్యుఁడు వ్యాసమహర్షిఁ గాశిఁ బాసివచ్చుటకుఁ గారణం బడుగుట ..	౩౩
౧౮	వ్యాసులు తాను గాశిఁబాసినకారణంబుఁ జెప్పుట	,,
౧౯	వ్యాసులు కాశిని శపింపఁబూనుట	౩౫
౨౦	విశ్వనాథుఁడు పార్వతితోడ వ్యాసాదు లుండిన వేదికకడకు విజయము చేయుట	౪౦
౨౧	శంభుండు వ్యాసుని శిష్యులతోడఁ గాశి వెడలిపొమ్మనుట	,,

తృతీయాశ్వాసము.

౨౨	కలశభవుఁడు పారాశర్యునకు దక్షారామమహిమంబు చెప్పుట ..	౪౪
౨౩	వ్యాసాదు లాకసంబుననుండి భీమమండలంబుఁ గనుఁగొనుట	౪౯
౨౪	వ్యాసాదులు దక్షారామంబుఁ బ్రవేశించుట	౫౧
౨౫	ఇంద్రుఁడు దేవతలకు శివలింగమాహాత్మ్యంబుఁ జెప్పుట..	౫౫
౨౬	బ్రహ్మాదులు భీమేశ్వరు వర్ణించుట	౫౮

విషయములు.		పుటలు.
౨౭	అగస్త్యుఁడు వ్యాసునకుఁ బంచతీర్థంబుల వివరించుట	౬౧
౨౮	అగస్త్యవ్యాసులు భీమేశ్వరాలయంబుఁ బ్రవేశించుట	౬౩
౨౯	వ్యాసుఁడు భీమేశ్వరార్చనంబు సలుపుట	౬౫
౩౦	వ్యాసు లీశ్వరు నుతించుట	౬౬

చతుర్థాశ్వాసము.

౩౧	అగస్త్యుఁడు తీర్థమాహాత్మ్యంబుఁ జెప్పుట	౭౫
౩౨	క్షీరసాగరమథనకము ప్రారంభము	౭౭
౩౩	శివుఁడు హాలహాలము మ్రింగుట	౭౯
౩౪	దేవత లీశ్వరుని స్తుతించుట	౮౦
౩౫	శివునియాజ్ఞను సురాసురులు విఘ్నేశునిఁబూజించి పాల్కడలి తరియించి చంద్రాదులఁ బడయుట	౮౨
౩౬	దేవాసురు లమృతమునకై పోరుటయు శ్రీమన్నారాయణుఁడు దేవారుల వంచించుటయు	౮౩
౩౭	నారదోక్తి నసురు లీశ్వరునిఁబూజించి వరంబులు వడసి లోకముల బాధించుట..	,,
౩౮	బ్రహ్మవిష్ణ్వాదులు శివునికడ కేగి మొఱవెట్టుట	౮౪
౩౯	ఈశ్వరుఁడు త్రిపురాసురుల నిర్జించుట	౮౬
౪౦	తుల్యభాగ యుత్పత్తిక్రమము	౯౪
౪౧	శ్రీభీమనాథేశ్వరుఁడు దనకుఁ దాన ప్రతిష్ఠితుండగుట	౯౬

పంచమాశ్వాసము.

౪౨	సూర్యుండు కైలాసమున కరిగి శివుని దక్షారామమునకుఁ దోడి తెచ్చుట..	౯౮
౪౩	మహాదేవుఁడు ప్రమథగణసమేతుఁడై దక్షారామమునకుఁబోవుట	౧౦౦
౪౪	శివుఁడు దక్షారామంబుఁ బ్రవేశించుట	౧౦౨
౪౫	శ్రీకంఠుఁడు దక్షారామ భీమేశుతో నైక్యతం బొరయుట	౧౦౪
౪౬	లక్ష్మ్యాదులు శ్రీభీమేశుని స్తుతించుట	,,
౪౭	దివస్పతి బృహస్పతిని దానములఁగూర్చి యడుగుట	౧౦౫
౪౮	భూదానమహిమ	౧౦౬
౪౯	దివస్పతి శ్రీభీమేశ్వరునకు భీమమండలంబు సమర్పించుట	౧౦౭
౫౦	వసంతర్తు వర్ణనము	౧౦౯
౫౧	సప్తముని స్తోత్రము	౧౧౪
౫౨	గౌరికి మహేశ్వరుండు భక్తి విజ్ఞానయోగంబుఁ జెప్పుట	౧౧౬

శ్రీరస్తు.

శ్రీరామాయనమః.

శ్రీమహాగణాధిపతయేనమః.

శ్రీమాణిక్యాంబాసమేత శ్రీభీమేశ్వరస్వామినేనమః

శ్రీ భీమేశ్వరపురాణము.

ప్రథమాశ్వాసము.

శ్రీస్తనగంధసార పరి♦షేకసమంచిత సాయకప్రయో
గాస్తమహాపురత్రయుఁ డ♦హార్యధనుర్ధరుఁ డర్కకోటి దీ
ప్తిస్తవనీయవిగ్రహుఁడు ♦ భీమయదేవుఁడు దక్షవాటికా
వాస్తుఁడు ప్రోచుఁగావుత ధ్రు♦వంబుగ దేవయయన్న ధీమణిన్. ౧

ఇష్టదేవతాప్రార్థనము.

ఉ. ఏనికమోముతా ల్పెలుక♦నెక్కినరావుతురాజు సౌరసే
నానియనుంగుఁబెద్దన వి♦నాయకదేవుఁడు కర్ణతాళఝం
ఝానిలతాడనంబున ని♦రంతరమున్ బ్రబలాంతరాయసం
తానమహాఘనాఘనక♦దంబములన్ విదళించుఁ గావుతన్. ౨

ఉ. బాలికమోము మత్తవన♦బర్హికిశోరకలాస్యలీలఁ బై
వాలిచి పచ్చకప్పురపు♦వాసనతోడి ముఖారవిందతాం
బూలపుమోవి మోవిపయి ♦ మోపుచు రాధకు నిచ్చు ధూర్తగో
పాలుఁడు ప్రోచుఁగావుత మ♦పారకృపామతి మంత్రియన్ననిన్. ౩

సీ. రాజీవభవుని గా♦రాపుఁబట్టపుదేవి, యంచబాబానెక్కు ♦ నలరుఁబోణి
పసిఁడికిన్నెరవీణఁ ♦ బలికించునెలనాఁగ,పదునాల్గువిద్యల ♦ పట్టుఁగొమ్మ
యీరేడుభువనంబు ♦ లేలుసంపదచేడె, మొలకచందురుఁదాల్చు♦ముద్దరాలు
వెలిచాయకొదమరా♦చిలుకనెచ్చెలికత్తె, ప్రణవపీఠికనుండు ♦ పద్మగంధి

---

౧. శ్రీస్తన . . . త్రయుఁడు = విష్ణువునే బాణముగాఁ బ్రయోగించి త్రిపురంబుల నాశనము చేసినవాఁడు; అహార్యము = పర్వతము, (ఇచట మేరువు.) ౨. అంతరాయసంతానము = విఘ్నపరంపర; ఘనాఘనము = మేఘము. ౩. బాలిక = కన్యక, ఇచట రాధ.

తే. మందరాచలకందర♦మథ్యమాన, దుగ్ధపాథోధిలహరికో♦ద్భూతమైన
లలితసాహిత్యసౌహిత్య♦లక్ష్మి నొసఁగు, వరదయై మాకు వినతగీ♦ర్వాణి వాణి. ౪

పురాతనకవీంద్రగుణకీర్తనము.

శా. శ్లోకంబుల్ శతకోటిఁ గాండములుగా ♦ సూత్రించి రామాయణం
బేకైకాక్షర మెల్లపాపముల మా♦యింపంగ నిర్మించి సు
శ్లోకుండైన పురాణసంయమివరుం ♦ జూతు న్మనోవీథి వా
ల్మీకిం బ్రహ్మపదావతీర్ణకవితా♦లీలావతీవల్లభున్. ౫

మ. తలఁతుం భారతసంహితాధ్యయన వి♦ద్యానిర్మితిప్రక్రియా
నలినప్రోద్భవునిం గళిందతనయాం♦తర్ద్వేదిపుణ్యస్థలీ
పులినాభోగకృతావతారు నపరాం♦భోజాక్షునక్షీణ ని
ర్మలసాహిత్యకళాసమృద్ధికయి పా♦రాశర్యమౌనీశ్వరున్. ౬

సీ. ప్రణుతింతు రసభావ♦భావనామహనీయ, కవితాసముల్లాసుఁ ♦ గాళిదాసు
గణుతింతు నిరవద్య♦గద్యపద్యనిబంధ, పరితోషితస్థాణు ♦ భట్టబాణు
భజియింతు సాహిత్య♦పదవీమహారాజ్య, భద్రాసనాసీనుఁ ♦ బ్రవరసేను
వర్ణింతు నంభోధి ♦ వార్వీచిగంభీర, తాసారవాక్సము♦త్కర్షు హర్షు
తే. భాస శివభద్ర సౌమిల్ల ♦ భల్లులకును, మాఘ భారవి బిల్హణ ♦ మల్హణులకు
భట్టి చిత్తపకవి దండి♦పండితులకుఁ, గేలుకొలుపుదు నొసలిపైఁ ♦ గేలుదోయి. ౭

కం. నెట్టుకొని కొలుతు నన్నయ, భట్టోపాధ్యాయసార్వ♦భౌముని గవితా
పట్టాభిషిక్తు భారత,ఘట్టోల్లంఘనపటిష్ఠ♦గాఢప్రతిభున్. ౮

ఉ. పంచమవేదమై పరఁగు ♦ భారతసంహిత నాంధ్రభాషఁ గా
వించెఁ బదేను పర్వములు ♦ విశ్వజగద్ధితబుద్ధి నెవ్వఁ డ
క్కాంచనగర్భతుల్యున క ♦ ఖండిత భక్తి నమస్కరింతు ని
ర్వ్యంచిత కీర్తివైభవ వి♦రాజికిఁ దిక్కన సోమయాజికిన్. ౯

మ. కనకక్ష్మాధరధీరు వారిధితటీ♦కాల్పట్టనాధీశ్వరుం
ఘనునిం బద్మపురాణ సంగ్రహకళా♦కావ్యప్రబంధాధిపుం
వినమత్కాకతి సార్వభౌముఁ గవితా♦విద్యాధనుం గొల్తు మా
యనుఁగుం దాతఁ బ్రదాత శ్రీకమలనా♦భామాత్య చూడామణిన్. ౧౦

---

౪. బాబా=గుజ్జము; ఈరేడు=పదునాలుగు; లలితసాహిత్యసౌహిత్యలక్ష్మి—మనోజ్ఞమైన సాహిత్యముయొక్క సంపూర్ణసంపద; వినతగీర్వాణి=మ్రొక్కుచున్న దేవతాస్త్రీలుగలది. ౫. సుశ్లోకుండు=మంచికీర్తిగలవాఁడు; అవతీర్ణ=దిగిన; కవితాలీలావతీ=కవితయనియెడు స్త్రీ. ౬. కళిందతనయ=యమునానది. ౭. పరితోషితస్థాణు=శివుఁడు ఎవనిచే సంతోషింపఁజేయఁబడినవాఁడు; త్ర-బ వార్వీచి=నీటియలలు. ౧౦. వినమజ్జ్యాంతరసార్వభౌము, అనిపాఠ. వినమత్=నమ్రుఁడైన.

మ. హరచూడాహరిణాంకవక్రతయుఁ గా♦లాంతస్ఫురచ్చండికా
పరుషోద్గాఢపయోధరస్ఫుటతటీ♦పర్యంత కాఠిన్యముం
సరసత్వంబును సంభవించె ననఁగా ♦ సత్కావ్యముల్ దిక్కులం
జిరకాలంబు నటించుచుండుఁ గవిరా♦జీగేహ రంగంబులన్. ౧౧

కుకవి నిరాకరణము.

చం. వెస వసుధాస్థలంబునఁ గ♦వీంద్రులు గొందఱు శేముషీమషీ
రసము మనఃకటాహ కుహ♦రంబుల నించి కలంచి జిహ్వికా
కిసలయతూలికం గొని లి♦ఖింతురు కబ్బము లెన్నఁగా మహా
వ్యసనముతో నిజాననవి♦యత్తలతాళపలాశరేఖలన్. ౧౨

తే. బోధమల్పంబు గర్వ మ♦భ్యున్నతంబు, శాంతినిష్పచ్చరంబు మ♦చ్చరము ఘనము
కూపమండూకములుఁబోలెఁ ♦ గొంచెమెఱిఁగి, పండితంమన్యులైన వై♦తండికులకు

తే. నికటమున నుండి శ్రుతిపుట♦నిష్ఠురముగ, నడరికాకులు బిట్టు పె♦ద్దఱచినప్పు
డుడిగిరాయంచ యూరక♦ యుంటలెస్స, సైఁపరాకున్న నెందేనిఁ♦జనుటయొప్పు.

తే. ప్రౌఢిఁబరికింపసంస్కృత♦భాషయందు,పలుకునుడికారముననాంధ్ర♦భాషయందు
నెవ్వ రేమన్న నందుఁగా♦కేలకొఱఁత, నాకవిత్వంబు నిజము క♦ర్ణాటభాష. ౧౪

వ. అని యిష్టదేవతాప్రార్థనంబును బురాతనకవీంద్రగుణకీర్తనంబును గుకవి నిరాకర
ణంబునుం జేసి యాత్మగతంబున. ౧౫

తే. నవమగుత్తు చరిత్రంబు ♦ నైషధంబు,
సప్తశతి పండితారాధ్య♦చరిత మనఁగఁ
గావ్యములు పెక్కుచెప్పియుఁ♦గాంక్షచనక
వెండియును గావ్యమొకటిఁగా♦వింపఁదలఁచి. ౧౬

వ. ఉన్నంత. ౧౭

ఉపోద్ఘాతము.

సీ. ఏమంత్రి కులదైవ ♦ మిందుశేఖరుఁడు ద,క్షారామభీమేశుఁ ♦ డఖిలకర్త
యేమంత్రి యేలిక ♦ యిక్ష్వాకుమాంధాతృ, రామసన్నిభుఁడైన ♦ వేమనృపతి

౧౧. హర . . . . వక్రత = శివుని జటాజూటమందుండు చంద్రునివలె వక్రముగలట్టియును, అనఁగాఁ గేవల ప్రౌఢకవీశ్వరాంగీకృతమయి సామాన్యకవిజనానవబోధమగు రహస్యములని యర్థము. ౧౨. మషీ=మసి, (సిరా.) తాళపలాశ = తాటియాకు. ౧౩. నిష్పచ్చరము = లేమిడి; పండితంమన్యులు = పండితులుగాకుండినను దాము పండితులమని గర్వపడువారు; వైతండికులు = వితండావాదము చేయువారు. ౧౪. నుడికారము = మాటల చమత్కారము.

యేమంత్రి సితకీర్తి ♦ యేడువారాసుల, కడకొండ యవులచీఁ♦కటికి గొంగ
యేమంత్రి సౌభాగ్య ♦ మిగురుఁగైదువజోదు, లాలిత్యలీలకు ♦ మేలుబంతి
తే. యతఁడు కర్ణాట లాట భో♦టాంగ వంగ, కురు కుకురు కుంతలావంతి♦ఘూర్జరాది
నృపసభాస్థానబుధవర్ణ ♦ నీయసుగుణ, మండనుఁడు బెండపూఁడన్న ♦ మంత్రివరుఁడు.
వ. ఒక్కనాఁడు. ౧౦
సీ. భాట్టప్రభాకర♦ప్రస్థాన సంవేద్యు, లుద్దండ పండితు ♦ లొక్కవంక
ఫణిపభాషితభాష్య ♦ ఫక్కికాభావజ్ఞు, లుత్తమ ప్రాగల్భ్యు ♦ లొక్కవంకఁ
గణభుక్ప్రణీతగ్రంథ ♦ గాఢార్థవిదులు బా,హుశ్రుత్యసంపన్ను ♦ లొక్కవంక
వేదాంతవాసనా ♦ విశ్రాంతహృదయజ్ఞు, లుపనిషత్తత్త్వజ్ఞు ♦ లొక్కవంక
తే. నుభయ భాషాకవీశ్వరు ♦ లొక్కవంక, వేశ్యలొకవంక నొకవంక ♦ వీరభటులు
బలసికొలువంగఁ గొలువుండి♦పిలువఁబంపె, బెండపూఁడన్నమంత్రీశ్వరుండునన్ను.
గీ. ఇట్లు పిల్పించి సమ్మాన ♦ మెసకమెసఁగ, సముచితాసనమున నుంచి ♦ చతురలీల
నానతిచ్చెను రాయవే♦శ్యాభుజంగు, మంత్రి గంభీరధీరసం♦భాషణముల. ౧౧
సీ. వినిపించినాఁడవు ♦ వేమభూపాలున, కఖిలపురాణ వి♦ద్యాగమములు
కల్పించి నాఁడవు ♦ గాఢపాకంబైన, హర్షనైషధకావ్య ♦ మాంధ్రభాష
భాషించినాఁడవు ♦ బహుదేశబుధులతో, విద్యాపరీక్షణ♦వేళలందు
వెదచల్లినాఁడవు ♦ విశదకీర్తిస్ఫూర్తి, కర్పూరములు దిశాం♦గణములందుఁ
తే. బాకనాటింటి వాఁడవు ♦ బాంధవుఁడవు, కమలనాభుని మనుమఁడ♦వమలమతివి
నాకుఁగృపసేయు మొకప్రబం♦ధంబు నీవు, కలితగుణగణ్య శ్రీనాథ♦కవివరేణ్య.
తే. సప్తసంతానములు నాకు ♦ సంభవించె, నొకప్రబంధంబు వెలితిగా ♦ సుకృతగరిమ
నావెలితిమాన నాపేర ♦ నంకితముగ, శివపురాణంబు తెనుఁగుగాఁ ♦ జేయుమొకటి.
వ. అదియును.
కం. బంధుర సపాదలక్ష, గ్రంథంబై యెదుపదులు ♦ ఖండంబులతో
సంధిల్లును స్కాందం బన, సింధువునకుఁ గాల్వ లమరి♦చినచందమునన్. ౧౩
మ. అరవిందాప్తకృత ప్రతిష్ఠుఁడగు ద♦క్షారామభీమేశ్వరే
శ్వరు మాహాత్మ్యముతోడఁ గూడి భువన ♦ శ్లాఘాస్పదంబై యభం
గురమై స్కాందపురాణసారమగు శ్రీ♦గోదావరీఖండముం
బరిపాటిన్ రచియింపు మంధ్రజగతీ♦భాషాప్రబంధంబుగన్. ౧౪
వ. అని పలికి సబహుమానంబుగాఁ గర్పూరతాంబూలజాంబూనదాంబరాభర
ణంబు లొసంగి వీడుకొలిపిన. ౧౫

---

౨౧. బహుశ్రుతభావము బాహుశ్రుత్యము.

సీ. ధారాసురత్రాణ ♦ ధాటీసమారంభ, గర్వపాథోరాశి ♦ కలశజులకు
సప్తమాడియరాజ ♦ ఝూడియస్థాపాల, వందితశ్రీపాద ♦ వనరుహులకు
సింహాద్రి పర్యంత ♦ సీమాంధ్రమేదినీ, మండలీ పాలనా ♦ ఖండలులకు
హరిదంతదంతిదం ♦ తావళీలిఖ్యమా, నానేకజయశాస ♦ నాఢ్యులకు
తే. వీరభద్రేశ వేమ పృ ♦ థ్వీధవులకు ననుఁగుమంత్రి మహాప్రధా ♦ నాగ్రగణ్య
బెండపూఁడన్న జగనొబ్బ ♦ గండబిరుద, సచివదేవేంద్రుఁగృతికధీ ♦ శ్వరునిఁజేసి.

వ. సర్గ ప్రతిసర్గ వంశ మన్వంతర వంశానుచరితంబు లనుపంచలక్షణంబులతోడం గూడి సపాదలక్ష గ్రంథసంఖ్యాసమన్వితంబై పంచాశత్ఖండమండితంబై బహు సంహితాసమాకీర్ణంబైయొప్పు శ్రీమహాస్కాందంబను నాదిపురాణంబునందు గోదావరీఖండంబు శ్రీసుద్దక్షారామభీమేశ్వరమాహాత్మ్యసంయుతంబగుటం జేసి భీమేశ్వర పురాణంబనంబరఁగు; నది యాంధ్రభాషాప్రబంధంబుగఁ జెప్పందొడంగితి; నమ్మహాప్రారంభంబునకు మంగళాలంకారంబుగా నమ్మహామంత్రీశ్వరునేలిన వీరభద్రేశ్వర వేమభూపాలుర వంశావతారం బభివర్ణించెద. ౩౦

వేమభూపాలుని వంశావతారవర్ణనము.

ఉ. కైటభదైత్యవైరి పద ♦ కంజమునం దుదయంబు నొందె మి
న్నేటికి భూతధాత్రికిని ♦ నెంతయు వచ్చిన తోఁడఁబుట్టువై
హాటకగర్భముఖ్యనిఖి ♦ లామరమాళి మహామణిప్రభా
పాటలవర్ణమైన యొక ♦ పావనవర్ణ ముదీర్ణసంపదన్. ౩౧

వ. అప్పుణ్యవంశంబు కంసాసురధ్వంసిచరణపల్లవంబు దనకుఁ బుట్టి నిల్లుగావునఁ గారణ గుణసంక్రమంబునంబోలెఁ జామరతోమరచ్ఛత్రధనుఃఖడ్గాది చిహ్నోప శోభితంబై, చదలేటినీటివలని సోదరీయస్నేహాలబ్ధంబులుంబోని పావనత్వ శుచిత్వ గాంభీర్య మాధుర్యంబులు చరితమనస్స్వభావవచనంబుల ధరియించి సైదోడుం బోదివి విశ్వవిశ్వంభరా క్రీడనంబు దనకువిదిర్చిన పగమహోంతి యంతరంగంబున సంతరించి నిఖిలప్రపంచంబునకు నాధారంబై ప్రవర్తిల్లె అందుఁ బద్మనాయకులన వెలమలనఁగమ్మలనసరిసర్లనవంటర్లన బహుప్రకారశాఖోపశాఖాభిన్నంబులైనమార్గంబులం ద్రిమార్గగంగాప్రవాహంబులుంబోలె గోత్రంబు లెన్నియేనియు జగత్పవిత్రంబులై ప్రవహించుచుండఁ గల్పంబు లతిక్రమించి మన్వంతరంబులు జరిగి యుగంబులుసరికడచి వత్సరంబులుచని కాలచక్రంబులతిక్రమించుచుండఁ జతుర్థ కులమాళిమండనంబై కీర్తివిహారఘంటాపథంబైన పంటమహాన్వయంబు పాకనాటి దేశంబున భద్రపీఠంబునధివసించి సింహవిక్రమనగరదువ్వూరు గండవరాది పట్టనంబులు నిజనివాసంబులుగా భ్రూలతాదష్టాష్టాదశద్వీపాంతరాళులగు భూపాల

గ్రామణులన్ ద్రిలింగభూమండలాఖండలులను బోలయవేమాన్నపోతాన్న వేమకుమారగిరీశ్వరాదులం బూజ్యసామ్రాజ్యపీఠస్థులంగాంచె. తత్సంబంధబాంధవంబున వసుంధరాభారధౌరంధర్యంబునం గంధసింధురఘటాకూటకపటకిటి కచ్ఛపావతారనారాయణ భుజంగ భూధరంబులకుం దోడుజోడై రాయగురువర మేశ్వర సాధుజనవిధేయు ఖోడెరాయ సకలకళాధామాదిబిరుదభాస్వరుండై భీమయగురువరేణ్య పుణ్యకారుణ్య కటాక్షవీక్షాలబ్ధ సుస్థిరైశ్వర్యధుర్యుండై విజయధాటీసమాటీకనంబులదిశలల్లాడ నల్లాడభూవల్లభుండు రాజమహేంద్రంబు రాజధానిగా సింహాద్రిపర్యంతంబుత్కళ కళింగ యవనకర్ణాట లాటాంతర్ద్వీపంబైన ప్రతాపంబున దిలీప నల నహుష నాభాగ భరత భగీరథ మాంధాతృ ధుంధుమారపూరుపురూరవః ప్రభావుండై విశ్వవిశ్వంభరాభువనమండలంబుం బరిపాలించెం దదనంతరంబ. ౩౨

గీ. రాజరఘురాములల్లాడ ♦ రమణసుతులు, ధాత్రిం బాలింతురాచంద్ర ♦ తారకముగ
వేమభూవల్లభుండును ♦ వీరవిభుండు, నన్నదమ్ములు హరియును ♦ హరుండుంబోలె.

ఉ. తమ్ముని వీరభద్రవసు ♦ధాధిపు విక్రమవీరభద్రుని
న్నమ్మికలీల రాజ్యభర♦ణస్థితిం బట్టముంగట్టి బాహుద
ర్పమ్మున వేమభూవరుండు ♦ వ్రాసె జగద్విజయప్రశస్తివ
ర్ణమ్ములు దిగ్ధురంధరసు ♦ రద్విపకుంభవిషాణమండలిన్. ౩౪

సీ. పాతాళభువనాది ♦ పతికి శేషాహికిం, బ్రియలతో మసకానం ♦ బెనంగంగలిగె
దిక్సింధురములకు ♦ దివ్యవాహినిలోనం, దేంటి రాయిడి మానం ♦ దేలనాడవె
నుర్వీధరములకు ♦ నుదధిలోం గాంపున్న, కొలముసాములయిండ్లం ♦ గుడువనబ్బెం
గుహనాకిటికి లక్ష్మి ♦ కుచకుంభములమీంది, కుంకుమంబున నునుల్ ♦ కొనంగంగూడె

తే. రాయవేశ్యాభుజంగవీ♦రప్రతాప, భాసి యల్లాడవిభువీర ♦ భద్రనృపతి
సర్వసర్వంసహాచక్ర♦సర్వభరము, పృథుభుజాపీఠమున సంభ♦రించుటయును. ౩౫

కం. ఏరీ ధరణిపు లల్లయ, వీరక్ష్మాపతికి సాటి ♦ వితరణగరిమన్
ధారాధరధారాధర, ధారాధరవాహదాన♦ధారానిధికిన్. ౩౬

మహాస్రగ్ధర. ఫణిరాజస్తబ్ధరోమ ♦ ప్రకటకమఠరా♦ట్పర్వతశ్రేణిదిగ్వా
రణధౌరంధర్యధారా ♦ రభటిసమధిక♦ప్రౌఢబాహాప్రతాప
ప్రణతప్రత్యర్థిపృథ్వీ♦పతిమకుటమణీ♦భాసమానాంఘ్రి వీరున్
బ్రణుతింతున్ వీరభద్రుం ♦ బ్రతిభటధరణీ♦పాలకాలాగ్నిరుద్రున్. ౩౭

సీ. పండువాసురతాణి ♦ పావడం బిచ్చిన, భద్రేభములు వీథిం ♦ బాలె ముందు
నొడ్డె ధాత్రీనాథుం ♦ డుపదపుత్తెంచిన, బింబారుణోష్ఠి సం♦బెళవహించుం

గర్ణాటభూపతి ♦ కానుక యనిచిన, ముక్తాతపత్రంబు ♦ మ్రోలమెఱయు
యవనాధిపతి యుపా♦యనముగా నొసఁగిన, పాగాహయంబులు ♦ వాగెవచ్చు
తే. దూరమంతంత బాఁపహ ♦ దొంతినున్న, సప్తమాడియరాజన్య ♦ సమితిమ్రొక్కు
రాయవేశ్యాభుజంగసం♦గ్రామపార్థ, గాయగోవాళవేమన♦క్ష్మాధవునకు. ౩౮

శా. దేవబ్రాహ్మణభక్తివర్ధితధరి♦త్రీచక్రసామ్రాజ్యల
క్ష్మీవాస్తోష్పతి సంస్తుతింపఁగఁదగుఁ ♦ శ్రీవేమపృథ్వీశ్వరుఁ
లావణ్యాపరమత్స్యలాం ఛనుని నా♦లంకాపురీశంకర
గ్రావాభ్యంతరకూలముద్వహయశః♦కల్లోలినీవల్లభున్. ౩౯

కం. కాంచీ శ్రీగిరి కాశీ, పంచారామాది దేవ♦భవనంబుల న్రా
యించెను వేమక్ష్మాపతి, యంచితభూదానశాస♦నాక్షరపంక్తుల్. ౪౦

సీ. ధరియింపనేర్చిరి ♦ దర్భ వెట్టెడు వ్రేళ్ల, లీలమాణిక్యాంగు♦ళీయకములు
కల్పింపనేర్చిరి ♦ గంగమట్టియు మీఁదఁ, గస్తూరికాపుండ్ర♦కములునొసల
సవరింప నేర్చిరి ♦ జన్నిదంబుల మ్రోలఁ, దారహారములు ము♦త్యాలసరులు
చేర్పంగ నేర్చిరి ♦ శిఖల నెన్నడుములఁ, గమ్మనిక్రొత్తచెం ♦ గల్వవిరులు
తే. ధామముల నెండియును బైఁడి♦దడఁబడంగ, బ్రాహ్మణోత్తములగ్రహా♦రములలోన
వేమభూపాలుఁ డనుజన్ము♦వీరభద్రు, ధాత్రి యేలింప గౌతమీ♦తటమునందు. ౪౧

తే. ధర్మశాసనఘనశిలా ♦ స్తంభమెత్తె, శ్రీముకుందోద్భవస్వామి ♦ శివునిమ్రోల
వీరభద్రేశుఁ డాచంద్ర♦తారకముగ, నగ్రహారాళి నఖిలమా♦న్యంబులొసఁగి. ౪౨

సీ. కమలాచలాగ్రమా♦ర్కండేయశివశిర, శ్శశిచంద్రికాధౌత ♦ సౌధవీథి
గోదావరీపుణ్య♦కూలంకషాజల, స్ఫారితశ్రీరుద్ర ♦ పాదయుగళి
బలవదభ్యున్నత ♦ ప్రాకారపరివేశ, గండూషితాజాండ ♦ మండలంబు
గంధదంతావళ ♦ గ్రైవేయఘంటికా, ఠంకారముఖరఘం♦టాపథంబు
తే. రాజబింబాననానూత్న ♦ రత్నపేటి, వీరరాహుత్తసుభటకం♦ఠీరవాద్రి
వేమభూపాలరాజ్యాభి♦వృద్ధికరము, సాంద్రవిభవంబు రాజమ♦హేంద్రవరము. ౪౩

తే. వీరభద్రేశవేమపృ ♦ థ్వీధవులకు, మంత్రియగు బెండపూఁడన్న ♦ మంత్రివరుని
విమలవంశావతారంబు ♦ విస్తరింతు, నభ్యుదయహేతువుగఁ ప్రబం♦ధాదియందు.

కృతినాయక వంశావతారవర్ణనము.

సీ. ఆకాశలక్ష్మికి ♦ నవతంసకంబైన, మునిమండలములోని ♦ మొదలి చుక్క
యఱకాల బ్రహ్మాండ ♦ మప్పళించిన యట్టి, చిన్నివేల్పులరాజుఁ ♦ గన్నతండ్రి

---

౩౮. పండువానురతాణి = పండువాదేశపురాజు; పావడము = కానుక; ఉపద = కానుక; సంబెళ = వక్కలాకులతిత్తి; ఉపాయనము = కానుక.

యాదికల్పంబునాఁ ♦ డఖిలప్రపంచంబు, సృజియించు బ్రహ్మకుఁ ♦ జేయిదోడు
పరశురామునిచేతఁ ♦ బాథోధిమేఖలా, భరము దానముఁగొన్న ♦ బ్రాహ్మణుండు

తే. వేగుదక్షప్రజాపతి ♦ పెండ్లికొడుకు,
కశ్యపబ్రహ్మ నిజవంశ♦కర్తగాఁగ
వెలసెనుభయాన్వయంబులు ♦ వృద్ధిఁబొంద,
వ్రాలుఁబ్రాలుఁనుగలమంత్రి♦పోలమంత్రి.

కం. సాటి చదలేటినీటికి, హాటకిగర్భనివధూటి ♦ కమరద్రువనీ
వాటికి మధుకైటభరిపు, పీటికి శ్రీపోలమంత్రి ♦ విశదయశంబుల్. ౪౬

కం. ఆమంత్రికి నుదయించిరి, శ్రీమంతులు కార్యఖడ్గ ♦ జితవైరిమహా
సామంతులు శ్రీయల్లా, డామాత్యగ్రామణియును ♦ నన్నవిభుండున్. ౪౭

కం. అల్లాడవిభుఁడు రిపుహృ,ద్భల్లాడంబరుఁడు నాఁడు ♦ భామలమనసుల్
గొల్లాడఁగ మదనుఁడు దిశ, లల్లాడఁగఁ జేయుఁ దద్భు♦జాటోపంబుల్. ౪౮

సీ. కాకతిక్ష్మాపాల ♦ గంధదంతావళ, ధ్వజినీమహాధురం ♦ ధరుఁడనంగ
నవలక్షకోదండ ♦ నాథరాజ్యాంభోధి, సంపూర్ణ పూర్ణిమా ♦ చంద్రుఁడనఁగ
నంధ్రభూమండలా ♦ ధ్యక్షసింహాసన, సంప్రతిష్ఠాపనా♦చార్యుఁ డనఁగ
వీరరుద్రాశేష ♦ విశ్వంభరాధీశ, పృథులదక్షిణభుజా♦పీఠ మనఁగ

తే. యవనసంహారవిలయకా♦లాగ్నియనఁగ, ధాటివిఘటితకుస్తురో♦ద్యానుఁడనఁగ
విశ్వలోకప్రశస్తుఁడై ♦ వినుతికెక్కె, నతులబలసీరి పోలయ ♦ యన్నశౌరి. ౪౯

చం. కొలనుఁ బ్రతాపరుద్రనృప♦కుంజరుచేత నరేంద్రనారణీ
సలిలవివర్ధమానబహు♦సస్యసమాకుల మగ్రహారమై
వెలయ విభాకరగ్రహణ♦వేళఁ దగంగఁ బరిగ్రహించి బం
ధుఁ భరియించె నన్నవిభు♦తో సరియెట్లు ప్రధానులెవ్వరున్. ౫౦

శా. అయ్యన్నయ్యకు యావదర్థ పదగ♦ర్వానర్వగంభీరవాక్
శయ్యాకైటభవైరిశయ్యకు ఘనుల్ ♦ షాడ్గుణ్యవిద్యానిధుల్
త్రయ్యంతజ్ఞులు దేవధీమణియునున్ ♦ దల్ల ప్రభుండున్ సుతుల్
వియ్యం బందుఁ దదీయకీర్తులు దిశా♦వేదండతుండాళితోన్. ౫౧

శా. లక్ష్మీదేవిఁ బయోరుహేక్షణునిఁ బో♦ల్పం బాత్రులై యొప్ప శ్రీ
లక్ష్మీదేవికి నన్నమంత్రికి సుతుల్ ♦ లావణ్యసంపన్నిధుల్

౪౬. మధుకైటభరిపువీడు = విష్ణునివాసస్థానమగు శ్వేతద్వీపము. ౫౦. కైటభవైరిశయ్య = శేషుఁడు; త్రయ్యంతము = వేదాంతము.

లక్ష్మీవంతులు దేవమంత్రియును ద♦ల్లప్పప్రధానుండు న
ర్వక్ష్మాధీశసభాంతరస్తుతనయ ♦ ప్రాగల్భ్యవాచస్పతుల్. ౩౨

కం. పన్నీటగంధజలమున, నన్నయతల్లప్రధానుఁ♦ డభిషేకింపన్
గన్నప పుక్కిటినీటను, గన్న యపోచికము వాయుఁ ♦ గఱకంఠునకున్. ౩౩

సీ. ముక్కంటిదరహాస♦మున కనుప్రాసంబు, మిన్నేటినీటికి ♦ మిక్కుటంబు
శారదజ్యోత్స్నాప్ర♦సారంబునకు వీప్స, నలువశుద్ధాంతంబు♦న కనుభాష
కల్పకారామరే♦ఖకుఁ బ్రతిచ్ఛందంబు, త్రిదశేంద్రకరటి కా♦మ్రేడితంబు
పుండరీకారణ్య♦మునకు నధ్యాహార, మమృతాంబునిధి కభి♦ధాంతరంబు

తే. గంధసారతుషారపా♦ణింధమంబు, దానవిద్యావిలాస వి♦ద్యాధనుండు
మంత్రి యన్నయ దేవయ్య ♦ మహితయశము, నిఖిలదిక్తటమంతయు♦నిండియుండె.

మహాస్రగ్ధర. వియదాశా భూతధాత్రీ ♦ విహృతికలన ని♦ర్విఘ్నసంభారనిఘ్నా
వ్యయకీర్తిస్ఫూర్తిముద్రా♦హసితశశికిరీ ♦ టాట్టహాస స్వయంభూ
దయితా మందార చంద్రా♦తప సురతటినీ ♦ తార నీహారమౌ న
న్నయ దేవామాత్యుతోడన్ ♦ హరహార సరియే ♦ యన్యభూపాలమంత్రుల్. ౩౫

ఉ. ధీరుఁడు దేవమంత్రి నయ ♦ ధీగుణనిర్జిత దేవమంత్రి శ్రీ
వీరయ దేవవల్లభధిప♦విశ్వవిభు ప్రియపుత్రి రామమాం
బారమణీమణిన్ భువన ♦ పావనవర్తనఁ బెండ్లియాడె నం
భోరుహనేత్రుఁ డంబునిధి♦పుత్రికఁ బెండిలియాడు కైవడిన్. ౩౬

సీ. జగదేకసంస్తుత్య ♦ సౌభాగ్యసంపద, రతిదేవిఁ బోలుని ♦ రాజవదన
పరమపాతివ్రత్య ♦ భాగ్యగౌరవమున, భూపుత్రిఁ బోలునీ ♦ పువ్వుఁబోణి
యక్షీణమహిమఁ గ♦ల్యాణవైభవమునఁ, బార్వతిఁ బోలునీ ♦ పద్మగంధి
మృదుగభీరప్రౌఢ ♦ మితభాషణంబుల, భారతిఁ బోలు నీ♦పరమసాధ్వి.

తే. యనుచు బంధులు వినుతింప ♦ నవనిమించె, నధికశుభగాత్రి విశ్వనా♦యకునిపుత్రి
యన్నవిభు దేవమంత్రి ♦ యర్ధాంగలక్ష్మి రమ్యసద్గుణనికురుంబ♦రామమాంబ. ౩౭

తే. సింధుకరికాళ భల్లాణ ♦ సేనయాది, పరమమాహేశ్వరాచార ♦ పథులసరణి
నన్నవిభు దేవయామాత్యు ♦ డెన్నవచ్చుఁ, బార్వతీవల్లభునిమీఁది ♦ భక్తిగరిమ. ౩౮

శా. ఆరామాంబకు దేవమంత్రికిని ద ♦ త్పౌరామభీమేశ్వర
స్ఫారాపారకృపాగుణోదయమునం ♦ జన్మించి రాత్మోద్భవుల్

---

౩౪. వీప్స=పరంపరగా వ్యాపింప నిచ్చు; పాణింధమంబు—కొలిమితిత్తి; త్రిదశేంద్రకరటి—ఐరావతము.

ధీరోదాత్తుఁడు లింగమంత్రి విభుఁడున్ ♦ ధీశాలి తల్లన్నయున్
బారావారగభీరుఁ డన్నధరణీ ♦ పాలుండు లక్ష్మీనిధుల్. ౫౯

ఉ. సంగరసవ్యసాచికిఁ బ్ర♦శస్తవితీర్ణిదధీచికి న్మహా
మంగళచారుమూర్తికి స♦మంచిత నిర్మలధర్మమూర్తికిన్
లింగనమంత్రికిన్ విశద♦నీతిధురావిబుధేంద్రమంత్రి కు
త్తుంగతరప్రతాపగుణ♦ధూర్జటి కెవ్వరుసాటి ధారణిన్. ౬౦

సీ. ఖండశర్కర జున్ను ♦ కండచక్కెరలు దో, సెలువడల్నేవెసా♦సెములతోడఁ
గమ్మఁగాఁ గాఁచిన ♦ కఱియాలనేతితోఁ, గమనీయపంచభ♦క్ష్యములతోడ
సంబారములతోడి ♦ శాకపాకముతోడఁ, బక్వమైన పెసర♦పప్పుతోడఁ
దేనియధారతోఁ ♦ బానకంబులతోడ, శిఖరపాడబరస ♦ శ్రేణితోడ
తే. నచ్చలవణాదికముతోడ ♦ నమృతఖండ, పాండురంబైన దధితోడ♦ బ్రాహ్మణులకు
భోజనముపెట్టు ద్వాదశీ♦పుణ్యవేళ, లింగమంత్రి నవీన రు♦క్మాంగదుండు. ౬౧

కం. ప్రతిఘటియింపఁగవచ్చునె, ప్రతిభటులకు నసమసమర ♦ ఫల్గునుతోడన్
శతకోటిదృఢకఠార, క్షతశాత్రవుతోడ లింగ ♦ సచివునితోడన్. ౬౨

సీ. ఝూడేశవనసప్త ♦ మాడెబారుహదాంతి, వంతునాదిక్షితీ♦శ్వరుల గెలిచి
యొడ్డాదిమత్స్యవం♦శోదయార్జునుచేతఁ, బల్లవాధిపుచేతఁ ♦ బలచమంది
దండకారుణ్యమ♦ధ్యపుళిందరాజరం, భాహివంశజులకు ♦ నభయ మొసఁగి
భానుమత్కులవీర♦భద్రాన్నదేవేంద్ర, గర్వసంరంభంబుఁ ♦ గట్టిపెట్టి
తే. యవనకర్ణాటకటకభూ♦ధవులతోడ, బలిమినాటించి యేలించెఁ ♦ దెలుఁగుభూమిఁ
దననిజస్వామి నల్లాడ♦ధరణినాథు, బళిరె యరియేటిలింగన ♦ ప్రభువరుండు. ౬౩

కం. దేవబ్రాహ్మణభూములు, భూవరునకుఁ జెప్పి ధార♦వోయించె భళీ
దేవయలింగన ప్రియసం, భావననిరుపాధి సర్వ ♦ మాన్యంబులుగన్. ౬౪

చం. అవుర! ప్రతాపవేమ వసు♦ధాధిపుచే నృపపట్టభద్రుచే
భువనమనోహరంబయిన ♦ బోడసకుర్రి మహాస్థలంబునన్
దివిరి పరిగ్రహించె మన♦దేవయలింగనమంత్రియన్న చో
డవరమహాగ్రహారముఁ గ♦డంకఁ గవిద్విజబంధురక్షకై. ౬౫

సీ. వాహ్యాళిభూమి చే♦వంతనైషధు లట్లు, హాయరత్నముల నెక్కి ♦ యాడనేర్చుఁ
గవిబుధశ్రేణికిఁ ♦ జెవులుపండువులుగా, నాస్థానమున మాట ♦ లాడనేర్చు

---

౬౧. శిఖర=పండిన దానిమ్మగింజలు; పాడబ=మధురమైన; రస=సారము. ౬౩. బలచము,=కప్పము. ౬౬. వాహ్యాళి=స్వారీ.

శక్తిత్రయంబునఁ ♦ జతురుపాయంబుల, షాడ్గుణ్యముల బుద్ధిఁ ♦ జరుపనేర్చుఁ
గైసేసిప్రత్యక్ష♦కందర్పమూర్తియై, నిర్వికారంబున ♦ నిలువనేర్చు
తే. నిష్ఠురాటోపవిస్ఫూర్తి♦నృహరి కరణి, నతికఠోర కుఠార ధా♦రాంచలమున
వైరివక్షస్స్థలము వ్రచ్చి ♦ వైవనేర్చు. సంగరార్జునుఁ డరియేటి ♦ లింగవిభుఁడు. ౬౬
ఆ. లింగమంత్రిభామ ♦ గంగాంబికాదేవి, గనియె సుతుల నర్థి ♦ కల్పతరుల
భవ్యరూపపంచ♦బాణావతారుల, మంత్రిమంత్రి దేవ ♦ మంత్రివరుల. ౬౭
తే. కశ్యపాన్వయపాథోధి ♦ కల్పశాఖి, సర్వగుణరత్నరోహణ♦శ్లాఘరేంద్ర
మభ్యుదయమందుమంత్రిలిం♦గయ్యసుతుఁడు, మదనగోపాలసన్నిభ♦మంత్రిమూర్తి.
ఉ. చంచలలోచనాకుసుమ ♦ చాపుఁడు దానకళాదధీచి యా
శాంచలవారణేంద్రదశ ♦ నాంకురనిర్మలకీర్తి వైభవా
భ్యంచిత సర్వలోకుఁ డన♦పాయరమావిభవప్రపంచరా
త్రించరశాత్రవుండు మన♦దేవయతిల్లన మంత్రిమాత్రుఁడే. ౬౯
కం. ఈవసుధామండలమున, నేవారును సరియె రూప♦హేలానుకృత
శ్రీవత్సలాంఛనునకును, దేవయతిల్లనికి మంత్రి ♦ దేవేంద్రునకున్. ౭౦
కం. నాళీకభవవధూస్తన, పాళీకస్తూరరమ్య ♦ పరిమళలహరీ
శాలీనతావిధాయిన, చోలీలలు తిల్లనార్థి ♦ సురభికి నమరున్. ౭౧
తే. తదనుసంభవుఁ డఖిల వి♦ద్యావిరించి, యర్థిజనకామధుగ్ధేను ♦ వన్నమంత్రి
క్రీడసల్పును వాని స♦త్కీర్తికాంత, సప్తలోకమహోత్సవ♦సౌధవీథి. ౭౨
మ. అరబీభాష తురుష్కభాష గజక♦ర్ణాటాంధ్రగాంధార ఘూ
ర్జరభాషల్ మళయాళభాష శకభా♦షా సింధు సౌవీరబ
ర్బరభాషల్ కరహాటభాష మఱియుం ♦ భాషావిశేషంబు ల
చ్చొసనై వచ్చు నరేటియన్ననికి గో♦ష్ఠీసంప్రయోగంబులన్. ౭౩
ఉ. అన్నయమంత్రిశేఖరుఁడ ♦ హమ్మదుసేనువదాన్యభూమిభృ
త్సన్నిధికి స్మదిన్నముచి♦తంబుగ వేమ మహీసురేంద్రరా
జోన్నతి సంతతాభ్యుదయ ♦ మొందఁగఁ బారసిభాష వ్రాసినం
గన్నులపండువై యమరుఁ ♦ గాకితమందలి వర్ణపద్ధతుల్. ౭౪
సీ. రాజమహేంద్ర దు♦ర్గమునఁ గావించె శ్రీ, వీరభద్రునకుఁ బ్రా ♦ కారరేఖ
నిలిపె మార్కండేయ ♦ నీలకంఠుని మ్రోల, రామేశుఁదమతల్లి ♦ నామకముగ
సంగమేశ్వరదివ్య ♦ శంభులింగమునకుఁ, గల్పించెఁ గళ్యాణ ♦ గర్భగృహము
దక్షవాటికయందుఁ ♦ దరుణేందుమౌళికి, మొగలివాకిటధామ ♦ మునురచించెఁ

౭౧. నాళీకభవవధూ=సరస్వతి.

తే. బ్రాగ్ద్రిశావప్రగోపుర ♦ ప్రాంగణమున, సప్తమునిసింధుసోపాన♦సరణికెలనఁ
దీర్చెభవనంబు భీమయ ♦ దేవునగర, మంత్రి దేవయ యన్నయా♦మాత్యవరుఁడు.

ఉ. భావనసంతసిల్లఁగ వి ♦ భావనజాపుని విద్విషత్పరీ
భావనవీనశౌరిఁ బ్రవి ♦ భావనుని న్నిఖిలక్షమాజనుల్
దీవనలిచ్చి యెప్పుడు సు♦ధీవనరాశి నుతింతు రుత్తముల్
దేవనమంత్రియన్న విభు ♦ దేవనదీవనపావనాన్వయున్. ౨౬

కం సిరిమేలికయగు నరకే, సరి యేమోకాని గర్వ♦సంరంభమ్మై
సరి యేపొనరఁగ నితరులు, సరియే యరియేటిమన్న ♦ సచివాగ్రణికిన్. ౨౭

శా. కాంచీకంకణతారహారకటక ♦ గ్రైవేయభూషావళుల్
లంచంబిత్తురు దూతికాతతికి లీ♦లన్ బెండపూఁడన్ననిన్
బంచాస్త్రోపముఁ దారతార కవయన్ ♦ బ్రార్థించి లోలోపలన్
బంచారామములందుఁ బల్లెలఁ బురిం♦బ్రౌఢేందుబింబాననల్. ౨౮

తే. తారగిరిసుందరముల బృం♦దారకాది, తారకారాజవదనలు ♦ తాసుతార
తారహారా శ్రుతి స్వరో♦దారలీలఁ, బాడుదురు బెండపూఁడన్న♦భవ్యకీర్తి. ౨౯

సీ. కలకంఠములఛాయఁ ♦ గల కంఠకోణంబు, నాగకుండలముల ♦ నాగరికతఁ
జూడఁజూడఁగనొప్పు ♦ సురసరిత్పూరంబుఁ, గాలఁగాలపిభాళి ♦ కటకముద్ర
మేన మేనాత్మజా♦మానినీరత్నంబుఁ ♦ గేలికురంగంబుఁ ♦ గేలి వ్రేల
భస్మోపవాహంబుఁ ♦ బాండుదేహంబునఁ, గటినిబుట్టంబైన ♦ కరటిశోలు

తే. వికటశృంగారమున నొప్పు ♦ వేల్పు తేని, నాగమోపనిషన్నరో ♦ హరుని హరుని
కర్చనముసేయు సంధ్యాత్ర♦యంబులందు, బెండపూఁడన్నకన్నుల♦పండువుగను.

సీ. అఖిలదిగ్దంతిదం♦తార్గళంబుల వ్రాయు, నధిపుదిగ్జయశాస ♦ నాక్షరములఁ
గువలయాక్షుల మించు♦గుబ్బచన్నుల వ్రాయుఁ, గుంకుమపత్రభం♦గాంకురముల
గర్వితారాతివ♦క్షస్థలంబుల వ్రాయు, నయకార్యసరణికి♦ణాంకములను
నర్థిసందోహహ♦స్తాంచలంబుల వ్రాయు, లక్ష్మీప్రసమ్మైన ♦ లక్షణములఁ

తే. బసిఁడిగంటాన భూపాలు♦పార్శ్వసీమ, వ్రాయు నయకావ్యసరణికే♦వలముకాదు
వేమధాత్రీకళత్రు గా♦రాము మంత్రి, యతులగుణహారి బెండపూఁ♦డన్నశౌరి.

—షష్ఠ్యంతములు.—

కం. ఇట్టి మహిమంబు గల జగ, జెట్టికి నర్థార్థిలోక ♦ చింతామణికా
రట్టహయఘట్టసేనా, ఘట్టితరిపుపట్టనోప ♦ కంఠక్షితికిన్. ౩౨

౨౬. దేవనదీ=గంగ; వనము—జలము. ౩౦. చూడన్—శిరస్సునందు. ౩౧. నయకార్యసరణికిణాంకములు=నీతికార్య మార్గరూపము లగు కాయల చిన్నెలు.

కం. కంఠీరవవిక్రమునకు, కుంఠప్రతిభునకు దాన ♦ గుణసురభికి శ్రీ
కంఠాంఘ్రి కమలనయనో, త్కంఠావైకుంఠునకు న♦ఖండితధృతికిన్. ౮౩

కం. దుగ్ధపయోధిసుధారస, ముగ్ధేందుధరాట్టహాస ♦ మురహారశయ్యా
దిగ్ధూర్ధర కరటిఘటా, స్నిగ్ధయశోదిగ్ధరోద ♦ సీకుహరునకున్. ౮౪

కం. చెంచుమలచూఱకారున, కంచితబాహాపరాక్ర ♦ మాధారునకున్
పంచారామ వధూటీ, పంచాస్త్ర విహారకేలి ♦ పాంచాలునకున్. ౮౫

కం. శ్రీవీరభద్రవేమ, క్ష్మావరరాజ్యాభివృద్ధి ♦ కారణమునకున్
లావణ్యరూపసంపదఁ, బూవిలుకానికిని బెంచు ♦ పూఁడన్ననికిన్. ౮౬

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా నామొనర్పంబూనిన యిమ్మహాప్రబంధంబునకుఁ గథానాయకుండైన భీమేశ్వర మహాదేవునకుఁ బ్రియధామంబైన దక్షారామపుర వరం బెట్టిదనిన. ౮౭

దక్షారామపురవర్ణనము.

సీ. పర్యంత మందార ♦ పారిజాతకవనీ, రమమాణనిర్ఝరీ♦సముదయంబు
సరసరసాసిద్ధ ♦ వరవారి సంపూర్ణ, గంభీరతరపరి ♦ ఖాపయోధి
ప్రబలచింతారత్న ♦ పాషాణసంఘాత, వప్రరేఖాచక్ర ♦ వలయితంబుఁ
గామధేనుసహస్ర ♦ కఠినరింఖాటంక, దళసదంతురితర ♦ థ్యాముఖంబు
తే. భద్రపాతాళభైరవ ♦ పాలితంబు, గుహవినాయక రక్షణా♦కుంఠితంబు
సప్తమాతృకపరివార ♦ సంకులంబు, వసుమతీనూపురము దక్ష♦వాటిపురము. ౮౮

సీ. కాంతిసంపదనేల ♦ కైవార మొనరింప, విధుబింబమున నుద్భ♦వించిరనిన
మాధుర్యగుణమేల ♦ మాటిమాటికిఁ జెప్ప, నమృతాబ్ధి నవతార ♦ మందిరనినఁ
దేజోవిశేషంబు ♦ తెలుఁగు పల్కఁగనేల, విద్యుల్లతలలోన ♦ వెడలిరనిన
మోహనాకృతియేల ♦ మునుమాడి కొనియాడఁ, బుష్పచాపునివింటఁ♦బుట్టిరనిన
తే. సంభవించిరి గంధర్వ♦జాతిననినఁ, గలితనంబేల పెన్నాట♦కంబు సేయ
నవఁగ భీమేశ్వరునిఁగొల్చు♦రప్పురమున, సానులనుపేరి యప్సర♦శ్చంద్రముఖులు.

మ. మొరయింపన్ మరుఁ డిక్షుచాప మనిశం♦బుం దక్షవాటీమహా
పురమధ్యంబున ముజ్జగంబు గెలువన్ ♦ బుత్తెంచులీలం బురం
దరవిశ్రాణితదేవతాభువనగం♦ధర్వాప్సరోభామినీ
చరణాంభోరుహనూపురస్వనములన్ ♦ జంకించు ఝంకారముల్. ౯౦

శా. గంధర్వోపనిషద్రహస్యములు వ♦క్కాణింతు రాలాపసం
బంధప్రస్ఫుటఝుంటుఝుంటుపద గుం♦భస్థాపవర్గావళీ

---

౮౪. కరటిఘటా=దిగ్గజములన్నియుఁ దెలుపను ప్రయోగాంతరములు మృగ్యములు.

సంధానక్రమదివ్యమంత్రకములన్ ♦ సాయాహ్నకాలంబులన్
గంధర్వాప్సరసల్ పురోపవనికా ♦ కల్పద్రుమచ్ఛాయలన్. ౯౧

సీ. చరణద్వయీభూరి ♦ సౌభాగ్యసంపదఁ, బరిభవింతురు హేమ♦పద్మవనము
ఘనవితంబస్థలీ ♦ గౌరవాభ్యున్నతి, సంప్రతింతురు నదీ ♦ సైకతముల
గంభీరతరనాభి ♦ గర్తవిభ్రమముల, వ్రక్కలింతురు జలా♦వర్తశోభ
గురుపయోధరభార♦పరిణాహ విస్ఫూర్తి గుద్దలింతురు హేమ ♦ కుంభగరిమ
తే. గారవింతురు కంబోప ♦ కంఠకాంతిఁ,
గంబుమణికాంతి బిబ్బోక ♦ డంబరంబు
మచ్చరింతురుముఖచంద్ర♦మండలములఁ,
బూర్ణశశిమండలముతోడఁ ♦ బురముసతులు. ౯౨

శా. దక్షారామవిలాసినీతతుల సౌం♦దర్యంబు వర్ణింపఁగాఁ
జక్షుశ్శ్రోత్రకులాధినాయకునకున్ ♦ శక్యంబె? తచ్చారుఘో
లక్షేత్రంబును బోలలేక మునిఁగెం ♦ లజ్జాభరక్రాంతుఁడై
నక్షత్రేశుఁడు శంభుశేఖరసుధాం♦ధస్సింధుపూరంబులన్. ౯౩

సీ. అంబుధరశ్రేణి ♦ హరిణలాంఛనరేఖ, కమ్రకార్ముకవల్లి ♦ కామతల్లి
జలచరద్వంద్వంబు ♦ చంపకప్రసవంబు, బింబంబు దాడిమ ♦ బీజరాజి
శష్కులీయుగళంబు ♦ చారుదర్పణములు, శంఖంబు బిసములు ♦ జలరుహములు
పసిఁడికుంభంబులు ♦ బయలంబువీచులు, పుష్కరావర్తంబు ♦ పులినతలము
తే. కదళికా హేమకాహళ ♦ కచ్ఛపములు, మణులబంతులు తారకా♦మండలములు
సంఘటించి పురంబు వే♦శ్యలసృజించె, జాణదేవరశ్రీపంచ ♦ శరవిరించి. ౯౪

సీ. ముడువంగనేర్తురు ♦ మూలఁగస్తురితావి, గలుగు క్రొవ్విరులు లోఁ ♦ గందకుండ
మురియంగనేర్తురు ♦ మోహనాస్పదమైన, మొగలివాకిటిచాయ ♦ నరగవీథి
వలపింపనేర్తురు ♦ వలరాజుగెలిచిన, పెద్దగాలమువేల్పు ♦ భీమనాథుఁ
బలుకంగనేర్తురు ♦ పాటలాధరముల, మొల్కలేనగవులు ♦ ముద్దుగురియఁ
తే. జందురునితోడఁ గల్పవృ♦క్షములతోడఁ, దారతో లక్ష్మితో నమృ♦తంబుతోడఁ
గౌస్తుభముతోడ మున్నీఁటఁ ♦ గలిగినారు, విబుధగంధర్వజాతుల♦వీటిసతులు.

కం. పూఁబోణులకును విటులకు, వేఁబోకలఁదలరుసొంపు ♦ వీడ్కొలుపుఁ బురిన్
వేఁబోకఁబోఁకతోఁటల, పూఁబాళలకమ్మతావిఁ ♦ బొదలినగాడ్పుల్. ౯౫

ఉ. వీటికి నాల్గువంకలను ♦ వెన్నెలతేటలఁబోలు నీళ్ళతో
హాటకపద్మమండితము ♦ లైన కొలంకులు చూడనొప్పగున్

౯౫. వేఁబోకల=ఉదయకాలములందు; వేఁబోఁక=తిన్ననివడక; పూఁబాళ=పుష్పగుచ్ఛము.

జీటికిమాటికిన్ హరుఁడు ♦ జృంభితలీల నటింప మౌళిమి
న్నేటిక్రుపీటనిర్ఝరము ♦ లింతటనంతటఁ జిందెనోయనన్. ౯౭

సీ. తిలకంబులు తేని ♦ యలఁజోఁకమోకల, పువ్వుఁబాళలతావిఁ ♦ బుక్కిలించి
కలమగోపికల చ♦క్కని చన్నుఁగవలపై, వటపల్లవంబులు ♦ వాయఁదట్టి
సప్తగోదావర ♦ జలతరంగారోహ, కేలీసుఖంబు లం♦గీకరించి
దేవగంధర్వ లీ♦లావతీహాటక, ప్రాసాదవలభి గ♦ర్భములుదూఱి
తే. ప్రతిదినము దక్షవాటీపు♦రంబునందు, మలయ వేలావనీ ♦ మందమారుతంబు
గంధసారలతాకుడుం♦గములమెలఁగు, చిలువతేనులు సేవింప ♦ వెలితిపడుచు. ౯౮

తే. దక్షవాటికఁబశ్చిను♦ద్వారభూమిఁ, బ్రతివసించును సర్వాంగ♦రమ్యుఁడగుచు
సేవకులపాలి సురశాఖి ♦ పూవుఁగొమ్మ, కోమలార్ధేందుధరుకొమ్మ♦గోఁగులమ్మ. ౯౯

తే. దక్షపురమున నుత్తర♦ద్వారమందు, నూర్జితంబుగ నుండుమ♦హోజ్జ్వలాంగి
కామితార్థైకసంకల్ప ♦ కల్పవల్లి, మహితసుగుణమతల్లి శ్రీ♦మండతల్లి. ౧౦౦

కం. సారమతి దక్ష.వాటిక, తూర్పుగవనిన్ బ్రసిద్ధి♦తో వసియించున్
హేరాళక్రీడాసం, చారిణి నూకాంబ భక్త ♦ జనరక్షకునై. ౧౦౧

కం. మట్టయినయట్టి దక్షుని, పట్టనమున దక్షిణంబు ♦ పార్శ్వపుగవనిన్
నెట్టుకొని వెలసి నిలిచిన, ఘట్టాంబికఁ గొల్వఁ గలుగుఁ ♦ గామితఫలముల్. ౧౦౨

తే. పృథివిఁ బదునెనిమిది యోగ♦పీఠశక్తి, గణములం దెంచ సర్వశృం♦గారయగుచు
భీమనాథుని సన్నిధిఁ ♦ బ్రేమ వెలయు, మాణికాదేవి సకల క♦ల్యాణమూర్తి. ౧౦౩

ఉ. ఏదెసఁజూచినన్ విబుధు ♦ లేదెసఁజూచిన మౌనిమండలం
బేదెసఁజూచినన్ హరి ద♦ధీశ్వరవర్గము వాసవాది యం
దేదెసఁజూచిన న్నవమ♦హేశ్వరమూర్తులు శ్రీనికుంభకుం
భోదరతండు భృంగిరిటి ♦ హూహుకహాహులు దక్షవాటికన్. ౧౦౪

సీ. విరులదండలతోడి ♦ వేణికాభారంబు, పొంకంబు పిఱుఁదులఁ ♦ బొరలిమాడ
మణితులాకోటికో ♦ మలఝుణత్కారంబు, రవలిముట్టెలమ్రోఁత ♦ యవఘళింపఁ
గుదురునిండినచిన్ని ♦ గుబ్బచన్నులమీఁద, ముత్యాలత్రిసరంబు ♦ మురువుఁజూప
వలమానతాటంక ♦ వజ్రాంకురచ్ఛాయ, లేఁతవెన్నెలఁ బుక్కి♦లించియుమియ
తే. సాని యీశానినై మహో♦త్సవమునందుఁ, గేల నవచంద్రకాంతపు ♦ గిన్నెపూని
వీథిభిక్షాటనమొనర్చు♦వేళఁ జేయు, మరులనృత్యంబు జగముల ♦ మరులుకొలుపు.

సీ. వేదండవదనశుం♦డాదండచుళికిత, ప్రోజ్ఝితాంభశ్ఛటా♦ప్లుతనభంబు
దేవగంధర్వాప్స♦రోవధూటీస్తన, స్థాసక శ్రీగంధ ♦ ధవళితంబుఁ

గనకసౌగంధిక ♦ గంధోత్తమాగంధ, సారనిష్యంద పు♦ష్పంధయంబుఁ
జటులవీచీఘటా ♦ ఘటాటడోలారూఢ, హంససంసన్ని నా♦దాలసంబు
తే. భూరితీరావనీఘనీ ♦ భూతనూత, జాతివకుళవనీసమా♦చ్ఛాద్యమాన
బహుళసింధు ధునీవన ♦ బకమరాళి, దక్షపురియొద్ద సప్తగో♦దావరంబు. ౧౦౬

సీ. సరివచ్చు ననవచ్చు ♦ శతమన్యుపీటికి, వివిధ దేవాగార ♦ విభ్రమమునఁ
బ్రతివచ్చు ననవచ్చుఁ ♦ బాలమున్నీటికి, నక్షయం బగు జీవ ♦ నాభివృద్ధి
నెనవచ్చు ననవచ్చు ♦ నిందుబింబమునకు, సకలకళావిలా♦సప్రవృద్ధి
దొరవచ్చు ననవచ్చుఁ ♦ దోయజాక్షునిమూర్తి, కభిరామలక్ష్మీ స♦మగ్రమహిమఁ
తే. జెప్పనొప్పదె యప్సరః♦స్త్రీసహస్ర, ధవళతరదీర్ఘసృక్కుప్పట ♦ ధాళధళ్య
సమ్మిళద్భీమనాథ భూ♦షాశశాంక, తరళదీధితిపరిపాటి ♦ దక్షవాటి. ౧౦౭

కం. రోధించు నభముఁ బటికపు, సౌధంబులు పేట భీమ ♦ శంకరహర్షో
త్సేధాట్టహాసరేఖా, దీధితిమైత్రీత్రిధావి♦ధేయములగుచున్. ౧౦౮

చం. ప్రహరిచరింతు రెప్పుడును ♦ భైరవు లర్ధనిశాగమంబులన్
గహకహనిష్ఠురాట్టహాస ♦ గర్వితకంఠకఠోరహుంకృతుల్
బహులభుజాసమస్తసుర ♦ భాంకృతినాదము మేళగించి ది
క్కుహరములొప్పు హాటకపుఁ ♦ గోటలమీఁదట దక్షవాటికన్. ౧౦౯

వ. మఱియు నప్పురంబు దళితసమదకరిసహస్రంబు లగు సుభటసహస్రంబులవలన సింహసంహతియు, సమధికవితరణశౌండానిరాఘాటకీర్తిస్ఫూర్తు లగు వదాన్యులవలనఁ బారిజాతోద్యానంబును, ననేకశతసవనసమజ్యోతిర్ధారియగు సుమనోవర్గంబువలన సుధర్మాస్థానంబును, నభిరామరామణీయక సౌభాగ్యరేఖావిలాస పక్ష్మాంతలక్ష్మీవిరాజమానంబగు రాజకుమారలోకంబులవలన గంధర్వలోకంబును, మకరకచ్ఛపముకుంద నిధినాథులగు వైశ్యులవలన వైశ్రవణస్థానంబునను దగి, సకలభువన ప్రశస్తంబై; భారతవర్షంబునకు ఫలసంపదయునుంబోలె శాఖానగసహస్రసంబాధ పరిసరంబై; సకలజగన్నిర్మాణమాతృకయగు కృతయుగంబునకుం గారణంబనఁ గనకగిరినప్రదీప్తప్రాకారబహుప్రకారవప్రప్రకరపరివేషవలయవలయితంబై; సలిలసంక్రాంత కనకావరణమండల ప్రతిబింబంబగుటం జేసి కులిశపతనభయావగాహహాటకక్షితిధరంబగు నపరాంబురాశియుంబోని పరిఖాచక్రంబుచేతను, క్రీడాగజమదజలపంకిల ప్రాంగణంబులగు భృంగిరిటినికుంభకుంభోదరప్రధాన ప్రమథగణమణిభవన సౌధంబులచేతను, నాసన్నదీర్ఘికావీచీపవనవికీర్యమాణ వికస్వరజలజనిష్యందమధు బిందువర్షాంబు

దూరీకృతశంభళీకపోలకస్తూరికాపత్త్ర భంగంబులగు నప్సరోంగనావాటంబులచేతను, గుట్టిమఖచితమణికిరణవిసరణజనితాకాండప్రసారితకదళీపలాశసంగతిసంశోభితకక్ష్యావిభాగంబులగు యక్షగంధర్వకిన్నరకింపురుష సిద్ధవిద్యాధరస్థానంబులచేతను, గారుత్మతరత్నాంశుపటలఘటితపటయామినీతారకాయమానస్థలఖచితస్థూలముక్తాఫలశలాకానికాయంబులగు భైరవాయతనంబులచేతను, బ్రస్నిగ్ధశ్యామలశిలోత్కీర్ణరమ్యోపవాహ్యశాక్వరంబులగు శంకరాగారద్వారంబులచేతను, దులసీవళశీతలామోదముషితకిల్బిషంబులగు విష్వక్సేనధామంబులచేతను, నిరంతర సంఫుల్లమల్లీవల్లికాతల్లజపుష్పనిష్యందమాన మధుమత్తపుష్పంధయవిరుతిపునీతహరిదుపఘ్నంబులగు విఘ్నేశ్వరావాసలలితోద్యానంబులచేతను, బృథులవారిశీకరపటలపానదరవికటకరటిముఖవికలితవరాటకోశవ్యాకోచహాటకకుశేశయంబులగు సప్తగోదావరప్రవాహసలిలంబులచేతను, గోమలకింజల్కాగ్రగ్రసనజాగ్రచ్చక్రవాక చరణనఖశిఖరసముల్లిఖితకమలకువలయకుముదషండంబులగు తీర్థకుండంబులచేతను, గోదావరీతుల్యభాగాకౌంతేయాకణ్వాపగానదీమాతృకాయమానంబై యిసుగారునుబంటపొసంగుపంటవలంతి కేదారక్షేత్రంబులచేతను, నఖండితాంభస్సమృద్ధి విజృంభించి విశ్వంభరాభ్రూలతాకారిసేతురేఖాలంకారంబులై తటతరుకుసుమాంతరక్షరదమందమకరంద సందోహస్యందనకల్లోలంబులై సలిలకేలీలోలకలహంసకామినీకోలాహలాను కృతజలదేవతాచరణమణినూపురఝుణఝుణత్కారంబులై కారండవపక్షవిక్షేపపరిచరిత పంకజపరాగపాళీవిరచితాళీకసంధ్యానుబంధచరితచక్రవాకమిథునంబులైపయోధిగన్నబిడ్డలుంబోని యొడ్డుచెఱువులచేతను, సరససహకారశాఖాశిఖాధిరూఢకోకిలకుటుంబినీకంఠనాళ కోమలకుహూకారకోలాహలకలిత విరహిణీహృదయహాలాహలక్షేపంబులును మధుకరనికరగుంజాయమానమాధవీనికుంజకుంజసన్నిహిత కిరణపుంజంబులును సముద్భిన్నపున్నాగకుసుమపరిమళోద్గార నీహారంబులును సముల్లసితచంపకకళికాకలాపకల్పితకందర్పపావకాస్త్రపరిత్రస్తపథికలోకంబులును, బాకపరిస్ఫుటితపుండ్రేక్షుపర్వముఖోద్గీర్ణముక్తామణిదర్శితాకారరాకానిశాకరప్రకాశంబులును గోరకప్రకరతారతారకితకురువకానోకహంబులును వనితావదనాసవసనాథవకుళవనంబులును మహోరుకుచకలశకాంతిచోరఫలకలితలికుచనిచయంబులునుమాతులుంగామోదహృదయంగమంబులును నవనాగరంగసంగసుఖితనారంగమంగళగానసరససంగీతప్రసంగంబులును భుజంగలతాపరిష్వంగధన్యతరుణపూగద్రుమంబులును, లలితలవలీలతాలింగితలవంగంబులును నగు శృంగారారామంబులచేతను, నభిరామంబై; కలితచాతుర్వర్ణ్యస్థితియగుటం ద్రైలోక్యతిలకంబును, సముద్భాసితాసం

ఖ్య దేవాలయంబగుట శతమఖనగరంబును, నక్షయజీవనధృతియగుట ధర్మపాల మండలంబును, ననధిగతకంటకరుచిరంబగుటం బ్రజాభాగ్యఘంటాపథంబును, బ్రచురసన్మణివాసంబగుట వసుంధరాధిపస్థానంబునునై, గుహ్యకనగరంబునుం బోలె వివిధమనుష్యధర్మ చరితపవిత్రంబును లంకానగరంబునుంబోలెఁ బుణ్యజనాధ్యుషిత సన్నివేశంబును గార్తవీర్యార్జునమూర్తియునుంబోలె నవిరళకరభూషితంబును నృసింహలీలాడంబరంబునుంబోలెఁ బ్రథితహిరణ్యకశిపుక్షయంబును శరత్కాలంబునుంబోలె విలసత్ప్రకాశంబును బ్రాహ్మణజాతిధర్మంబునుంబోలె నిగమశాలియునునై; మహాభూషాన్వితంబయ్యును నిరాక్రోశంబును బ్రకటభుజంగప్రచారంబయ్యును సదాహితాభయంబును బలిరాజనిలయ భూతంబయ్యును గంధర్వభూమియునై; వర్ణసాంకర్యంబు వాసవకోదండంబునంద, యహిభయంబు వల్మీకంబులయంద, జీవనసంశయంబు వారిదంబులయంద, వృషాతిక్రమంబు గృహంబులయంద, పరదర్శనంబు యతులయంద, దోషోల్లాసంబు కువలయంబులయంద, కౌరవపదానుసరణంబు కిరాతులయంద, తరళత్వంబు కరికరసంతానంబులయంద, విపక్షక్షోభంబుకొలంకులయంద, యాత్తగంధత్వంబు చందనంబులయంద, కానితనయందుఁ బొందనీక విభవంబునకుఁ బ్రభవంబును విలాసంబునకు నివాసంబును నపర్గంబునకు సర్గంబును ధర్మంబునకు మర్మంబును దానంబునకు నిధానంబును నానందంబునకు మూలకందంబును విద్యకు నిషద్యయు విశ్రామంబునకు ధామంబునునై యొప్పు నప్పట్టనంబున కధీశ్వరుండు. ౧౧౦

సీ. హాలాహలంబను ♦ నల్లనేరెడుపండు, మిసిమింతుఁడునుగాక ♦ మ్రింగినాఁడు
పెనుమ్రేలికొనగోర ♦ బిసరుహాసను మోముఁ, గెందమ్మివిరివోలె ♦ గిల్లినాఁడు
పంచవన్నియతోడఁ ♦ బ్రవననారాచుని, నెఱ్ఱచిచ్చుఱకంట ♦ జుఱ్ఱినాఁడు
మెఱుఁగుఁగోఱలుదుల్ల ♦ మృత్యుదేవతనోరు, ధట్టించియుఱకాలఁ ♦ దన్నినాఁడు
తే. త్రిపుర దైత్యావరోధనా♦రీవిలాస, దంతతాటంకములకెగ్గు ♦ దలఁచినాఁడు
దక్షపురిసానికూఁతులఁ ♦ దవిలినాఁడు, విశ్వలోకకుటుంబి భీ♦మేశ్వరుండు. ౧౧౧

మ. ఎనయంగల్గినకూర్మి భృంగిరిటిఁగా♦నీ తండుఁగానీ నికుం
భునిఁగానీ కయిదండపట్టుకొని సం♦భోగేచ్ఛ నంతఃపురాం
గనలం గన్నుమొఱంగి యప్పురమునం ♦ గన్నెఱు కాఁదారి ప్రొ
ద్దున భీమేశుఁడు సానివాడ కరుగుః ♦ ధూర్తప్రకారంబునన్. ౧౧౨

కం. పదునాల్గు మహాయుగముల, ముదుకగు భీమేశ్వరునకు ♦ మొగచాటైయుం
డదు సాని పెండ్లి యెప్పుడు, నది దక్షారామమహిమ ♦ మగునో కాదో? ౧౧౩

౧౧౨. కాఁదారి=నడురేయి.

సీ. నేదిష్ఠమున సప్త♦గోదావరంబున, నఘమర్షణస్నాన ♦ మాచరించి
త్ర్యాయుతమంత్రాక్ష ♦ తాభిమంత్రితమైన, విమలభూతి త్రిపుం♦డ్రముధరించి
మొగలివాకిలిఁ దూఱి ♦ దిగువశాక్వరరాజు, నగరిపై వెన్నుని ♦ ననువుఁ జూచి
మణిశిలాసోపాన ♦ మధ్యమార్గంబుగా, నభ్రంకషంబైన ♦ హర్మ్యమెక్కి
తే. సప్తపాతాళభువన వి♦ష్కంభములను, దెఱచి వెడలిన జ్యోతిః ప్ర♦దీప్తమూర్తి
శంభు భీమేశ్వరేశ్వర ♦ స్వామిఁ గొలుచు, పరమమాహేశ్వరున కేమి ♦ ప్రాఁతిముక్తి.
కం. పరమాశించును భీమే,శ్వరు ననుమతిఁ జేసి చోడ♦వంశాభరణుం
డరికాలుఁడు కరికాలుఁడు, ధరణీధరపత్ని మనసు ♦ దైన్యము ముంచెన్. ౧౧౪
సీ. గజచర్మ మెన్నఁడో ♦ కాని నిచ్చలుగట్టు, పసిఁడికమ్ములపట్టు ♦ పచ్చడంబుఁ
భసితమెన్నఁడొ కాని ♦ ప్రతిదినంబున నలందు, మలయజంబు కురంగ ♦ మదము గూర్చి
నిజువపాములరాజు ♦ తొడవు లెన్నఁడొ కాని, తారహారములు ని♦త్యము ధరించు
నృకరంకరుండమా♦లిక లెన్నఁడో కాని, ధరియించు కహ్లార ♦ దామ మెపుడు
తే. కాటనడుచక్కి నెన్నఁడో ♦ కానియుండు, దక్షవాటి సువర్ణ సౌ♦ధముల మీఁద
నెన్నఁడొ పిశాచులను గాని♦యుండు ముఖుల, నెల్లకాలంబుఁ దలఁచు భీ♦మేశ్వరుండు.
సీ. ఒకవేళ ధరియించు ♦ యువనాశ్వుఁడిచ్చిన, కట్టాణిముత్యాల ♦ కంఠమాల
మాంధాతృఁడిచ్చిన ♦ మాణిక్యఖచితకే,యూరంబు ధరియించు ♦ నొక్కవేళ
నిక్ష్వాకుఁడిచ్చిన ♦ హీరాంకురంబుల, యుంగరంబు ధరించు ♦ నొక్కవేళ
ఘనచక్రవర్తి యి♦చ్చిన ప్రవాళంబుల, యొడ్డాణము ధరించు ♦ నొక్కవేళ
తే. వేడ్కధరియించు నొక్కొక్క♦వేళయందు, భరతదుష్యంతరంతినా♦భాగనహుష
నలభగీరథనృగమహీ ♦ నాథదత్త, హేమమణిభూషణములు భీ♦మేశ్వరుండు.

వ. వెండియు భీమేశ్వరుండు పండువుపండువు నఖండవిభవంబున నాఖండలాదివిబుధ మండలంబు పరివేష్టింప చలిగొండరాచూలియుందానును మార్తాండచంద్ర మండలంబువలనను బాలసముద్రంబువలనను మధుకైటభారియూరుకాండంబు వలనను గృపీట భవజ్వాలాజాలంబువలనను గంధర్వసార్వభౌమువలనను బ్రభ వించి కంతుకుంతంబులనఁ గాముతోమరంబులన మదనముద్గరంబులన శంబరారి కఠారంబులన నంగభవుకొంగవాలులన సిరిపట్టిసెలకట్టియలనవలరాజుభిండివా లంబులనఁ, దళతళంబొలయు తొలకరిమెఱుంగుమొలకలఁ గలకలనగు కలికితెలి గన్నుఁగవయును, జక్కనకనలఁ దక్కనపఱచుచుఁ గ్రిక్కిఱిసిన మెఱుంగు నిబ్బ రంబు గుబ్బచన్నులును, మిలమిలని జిలుఁగునలిపెంపువలువల తెరలమొదలవెలువడి

౧౧౪. నేదిష్ఠము = మిక్కిలి సమీపము.

కేలిగడలుకొను పసిమిగలపసిండితగటునుం దెగడు నునుదొడలజిగియును, బగడంపుఁ జిగురుటధరములతుదల నిగురుచుఁ జిఱుతనగవులు బిగియనగినం దెగిపడియెడుననువడువున నడుగడుగునకు వడవడనడంకుచుం బిడికిటనడంగు నడుముల బెడంగునుంగలిగి, ఘుగఘుగం గురంగనాభిసౌరభసారంబులతోడంగూడి సంకుమదపంకపరిమళంబుల ఝుంకించు కర్పూరవాసనాసముల్లాసంబును, కర్పూరవాసనాసముల్లాసంబు నుల్లసంబాడు కాలాగురుకర్దమామోదంబుననుంబునుంగుపసం బిసాళించు గొజ్జంగినీటిసెత్తావియును, గొజ్జంగినీటినెత్తావి బిత్తరించు గంధపొడిపొలుపును, గంధపొడి పొలుపునుంగుమ్మరించు ధమ్మిల్లమల్లికాహల్లక వకుళవాసంతికాజాతికేతకీకుందకుసుమగంధంబులును నిఖిలదిక్సంధిబంధంబుతో బాంధవం బనుసంధింప, నిలింపగంధర్వాప్సరోజాతులగు సానికూఁతులుగొలువ, జగనొబ్బగండ జగదగోపాల పల్లవాదిత్య పల్లవత్రినేత్ర కేళాదిరాయ రాయవేశ్యాభుజంగ బిరుదాభిరామాల్లయ వేమభూపాల రాజ్యభారధురంధరుండై, బెండపూఁ డన్నయామాత్యుఁడు గట్టించినమొగసాలవాకిటి మహోత్సవమండపంబు నందుఁ, బేరోలగంబుండి, కుండలీ దండలాసకప్రేరణీ ప్రేంఖణసింధుకందుకథమాళిచేలమతల్లీ హల్లీసకాదినృత్యంబు లవలోకించుచుఁ, బంతంబు లవధరించుచు, మేలంబు లాలకించుచుఁ, జంపూచాటునాటకోదాహరణ జయఘోషచక్రవాళచతుర్భద్రచతురాత్రిప్రబంధంబు లాకర్ణించుచు, వేణువీణామృదంగ కాంస్యకాహళ పటహఢక్కా హుడుక్కానక ఝల్లరీహృద్యవాద్యానుషంగంబు లాదరించుచు, సంగీతభంగీతరంగంబు లంగీకరించుచు, నిగమంబులుగ్రహించుచుఁ బురాణంబులు వినుచు, నితిహాసంబు లిచ్ఛగించుచుఁ, దర్కంబులు వితర్కించుచు, నాగమంబులు పరీక్షించుచు, నిఖిలలోకరక్షణార్థంబుగా వివిధవిద్యాకలాపంబుల వినోదించుచుండు. ౧౧౮

కం. ఏతాదృశప్రభావో, పేతుండగుదక్షవాటి ♦ భీమేశ్వరువి
ఖ్యాతకథ చెప్పెదను శుక, తాతకృతపురాణసరణి ♦ తప్పకయుండన్. ౧౧౯

కథాప్రారంభము.

వ. ఇమ్మహాపురాణంబునకుఁ గథాక్రమం బెట్టిదనిన:—నైమిశారణ్యపుణ్యక్షేత్రంబున ద్వాదశవార్షికంబైన దీర్ఘసత్త్రంబు ప్రవర్తిల్లుచుండఁ గులపతిశౌనకుండను పరమఋషి మొదలుగాఁగలసంయమీశ్వరులు యదృచ్ఛాసమాగతుఁడైన రోమహర్షణపుత్త్రుఁ బాదరాయణప్రియశిష్యుఁ బౌరాణికు సూత్యాహసంభవు సూతు నర్చించి యతనివలనను బంచాశత్ఖండమండితంబును, బహుసంహితాసమాకీర్ణం

-T41

బును, సపాదలక్షగ్రంథసంఖ్యాసమన్వితంబును, నైనస్కాందపురాణంబు విను
వారును నందుఁ బూర్వఖండంబునం బారాశర్యుండు నిజాపరాధంబు గారణంబు
గా విశ్వనాథుచేత నధిక్షేపింపంబడి వారణాశివెల్వడియె ననివిన్నవారగుటం జేసి
యటమీఁదివృత్తాంతంబు వినువేడుక నమ్మునీంద్రు నభినందించి యిట్లనిరి. ౧౨౦

తే. కాశివెలువడివచ్చి ప♦రాశరాత్మ, జుండు ఖేదంబు నొంది శి♦ష్యులును దాను
నెచట వసియించె నెచ్చోట ♦ నేమిచేసె, ననఘ యేతీర్థమాడె మా♦కానతిమ్ము.

వ. అని యడిగిన. ౧౨౦

మ. సరసీజాసనవంశమౌక్తిక కళా♦సర్వజ్ఞ విజ్ఞానశం
కరినాథాంఘ్రిసరోజషట్పద సమి♦ద్గాండీవకోదండ భూ
భరణప్రౌఢభుజాభుజంగ మహిళా ♦ పాంచాల వేమక్షమా
వరసామ్రాజ్యరమాధురంధర జగ♦ద్వ్యాప్తప్రతాపోదయా. ౧౨౩

కం. శ్రీవీరభద్రభూపతి, సేవాహేలాకటాక్ష ♦ సిద్ధసమృద్ధ
శ్రీవిభవపాకశాసన, భావభవారాతిభక్తి ♦ పరతంత్రనిధీ. ౧౨౪

మాలిని. అకుటిలనయమార్గా ♦ యాశ్రితార్థి ప్రవర్గా
సుకృతిసరణిపాంథా ♦ శుద్ధకీర్తిప్రబంధా
సకలజనవిధేయా ♦ శారదాభాగధేయా
ప్రకటసుగుణసంగా ♦ రాయవేశ్యాభుజంగా. ౧౨౫

గద్య. ఇది శ్రీకమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర సుకవిజనవిధేయ శ్రీనాథ
నామధేయప్రణీతంబైన శ్రీ భీమేశ్వరపురాణంబను మహాప్రబంధంబునందుఁ బ్రథ
మాశ్వాసము.

శ్రీరస్తు.

శ్రీరామాయనమః.

శ్రీమహాగణాధిపతయేనమః.

శ్రీమాణిక్యాంబాసమేత శ్రీ భీమేశ్వరస్వామినేనమః.

శ్రీ భీమేశ్వరపురాణము.

ద్వితీయాశ్వాసము.

శ్రీఖండ ఘుసృణ మకరీ
రేఖాలంకార సుంద ♦ రీస్తనయుగ పా
లీ ఖచిత భుజాంతర విభ
వాఖండల! బెండపూఁడి ♦ యన్నా మాత్యా! ౧

వ. అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పం దొడంగె. ౨

తే. మృడునిచే నిట్లుఁ గోపానఁ ♦ బడి కలంగి, గంగ దరినుండి నిజశిష్య ♦ గణము తోడ
మద్గురుస్వామి సకలధ ♦ ర్మజ్ఞుఁ డపుడు, పృథివిఁ గలతీర్థముల లెక్క ♦ వెట్టిచూచి. ౩

వ. ఇట్లనియె. ౪

తే. అంబపార్వతి సాతోడ ♦ నానతిచ్చెఁ, గాశి యెక్కుడు క్షేత్రసం ♦ ఘములలోనఁ
గాశికన్నను నెక్కుడు ♦ గౌరవమున, మోక్షభోగ నివాసంబు ♦ దక్షవాటి. ౫

వ. తొల్లి దక్షప్రజాపతి భూచరఖేచరులగు నఖిలగీర్వాణుల రప్పించి హాటకగర్భ
కైటభారులఁ బురస్కరించికొని మహాధ్వరంబు సేయం బ్రారంభించి. ౬

గీ. అర్థితో నోషధీశ్వరుఁ ♦ డాదియైన, పెండ్లికొడుకుల నెల్లను ♦ బిలువ నంపె
గబ్బితనమున జగదీశుఁ ♦ గాలకంఠుఁ, బిలువఁ బంపకమానెన ♦ బ్బిగుదులాఁడు. ౭

కం. అజ్ఞానంబున హరున క, వజ్ఞదలఁచి యతని నొసలి ♦ వ్రాఁతఫలమునన్
యజ్ఞము సేసెను సురలయు, నుజ్జఁ బరోవృద్ధి కప్ప ♦ నులు సమకొనునే. ౮

ఉ. అల్పవుబుద్ధి నీక్రియమ ♦ హాక్రతుతంత్రముఁ బన్నగాధిపా
కల్పునిఁ బాయఁబెట్టి కను ♦ గానక దక్షుఁడు చేయఁ జొచ్చి యా
వేల్పులుఁ దానుదుర్దశల ♦ వేఁగె మహాప్రళయాగ్ని రుద్రునిం
బోల్పఁగ వచ్చునట్టి పటు ♦ భూరివిభుండగు వీరభద్రుచేన్. ౯

౭. పెండ్లికొడుకు = అల్లుఁడు.

తే. పువ్వుముడిచిన పురవీథి ♦ భూమియందుఁ, గట్టె మోవంగవలసిన ♦ కారణమున
వీరభద్రునిచే దైన్య ♦ వృత్తినొందె, దక్షుఁడట్టి మహాధ్వర ♦ స్థానమునను. ౧౦

కం. తుదిఁబోయి యమ్మహేశ్వరు, పదపద్మములాశ్రయించి ♦ బ్రతికెం దానుం
ద్రిదశులుఁ బెద్దలునయ్యె, యదనునఁజూపుదురునిగ్ర ♦ హానుగ్రహముల్. ౧౧

సీ. దక్షప్రజాపతి ♦ తప్పులోఁగొని యాత్మఁ, గృపవుట్టి మిగుల ర ♦ క్షించెఁగాన
హరివిరించిపురంద ♦ రాది దైవతకోటి, మించి క్రమ్మఱ గార ♦ వించెఁగాన
నరిగియంతర్ధాన ♦ మందినతన దేవి, నెడమ మేనఁ బరిగ్ర ♦ హించెఁగానఁ
గోపాగ్నిఁ గడుఁబరి ♦ తాపంబు నొందెడు, రిపులకు నభయంబు ♦ లొసఁగెఁగాన

తే. నఱ్ఱుదెగనేసి జన్నపు ♦ టిఱ్ఱి శిరము, గరిమచెడకుండ దివి వ్రేలఁ ♦ గట్టెఁగాన
నయముగల వేల్పు శ్రీభీమ ♦ నాయకుండు, దక్షవాటంబు తీర్థంబు ♦ ధరణియందు.

తే. కాలకూటోపసంహార ♦ కారియతఁడు, త్రిపురదైత్యాధిపతులు మ ♦ ర్దించెనతఁడు
నిగ్రహానుగ్రహ ప్రౌఢి ♦ నిపుణుఁడతఁడు, సంతతము దేవవేశ్యాభు ♦ జంగుఁడతఁడు.

తే. ఏమిచిత్రంబు భీమేశ్వ ♦ రేశ్వరుండు, నిగ్రహానుగ్రహక్రియా ♦ నిపుణుఁడగుట
యతని నిశ్వాసముల మాత్ర ♦ నొనొకాదొ, వేదములును జరాచర ♦ విశ్వజగము.

వ. బ్రహ్మాది సంస్తుతుండై నిజార్ధదేహంబునను్నమాయారూపిణి, మహాదేవిభువన
మోహిని, దేవకార్యప్రయోజనంబును, మేనకాదేవిభాగధేయంబును, హిమ
వంతుని తపోవిశేషంబును, గారణంబుగాఁ దద్దేహంబున జన్మింప నియోగించిన
భువనేశ్వరి మహేశ్వరుని దేహంబువలన నిర్ముక్తయయ్యెంగావున దక్షారామంబు
ముక్తిక్షేత్రంబు నాఁబరఁగె వెండియు. ౧౫

కం. దక్షుని సవనాగారము, దక్షారామంబు శివుఁడు ♦ దన్మధ్యమునం
సాక్షాత్కరించియుండుట, మోక్షము భోగంబు బ్రాఁతె ♦ ముజ్జగములకున్. ౧౬

తే. ధాత్రివలయంబులో భోగ ♦ దములుగొన్ని, మోక్షదంబులుగొన్ని ప ♦ రీక్ష సేయ
భోగమోక్షములకు జన్మ ♦ భూమియైన, దక్షవాటంబుతావు క్షే ♦ త్రములకెల్ల. ౧౭

తే. భీమనాథేశ్వరునికన్న ♦ పెద్దవేల్పు, దక్షవాటంబుకంటె ను ♦ త్తమపదంబు
సప్తగోదావరము కంటె ♦ సకలతీర్థ, సారమగుతీర్థరాజంబు ♦ జగతిలేదు. ౧౮

కం. అచ్చమగు భోగమోక్షము, లచ్చోటం దొరకుఁ గరత ♦ లామలకముగన్
విచ్చలవిడి బ్రతికినను౦, జచ్చినఁగడులెస్స భీమ ♦ శంకరు నగరన్. ౧౯

కం. దక్షిణవారాణశికిని, మోక్షశ్రీభోగవిభవ ♦ మూలంబునకున్
దక్షారామంబునకు స, దృక్షంబగునట్టి పుణ్య ♦ క్షేత్రము గలదే. ౨౦

సీ. కాలకూటవిషాగ్ని ♦ కబళహేలాగ్రాస, కల్మాషితాసిత ♦ కంఠుచేతఁ
గుంభినీధరసుతా ♦ కుచకుంభపరిరంభ, సంభావనాకేలి ♦ శాలిచేత

గగనకల్లోలినీ ♦ కల్లోలమాలికా, క్షాలితబాలేందు ♦ మౌళిచేతఁ
గుటిలకుంతలిరాజ ♦ కుండలాలంకార, విలసితగండము ♦ డలునిచేత
తే. ద్రుహిణపంచమమస్తక ♦ ద్రోహిచేత, భీమనాథునిచే జగ ♦ త్స్వామిచేత
హరునిచేత సనాథమై ♦ యతిశయిల్లు, మోక్షభోగనిదానంబు ♦ దక్షవాటి. ౨౧
వ. అని దక్షారామమాహాత్మ్యం బభివర్ణించుచు. ౨౨
మ. కినుకం బుట్టినయట్టి మానిహృదయక్లేశంబు శాంతంబుగా
మునిశిష్యప్రకరంబుతోడ నగుసౌ ♦ ముఖ్యంబునన్ ముచ్చటల్
తనియం జెప్పుచు వేల్పుటేటి నికట ♦ స్థానంబునం దుండఁగా
వనజాతాప్తుని మండలంబు దిగియె ♦ న్వారాశి దిక్సీమకున్. ౨౩

సూర్యాస్తమయవర్ణనము.

తే. అల్లనల్లన గగన మ ♦ ధ్యమునుండి,
వ్రాలెనస్తాద్రి కరుణసా ♦ రథిరథంబు
పశ్చిమాంభోధిమారుతా ♦ స్ఫాలనమునఁ,
గేతనముమీఁదిపసిఁడికిం ♦ కిణులు మొరయ. ౨౪
కం. తారాపథాంచలము డిగి, వారిజహితమండలంబు ♦ వ్రాలె నపరది
క్పారావారంబునకై, పారావతపతగపాద ♦ పాటల మగుచున్. ౨౫
తే. కూడియొప్పారె న ♦ స్తాద్రికూటకోటి, భానుబింబంబు కన్నుల ♦ పండువుగను
విశ్వనాథుని గుడిమీఁది ♦ విమలకాంతి, భాసురంబైన హేమకుం ♦ భంబువోలె.
కం. చరమాచలశిఖరంబునఁ, దిరమైయొక్కింత తడవు ♦ దినకరుఁ డొప్పెన్
వరుణుని శుద్ధాంతంబున, నరవిందాక్షులకు మించు ♦ టద్దంబగుచున్. ౨౭
సీ. సిద్ధవాహిని నీటఁ ♦ జిఱుబంతి పసుపాడి, శ్రీవిశాలాక్షి గై ♦ సేయుఁదొడఁగె
మొరసె నంతర్గృహా ♦ మున విశ్వనాయక, తాండవారంభ మ ♦ ర్దలరవంబు
మందారతరుపుష్ప ♦ మధుపానగోష్ఠికిఁ, బ్రారంభ మొనరించె ♦ భైరవుండు
కొక్కొరోకో యని ♦ కొమరసామి రథంబు, కంఠంబు సాఁచి క్రేం ♦ కారమిచ్చె
తే. మొగుడఁబాఱిన యరవింద ♦ ములనుబాసి,
గములుగములుగ మత్తభృం ♦ గములుగూడి
దుంతివిఘ్నేశు చెక్కులు ♦ త్కంఠఁ జేరె,
నభినవంబైన యపరసం ♦ ధ్యాగమమున. ౨౮
చం. ప్రమదమదాతిరేకమునఁ ♦ బాశివిలాసవతీకదంబకం
బుమిసిన తమ్ములంపుఁగఱ ♦ యోయన నింగిలికంబు ఛాయచేఁ

గమిసిన దాసనంపుఁబువు ♦ కాంతికి డాసిన కుర్గినట్టమా
కోమటున సంజయంబరము ♦ కొంగున నూన్చెఁ గుసుంభరాగమున్. ౨౯

తే. సంజకెంపును దిమిరపుం ♦ జంపునలుపు,
గమిచి బ్రహ్మాండభాండంబు ♦ గరము మెఱసె
పరగుపరిపాకదశవృంత♦బంధ మెడలి,
పతనసుగుతాటిపంటితోఁ ♦ బ్రతిఘటించి. ౩౦

తే. కామినీవిప్రయోగ దుః♦ఖమునఁ గుందెఁ,
జక్రవాకంబు సురనదీ♦సైకతమునఁ
గౌశికావిప్రయోగ దుః♦ఖమునఁ గుందు,
బాదరాయణమునిసార్వ♦భౌముకరణి. ౩౧

శా. ఆకాశాంచలవీథుల న్నిగిడె సం♦ధ్యారాగరేఖావళుల్
పాకోన్ముద్రిత పారిభద్రకళికా ♦ పాండిత్య వైతండికో
త్సేకస్ఫూర్జిత చండతాండవరయో ♦ ద్రేకారభట్యుద్భట
శ్రీకంఠస్థిరదీర్ఘపాటలజటా ♦ శ్రేణిన్ విడంబించుచున్. ౩౨

వ. అప్పుడు బాదరాయణుండు సంధ్యాసమయంబు నిరూపించి యమరసింధు ప్రవాహంబునం గాలోచితక్రియాకలాపంబులు నిర్వర్తించి యొక్క నిర్మలసైకత ప్రదేశంబునం గూర్చుండి పార్వతీవల్లభుండు తనకుఁ జేసిన యవమానంబునకు నుల్లంబునం దురపిల్లుచుండె నయ్యవసరంబున. ౩౩

కం. వెల్లిగొనె నఖిలదిక్కుల, నల్లనిచీఁకటి నవాంజ ♦ నప్రతిభటమై
భల్లూకసటావల్లిను, తల్లీ విభ్రమదమై య♦దభ్రస్ఫురణన్. ౩౪

సీ. గిరినికుంజములఁ గుం♦జరపుంజ మనుశంకఁ, గంఠీరవంబు లు♦త్కంఠ నెగయఁ
బల్వలంబులఁ గిరి ♦ ప్రకరంబు లనుశంక, నెఱుకురాజులు విండు ♦ లెక్కుపెట్టఁ
గడలి మధ్యంబునఁ ♦ గాకోల మనుశంక, జల దేవతలు భీతి ♦ సంభ్రమింప
వనములఁ గువలకా ♦ ననవాటి యనుశంక, నిందిందిరశ్రేణు ♦ లెదురు కొనఁగ

తే. రజతగిరియందుఁ దాండవా♦రంభరభస, భంగిపతితపరశ్వధ ♦ పాణి వికట
కంధరారూఢగజకృత్తి ♦ కంథశంక, ప్రమథులకుఁ దోఁప నంధకా♦రంబు ప్రబలె.

తే. ప్రబలమై యంధకారంబు♦బలిసియుండఁ, దారకంబులు కాంతి నెం♦తయును బెరసె
నీలి పుట్టంబుఁ బఱచి పై♦నిలిపినట్టి, వలుఁద ముక్తాఫలముల తా♦వళము లట్ల. ౩౬

శా. శ్రీవారాణశివిశ్వనాయక గళ ♦ క్ష్వేళానుకారక్రియా
హేవాకోద్ధతిఁ జీఁకువాల్ప్రబలఁగా ♦ హేలావతీ కోటిపైఁ

బూవుందూపులజోదుపుచ్చుకొనియెన్ ♦ భూపాల లీలావతీ
భ్రూవల్లీ నిభశృంగకంబగు లస♦త్పుండ్రేక్షు కోదండమున్. ౩౭

వ. అంత. ౩౮

చంద్రోదయవర్ణనము.

ఉ. ఆతతలీలఁ గోమల ♦ నవాంశుకపాళి మహాంధకార సం
ఘాతము మీఱె నద్భుతము ♦ గా శశిలాంఛనుఁ డభ్రవీథికిన్
శ్వేతవరాహమూర్తి యగు ♦ వెన్నుఁడు ప్రన్ననియొంటికోఱ ధా
త్రీతలమెంత యంతయు ధ♦రించిన యట్టి విజృంభణంబునన్. ౩౯

తే. అర్ధమండలముదయించు♦నమృతభానుఁ,
డుదయరాగంబుతోఁగూడ♦నొప్పుమిగిలెఁ
బ్రకటతాంబూల రాగసం♦రక్తమైన,
ప్రాగ్దిశాకాంతబింబాధ♦రంబువోలె. ౪౦

కం. సంకలితోదయరక్తి శ,శాంకుఁడు శోభిల్లె గైరి ♦ కావనిధరవ
ప్రాంకక్రీడాపాటల, సంకరభృతకాలకూట ♦ సంకాశుండై. ౪౧

సీ. కాదు కా దుదయాద్రి ♦ కనకకూటంబిది, డంబైనపాన వ♦ట్టంబుగాని
కాదు కా దిదిసుధా ♦ కరపూర్ణబింబంబు, కాశ్మీర శంభులిం♦గంబుగాని
కాదు కా దుదయరా♦గప్రకాశంబిది, నవకుంకుమా లేప ♦ నంబుగాని
కాదు కా దిది కళం ♦ కచ్ఛటారింఛోళి, పూజచేసిన కల్వ♦పువ్వుగాని
తే. యనఁగ సప్తార్ణవములు మి♦న్నందికొనఁగఁ, జంద్రకాంతోపలంబులు♦జాలువాఱ
ననమశరసార్వభౌము ము♦త్యాలగొడుగు, విధుఁడు విశ్వంబు వెన్నెల♦వెల్లిఁదేల్చె.

తే. ఉదయ రాగము నిం♦చించు కుజ్జగించి, నిండుచంద్రుండు కన్నుల ♦ పండువయ్యె
దానరాగాంతర స్నిగ్ధ♦దాక్షిణాత్య, రాజశుద్ధాంతదంత వ♦జ్రములకాంతి. ౪౩

సీ. అభిషేక మొనరించు ♦ నమృత ధారావృష్టి, మదనాంతకునిముక్తి ♦ మంటపికకు
నలవోకగా విశా♦లాక్షీమహాదేవి, నిద్దంపుఁజెక్కుల ♦ నీడఁజూచు
నెరియించు మిన్నేటి ♦ యిసుక తిన్నెలమీఁదఁ, జక్రవాకాంగనా♦నముదయంబు
డుంఠి విఘ్నేశుని♦స్ఫురకంఠవేదిపైఁ, గోదమ చుక్కలరాజుఁ ♦ గుస్తరించుఁ
తే. గాయువెన్నెల యానంద ♦ కాననమునఁ, గాలభైరవు దంష్ట్రకు ♦ డాలుకొలుపు
విధుఁడు వారాణశీసోమ ♦ వీథిచక్కి, నభ్రఘంటాపథంబున ♦ నరుగునపుడు. ౪౪

సీ. రోహిణీగాఢోప ♦ గూహనంబునఁ గన్న, కస్తూరికాస్థాన ♦ కంబనంగ
రాహుదంష్ట్రాఘాత ♦ రంధ్రమూర్గంబున, లలిఁదోఁచు నాకాశ♦లవమనంగ

నైర్మల్యమునఁ జేసి ♦ నడుమఁ గానఁగవచ్చు, కమిచి మ్రింగిన యంధ♦కారమనఁగ
జన్మవేళను సుంధ ♦ శైలాభిఘట్టన, సంభవించిన కిణ ♦ స్థానమనఁగ
తే. విరహపరితాపవేదన ♦ వేఁగుచున్న, చక్రవాకాంగనల కటా ♦ క్షములయగ్గి
నావహిల్లినకలదూప ♦ మనఁగనొప్పు, నుడుగణాధీశబింబంబు ♦ నడిమిమచ్చ. ౭౫

సీ. కాలభైరవుఁడుఢ♦క్కాడిండిమము మ్రోయ, బహుభూతములుఁదానుఁ ♦ బ్రహరిదిరు
జంద్రికామధు వాని ♦ చాకోరముల్నిక్కి, దేవతాసౌధవీ♦థికల సొగయు [గఁ
నానందకాననా ♦ భ్యంతరంబులయందు, సిందువారమునఁ బూ ♦ శిథిలపడఁగఁ
గడునివాతములైన ♦ కలుషరంబులయందు, యతులు ప్రాణాయామ ♦ మభ్యసింప
తే. దొడ్డనయమున శీతాంశుఁ ♦ డొడ్డగిల్లెఁ, దఱపిచంద్రాతపమునేల ♦ చఱచికాయ
వంతమురపిల్లి వెన్నెల ♦ వగచివగచి, గంధవతిపట్టి యొకభంగిఁ గన్నుమోడ్చె. ౭౬

వ. అంత. ౭౭

సూర్యోదయవర్ణనము.

చం. వెలవెలఁబాఱెఁ జంద్రుఁడును ♦ విన్నునఁ దారకచక్రవాళముల్
పలపలనయ్యె దీర్ఘికలఁ ♦ బద్మవనంబుల షట్పదాంగనా
కలకలముల్ చెలంగె వెడ ♦ కన్ను మొగిడ్చె లలిం గుముద్వతుల్
తెలతెలవాఱె జంభరిపు ♦ దిక్కునఁ దోఁచె ననూరురాగముల్. ౭౮

సీ. ప్రథమసంధ్యాంగనా ♦ ఫాలభాగంబునఁ, జెలువారు సిందూర ♦ తిలక మనఁగఁ
గైసేసి పురుహూతు ♦ గారాపుటిల్లాలు, పట్టిన రత్నద ♦ ర్పణ మనంగ
నుదయాచలేంద్రంబు ♦ తుదఁ బల్లవించిన, మంజుకంకేలిని ♦ కుంజ మనఁగ
శతమన్యుశుద్ధాంత ♦ సౌధకూటముమీఁదఁ, గనుపట్టు కాంచన ♦ కలశ మనఁగఁ
తే. గాలమని యెడు సిద్ధుండు♦గమిచి మ్రింగి,
కుతుకమొప్పఁగ నుమిసిన♦ఘుటిక యనఁగ
గగనమందిరదీపికా ♦ కళిక యనఁగ,
భానుఁ డుదయించె దేదీప్య ♦ మానుఁ డగుచు. ౭౯

వ్యాసమహర్షి యాత్రకు వెడలుట.

వ. ఇట్లు సూర్యోదయంబగుటయు బాదరాయణుండు కాలోచితకృత్యంబులు నిర్వర్తించి గమనోన్ముఖుండై కాశీవియోగజనితవేదనాభరంబు దుస్సహంబై యంతరంగంబుఁ గుందింప నెట్టకేలకు నేటికెదురీఁదువిధంబున శిష్యులుం దానును గనఘనకనక మణిమయసౌధాట్టవిలాసంబైన యప్పట్టనంబునకుఁ బ్రదక్షిణక్రమంబునఁ జనువాఁడై లోలార్క కేశవులకు నభివాదనంబును భాగీరథికి నంజలిబం

ధంబును విశ్వనాథునకు వినుతియు విశాలాక్షికిం బ్రార్థనంబును మోక్షమంట
పంబునకు జయకారంబును నంతర్గేహంబున కామంత్రణంబును గాలభైరవునకు
జోహారును డుంఠివినాయకునకు శరణార్థము దండపాణికి దండప్రణామంబును
గుక్కుటచతుష్టయంబునకు మ్రొక్కును సకలదేవతాకోటికి నేటికోళ్ళును జేసి
చనునప్పుడు కతిపయదినప్రయాణంబున. ౫౦

సీ. గంగానదీప్రవాహ ♦ కణము మాధవదేవు, దోరంతరంబు శ్రీ ♦ తులసిచిగురుఁ
బురుషోత్తమునందుఁ ♦ బుండరీకాక్షుని, దివ్యపాదాంభోజ ♦ క్షేత్రజలము
శ్రీకూర్మమునయందు ♦ శేషాహిపర్యంకు, కంఠంబు క్రొత్తచెం ♦ గల్వదండ
సింహాద్రియందు ల ♦ క్ష్మీనృకంఠీరవ, సార్వభౌము ప్రసాద ♦ చందనంబుఁ

తే. గాశికావిప్రయోగోగ్ర ♦ గాఢతాప, శాంతిగా నవెను శిశిరోప ♦ చార మగుచుఁ
జాయ తెరువున శ్రీ బాద ♦ రాయణునకు, హరిహరాభిధ్యానపూజాప ♦ రాయణునకు.

—— పీఠికాపురవర్ణనము. ——

సీ. ఏపట్టనము మ్రోల ♦ నేలేఱు ప్రవహించుఁ, బృథివికి ముత్యాల ♦ పేరువోలె
మున్నాటయుఱువది ♦ మూర్తిభేదములతో, విహరించు నేపీట ♦ వేల్పుపిండు
పీఠాంబ చెలి యోగ ♦ పీఠహుంకృతిదుర్గ, సనిచికాపుండు నే ♦ నగరికేలనఁ
గుంతీమహాదేవి ♦ కూర్మిమేనల్లుఁడు, మాధవుం డేపీట ♦ మరగినాఁడు

తే. పెద్దగవఁకుల నేపుట ♦ భేదనమున, నెలమినిలుచుండు ప్రీడావి ♦ హీనజఘనుఁ
డట్టి పీఠాపురముఁ జేర ♦ నరుగుదెంచెఁ, బరమశైవుండు శ్రీపరా ♦ శరసుతుండు.

తే. నారికేళంపుబుట్ట నె ♦ న్నడిమిచాయ, దళములందును బోలె సం ♦ తతముఁ బాఱు
వేణికాసారణులయందు ♦ విస్మయముగ, జగతి నెక్కుడి వేలేటి ♦ సాటినదులు. ౫౩

సీ. ఏఁటేఁట విరినీల ♦ నిరుగారునుం బండుఁ, బ్రాసంగువరి చేలఁ ♦ బసిఁడిచాయఁ
బరిపాకమున వేగుపనస ♦ పండులతావి, యిందిందిరములకు ♦ విందు సేయు
వేఁబోఁకఁబోలుపారు ♦ వింధ్యాద్రి పవనంబు, పోఁకపువ్వుల తావిఁ ♦ బుక్కిలించు
వేశ్యవాటికలందు ♦ విహరించు వలరాజు, ననయంబుఁ జెఱకువి ♦ ల్లును ధరించు

తే. నారదంబుల వలపు పొ ♦ న్నలఁ బెనంగి, విచికిలామోదములతోడ ♦ వియ్యమందుఁ
బాటలీపుష్పకేతకీ ♦ పరిమళములు, పొదల విలసిల్లుఁ బీఠికా ♦ పురమునందు. ౫౪

వ. వెండియు నవఖండమండలంబగు మహీమండలంబునకు మకరకుండలాలంకా
రంబునుం బోలె భీమేశ్వరమండలంబు పొరువునఁ ద్రిలింగోత్కలతలంబులనంది
వింధ్యాచలపాదంబునఁ గేదారకుంభకోణార్కస్థానంబులకుపమానంబనఁజాలి
యేలేటిమేటికాలువలవలననదీమాతృకంబులగు పంటవలంతి సలిలధౌతకలధౌత

శిలాకాశకలసంకోచంకరణంబులై యంకురించినవియును, గోదమపసరుఱెక్కల పక్కిడాలు పుక్కిలించి యుమియుంజాలు చాయ లేర్పడం బసరుపాఱు నవియును, దశారామ గ్రామాజనంబుల చిలుకపిక్కలచక్కఁదనంబు నెకసక్కెంబాడు బిగువు పొట్టలం గనుపట్టునవియును, బధికనాసాపుటీకుటీరంబులకుఁ గుటుంబకములగు కమ్మఁదనంబులీని పాలుకుడిచి సుందరీ ప్రాయంబున నాముపలమునవియును, బది యాఱునన్నె కుందనంపుఁదగడుఁ దెగడుచుఁ బండి యుద్ధంప కేదారవలయకు ముదపంశంబు లాఘ్రాణింపనుం బోలెఁ గైవ్రాలునవియు నై కలమశాలిశారదా ముఖాదివ్రీహిసస్యంబులవలనను, నిరంతరనారికేళచ్ఛదచ్ఛాయాచ్ఛన్న హరి దంతరంబుల భుజంగవల్లీమతల్లికాలింగిత క్రముకకఁ కోపకంఠంబులఁ గ్రీడించు క్రోడదశనదష్ట స్వాదిష్ఠపనసఫలరససారణీ పరంపరా సంపూర్ణచంపకద్రు మాలా వాలవలయంబులు, వనదేవతావిలాసతాళవృంతాయమాన రంభాపలాశసంభా రంబులుఁ, దిలకతిలకితంబులు, విదేశవిచికిలంబులుఁ, గోరకితకురువకంబులు, నిబిడ రసకేసరంబులు, నఖిలభువనాభిరామంబులు నైనయారామంబులవలనను గన్నుల పండువై కుంతీమాధవదేవునకు విశ్రాంతిప్రదేశంబును, హుంకారిణీ మహాదేవికి విహారసంకేతభవనంబును, బీఠాంబికాలక్ష్మి కాటకూటంబును, హేలాపానికి హాలాపానగోష్ఠీమంటపంబును, ననందగి భూతబేతాళడాకినీ ప్రేతరంక భైరవ వ్రాతనిర్మిత ప్రాకారవప్రహట్టకుట్టిమంబగు పీఠాపట్టనంబుఁ బ్రవేశించిరంత. ౫౫

సీ. త్రపుసపుష్పలతామ ♦ తల్లీపటోలికా, కారవేల్లకుడుంగ ♦ కములతోడఁ
కూష్మాండవృంతాక ♦ కోలకచించికా, కాయమానకదంబ ♦ కములతోడ
శాకినీమూలకచ్ఛత్రాక ♦ నారణీ, ధాన్యాక మేఘనా♦దములతోడఁ
బిప్పల్యపోదకీ ♦ పీతపలాండుక, వాస్తుశాఖా కోటి ♦ వాటితోడ

తే. రాజనలతోడ శృంగబే♦రములతోడఁ, జిలుగడఁపుఁ బెండలముతోడఁ ♦ జేమతోడ
నొప్పునాలుగు పొలములం ♦ దుపవనములు, భువనసారము పీఠికా♦పురవరమున.

ఉ. హాటకపానపాత్రయును ♦ నారఁగఁబండినమాతులుంగముం
ఖేటము లోహదండము నొ♦గిం ధరియించి పురోపకంఠశృం
గాటకభూమి భాగమునఁ ♦ గాపురముండెడు పీఠికాంబకుం
గైటభదైత్యవైరి ప్రియ♦కాంతకు మ్రొక్కె నతంబు భక్తితోన్. ౫౭

శా. అంతర్వాణి భజించెఁ గుక్కుటపతిం ♦ హాలాహలగ్రీవునిం
శాంతస్వాంతుఁడు గొల్చె దానవచమూ ♦ సంహారిణిం హుంకృతిం
జింతించెం మునిసార్వభౌముఁడు పుర ♦ క్షేత్రాధిదైవంబులం
గుంతీమాధవుఁ బూజచేసె ఋషి వా♦క్పుష్పోపహారంబులన్. ౫౮

తే. హేల వేలాతరంగిణీ ♦ కూలనిలయ, బాల బాలారుణాశోక ♦ పల్లవోష్ఠి
వేల వేలావనోద్దేశ ♦ విహృతిలోల, నేల నేలాయనకపాడె ♦ ఋషివరుండు. ౫౯
వ. అనంతరంబ యొక్కింత మార్గాంతరం బతిక్రమించి. ౬౦

—కుమారారామవర్ణనము.—

శా. ఆలోకించె మహామునీంద్రుఁడు కుమా♦రారామముం బింధ్యకు
త్కీలోపాంతధరాలలామము బహు♦క్రీడావనశ్యామముం
బ్రాలేయాచలకన్యకాధవజటా♦భారాసనార్ధేందురే
ఖాలానాయితహేమకూటకలధౌ♦తాట్టాలకగ్రామమున్. ౬౧
సీ. గోమరేటి కల్యాణ ♦ కమలషండంబుల, సౌరభ్యభారంబు ♦ సంతరించి
నారికేళాటవీ ♦ నవపుష్పకుహళికా, వితతికన్నెతికంబు ♦ వీడుకొలిపి
యప్సరఃకాంతావి ♦ హారహాటకహర్మ్య, శశికాంతమణిగవా♦క్షములఁదూఱి
భీమనాయకదేవు ♦ పేరురంబునఁగ్రాలు, భుజగహారములకు ♦ భుక్తివెట్టి
తే. రాజనారాయణస్వామి ♦ రమ్యభవన, తార్క్ష్యకేతనపతికి న♦ర్తనముగఁజపి
పొలసెనధ్వపరిశ్రాంతి ♦ పొడవడంగ, మౌనివరుపైఁ గుమారవ♦నానిలములు.
తే. బాదరాయణుఁ డత్యంత ♦ భక్తినియతి, దివ్యవాహినిఁ గోమరేటఁ ♦ దీర్థమాడి
శిష్యవర్గంబుఁదాను ద♦ర్శించి మ్రొక్కి, శాశ్వతునకుఁజాళుక్య భీ♦మేశ్వరునకు.
వ. వెండియుఁ గొంత దవ్వుచని. ౬౨

—సర్పపురవర్ణనము—

శా. కాంచెన్ సర్పపురాభిధానముఁ ద్రిలిం♦గక్షోణి వైకుంఠముం
ముంచెన్ నారదకుండికాజలముల ♦ స్నోదంబుతో దేహముం
జించెన్ గాశివియోగదుఃఖము మహా ♦ క్షేత్రంబు వీక్షించి ద
ర్శించెన్ సన్ముని లోచనోత్సవముగా ♦ శ్రీభావనారాయణున్. ౬౩
సీ. శ్రీసుదర్శన శంఖ ♦ చిహ్నాంకితముగాక, యొపుడు మిన్నకయున్న ♦ యిల్లులేదు
బహుళోర్ధ్వపుండ్రసం♦పద లేక వృథయైన, ఫాలరేఖలతోడి ♦ ప్రజయులేదు
వైష్ణవోత్తమ భాగ♦వతసాత్త్వికులగోష్ఠి, వెలియైనవాటికా ♦ వేదిలేదు
నలినేక్షణుఁడు భావ ♦ నారాయణస్వామిఁ, దప్పించి పరదైవ♦తంబు లేదు
తే. పరమగీర్వాణయోగవై ♦ భవము నెలవు, నిఖిల కల్యాణగుణకేలి ♦ నిలయ మనఘ
దివ్యములు నూటయెనిమిది ♦ తిరుపతులకుఁ, బరమపదమైన శ్రీసర్ప♦పురమునందు.
మ. శనివారోత్సవ మాచరించె మునిశి♦ష్యవ్రాతముం దానుఁ గ
మ్మనిపళ్యారముతోడ బూరెగమితో ♦ మండెంగ దంపంబుతో

ననుగుంబాసెముతోడఁ బొండుకలమా♦హారంబుతో నేతితో
ఘనరంభాఫలఖండశర్కరలతోఁ ♦ గారుణ్యపాథోధికిన్. ౧౮

తే. ద్వాదశాక్షరదివ్యమం♦త్రమునఁ బూన్చి, చెంగలువ పువ్వునండ ల♦క్ష్మీధవునకు
శ్రీమదష్టాక్షరమున న♦ర్చించెఁ దపసి, భావనారాయణస్వామిఁ ♦ బసిఁడివిరుల.

వ. అనంతరంబ కతిపయప్రయాణంబులఁ దుల్యభాగాతీరంబున. ౧౯

శా. చేతోమోదమెలర్పఁ గట్టెదురఁ గాం♦చెన్ భారతామ్నాయ వి
ద్యాతంత్రగ్రథనాబ్జసంభవుఁడు వే♦దవ్యాసుఁ డభ్యర్హిత
జ్యోతిర్లింగమయస్వరూపుల జటా ♦ జూటావనార్ద్రేందులన్
వాతాపీల్వలవైరి గౌతమనదీ♦వాస్సంగమేశానులన్. ౨౦

తే. వేదశాఖావిభాగసం ♦ వేదియతఁడు లలితబిల్వత్రిశాఖాప♦లాశసమితి
సంగమేశఘటోద్భవ ♦ శంకరులకు, నర్చనము సేయుఁ బ్రణవపం♦చాక్షరముల. ౨౧

వ. మఱియుఁ దుల్యభాగాతీరంబున సాంపరాయణగ్రామంబు చేరువ బిల్వాటవీ వాటిఁ
గపట భిల్లుండైన చలిగొండ తేని యల్లుని ముక్తీశ్వరు దర్శించి. ౨౨

ఉ. వేదవిభాగముం బరిఢ♦వించిన పుణ్యుఁడు వేడ్కఁ బూన్చి బి
ల్వీదళపూజనంబు గడు ♦ లెస్సఁగఁ గూరిమి శిష్యపంక్తితో
నాదిమభిల్లు నిత్యకరు♦ణామృతపూరముఁ జల్లు పుండరీ
కోదరభల్లు నృత్తకరి ♦ యూథపుమల్లునిఁ గొండయల్లునిన్. ౨౩

తే. పదియునార్వన్నెబంగారుఁ ♦ బరిహసించు, నవనవారగ్వధప్రసూ♦నములు గోసి
సాంపరాయమహాగ్రామ ♦ సవిధనిలయు, నభవుఁ బూజించెఁ బుండరీ♦కాక్షమూర్తి.

కం. పంచబ్రహ్మంబుననున్, బంచాక్షరమంత్రమునను ♦ బంచాననునిం
బంచమవేదంబభి ని, ర్మించినముని పూన్చెఁ బుండ♦రీకకళికలన్. ౨౪

వ. ఇవ్విధంబునఁ గాలకంఠునకుఁ బ్రభాతకాలపూజ నిర్వర్తించి సాత్యవతేయుండు
గమనోన్ముఖుండై యున్న సమయంబున. ౨౫

సీ. ఎవ్వాఁడు వింధ్యాద్రి ♦ నిట్టింకులింకించె, గంభీరహుంకార ♦ గర్జనమునఁ
బ్రణవపంచాక్షరో ♦ పనిషత్ప్రపంచంబు, లెవ్వాఁడు శివునిచే ♦ నెఱిఁగికొనియె;
గడసిల్లుధరయొడ్డ ♦ గెడవైన నెవ్వాఁడు, త్రాసుపైఁ గల్లెచం♦దమున వంచె
నంభోధులేడింటి ♦ నాపోశనం బెత్తి, కలిగించె నెవ్వాఁడు ♦ క్రమ్మఱంగ

తే. భీమనాథేశ్వరుఁడు గౌరిఁ ♦ బెండ్లియాడి, దక్షిణాముఖకల్యాణ ♦ దర్శనమున
వత్సరము వత్సరంబు నె♦వ్వానిఁ జూచు, నతఁడు గగనాగ్రమాణిక్య♦మరుగుదెంచె.

తే. మలయదుర్ధరగిరిగుహా ♦ మందిరుండు,
తామ్రపర్ణీజలస్నాన ♦ ధౌతమలుఁడు

కలుషితాంభఃప్రసాదైక ♦ కతకఫలము,
కోమలియుఁ దాను నేతెంచెఁ ♦ గుంభభవుఁడు. ౭౮

శా. ద్వీపాంతోద్భవుఁడైన సంయమికులా♦ధీశుండు కాలోచిత
వ్యాపారంబులు దీర్చి రేపకడ ద♦క్షారామయాత్రోద్యమం
బాపాదించుచు నోంక్రియానగరప♦ర్యంతార్ధమార్గంబునన్
లోపాముద్రయుఁ దాను వచ్చు ముని నా♦లోకించె గాదవ్వులన్. ౭౯

తే. ద్వాదశక్షేత్రయాత్రావి ♦ ధాననియతి, భీమమండలిఁ జరియింపఁ ♦ బృథులభక్తిఁ
గుక్కుటేశ్వరు దర్శింపఁ ♦ గోర్కి పుట్టి, యట్టి పీఠాపురంబున ♦ కరుగువాని. ౮౦

ఉ. ఱేఫులు భీమలింగము గు♦ఱించి జపం బొనరించి నిచ్చలున్
మాపటివాఁకఁ దీర్థముల ♦ మజ్జనమాడుచు నుండు వానిఁ బీ
ఠాపురికుక్కుటేశ్వరుని ♦ డాయఁగఁ బోయెడువానిఁ దుల్యభా
గాపగ చెంత శంకరగృహాం♦గణ బిల్వవనాంతరంబునన్. ౮౧

వ. అప్పరమమాహేశ్వరుం గనుంగొని సాత్యవతేయుండు ప్రత్యుత్థానంబు చేసి యెదు
ర్కొనియె నతండును. ౮౨

సీ. భస్మత్రిపుండ్రాంక ♦ ఫాలప్రదేశుని, రుద్రాక్షమాలికా♦రూఢవక్షు
నుపవీతకృష్ణాజి ♦ నోత్తరాంగుని, బల్ల, వారుణాంచితజటా♦పటలధారుఁ
దామ్రపాత్రాంగుళీ ♦ దర్భమూలపవిత్రుఁ, దరుణకింశుకలతా ♦ దండధారుఁ
బ్రావృషేణ్యవినీల ♦ పాథోధరశ్యాము, సాలవృక్షప్రాంశుఁ ♦ జారుదేహుఁ

తే. బరమభాగవతోత్తము ♦ ప్రథమగణ్యు, విమలమాహేశ్వరాచార ♦ వీథిపథికు
నఖిలనీవారముష్టింప ♦ చాగ్రవమునిఁ, బులినసంభవుఁ బొడగాంచెఁ ♦ గలశజుండు.

ఉ. యోజనగంధినందనుఁడు ♦ నార్వశిపట్టియు నిర్ణిరోధని
ర్వ్యాజనిరంకుశ ప్రణయ ♦ వైభవసంపద సొంపు మానసాం
భోజములం దలిర్ప ముని ♦ పుంగవు లొండొరుఁ గౌఁగిలించి వి
భ్రాజితలీలఁ జల్పిరి ప♦రస్పరముం గుశలప్రసంగముల్. ౮౪

కం. వినయము భక్తియు సంభ్రమ, మును సౌహార్దంబు హృదయ♦ముల మొలతేరన్
వినుతి యొనర్చి రగస్త్యన, కును వైశంపాయనాది♦కులు మునిశిష్యుల్. ౮౫

వ. అనంతరం బాతుల్యభాగాతీరబిల్వతరువనాంతరంబున శశికాంతశీతలశిలాతలప్రదే
శంబున నాసీనులై యిల్వలాసురదమనుండును బరాశరనందనుండును గొంతతడ
విష్టకథావినోదంబులఁ బ్రొద్దుపుచ్చి రప్పుడగస్త్యుండు సాత్యవతేయున కిట్టు
లనియె.

అగస్త్యుఁడు వ్యాసమహర్షి గాశిఁ బాసి వచ్చుటకుఁ గారణం బడుగుట.

తే. ఆననమునందు వైవర్ణ్య ♦ మగ్గలించెఁ, గన్నుఁగవయందు దైన్యంబు ♦ గానఁబడియె
నార్తి నేదేనియొకటి నీ♦యంతరంగ, మూనియున్నది యిదియెట్టు♦లొక్కొ యనఘ.
సీ. లోలార్కునకు నీకు ♦ లోలోన నేమేనిఁ, బోటిపుట్టదు గదా ♦ మాటమాట
వెనకయ్య శ్రీడుంఠి ♦ విఘ్నేశ్వరస్వామి, ధిక్కరింపఁడు గదా ♦ తెగువ నిన్ను
నాఁకొన్న నిన్ను మ♦ధ్యాహ్నకాలంబున, నరయకుండదు గదా ♦ యన్నపూర్ణ
నెపమేమియును లేక ♦ నీయెడాటమ్మునఁ, బాటిఁదప్పఁడు గదా♦ భైరవుండు
తే. ఎట్టు పాసితి మిన్నేటి ♦ యిసుకతిప్ప, లెట్టుపాసితి వాస్థలం ♦ బేడుకోసు
లెట్టుపాసితినవిముక్త ♦ హట్టభూమి, యెట్టుపాసితి విశ్వేశు ♦ నిందుధరుని. ౮౮
కం. కాళీనందన కంఠే, కాలుర శిరములకు విరులు ♦ కల్పించునొకో
లీలావనాంతరమునను, మాలోపాముద్రయిడిన ♦ మల్లీవల్లుల్. ౮౯
శా. ఆమందాకిని యాత్రివేణి వలనం ♦ బాబాహ్యకక్ష్యస్థలం
బామధ్యాంతరకక్ష్య లావిమలది♦వ్యజ్యోతిరుజ్జృంభణ
శ్రీమద్విశ్వపతీశలింగము మదిం ♦ జింతింపఁ గాశీమహా
గ్రామంబిప్పుడు నాకనుంగవకు సా♦క్షాత్కారముం గైకొనున్. ౯౦
శా. ఆనందంబున నర్ధ రాత్రములఁజం ♦ ద్రాలోకముల్ కాయఁగా
నానాసైకత వేదికాస్థలములం ♦ దద్దిక్కులం శంభుఁ గా
శీనాథుం దరుణేందుశేఖరు శివుం ♦ శ్రీకంఠునిం బాడుదు
న్నేనెల్లంబులకాంకురప్రకరముల్ ♦ నిండార మిన్నేటిలోన్. ౯౧
కం. గంగాయమునాతీరో,త్సంగమునఁ బ్రయాగను న్న♦వాశివు విశ్వే
శుం గూర్చి తపము చేసితి, నంగుష్ఠము ధరణి మోపి ♦ యతిఘోరముగన్. ౯౨
తే. విస్మయము నాకు మదిలోన ♦ విస్తరిల్లెఁ, బరమధర్మజ్ఞ కాశికా♦పట్టనమున
నుండు మాహాత్మ్యుఁడైనను♦నొండుకడకుఁ, బోవఁ దలఁపఁడు నీ కెట్లు♦బుద్ధిపుట్టె?
వ. అనినఁ బారాశర్యుండు హాళాపిదమనున కిట్లనియె. ౯౩

వ్యాసులు తాను గాశిఁ బాసిన కారణంబుఁ జెప్పుట.

చం. సమధికసత్కవీశ్వరులు ♦ జైమినిపైలసుమంతు లాదిగా
శమదమసద్గుణాన్వితులు ♦ సాధులు శిష్యులు తోడఁ గూడిరాఁ
గ్రమమునఁ క్షేత్రయాత్రకు ధ♦రాతలమం దఖిలంబుఁద్రొక్కి భా
వము భవభక్తియుక్తముగ ♦ వచ్చితిఁ గాశికిఁ బుణ్యరాశికిన్. ౯౪

కం. ఏమిశకునమునఁ జొచ్చితి, మో మన్మథదమనుపీ డ♦హోరాత్రంబుల్
మే మేడునాళ్లననుకనుకూ, స్వామీ! యుపవాసముండి ♦ జడిసితిమి మదిన్. ౯౬

కం. గేహములకేగి భిక్షాం, దేహియన స్వీట నొక ప♦తివ్రత యైనన్
సౌహార్దంబునఁ దెడ్డెం,డాహారము పెట్టదయ్యె ♦ నా దినములలోన్. ౯౭

శా. శ్రీవిశ్వేశ్వరదేవదేవుని కృపా ♦ శ్రీచే దివోదాసు బా
హావిశ్రాంతబలంబుచేత ధవళ ♦ న్యాయప్రజావృద్ధినొ
ప్పి విశ్రామముగల్గి సుస్థిరతరం♦బై యుండి భాసిల్లఁగా
నీ వారాణశిలోన భిక్ష కఱవ♦య్యెం జూడుమీ కుంభజా. ౯౮

శా. వైశంపాయనుఁ డెంతయున్ సుడివడె♦న్వాడె న్సుమంతుం డతి
క్లేశం బందిరి పైలజైమినులు దుః♦ఖించెన్ మదిన్ దేవలుం
డాశాంతంబులు చూచె దాల్భ్యుఁ డుదరో♦దగ్రక్షుధాక్షోభచేఁ
గాశీపట్టనవిప్రవాటికల భి♦క్షాలబ్ధి లేకుండుటన్. ౯౯

తే. అక్కటా యేమి చెప్ప విం♦ధ్యాద్రిదమన, కాశిలో నేడు నాళ్లు ని♦ష్కారణంబ
శిష్యులును నేను నిట్రుపా♦సెంబు వడితి, మమర గంగానదీ సైక♦తములయందు.

వ. అష్టమదివసంబునం దరుణోదయకాలంబున గంగాపులినోత్సంగంబులం గుశశయనంబున మేలుకాంచి యభ్యుదితంబైన మార్తాండమండలం బాఖండలదిశావేదండకంఠగ్రైవేయకనకఘంటికాఠంకారంబునుం బోలె నుదయగిరిశిఖరతటసవిధంబునఁ గుంకుమరజస్త్రసరేణువిసరంబునుం బోని నిగనిగనుజిగిగీలుకొని కోమలజిలుఁగుజిగికొనలు గగనతల మలమికొనుకొలఁది మణికర్ణికాంభఃప్రవాహంబున నఘమర్షణస్నానం బాచరించి యత్తీరవాసిజనవిరచితవాలుకాలింగంబులకుఁ బీఠార్చనాశంభులింగంబులకును మంత్రాక్షతపుష్పకపూర్వకంబుగా నభివాదనంబుఁ జేసి పంచబ్రహ్మషంచాక్షరీమంత్రప్రధానంబులు జపియించి సిద్ధమునిపరంపరాసంకులంబైన ఘంటాపథంబునం గంగాబహిర్గేహదేహళీవిభాగంబును నంతర్గేహసౌధవీథి కాట్టకుట్టిమప్రఘణంబులును గడిచి లోలార్కకాలభైరవఢుంఠివినాయకవిశాలాక్షీ ప్రముఖపరివారదేవతాకోటికి నేటికోళ్లు సమర్పించి విశ్వేశ్వరు విరూపాక్షు నక్షీణమోక్ష లక్ష్మీసామ్రాజ్యసింహాసనారూఢుం దారకోపదేశదేశికు దాక్షిణ్యపుణ్యకరుణాకటాక్షవీక్షాపేక్షునిఁ బ్రదక్షిణక్రమదండప్రణామపురస్సరంబుగా సేవించి ముక్తిమంటపంబునఁ గొంతతడవుండి మధ్యాహ్నకాలం బగుట నిరూపించి భిక్షాపాత్రంబులఁ గేలఁబూని యతికఠోరజఠరక్షుధాగ్నితాపంబునకుఁ దోడగు తపనమయ ప్రచండకిరణకాండ ప్రకాండంబులు నెత్తి మండింప లేదు నడుపుండు పొండుకూడ దను నిషేధవాక్యంబులు చెవులునిండికొన

విప్రవాటంబులఁ బ్రతిగేహంబును బరిభ్రమించి విసికి విసిమాలి వేసరి యలసి యారటఁబొంది సొలసి జూఁకించి తూలి దూఁపటిలి యుల్లంబునఁ గ్రోధం బుద్భవించిన. ౧౦౧

శా. కుక్షిప్రోద్భవనిష్ఠురక్షుధితదు♦ష్క్రోధాంధ కారంబునం
జక్షుల్ రెంటను జిమ్మచీఁకటులుగా ♦ సంరంభ శుంభద్గతిం
బ్రేక్షచ్ఛాత్రులు భీతిఁబొందఁ గడును♦ద్రేకించి హట్టంబునన్
భిక్షాపాత్రము రాతిమీఁద శతధా♦భిన్నంబుగా వైచితిన్. ౧౦౨

కం. అటు పౌరవీథిచక్కటిఁ, బటుకునఁ బడవైచి క్రోధ ♦ పరిపాటిమెయిం
గటములదరంగ భ్రూకుటి, నిటలములను జెమటనీటి♦నిండ ఘటిల్లన్. ౧౦౩

కం. ఏమి యని చెప్పుదును లో, పాముద్రా ప్రాణనాథ ♦ ప్రజ్ఞావిభవం
బేమోయయి చెడిపోవఁగ, నా మది నెన్నండు లేని ♦ నైచ్యము పొడమెన్! ౧౦౪

సీ. ఏలా విచారింప ♦ నిందురేఖామౌళి, వివిధమౌక్తికధాతు ♦ విశ్వనాథు
నేలా వితర్కింప ♦ హిమశైలశేఖరో, ష్ణీషకౌశేయంబు ♦ సిద్ధతటిని
నేలా పరీక్షింప ♦ నిభరాజ వదనుని, దుంఠి విఘ్నేశు మం♦దాకజఠరు
నేలా విలోకింప ♦ శ్రీశాకశాకంభర్య, కటిఁ గాలభైరవు ♦ వటుకనాథు
తే. నిఖలకైవల్యకల్యాణ ♦ నిలయమైన, కాశిపైఁ గూడు లేకుండు♦కారణమున
నలిగి శపియింపఁగాఁ బూని ♦ యందుకొంటి, ధృతకమండలు భాగీర♦థీజలంబు.

ఉ. కోపము సంహరింపు ముని♦కుంజరయంచు లలాటదేశసం
స్థాపితపాణిపద్మయుగ ♦ సంఘటితాంజలిబంధులై మహా
తాపసశిష్యబృందములు ♦ ధర్మపథంబును దెల్పి చెప్పఁగా
శాపజలంబు పూనితిఁ బ్ర♦శాంతివిహీనత నేమి చెప్పుదున్. ౧౦౬

వ. ఇవ్విధంబున సప్తవాసరోపవాసాయాససంభూతప్రభూతరోషావేశంబున నంగుళీపవిత్రసనాథంబైన హస్తంబున మణికర్ణికాజలంబులు ధరియించి యిట్లని శపియింప నుద్యోగించితి. ౧౦౭

వ్యాసులు కాశిని శపింపఁబూనుట.

శ్లో. మాభూ త్త్రైపూరుషీ విద్యా, మాభూ త్త్రైపూరుషం ధనమ్
మాభూ త్త్రైపూరుషీ భక్తిః, కాశ్యాం నివసతాం సదా. ౧౦౮

తే. అని శపింపఁగఁ బూను న♦య్యవసరమున
నేమి చెప్పుదు నోసంయ♦మీంద్రవంద్య
యుదిలగొని కంపమందుచు♦నుండెఁ గాని
శాపజలమందుకోఁ గేలు♦సాఁగదయ్యె. ౧౦౯

వ. ఆసమయంబునఁ గాశికానగరసోమవీథికాభవనవాటికామధ్యంబున నొక్కయింటి ముచ్చకంటి పంచాశద్వర్షదేశీయపలితసారంబైన వేణికాభారంబు గైవస ముదుసలి చక్రవాకంబులతో నెకసక్కెంబాడు వీఁగుచన్నుల వ్రేఁగుఁదనంబునఁ దనతనూవల్లి జలదరింపఁ గంకణఝుణఝుణత్కారంబు దోరంబుగాఁ గ్రక్కున గోపురద్వారంబు బోరుతలుపు వాఁయుం బట్టి యందియలరవళిఘోషం గూడి మట్టియలమ్రోఁత త్రిభువనంబులు నుసుజగొనం దేరుగడుపయోలం జరణపల్లవంబుఁ జాఁచి యనంగధ్వజపటకతోరపాఠీనచ్ఛాయాదాయాదంబులైన వెడఁదకన్నులు తలచుట్టునుంబలిసి పోలయ కలమధురవీణాక్వాణపాణింధమంబైన యెలుంగు నెత్తి యో బ్రాహ్మణోత్తమా! శాపము సంహరించి యిటు రమ్మని నన్నుఁ జేరం బిలిచిన. ౧౧౦

ఉ. సంతసమంది యే నపుడు ♦ శాపజలంబులు పాఱఁజల్లి వే
దాంతవచోమహోపనిష ♦ దర్థమయిన్ శుభరూప వృద్ధసీ
మంతినిఁ గాశికానగర ♦ మధ్యనివాసిని విశ్వనాథుశు
ద్ధాంతము డాయఁబోయితిఁ బ్రి ♦ యంబును భక్తియునుం దలిర్పఁగన్. ౧౧౧

ఆ. డాయఁబోయి యప్పు ♦ డాయమ్మ యెవ్వరో, యేకులంబునదియొ ♦ యెఱుఁగకయును
నే జొహారునిడితి ♦ (హృదయంబ నేసచు, నెదుట ప్రాభవంబు ♦ నేర్పరింప.) ౧౧౨

వ. అంత నన్నుం జేరఁబిలిచి యక్కాంత యిట్లనియె. ౧౧౩

తే. భిక్ష లేదని యింత కో ♦ పింతురయ్య? కాశికాపట్టణముమీఁదఁ ♦ గాని నేఁడు
నీమనశ్శుద్ధిఁ దెలియంగ ♦ నీలకంఠుఁ, డింత చేసెను గాక కూ ♦ డేమి బ్రాఁతి. ౧౧౪

తే. శ్రీవిశాలాక్షి బంగారు ♦ త్రెడ్డునందు, నమృతపాయస మొసఁగు న ♦ భ్యాగతులకుఁ
గాశికాపురి మధ్యాహ్న ♦ కాల మనఁగ, వినియు నెఱుంగవె యాతిథ్య ♦ వేళలందు.

ఉ. ఏడు దినంబు లన్నమున ♦ కెడ్డము పుట్టిన యంతమాత్రలో
నేడుచుచున్నవాఁడవు ము ♦ నీశ్వర నేఁడును నీదు ధీరతల్
పాడఱిపోయెనే శివుని ♦ భార్యకుఁ గాశికిఁ బుణ్యరాశికిం
గాడు నొనర్పఁ జూచెదవు ♦ కంఠపుఁ గ్రోధము పెచ్చులెచ్చఁగన్. ౧౧౬

ఉ. క్రొన్నెలపువ్వుదాల్పునకుఁ ♦ గూరిమిభోగపురంధ్రి కక్కటా
యిన్నగరీలలామమున ♦ కీపరిపాటికి నిట్టికోప మే
లన్న! ఘటించె దో మునికు ♦ లాగ్రణి నిక్కమువో బుభుక్షితః
కిన్నకరోతిపాపమను ♦ కేవలనీతిఁ దలంచిచూడఁగన్. ౧౧౭

తే. కాశిపైఁ గోపగింపఁగఁ ♦ గాదు నీకు, నెంతకోపించునో యింత ♦ కిందుమౌళి
విప్రుఁడవు గాన నేరము ♦ వెదకఁ దగదు, భిక్షఁ గొనరమ్ము మాటలు ♦ పెక్కులేల.

వ. అనిన నన్నాలుఁగంటికి నిట్లంటి. ౧౧౯

శా. తల్లీ! యిన్ని దినాల కేనియు సుధా♦ధారారసస్యందియై
యుల్లంబుల్ సుఖియింపఁజేయు పలు కె♦ట్లోవింటి నిన్నేటిలోఁ
బెల్లాఁగొన్నతవాన నే నొకఁడనే ♦ భిక్షాన్నకున్ వత్తునో
యెల్లన్ శిష్యులఁ గొంచు వత్తునొ నిజం♦బేర్పాటుగాఁ జెప్పుమా. ౧౨౦

తే. ఈవు పెట్టిన భిక్ష మే♦మిందఱమును
బంచుకొని చేయువారము ♦ ప్రాణరక్ష
నాతియందఱవియును బ్రా♦ణములు కావె?
నా యది యె ప్రాణమనివత్తు♦నా! భుజింప. ౧౨౧

వ. అనిన మందస్మితవదనారవిందయై యయ్యిందుబింబానన యిట్లనియె. ౧౨౨

శా. అంతేవాసులు నీవుఁ గూడుకొని మ♦ధ్యాహ్నాభిషేకక్రియల్
శాంత స్వాంతత జాహ్నవిం జలిపి వే♦ల్పన్ రండు నే నింతలో
నంతర్గేహమునన్ సమగ్రముగ మీ♦కాహారము ల్వేగఁ గ
ల్పింతున్ భోజనమిష్ట మిందఱకుఁ దృ♦ప్తిన్ బొందఁగాఁ బెట్టెదన్. ౧౨౩

కం. ఆఁకొంటి రిన్ని దినములు, పోఁకంతయు భిక్ష సేటఁ ♦ బుట్టక యునికిన్
ఆఁకట దూఁకట నలిగితి, రేఁకట వాయంగ భిక్ష♦లిడియెద రండీ. ౧౨౪

వ. అనిన నేమును విద్యుల్లోకల్లోలినికిం జని యాప్లవనం బాచరించి యుభయపవి
త్రంబులు ధరియించి వేదంబులు పఠియించుచు వచ్చి యన్నచ్చకంటి యింటి
మొగసాలఁ గూర్చుంటిమి. ౧౨౫

కం. మున్నాఁటి శిష్యులును నే, నన్నెలఁతుకతోడ మాట♦లాడిన యయ్యా
భ్యున్నతసౌధము మీఁదను, సున్నము నిగిడించినట్టి ♦ జోపరఁగులపై. ౧౨౬

వ. ఉండి యాసారప్రసారంబులు చేయు శంభళీజనంబులచేతను మారాకయెత్తింగిం
చిన నబ్బోటి హాటకమయంబైన గొడుగుపావలుగిలుకలు గులుకరింపఁ గుసుమ
కోదండసమ్మోహనకాండంబునుఁ బోని యొక్క రెంపవనయసుతాంబూలకరండ
వాహినిం గైదండపట్టుకొని యేతెంచి రండు విచ్చేయుండని సబహుమానంబుగాఁ
దోడ్కొనిపోయి చంద్రికాసంకాశకౌశేయశతసహస్రసందానితవితానోపశోభితం
బును, గాలాగురుధూపధూమవాసనాసనాథంబును, కర్పూరరచితరంగవల్లీవేల్లితం
బును, కస్తూరికాలేపనసురభిశశికాంతమణిశిలాకుట్టిమంబును నగు చతుశ్శాలా
భోజనమందిరంబున వృద్ధానుపూర్వకంబుగ నుచితాసనంబులం గూర్చుండ నియ
మించిన. ౧౨౭

కం. మొగి విరిసి కఱకుగూడక, పగులక వెడలుపును నిడుపుఁ ♦ బసిమియుఁ గలలేఁ
జిగురరఁటాకులు పెట్టిరి, దిగదిగ నద్దేవియాజ్ఞ ♦ దివ్యపురంధ్రుల్. ౧౨౮

వ. అనంతరంబ. ౧౨౯

తే. అర్చనలు చేసి గంధపు♦ష్పాక్షతముల, ధూపమిచ్చెఁ గాలాగురు ♦ ధూమరేఖఁ
గప్పురంబు నివాళించెఁ ♦ గమలనేత్ర, పంక్తిపంక్తికి నేతెంచి ♦ బ్రాహ్మణులకు. ౧౩౦

ఉ. ఇందఱుఁ గూడి శాంతి పఠి♦యింపుఁడు మజ్జనమాచరింపుఁ డ
ర్ధేందుకళా కిరీటునకు ♦ నీ యమృతాన్నము లీ పదార్థముల్
మందగతిం భుజింపుఁడు స♦మస్తజగత్పతి కాశికాపురీ
మందిర విశ్వనాయకుఁ డు♦మాపతి ప్రీతి వహించుఁ గావుతన్. ౧౩౧

వ. అని పంక్తిపంక్తి నడుమ నిలుచుచుఁ నయ్యింతి భక్తిశ్రద్ధా తాత్పర్య విశ్వాస పూర్వ
కంబుగా నుర్వీగీర్వాణవర్గంబులఁ బ్రార్థించుచు నాపోశనంబులు వోయింపనుండె
నప్పు డేను బైలసుమంతుజైమినివైశంపాయనాదిశిష్యప్రకరంబు నెమ్మనంబుల
నిట్లని వితర్కించుచుంటిమి. ౧౩౨

ఉ. వండినచొప్పునుం బొగపు♦వాసనయుం బొగపాఱు చందముం
భాండసమృద్ధి సంపదయుఁ ♦ బానవిభూతియు సర్వమంగళం
బండజయాన రిత్తప్రియ♦మాడెడు నేఁడును భోజనంబు లే
కుండుట గాననయ్యె నసి♦తోత్పలగంధియు నేమిమాయయో. ౧౩౩

ఉ. చల్లని సౌమ్యదృష్టియుఁ బ్ర♦సాదము మాధురియు న్వివేకము
న్వెల్లఁదనంబు మౌగ్ధ్యమును ♦ నిర్మలినత్వముఁ జూపునచ్చినం
గల్ల యొకింతయేనిఁ బొడ♦గానఁగరా దరఁటాకుఁజూచినన్
ఝల్లనె గుండె యోగిరము ♦ శాకములుం బొడగాన[illegible]క్కిన్. ౧౩౪

తే. పాత్రసంశుద్ధి కాజ్యంబు ♦ పస్తరించి, యూరకుండిరి యిదియేమి ♦ యొక్కొ వీరు
కానరావిప్డు శాకపా♦కములు నెదుర, మనకు నిజమయ్యె నలచంద♦మామఘుటిక.

మ. అవుగాకేమి నిజంబు తేటపడఁగా♦నర్చించె గంధాక్షతా
దివిశేషంబుల శాంతిపాఠమును సం♦దీపించె విశ్వేశ్వరుం
శివు నుద్దేశము చేసి మ్రొక్కి వివిధా ♦ శీర్వాదముల్ గైకొనెం
ధవళాంభోరుహనేత్ర యింతయును మి♦థ్యాదృష్టి గానేర్చునే. ౧౩౬

కం. కానీ యీదివసంబును, నే నిన్నఁటి యట్లకాక ♦ యేమునఁగ నపో
సానంబులు వడ్డించిరి, మానవతీజనులు లీల ♦ మహిదివిజులకున్. ౧౩౭

తే. పోసి రామెల్లవారి కా♦పోశనములు, నారగింపుఁడు లెండు మీ ♦ కమృతమస్తు
ప్రొద్దుపోయెనుజుండని♦బుజ్జగించి, మ్రొక్కి యంజలియెత్తె న♦మ్ముదుకపణఁతి.

శా. ఆముత్తైదువ యాజ్ఞఁ విప్రనికరం ♦ బాపోశనం బెత్తినన్
సామర్థ్యం బది యెట్టిదో నిఖిలమున్ ♦ సంపూర్ణమై పత్త్రపా
త్రీమధ్యంబునఁ బిండివంటకములుం ♦ దివ్యాన్నముల్ షడ్రసీ
సామగ్రీరుచిమత్పదార్థచయము ♦ ల్సంధిల్లె నొక్కుమ్మడిన్. ౧౩౯

ఉ. పప్పును బిండివంటలును ♦ బాయసముల్ ఘృతముల్ గుడంబులుం
గుప్పలుగాఁగఁ జట్టునను ♦ గూర్పఁగఁ గూడిన యోపుఁబ్రాలతె
ల్లప్పరభోగివంటకము ♦ గమ్మని తాలిఫు సాజ్జెపిండితో
నొప్పులుగా భుజించిరి బు♦ధోత్తములాఁకటిచిచ్చు పెచ్చునన్. ౧౪౦

కం. తరుణి యిది యన్నపూర్ణా, పరమేశ్వరి గాని యితర♦భామిని గాదం
చరవాయి గొనక మెసఁగిరి, పరమమునీశ్వరులు పంచ♦భక్ష్యాన్నంబుల్. ౧౪౧

శా. ద్రాక్షాపానకఖండశర్కరలతో ♦ రంభాఫలశ్రేణితో
గోక్షీరంబులతోడ మండెఁగలతోఁ ♦ గ్రొన్నేతితోఁ బప్పుతోఁ
నక్షయ్యంబగు నేరుఁబ్రాలకలమా♦హారంబు నిశ్శంకతం
గుక్షుల్ నిండఁగ నారగించితిమి య♦క్షుద్రక్షుధాశాంతికిన్. ౧౪౨

ఆ. ఎవ్వఁ డే పదార్థ ♦ మెంతేనిఁ జింతించు, నతని కా పదార్థ ♦ మంత గలిగి
యరఁటియాకు మీఁద ♦ నవతారమై యుండు, నిట్టిమహిమ చూడ♦మెన్నఁడేని.

ఉ. వేలుపుగిడ్డియుం బరుస ♦ వేదియుఁ గల్పకుజంబుఁ దోడ రా
లాలితపాదనూపురఝు♦ళంఝుళనాదము లుల్లసిల్లఁ బైఁ
జేలచెఱంగు దూలఁగ వి♦శృంఖలవృత్తిఁ జరించుచుండె నీ
లాలక యన్నపూర్ణ యమృ♦తాన్నముఁ బెట్టుచు నన్నిపంక్తులన్. ౧౪౪

వ. ఇవ్విధంబున నాజ్యధారాప్రవాహంబును, శర్కరాక్షోదసికతాంచితంబును, పాయసాపూపసంపన్నంబగు కలమాన్నపూర్ణంబును, ద్రాక్షాగోక్షీరక్షౌద్రపుండ్రేక్షుఖండ మండితంబును, రంభానారికేళఫలపాకశాక సాకల్యకల్యంబును, షాడబరసావళీపానక ప్రచురంబును, శరచ్చంద్రచంద్రికాధవళదధిసమృద్ధంబునునైన భోజనోత్సవంబు వైశంపాయనమనః ప్రమోదసంపత్సంపాదనలంపటంబును, సుమంతుసంతోషకారణంబును, పైలరసనాతపఃఫలంబును, జైమినికామనాకామధేనువును, దేవలముదావహంబును, రోమహర్షణహర్షోత్కర్షావహంబును, సూతకౌతూహలహేతుభూతంబును, నస్మన్మనోరథవిహారఘంటాపథంబునునై ప్రవర్తిల్లెఁ దదనంతరంబ. ౧౪౫

ఆ. హస్తములను గడిగి ♦ యాచమనక్రియా, వ్యాప్తిదీర్చి దేవి ♦ యాజ్ఞ మేము
విమలసౌధమధ్య ♦ వేదికాస్థలమున, విశ్రమించియున్న ♦ వేళయందు. ౧౪౬

వ. అభ్యంతర భవనంబునందుండి. ౧౪౭

విశ్వనాథుఁడు పార్వతితోడ వ్యాసాదులుండిన వేదికకడకు విజయముచేయుట.

సీ. చంద్రబింబానన ♦ చంద్రరేఖామౌళి, నీలకుంతలభార ♦ నీలగళుఁడు
ధవళాయతేక్షణ ♦ ధవళాఖిలాంగుండు, మదనసంజీవని ♦ మదనహరుఁడు
నాగేంద్రనిభయాన ♦ నాగకుండలధారి, భువనమోహనగాత్ర ♦ భువనకర్త
గిరిరాజకన్యక ♦ గిరిరాజనిలయుండు, సర్వాంగసుందరి ♦ సర్వగురుఁడు
తే. గౌరి శ్రీవిశ్వనాథుండు ♦ కనకరత్న, పాదుకలు మెట్టి చట్టలు ♦ పట్టికొనుచు
నేగుదెంచిరి యొయ్యార ♦ మెసకమెసఁగ, విహరణక్రీడ మాయున్న ♦ వేదికపుడు.

తే. జయయు విజయయు నొకవంక ♦ సరస రారు
నందికేశుండు ముందర ♦ నడచి రాఁడు
ప్రథమసంఘము లేమి సం ♦ భ్రమము లేక
యరుగుదెంచుట యద్భుత ♦ మయ్యె మాకు. ౧౪౯

శా. గౌరిం జూచినయప్పు ♦ డంచితమహా కారుణ్యసంపత్తియుం
దారానాయకమౌళిఁ జూచినపుడు ♦ ద్యత్క్రోధసంరంభముం
దోరంబై యపు డంతరంగముల సం ♦ తోషంబు సంత్రాసముం
బూరిం జెన్నొను మేమి చెప్పుదు మహా ♦ పుణ్యాత్మ కుంభోద్భవా. ౧౫౦

తే. కాశి శివునకు శుద్ధాంత ♦ కాంతగాన
దానిపై నల్గి కోపపా ♦ త్రంబ నైతిఁ
గాశి గౌరికి సవతియౌఁ ♦ గాన నేను
దానిపై నల్గి ప్రేమపా ♦ త్రంబ నైతి. ౧౫౧

వ. అనంతరంబ యేము ప్రత్యుత్థానంబు చేసి యా పురాణదంపతులకుఁ బ్రణామం
బులాచరించి మడిసందులం జేతులిడి యొక్కకెలన నిలిచి యుండితిమి. పార్వతీ
పరమేశ్వరులు వేదికాస్థలంబున విజయంచేసి కూర్చుండి రప్పుడు శంభుండు కోప
సంరంభంబున నాదిక్కు చూచి ధిక్కరించి యిట్లనియె. ౧౫౨

శంభుండు వ్యాసునిశిష్యులతోడఁ గాశి వెడలిపొమ్మనుట.

సీ. ఓరి దురాత్మ! నీ ♦ వారముష్టింపచా, భాస! యోజనగంధ ♦ ప్రథమపుత్ర!
దేవరన్యాయదు ♦ ర్భావనాపరతంత్ర! బహుసంహితావృథా ♦ పాఠపఠన!
భారతగ్రంథగుం ♦ భనపండితంమన్య! నీవా మదీయప ♦ త్త్నికి నశేష
కైవల్యకల్యాణ ♦ ఘంటాపథమునకుఁ, గాశికాపురికి ని ♦ ష్కారణంబ
తే. శాపమిచ్చెద నని యనా ♦ చారసరణి
నడుగువెట్టినవాఁడవ ♦ హంకరించి

పొమ్ము నిర్భాగ్య మాయూరి♦పొలము వెడలి
యెచటికేఁ శిష్యులును నీవు ♦ నీక్షణంబ. ౧౫౩

కం. పోక నడగొట్టితేనియు, రాకింతుఁ జుమీ మొగంబు ♦ రాచట్టుపయిం
శ్రీకాశిక నిందించిన, నీకింతట నేలపోవు ♦ నీచచరిత్రా. ౧౫౪

కం. వడి విడువక యివ్వడువున, నుడుపతిమకుటుండు చెవుల ♦ కొనరని నుడుగుల్
నొడివిన నే నయ్యగువుర, యడుగులఁ బడి కాశి వెడలి ♦ యరిగెడు వేళన్. ౧౫౫

చం. వెఱవకుమో కుమార! పది♦వేలవిధంబులనైన నిన్ను నే
మఱవ మహేశకుం జనుట♦మాని సుఖంబున దక్షవాటికిన్
దుఱఁగలి గొన్న సన్మనము♦తో గమనింపుము భీమనాయకుం
డఱగొఱలేని వేల్పు నిఖి♦లాభ్యుదయంబులు నీకు నయ్యెడన్. ౧౫౬

వ. అనిన నంబవచనంబులు విని విశ్వేశ్వరదేవ రచితస్వశ్యాపానుగ్రహోపద్రవసంభూత వేదనాదూయమాన మానసుండ నయ్యును భవానీకృపాపాంగవీక్షావిశేషదాక్షిణ్యంబున నొక్కింత యంకిలి దెలిసి శిష్యసహితుండనై యెన్నఁడెన్నఁడు భీమేశ్వరుఁ దర్శింతునో యని యువ్విళ్ళూరి యేతెంచుచున్నవాఁడఁ బరమమాహేశ్వరుండ వైన నిన్నుం గనుంగొంటి నింక నా మనోరథం బవ్యాహతగతిం బ్రవర్తింపఁ గలయది. ౧౫౭

తే. అనవధానత నావగిం♦జంతసూవె, పర్వతంబంత యపరాధ ♦ భరము గొలిపి
కాశి వెడలంగ మొత్తినఁ♦ గాసిబొంది, తిరుగుచున్నాఁడ నిదె యేను♦ దిక్కుమాలి.

తే. కడుదయాళువు దేవతా♦గణములెల్లఁ, గాలభైరవు చిత్తంబు ♦ కఠినపాక
మీరసము పెద్ద దుంఠివి♦ఘ్నేశ్వరునకుఁ, గాశిమనబోంట్లకెల్లను ♦ గాని బ్రదుకు.

కం. అని కుంభసంభవునకును, దన వృత్తాంతంబు చెప్పి ♦ దైన్యము నొందెన్
గనుఁగవ నశ్రులు దొరుఁగఁగ, ననఘుఁడు సత్యవతిసూనుఁ♦డని చెప్పుటయున్.

వ. అటమీఁది వృత్తాంతం బెయ్యది యని యడిగిన. ౧౬౧

మ. స్మరజిద్భూధరదిక్కరిద్రుహిణయో♦షాచంద్రికాభ్రాపగా
శరదభ్రాభ్రమువల్లభ ప్రతిభట♦స్ఫాయత్స్ఫురత్కీర్తిని
ర్భరగర్భోదయభాస్వరఖిల ♦ బ్రహ్మాండభాండోదరా!
యరివేదండఘటావిఘట్టనకఠో♦రాటోపకంఠీరవా! ౧౬౨

కం. అసమసమవిషమసమర, ప్రసృమరరిపు సుభటనిటల ♦ పట్టవిఘట్ట
వ్యసనదృఢదోఃకఠారా, కుసుమశరాసనసమాన ♦ కోమలమూర్తీ. ౧౬౩

స్రగ్విణీ. రామమాంబాసుతా ♦ రాజవిద్యాధరా
కామితార్థైకసం♦కల్పకల్పద్రుమా
వేమనక్షోణిభృ♦ద్వీరభద్రేశ్వరా
స్వామికార్యాభిర♦క్షా క్రియాదక్షిణా. ౧౬౪

గద్య. ఇది శ్రీకమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర సుకవిజనవిధేయ శ్రీనాథనామధేయ ప్రణీతంబైన భీమేశ్వరపురాణం బను మహాప్రబంధంబునందు ద్వితీయాశ్వాసము.

సమాప్తము.

శ్రీరస్తు.
శ్రీరామాయనమః.
శ్రీమహాగణాధిపతయేనమః.
శ్రీమాణిక్యాంబాసమేత శ్రీ భీమేశ్వరస్వామినే నమః.

శ్రీ భీమేశ్వరపురాణము.

తృతీయాశ్వాసము.

శ్రీభీమేశ్వరకరుణా
లాంభసముజ్జృంభమాణ ♦ లక్ష్మీవిభవా
ప్రాభవకశ్యపమునివం
శాభరణా! బెండపూఁడి♦యన్నామాత్యా. ౧

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పందొడంగె. ౨

గీ. అవ్విధంబున బాష్పధా♦రాకులాక్షుఁ
డగుచు సత్యవతీసూనుఁ ♦ డడలుటయును
నెలఁతయును దాను గన్నుల♦నీరునించెఁ
గరుణ చిత్తంబులో నుబ్బఁ♦గలశభవుఁడు. ౩

వ. అనంతరంబ యంతరంగంబున సంతాపంబు డిందుపఱచుకొని సత్యవతీనందనుండు కమండలుజలంబులు కన్నులఁ దడుపుకొని నిట్టూర్పు నిగిడించి కాశికావియోగక్లేశంబున సమానవ్యసనుండైన కుంభసంభవున కిట్లనియె. ౪

ఉ. ఈవును నేనహోలెను ము♦నీశ్వర భాగ్యము లేమిఁ జేసి కా
శీవిరహాగ్నితాపమునఁ ♦ జేవ్రడినాఁడవు చెప్పవయ్య నా
త్రోవ మహాత్మ దక్షపురి ♦ ధూర్జటి శంభుఁడు భీమనాథుఁ డా
ర్యావిభుఁ డాశ్రయాస్పదుఁడగు♦నా? నను నేలికొనం దలంచునా? ౫

మ. జగతీమౌళివతంసభూషణము వి♦శ్వఖ్యాతముం గాశికా
నగరంబు న్విడఁబాసి నీకును జగ♦న్మాన్యైకచారిత్ర యీ
చిగురుంబోఁడికి నాకునుం గటకటా ♦ చేట్పాటు వాటిల్లె నీ
ముగురం గూర్చిన ముండదైవమునకుం ♦ మోమోట లేదో సుమీ? ౬

సీ. నిండి పాఱుచు నుండు♦నే నిదాఘములందుఁ, దళుకొత్తు సప్తగో♦దావరంబు?
షట్కాలశంభుపూ♦జావిధానములకుఁ, బల్లవప్రసవస♦ర్పలును గలవె?
కాంతాజనంబులు ♦ కమియూర నిడుదురే, పురములోఁ దత్కాల♦పుణ్యభిక్ష?
ఘనతపంబునకు వి♦ఘ్నంబు సేయుగదా, యమరేంద్రుఁ డొసఁగిన♦యప్సరసలు?
తే. కాలభైరవవిఘ్నేశ ♦ కార్తికేయ, వీరభద్రాదిపరివార ♦ వీరగణము
స్వాగతము సేయునే కార్య♦సాధకులకు, దక్షవాటికయందు వా♦రాపివముని? ౮
ఉ. ముక్కుమొగంబుచూడక కోక ♦ మోసపుమాటకు విశ్వనాయకుం
డెక్కడికైనఁ బొమ్మనుచు ♦ నెట్టనిచూపులఁ జూచె నక్కటా
ధిక్కరణంబు సేయఁ జను♦దెంచితిఁ గాశినినుండి నాకుఁ దా
దిక్కయి భీమనాయకుఁడు ♦ దీర్చునొకో యవమానదుఃఖముల్. ౯
తే. నన్నుఁ గన్నతల్లి ♦ యన్నపూర్ణామహా, దేవి విశ్వనాథ ♦ దేవు తరుణి
గుఱుతుచెప్పి తన్నుఁ ♦ గొలువంగఁ బుత్తేర, వచ్చినాఁడ ♦ నేలనలదె తనకు? ౧౦
సీ. భీమేశ్వరేశ్వర ♦ శ్రీమహాదేవుండు, కరుణించునే నన్నుఁ ♦ బరమశైవ?
సప్తగోదావరో♦త్సంగధాముఁడు నన్ను, నాదరించునె యిల్వ♦లాసురారి?
సప్తపాతాళవి♦ష్కంభమూలస్తంభ, మూరడించునె నన్ను ♦ నుపరతాత్మ?
దక్షిణాంభోరాశి ♦ తటమేదినీభర్త, రక్షించునే నన్ను ♦ బ్రహ్మవాది?
తే. స్వాగతముసేయునే నాకుఁ ♦ జంద్రమౌళి, కాంక్షితంబిచ్చునె నాకుఁ ♦ గాళగళుఁడు?
కాశిలోఁ బడ్డ మానభం♦గంబువాయఁ, గుస్తరించునె నను శూలి ♦ కుంభజన్మ?
ఉ. దోసము పెద్దలేదనక ♦ ధూర్జటి నిష్ఠురకంఠహుంక్రియా
భ్యాసముమై నదల్చి యద♦యస్థితిఁ గాశివెలార్చె నింకనే
నా సరిసంయమీంద్రుల స♦నాథత నేమొయిఁ జూతు దక్షవా
టీసదనుండు ప్రేమ ఘటి♦యింపక తాను నుపేక్ష చేసినన్. ౧౧

కలశభవుఁడు పారాశర్యునకు దక్షారామమహిమంబు చెప్పుట.

వ. అనినఁ బారాశర్యునకు సత్తపోధనవర్యుం డిట్లనియె. ౧౨
మ. వితతాష్టాదశసంహితాగమకథా ♦ వీథీసహస్రంబు భా
రతతంత్రంబఖిలంబు నీయది యపా♦రంబైనయామ్నాయసం
తతి నీచే వివరింపఁగాఁబడియె వి♦ద్యావర్ధనా నీవు నీ
క్షితిలోఁ గానని క్షేత్రముల్ గలవె? యీ ♦ చింతాభరం బేటికిన్. ౧౩
వ. భీమలింగంబు మాహాత్మ్యంబు నీ వెఱుంగనియదియునుంగలదె? దక్షారామపుణ్య క్షేత్రం బఖిలపురాణప్రసిద్ధంబు కాదే? నీమనోవిషాదంబునం జేసి యెఱుఁగని వాఁడవుంబలె నడిగెదవుగాక, నైన నడిగిన యర్థంబు చెప్పెద నాకర్ణింపుము.

ఉ. మోక్షస్థానము భోగభూమియును నై ♦ మున్యాఖ్యక్షేత్రంబులన్
సాక్షాద్బ్రహ్మపదంబనంగ నపర♦స్వర్గంబునా నొప్పగున్
దక్షారామము భీమనాయకమహా♦ధామంబు లోకత్రయీ
చక్షుః ప్రాఘుణకాయమానసుషమా ♦ సంపత్సముద్దామమై. ౧౫

తే. రాజవంశజుఁడగు భగీ♦రథుని వెనుకఁ, బాఱుతెంచిన చదలేఱు ♦ పాటియగునె
సప్తమునిరాట్ప్రతాప సం♦ప్రాప్తమైన, సప్తగోదావరంబుతో ♦ సారమహిమ. ౧౬

సీ. దక్షప్రజాధినా♦థమహాధ్వర క్రియా, దీక్షాధిగతపుణ్య ♦ దేశమునకు
బ్రహ్మవిష్ణుపురంద♦రప్రధానసుపర్వ, పరమసంయమిసభా ♦ భవనమునకు
దాక్షాయణీయోగ ♦ దహనార్చిరున్మేష, సామిధేనీమంత్ర ♦ జాతమునకు
వీరభద్రభుజావి♦హారహేలాసమా, రంభనాటక నాట్య ♦ రంగమునకు
తే. నమృతమయదివ్యతేజస్స్వ♦యంభులింగ, శాంతభీమేశ్వరేశ్వర ♦ స్థానమునకు
దక్షవాటంబునకు మోక్ష♦ధామమునకు, భోగజన్మస్థలమున కే♦పురము సరియె?

వ. వెండియుఁ జండభానుకృతప్రతిష్ఠుండును, నాఖండలముఖనిఖిలబర్హిర్ముఖశిఖామణిమయూఖకిమ్మీరితచరణారవిందుండును, సప్తపాతాళభువనవిష్కంభనిర్భేదసమాసాదితావిర్భావుండును, దివ్యామృతస్వయంభూరుజ్జ్యోతిర్లింగమయమూర్తిధరుండునైన, భీమేశ్వరుండు భోగమోక్షప్రధాన దీక్షాధురంధరుండై యందు వసించియుండు నమ్మహాదేవుచేత నప్పుణ్యక్షేత్రంబు భీమమండలంబనఁ బండ్రెండు యోజనంబుల మేర కైవల్యకల్యాణ మండపంబును భోగలక్ష్మీవిలాస భవనపుండరీకంబునునై కుండలాముఖ సంవేద్యశాస్త్రాలక్షేత్రంబులు మొదలుగాఁ గల శాఖోపశాఖాక్షేత్రంబులం గలిగి దక్షిణజలధివేలావనోపకంఠంబున వేదండవదనశుండాకాండచుళికితోన్ముక్తసప్తగోదావరసలిలధారాఘుణత్కారబృంహిత బ్రహ్మాండగోళంబును, దుల్యభాగాప్రవాహ లహరికాఘోషఘుమఘుమాయమానదిగ్విభాగంబును, నేలానదీ మాతృకాయమాన కేదారక్షేత్రసంవర్ధితానేక వ్రీహిభేద సంపత్సంపన్నంబును, ఫలభరితనారికేళషండమండిత ప్రౌఢపీఠాపురోపకంఠసీమాబహిర్భాగంబును, మాతృకాయమాన గోదావరీక్షేత్ర పుణ్యాగ్రహార పరంపరా భూనిలింప సంపత్సంపాదితాధ్వరక్రియాసమాహూతాది దేవతాకదంబ సంబాధ సంచరితంబును, గౌంతేయవాహినీప్రాంతసంతప్యమాన మునిమండలంబును సహకారకాంతారఫలరసాస్వాదమోదమానపుంస్కోకిల కుటుంబకంఠనాళకోమల కుహూకారకోలాహల ప్రపంచితపంచమంబును, హరివంశంబునుంబోలె బలభద్రప్రద్యుమ్నానిరుద్ధపురుషోత్తమాధిష్ఠితంబునునై, మహాక్షేత్రంబన, మహాలింగస్థానంబన, దక్షిణకాశియనఁ, గళ్యాణనిలయంబనఁ, గైలాసప్రతిబింబంబన,

ననశ్వరమహైశ్వర్యంబును, నప్రతిమవైభవంబును, నవాఙ్మానస గోచరంబును,
నసంఖ్యాతప్రమథగణసమాకీర్ణంబునునై, యశేషకల్యాణనిలయంబై యొప్పు
నమ్మహాస్థానంబునందు. ౧౮

సీ. పాటలంబగుజటా ♦ జూటంబునడునట్టు, పూపచుక్కలరాజు ♦ పొడవుచూపు
వెడఁద యైన లలాట ♦ వీథివిటంకంబు, కట్టెఱ్ఱక్రొవ్వేఁడి ♦ కన్నుఁగూర్పుఁ
గంబుసన్నిభ మైన ♦ కంఠప్రదేశంబు, గరళకూటముఛాయఁ ♦ గ్రాఁచి యుమియుఁ
గడు మనోజ్ఞము లైన ♦ కర్ణపార్శ్వంబులఁ, బెనుపాఁపపోఁగులు ♦ బిత్తరించు

తే. భీమమండలికాపుణ్య ♦ భూమియందు, వివిధకైవల్యకళ్యాణ ♦ వేది ననఁగఁ
గీటపక్షిసరీసృప ♦ క్రిమిచరాది, జంతుకోటికిఁ బ్రాణావ ♦ సానవేళ. ౧౯

సీ. ఒకచోటఁ గోటివ ♦ ల్మ్యుడురాజకోటీర, విభ్రాజితోత్సంగ ♦ వృద్ధగంగ
యొకచోటఁ బీఠాంబి ♦ కోన్నతస్తనభరా, స్ఫాలజర్జరితక ♦ ల్లోల యేల
యొకచోటఁ జటులన ♦ క్రకుళీరపాఠీన, తోయగర్భాభోగ ♦ తుల్యభాగ
యొకచోటనప్సరో ♦ నికరసంసేవితాంతరము శ్రీసప్తగో ♦ దావరంబు

తే. నమరు నాగరఖండసి ♦ ద్ధాంతజాతి, నాగవల్లీసమాక్రాంత ♦ పూగఖండ
మండితోద్యానవాటికా ♦ ఖండవిభవ, పాత్రమగుభీమమండలీ ♦ క్షేత్రమునకు.

సీ. త్ర్యంబకాచలశిఖా ♦ గ్రమునందునుదయించి, పొదలి యార్యావర్త ♦ భూమిఁదఱిసి
మలఁగిదండకవనీ ♦ మధ్యభాగముననా, ప్రస్రవణాచల ♦ ప్రస్థమొఱసి
పట్టిసశ్రీవీర ♦ భద్రేశు సేవించి, క్షేత్రసోమేశుమం ♦ దిరము డాసి
యేచియనంతభో ♦ గేశ్వరస్థానంబు, రుద్రపాదములపైఁ ♦ ద్రోవగాఁగఁ

తే. గోటిపల్లీశు కోమలాం ♦ ఘ్రులకు మ్రొక్కి, కుండలాముఖక్షేత్రంబుఁ ♦ గుస్తరించి
భీమమండలి డాపలఁ ♦ బెట్టుకొనుచు, గౌతమీగంగ లవణాబ్ధిఁ ♦ గౌఁగిలించె.

తే. నీరుకడఁ గోళ్లఁగూడిము ♦ న్నీటిఁగవయు
మొగులుబడి వాహినులకెట్లు ♦ మొరయువచ్చు
వార్ధులేఁడింటికివలపు ♦ వనితయైన
మంగళోత్సంగగౌతమీ ♦ గంగయెదుర. ౨౨

ఉ. ఎక్కడఁ జూచినం సరసి ♦ యెక్కడఁ జూచిన దేవమందిరం
బెక్కడఁ జూచినం దటిని ♦ యెక్కడఁ జూచినఁ బుష్పవాటికల్
ఎక్కడఁ జూచిన న్నది మ ♦ హీవలయంబున భీమమండలం
బెక్కడ యన్యమండలము ♦ లెక్కడ భావన చేసి చూచినన్. ౨౩

తే. బ్రహ్మహత్యాదులగు మహా ♦ పాతకములు
ధాత్రిజనులకునిమిష మా ♦ త్రమునఁ బాయు

భీమనాథమహాదేవు ♦ పెండ్లినాఁటి
దక్షిణాముఖమండప ♦ దర్శనమున. ౨౪

తే. కార్తికీవేళ భీమశం♦కరునినగరఁ
దూఱు నెవ్వాఁడు చిచ్చుఱ ♦ తోరణంబు
నతఁడు దూఱఁడు ప్రాణని♦ర్యాణవేళ
ఘోరయమపట్టనద్వార ♦ తోరణంబు. ౨౫

తే. ద్వాదశక్షేత్రపుణ్యక్షే♦త్రములతోడ, రమ్యమగు సప్తగోదాన♦రంబుతోడ
వరదభీమేశ్వరేశ్వరా ♦ వాసమైన, దక్షవాటంబుకళ్యాణ ♦ ధామమమరు. ౨౬

తే. అప్పురంబుప్రభావంబుఁ ♦ జెప్పనేల, తిరిగిపాఱంగ యోజన ♦ త్రితయభూమి
వాపికాకూపగర్తప♦ల్వలతటాక, క్షేత్రజలములుభాగీర♦థీజలములు. ౨౭

సీ. పంచాక్షరీమంత్ర ♦ పారాయణంబులు, జపియించు శారికా ♦ సముదయములు
నీలకంఠస్తోత్ర ♦ కోలాహలప్రౌఢిఁ, జూపు నున్నత్తపుం♦స్కోకిలములు
శతరుద్రసచ్ఛ్రుతి ♦ స్వాధ్యాయపాఠంబుఁ, బరిఢవించుఁ గిశోర ♦ బంభరములు
ప్రణవాక్షరాభ్యాస ♦ పరిపాటిఁ బాటించు, నానావిధంబుల ♦ నమిలిపిండు

తే. సప్తగోదావరాంబు ని♦ర్ఝరసహస్ర, సారణీసేకసాంతత్య ♦ సంప్రవృద్ధ
వివిధతరుగుల్మవల్లికా ♦ వేలమైన, తత్పురోద్యానవీథికాం♦తంబునందు. ౨౮

సీ. నిఖిలపుణ్యక్షేత్ర ♦ నివహంబునందును, నత్యంతమాశ్రయం♦బనఁగ నెగడి
యైంద్రసంపదకెల్ల ♦ నాధారభూతమై, దక్షునియజ్ఞంబు ♦ తానకమయి
ద్వాదశపుణ్యక్షే♦త్రములతో సంధిల్లి, భోగమోక్షవిహార ♦ భూమి యగుచు
నియమయాత్రామాత్ర ♦ నిశ్శేషదోషాప,హారణం బొనర్ప స♦మర్థమగుచు

తే. సిద్ధనిర్మలనిరవధి ♦ శ్రీస్వయంభు, ధన్యభీమేశ్వరేశ్వర ♦ స్థాణులింగ
దైవతస్థితిసంభవ ♦ స్థానమైన, దక్షవాటంబు వర్ణింపఁ ♦ దరమె మనకు. ౨౯

కం. దక్షిణకాశీనగరము, దక్షారామంబు భీమ♦ధామము ధన్య
త్ముక్షిక్షోణీమండల, రక్షామణి దానిఁ బొగడ ♦ బ్రహ్మకు వశమే. ౩౦

సీ. భీమేశ్వరేశ్వర ♦ శ్రీమహాదేవుండు, హిమధామమౌళి వి♦శ్వేశ్వరుండు
సప్తగోదావర ♦ సలిలప్రవాహంబు, సాక్షాత్కరించిన ♦ జహ్నుకన్య
తిరుచుట్టుమాలెలోఁ ♦ దిరమైనగణపతి, యేకాంతదుంఠి వి♦ఘ్నేశ్వరుండు
దక్షిణంబుననున్న ♦ దండపాణీశుఁ డూహింపంగ దండపా♦ణీశ్వరుండు

తే. భైరవస్వామి శ్రీకాల ♦ భైరవుండు, నంది నందీశ్వరుం డేమి ♦ సందియంబు
దక్షవాటంబు కాశికా ♦ స్థలముగాదె, తీవ్రకరతేజ సత్యవ♦తీతనూజ. ౩౧

వ. మఱియు భీమేశ్వరమండలమునకు సీమాసంవిభాగంబు. ౩౨

తే. జంభరిపుదిక్కునకు సీమ ♦ సలిలరాశి, పశ్చిమమునకు సీమ త్ర్యం♦బకతనూజ
దుర్యమ్నపతిదిక్కునకు సీమ ♦ తుల్యభాగ, దక్షిణమునకు వృద్ధగౌ♦తమియెసీమ. 33

తే భోగమోక్షసుపైశ్వర్య♦యోగకాంక్ష, భీమసుండలిఁగాపుండఁ ♦ బ్రియముపుట్ట
మర్త్యయోనిజనింపంగ ♦ మదిఁదలంత్రు, వివిధగంధర్వకిన్నర ♦ విబుధవరులు. 3౪

తే. భీమమండలికాపుణ్య ♦ భూమియందుఁ, దేజరిల్లెడు పండ్రెండు ♦ క్షేత్రములకు
జాతరలు సేయు నప్సర♦స్సతులతోడ, నాకమునుండి యేతెంచి ♦ నముచివైరి.

సీ. ఏడురసాతల ♦ క్రోడంబులును విని, ర్భేదించి వెడలిన ♦ పెద్దవేల్పు
మార్తాండుచే నభో♦మణిచేత రవిచేఁ బ్రతిష్ఠఁ బొందిన మహా♦దివ్యమూర్తి
సప్తర్షు లగుదేర ♦ సప్తగోదావరం, బవగాహనము చేసి♦నట్టిప్రోడ
తోలుమామయగుడతు♦నెలదోఁటనడుచక్కి,విహరణంబొనరించు♦వేడ్కకాఁడు

తే. విశ్వపతి భీమనాథేశ్వ♦రేశ్వరుండు, కర్తయై యుండి భోగమో♦క్షములనిచ్చు
భక్తజనులకు నట్టి నై♦భవపదంబు, మండనము మేదినికి భీమ ♦ మండలంబు. 3౬

సీ. ఎచ్చోటఁ దాఁ బాఱె ♦ నిట్రిరూపముఁ దాల్చి, యతిసాధ్వసంబుతో♦నధ్వరంబు
పాటిల్లె నెచ్చోట ♦ భాషావధూటికి, నతిజుగుప్సితమైన ♦ యంగవికృతి
యెచ్చోట ముచ్చిచ్చు ♦ నేడేసినాల్కలు, కొండనాల్కలదాఁకఁ ♦ గోఁతవడియె
నెచ్చోట నలివేఁడి ♦ యెండఁ బండులురాలి, పూషార్కవదనంబు♦బోసివడియె

తే. దక్షుఁ డెచ్చోటఁబొట్టేలి♦తల ధరించెఁ,జిందువందయ్యె నెచ్చోట♦నిందుఁడనుచుఁ
జెప్పుదురు వీరభద్రుని ♦ జృంభణంబు, భీమమండలి నుండు ప్రాఁ ♦ బెద్దమునులు.

వ. నీవు విశ్వేశ్వరదేవవిరచితానమానమన శ్శల్యంబున డస్సి ఖిన్నుండవై యున్నవాఁడవు; నిన్ను విడిచి పోవుట నాకు నుచితంబు గాదు; నీవు నేనునుంగూడి ద్వాదశపుణ్యక్షేత్రయాత్రాప్రసంగమునఁ గుక్కుటేశ్వరదేవు దర్శింపఁగలవార మీవేళ దక్షారామంబునకు మగిడి పోదము లెమ్మని యతండును దానును లోపాముద్రయును శిష్యమండలంబునుం గదలి యిష్టాలాపంబులఁ బొద్దుపుచ్చుచుం జనిచని.

సీ. తుల్యభాగాతటీ ♦ ద్రుమసుండలం బైన, సాంపరాయపురంబు ♦ సరణిఁ బట్టి
చూతాటవీవాటి ♦ శోభమానం బైన, పులుగుర్తిసోమేశు ♦ వలపలించి
యోంకారపురిఁద్రికూ♦టోపరిస్థితులైన, హరిహరబ్రహ్మల ♦ నభినుతించి
శీలామహాగ్రామ ♦ సింహాసనస్థున*, కురగహారున కెదు♦రుండి మ్రొక్కి

తే. యనుగువారు మునుల్ పరా♦శరసుతునకు
దక్షవాటిఁ బ్రవేశింపఁ♦దగినయట్టి

* అశ్లీలము ప్రమాదపతితము. ప్రమాదోధీమతామపి.

శుభముహూర్తంబునకుఁ గాల♦శుద్ధి దెలియఁ
దలఁచి కూర్చుండి రొకవివి♦క్తస్థలమున. ౩౯

వ. అప్పుడు కాలశుద్ధి విమర్శించి మైత్రావరుణుండు పరాశరసుతున కిట్లనియె. ౪౦

తే. గార్గ్యసిద్ధాంతమతముఁ ♦ కాలకలన, శకున మూనుట యది బృహ♦స్పతిమతంబు
విప్రజనవాక్య మరయంగ ♦ విష్ణుమతము, సర్వసిద్ధాంత మభిజిత్తు ♦ సన్నుత మగు.

తే. అసురపురములు సాధించె ♦ నంధకారి, యమరపాథోధి మథియించి♦యమరవరులు
దివ్యసింహాసనం బెక్కె ♦ దివిజభర్త, సిద్ధమధ్యాహ్నవేళాభి ♦ జిత్తునందు. ౪౨

వ. ఇంక నొక్క విచారంబు. ౪౩

తే. నాభిమండలమిచ్చోటు ♦ నడుముగాన, భీమమండలికాపుణ్య ♦ భూమినెల్ల
నిచ్చటనెయుండి వీక్షింత♦మే? మునీంద్ర, యాకసం బెక్కి యోగవి♦ద్యాబలమున.

కం. భద్రగతి నేను లోపా, ముద్రయు నిర్నిద్రయోగ ♦ ముద్రాశక్తిం
రుద్రవిహారాలయము స,ముద్రముతోఁ గూడఁ జూతు ♦ మోమునివర్యా. ౪౫

తే. ఇప్పుడు ఘటికాద్వయం బయ్యె♦ నినుఁడు పొడిచి, దవ్వు చాలదిచ్చోటికి♦ దక్షవాటి
కేవలము మంచినడకైనఁ ♦ గీసవెల్తి, రెండు జాములు నిట నూర♦కుండ నేల. ౪౬

వ. ఈ యోంకారపురపుణ్యక్షేత్రంబునం ద్రికూటదివ్యభవనవాటంబున మునిసంఘంబుండునది; మనము నభోమండలంబున కెగసి ముహూర్తమాత్రంబునఁ గన్నులపండువులుగా భీమమండలిపుణ్యక్షేత్రంబు గనుఁగొంద మనుటయుఁ బారాశర్యుం డు సబహుమానంబుగా సన్నుతించిన. ౪౭

వ్యాసాదు లాకసంబుననుండి భీమమండలంబుఁ గనుఁగొనుట.

స్ర. పరమర్షు ల్భృతరోమహర్షమున లో♦పాముద్రయుం దాను నం
బరమధ్యంబున నావహం బను జగ♦త్ప్రాణప్రవాహంబుపైఁ
బరిలంఘించిరి భుక్తిముక్తిరమణీ ♦ ప్రత్యగ్రలీలాస్పదం
వరసౌధంబగు భీమమండలము స♦ర్వంబుం విలోకింపఁగన్. ౪౮

వ. ఇవ్విధంబున నావహస్కంధగంధవాహప్రవాహమధ్యంబునఁ దపః ప్రభావావష్టంభంబున నిలిచి కుంభసంభవుండు బాదరాయణున కిట్లనియె. ౪౯

సీ. అంధ్రభూభువనమ♦ధ్యము పుండరీకంబు, సప్తగోదావర ♦ జలము తేనె
బ్రహ్మానందవేద్యాది ♦ బహుతీర్థములు రేకు, లకలంకచారుది♦వ్యస్థలములు
నాళంబు లవణాబ్ధి ♦ వేలావిభాగంబు, కళ్యాణభోగమో♦క్షములు తావి
దక్షవాటీమహా♦స్థానంబు కర్ణిక, హంసంబు భీమనా♦యకుఁడు శివుఁడు

తే. గౌతమీసింధుకౌంతేయ ♦ కణ్వనదులు, తుల్యభాగయు నేలేఱు ♦ దుమ్మికోనలు
భువనసంభావ్య మైన యీ ♦ పుణ్యభూమి, యనఘ సంసారతాపశాం ♦ త్యౌషధంబు.

సీ. సర్వంసహాకుఁ గాసె ♦ సమకట్టుపుట్టంబు, గగనంబునకు నెల్లఁ ♦ గలువసెజ్జ
యవటంబు మేఘవా ♦ హనుగంధకరటికి, నభ్యవహారి మా ♦ ర్వాగ్నిశిఖకు
పంటిల్లు యామినీ ♦ శ్వరకళామాళికిఁ, దరిచోటు నిఖిలబృం ♦ దారకులకుఁ
గూటకచ్ఛపనాయ ♦ కునకు నిశాంతంబు, మరుజనకునికిని ♦ మనికిపట్టు

తే. ఘనతరోద్దండపాఠీన ♦ కమఠనక్ర, తిమితిమింగిలచక్రవి ♦ క్రమవిహార
ఘుమఘుమారంభ గంభీర ♦ ఘోషఘటిత, లటదిశా ప్రతిశబ్దోప ♦ లబ్ధి యబ్ధి. ౫౧

సీ. జనమేజయారబ్ధ ♦ సర్పాధ్వరాహూత, చతురశ్రవస్సహా ♦ స్రములఁ బోలి
బ్రహ్మాండమండల ♦ ప్రాసాదసంభార, హరిమణిస్తంభసం ♦ హతుల నంగ
జంభారిదోస్తంభ ♦ దంభోళిఖండితాం, జనశైలశిఖరపుం ♦ జములఁ బెనఁగి
సంహారసమయఝం ♦ ఝామారుతోద్ధూత, కాలాంబువాహసం ♦ ఘములఁ గెలిచి

తే. యాడుచున్నవి తింత్రిల్లి ♦ యంబరమునఁ, జేయుచున్నవి త్రిభువనా ♦ శ్లేషకంబు
నబ్జనాభుని తూఁగుటు ♦ య్యాలలుగంటె, వేనవేలు పయోరాశి ♦ వీచిఘటలు. ౫౨

శా. కాళిం జచ్చిన యంతఁ గాని పడయం ♦ గారాని కైవల్య మ
క్లేశం బౌనటు వేద్యనాయకునిచే ♦ లీలాగతిం జేరు రా
రో శీఘ్రంబున మర్త్యులార యను నా ♦ హ్వానంబునన్ మ్రోయు నా
కాశాస్ఫాలనగౌతమీజలధిసం ♦ గస్థానకల్లోలముల్. ౫౩

మ. అదె సంవేద్యము; కోటిపల్లి యదె; ద ♦ క్షారామమున్ పట్టనం
బదె; యభ్రంకషసౌధకూటఘనహే ♦ లావాస ముచ్ఛ్రాయసం
పద సొంపారెడు భీమలింగము మహా ♦ ప్రాసాదభూమీధరం
బిదె; సప్తర్షినదీప్రవాహ మిదె; సం ♦ వీక్షింపు మేకాగ్రతన్. ౫౪

సీ. అదె పట్టిసస్థాన ♦ మందుండు వీరభ, ద్రేశ్వరస్వామి య ♦ ర్ధేందుమౌళి
యదె పుండరీకాద్రి ♦ యచట మార్కండేయు, నిలువేల్పు ముక్కంటి ♦ నెలసెఁ దొల్లి
యదె కుమారారామ ♦ మాహార్యరేఖయ, చాళుక్యభీమేశు ♦ సదనవాటి
యదె కుక్కుటేశ్వరం ♦ బయ్యుపాంతము మేడ, హుంకారిణీదేవి ♦ యోలగంబు

తే. వాఁడె మాయింటివేల్పు ప ♦ ల్వలపురమున
నుండులింగంబు ఫణిరాజ ♦ కుండలుండు
సప్తమునిసింధుసంగమే ♦ శ్వరుఁడు వాఁడె
కుండలాముఖ మదె మాని ♦ కులవరేణ్య. ౫౫

కం. అని చూపి చెప్పి కుంభజుఁ, డినుఁ గనుఁగొని శుభముహూర్త♦మిదె యే తెంచెఁ
జనము దిగవలయు ననుచును, మునిమండలి ప్రోల దిగిరి ♦ ముగురుం దరకున్.

వ. అనంతరంబ కుంభపులినసంభవులు సంబవులు దొడిగికొని కదలి, కదళికా రామం
బుల రామణీయకంబును, నుల్లసిత బిల్వచిరిబిల్వవిటపంబుల పొల్పును, ద్రాక్షా
ద్రాక్షఖర్జూర కేసరసరళపున్నాగనారంగంబులరంగంబును, లవంగలుంగలవలీమ
ల్లీవల్లీమతల్లి వేల్లనంబులయుల్లాసంబును, ఘోంటాకురంటక ఝుంటికాకంటక
ఫలకపిత్థ లోధ్రజంబూజంబీరపారిభద్రభద్రదారుశాల్మలీగుల్మ లీలాహేవాకంబు
నుద్రేకంబును, గోమలతరతమాలమాలాకారశాకోట విటపిషండంబుల మెండును,
జలకుముదకంబును, భ్రాసంగుమిసిమియుఁ, జెంగల్వతావితేవయుఁ, గుసుమ
వాటియెసకంబును, నుభయపార్శ్వంబులం గల ఘంటామార్గంబునుగా నెడనెడఁ
గుసుము భారారంభ సంభారకుసుమగుచ్ఛచ్ఛాయావిభాసితసంధ్యారాగసరభసం
బును, గందిమందంబును, బెసరసిరియును, మినుమునలువును, గోధూమ శ్యామా
కవరగయును, మాషతోరసమున్మేషంబును, నేసియేపును, ననంతినన కేతనంబును,
నువ్వమన్వంబును, గుళుత్థశుద్ధార్ధమానవృద్ధియుఁ, బ్రత్తిసంపత్తియు, బొబ్బర
యుబ్బరంబును, నందసంవర్ధంబును, యవయావనాళ ప్రియంగుగుళుజతిలపరి
స్ఫూర్తియు, దవ్వొందలసందడియు, గంటెకొఱ్ఱతఱచును, గసగసలివయును,
జెంగలించు జాంగలిక్షేత్రంబున నేత్రంబులకు నింపుసొంపుసంపాదింప ననం
తాంతరాంతరంబులు, తరతరంబు తరళ తరతరంగరించోళికాంచలంబులం జెం
గులం దువాళించుచు నతిశిశిరసలిలశీకరనికర నిరతకరణపరిణతింగొల్పి పోఁక మోఁ
కల పూవుఁబాలల నెత్తావికిం దావలంబులై కేవలంబుపోలయు సప్తగోదావర
సమీరణంబులు నాసికా పుటకుటీరంబులకుఁ గుటుంబకంబుగా మందమందగ
మనంబున నహిమకరబింబం బంబరవీథీసౌధకూటంబున హాటకకలశభంగినంగీ
కరించుకొలఁది నభిజిద్వేళ వేలావనోపకంఠకంఠాలంకారహారధామంబైన దక్షా
రామంబుఁ బ్రవేశించి రంత. ౫౮

వ్యాసాదులు దక్షారామంబుఁ బ్రవేశించుట.

కం. ఇటు కృష్ణద్వైపాయన, ఘటజన్ములు భీమనాయ♦కస్వామిమహా
కటకము ముక్తివధూటీ, కటకాభరణంబుఁ జొచ్చి ♦ కడు వేడుకతోన్. ౫౯

తే. కర్ణికారాంబికామహా♦కాళిగుడికి, నంతముగ నూలుపట్టిన ♦ యట్టిచాయ
సూర్యవీథికిఁ జనిరిసం ♦ శుద్ధమతులఁ, బశ్చిమద్వారమునకునై ♦ పరమమునులు.

వ. అప్పుడు ఘటోద్భవుం డస్మహాస్థానంబు సత్యవతీసూనునకుఁ జూపి వెండియు
నిట్లనియె. ౬౦

సీ. లీలావిలాసలా♦లితలోకహర్షంబు, గోమేధికాక్లృప్త♦గోపురంబు
గోపురస్థితశాత♦కుంభకుంభశతంబు, దివ్యరత్నవిబద్ధ♦దేవగృహము
దేవగేహాకీర్ణ♦దివిజాప్సరశ్శ్రేణి, యఖిలవస్తుప్రపూ♦ర్ణాపణంబు
వివిధాపణస్వర్ణ♦వేదికాధ్యాసిత, యక్షగంధర్వవి♦ద్యాధరంబు
తే. శంఖభేరీమృదంగని♦స్సాణపటహ, ఝల్లరీవేణువీణాది♦శబ్దనినద
కలకలోద్వేజితాశేష♦కల్మషంబు, నయనభాగ్యంబు దక్షిణా♦నందవనము. ౬౧

సీ. ఘల్లుఘల్లనిరత్న♦కంకణంబులు మ్రోయ, గంధవాహునిమూలు♦ కసవునూడ్చు
లక్ష్మి కెంగేలిలీ♦లారవిందమ్మునఁ, గలయంపిచిలికించుఁ♦ గన్నుఁదేనెఁ
దామ్రపర్ణియుఁ దాను♦ తారకాపథగంగ, నలిముత్యములరంగ♦వల్లిఁదీర్చు
నధివాసమును జేయు♦యముని శుద్ధాంతంబు, ధూపార్తిమహిసాక్షి♦ ధూపఘుటిక
తే. సప్తపాతాళనాగేంద్ర♦చంద్రముఖులు, ఫణామణిజ్యోత్స్నదివియగం♦బములగుదురు
సోమసుకుటుని గారాబు♦జోటియైన, దక్షవాటికిఁ బ్రతిసుహో♦త్సవమునందు.

మ. ధనకోటీవినిబద్ధకేతనశత♦ద్రాఘిష్ఠ వైశ్యాలయం
బను వేలధ్వనితార్క్ష్యదానవిధిఘం♦టారావవేశ్యాగృహం
బనిమేషాక్షినిరీక్షితేశ్వరసుహే♦ద్యక్షోణి బృందారకం
బనుసంధ్యాగతలోకపాలకము ద♦క్షారామ మభ్యున్నతిన్. ౬౩

తే. మొగులుముట్టిన సురసస్య♦మూర్ధవీథిఁ, గోటిపడగలఁ బొలుపారుఁ♦ గూటకోటి
పట్టనమ్ము నిజాంగుళీ♦ పల్లవముల, నెట్టుకొని పాపములఁ బాయఁ♦ దట్టుకరణి. ౬౪

సీ. ఎచ్చోటక్షేత్రంబు♦ లేఁకారుజనుల కిచ్ఛామాత్రభోగమో♦క్షప్రదములు
కీర్తింతురెద్దాని♦ కీర్తి గంధర్వులు, గాంధర్వమున యక్ష♦గానసరణి
జంకించు నెద్దాని♦ శబలసౌధోపరి, ధ్వజపటంబులు దేవ♦తాగృహముల
వసియింతురెద్దాన♦ వాలఖిల్యాదులు, తపసులష్టాశీతి♦ దశశతములు
తే. నెద్దియమరేంద్రపురలక్ష్మి♦కింతపెద్ద, యట్టిశ్రీదక్షవాటీమ♦హాపురంబు
నద్భుతంబందిచూచిరి♦ యాదిమునులు, సత్యవతినందనుఁడు గుంభ♦సంభవుండు. 6

సీ. దక్షాధ్వరానల♦త్రయతీర్థమొక్కటి, యోగాగ్ని నెందేని♦ నురిసెగౌరి
యఖిలేష్టసంసిద్ధి♦యందు రెండవతీర్థ, మెందేని మును గాంచె♦ నిష్టసిద్ధి
సోమేశ్వరం బంద్రు♦సొరిది మూఁడవతీర్థ, మెందేని నఘము లి♦ట్టింకులింకు
హైమవతం బందు♦ రదినాలుగవతీర్థ, మెందేని హిమవంతుఁ♦ డొందెవరము
తే. సప్తగోదావరంబు పం♦చమసుతీర్థ, మఖిల శుభములు నెందేని♦ నావహిల్లుఁ
బంచతీర్థంబులివియాడి♦పంచజనుఁడు, పాయుఁబంచేంద్రియోద్భవ♦పాతకములు. 6

గీ. శిష్టమునిలోక విబుధాభి♦సేవ్యమైన, యిమ్మహాతీర్థము శక్తి♦ నేమి చెప్ప
వానికైఁ బొటివెడలేడు♦ నాయువేనిఁ, జీమకైనను గైవల్య♦ సీమనొసఁగు. ౬౭

వ. అని దక్షారామ మాహాత్మ్యంబు వర్ణించుచుఁ బ్రదక్షిణక్రమంబున భీమేశ్వరుదివ్య మందిరంబు వలపలించి సప్తగోదావరంబునకు డిగ్గి కృతస్నానులై రప్పుడు సాత్యవతేయుండు కుంభసంభవున కిట్లనియె. ౬౮

తే. ద్వాదశక్షేత్రశివలింగ♦దర్శనంబు, మొదలఁ జేయంగవలయుట♦ ముఖ్యపక్ష
మానతీఁదగు నాకు నీ♦ వాముపూర్వి, శంబులింగంబు లవియెవ్వి♦ కుంభజన్మ.

కం. ఇటమున్న దక్షవాటిఁ, కటకంబునయందుఁ బెద్ద♦కాలంబునసిం
చుటఁ దీర్థంబులు నీకుఁ, ఘటసంభవ యాడినవియె♦ కానె తలంపన్. ౭౦

వ. అనిన విని యగస్త్యుండు సాత్యవతేయున కిట్లనియె. ౭౧

తే. పూర్వజన్మకృతంబైన♦ పుణ్యరాశి, పాకదశఁ బొందు నెప్పుడే♦ప్పాటఁగాని
సకలసంసారదురితని♦స్తారమైన, శివకథాగోష్ఠి చెవులకుఁ♦ జెలువుగాదు. ౭౨

వ. అని పలికి సత్యవతీసూనునకుఁ గుమారవక్త్రంబునఁ దాను విన్నప్రకారంబున మైత్రావరుణుండు ద్వాదశతీర్థమాహాత్మ్యంబు నిట్లని చెప్పందొడంగె. ౭౩

సీ. ఇంద్రేశతీర్థంబు♦ ఋషిసమాకీర్ణంబు, సిద్ధేశ్వరము సర్వ♦సిద్ధికరము
యోగీశతీర్థంబు♦ యోగలక్ష్మీదాయి, కాలేశ్వరము భక్త♦కల్పతరువు
శమనేశతీర్థంబు♦ శాంతిదాంతివిధాయి, వీరభద్రేశంబు♦ విశ్వనుతము
బ్రహ్మేశతీర్థంబు♦ బ్రహ్మర్షి సేవ్యము, పైశ్వర్యదము కపా♦లేశ్వరంబు

తే. కుక్కుటేశంబు కాశికిఁ♦ గొంతవెలితి, సోమనాథేశ్వరము ముక్తి♦సూచకంబు
శ్రీమహేశ్వరుతీర్థంబు♦శివునిమెచ్చు, త్రిభువనాభ్యర్చితము రామ♦తీర్థమనఘ. ౭౪

కం. గూఢములు నిగూఢంబులు, గూఢాగూఢములు నగుచుఁ♦ గోటుల సంఖ్యల్
గాఢమహేశ్వరభక్తిని, గూఢిం దీర్థములు గలవు♦ గుహునివాటిన్. ౭౫

తే. గరుడగంధర్వయక్షకి♦న్నరులచేత, దివిజఖేచరదైత్యదా♦నవులచేత
ద్వాదశక్షేత్ర తీర్థమ♦ధ్యంబునందు, భక్తి శివలింగకోటి ని♦ల్పంగఁబడియె. ౭౬

కం. ద్వాదశతీర్థకపరివే, షోదరమున భీమనాథుఁ♦ డుజ్జ్వల తేజః
ప్రాదుర్భావుం డొప్పగు, నాదిత్యుఁడు పరిధినడుమ♦ నమరెడుభంగిన్. ౭౭

తే. ద్వాదశక్షేత్రవికచప♦త్రములతోడి, దక్షవాటిక యనెడి కెం♦దమ్మివిరికి
సప్తగోదావరంబుని♦ర్ఝరము తేనె, నడుమ గాయంచ శ్రీభీమ♦నాయకుండు. ౭౮

తే. భైమమీశానలింగం బ♦పారతేజ, మక్షయం బప్రధృష్యం బ♦నాదినిధన
మమ్మహాజ్యోతిరత్నదీ♦పాంకురంబు, కనకగర్భాండభవనవి♦ష్కంభమునకు. ౭౯

చం. అమృతపయోనిధానమున ♦ యందుదయించెఁ గళాసమృద్ధిఁ ద
న్నమరసుధాకరుండు నిజ ♦ మారఁగఁ జూచిన దక్షవాటికా
రమణుఁడు భీమనాయకుఁడు ♦ రాజశిఖాభరణుండు గానినాఁ
డమరమునీంద్రసంఘముక ♦ రాంబుజముల్ మొగుడంగ నేర్చునే. ౮౦

తే. విమలపాథోధిఁ బుట్టిన ♦ యమృతమూర్తి, భీమనాథుఁడుమా స్వామి ♦ కేమిచోద్య
మహరహంబును బాదసే ♦ వానురక్త, భక్తజనలోకభవరోగ ♦ భంజనంబు. ౮౧

తే. భీమనాథునిఁ ద్రిభువన ♦ స్వామినాథుఁ, బార్వతీనాథు శశ్వత్కృ ♦ పాసనాథు
దక్షవాటాధినాథు వే ♦ దత్రయైక, నాథునానాథుఁగొలుతు శ్రీ ♦ నాథునాథు. ౮౨

సీ. భవు భవానీభర్త ♦ భావసంభవవైరి, భవరోగభంజను ♦ భాలనయను
భోగప్రదుని భోగి ♦ భోగిరాజవిభూషు, భూనభోభివ్యాప్తు ♦ భువనవంద్యు
భగవంతు భర్గుని ♦ భసితాంగరాగుని, భానుకోటిప్రభా ♦ భాసమాను
భాగీరథీమౌళి ♦ భగనేత్రవిపాటను, భూరథాంగుని భద్ర ♦ భూతిధరుని

తే. భామినీసువిలాసార్ధ ♦ వామభాగు, భక్తితోడభజింపరో ♦ భవ్యమతులు
భావనాభాజులకతండు ♦ ఫలములొసఁగు, భాగ్యసౌభాగ్యవైభవ ♦ ప్రాభవములు.

కం. తేజితవిష్ణుశిలీముఖుఁ, దేజఃప్రదు దక్షవాటి తీర్థైకమహా
రాజాధిరాజరాజును, రాజకళాధరు భజింప ♦ రారో విబుధుల్. ౮౪

కం. రారో ప్రియశుద్ధాంతవ, రారోహాసహులు విబుధు ♦ లంబుజహంస
క్షీరామలదేహుని ద, క్షారామపురీనివాసు ♦ నభవునిఁ గొలువన్. ౮౫

ఉ. నందివినాయకాదిగణ ♦ నాథులు గూడి ధృతాస్త్రశస్త్రులై
యెందఱు పాలెముందురు మ ♦ హీధరకన్యకు సావధానులై
నందివినాయకాది గణ ♦ నాథులు గూడి ధృతాస్త్రశస్త్రులై
యందఱు పాలెముందురు మ ♦ హాప్రభువీటికి దక్షవాటికిన్. ౮౬

సీ. భానుమండలములు ♦ పండ్రెండునుదయించి, కరపాళిబిట్టెండ ♦ గాయకుండ
సంరంభమున నేడు ♦ ఝంఝానిలంబులు, వెగ్గలం బగు మ్రోఁత ♦ విసరకుండఁ
బుష్కలావర్తకం ♦ బులు లోనుగాఁగల, క్రొమ్మేఘములు వృష్టి ♦ గురియకుండఁ
బరపి లంఘించి స ♦ ప్తమహార్ణవంబులు, విన్నందిపెనువెల్లి ♦ విరియకుండ

తే. నాజ్ఞవెట్టించుఁ బ్రమథనా ♦ యకులచేత, విశ్వపతి యైన భీమేశ్వ ♦ రేశ్వరుండు
దక్షవాటికి నాత్మశు ♦ ద్ధాంతమునకు, నవహితస్వాంతుఁ డగుచుఁ గా ♦ లాంతవేళ.

తే. భైరవుం డర్ధరాత్రంబు ♦ ప్రహరిఁ దిరుగుఁ
బాయకుండును నడురేయి ♦ బ్రమథగణము

గవనికాపులవారుఁ ది♦క్పాలవరులు
దక్షవాటికి భీమేశు♦ధామమునకు. ౮౮

వ. అని ప్రసంగించి శివలింగార్చనాపరాయణుండైన మైత్రావరుణుండు త్రిలింగవి
షయ మంగళాలంకారంబగు భీమేశ్వరమండలంబునఁ బండ్రెండుశివలింగస్థానం
బులు వివరించువాఁడై యిట్లనియె. ౮౯

తే. ఉత్సవం బుత్సవము దప్ప♦కుండ సురలు, వత్తు రౌత్సుక్యమున దక్ష♦వాటమునకు
శాంభవీశక్తి సర్వవే♦షంబు దాల్చి, భీమలింగంబుఁ ద్రిభువన♦స్వామిఁ గొలువ.

కం. తాండవమాడుఁ గుమారిశి,ఖండి మహోత్సవము వేళ ♦ గంభీరములై
డిండిమనిర్ఘోషంబులు, పండువుపండువున నుఱుము ♦ భంగి వహింపన్. ౯౦

తే. మర్త్యభామలు విబుధ♦భామలును గలసి
యుత్సవములందు వర్తించుచున్న♦యపుడు
దక్షవాటంబు వీట భే♦దంబు దెలియ
దృఙ్నిమేషానిమేషప్ర ♦ దీప్తివలన. ౯౧

శా. అర్కేందూపలరత్ననిర్మితమహా ♦ హర్మ్యాగ్రభాగంబులం
దార్కాల్ తారక మండలంబుగని ము♦గ్ధస్త్రీలు రేలప్పురిం
గర్కంధూఫలసన్నిభంబయిన ము♦క్తాజాలముల్ చింతచేఁ
దర్కింపం దిలకించి నవ్వుదురు గం♦ధర్వాంగనాపల్లవుల్. ౯౩

తే. దక్షమునిరాజు నంతరు ♦ ద్యానవనము, దక్షవాటంబు శివుని యు♦త్తమపురంబు
బహుళకైవల్యఫలధర్మ♦పాదపంబు, దీనిఁ గాతురు చుట్టును ♦ దిరిగి సురలు. ౯౪

తే. గౌరి యొక్కతె యాకాశ♦గంగ యొక్కతె
కాశి యొక్కతె దక్షిణ♦కాశి యొక్కతె
నలుగురును శంభునకు లోక♦నాయకునకు
రాణివాసంబు లనురాగ ♦ రసము పేర్మి. ౯౫

వ. ఒక్క సమయమ్మున దక్షారామమున కేతెంచి భీమమండలంబునందు. ౯౬

కం. శోభనముహూర్తమున భుజ, గాభరణుఁ బ్రతిష్ఠ చేసి ♦ యర్చించి మహా
వైభవమొనర్చి పొందెను, నోభిసుతము విబుధనాథుఁ ♦ డధికస్ఫురణన్. ౯౭

తే. దేవతాభర్త శంభుప్ర♦తిష్ఠ చేసి, సురగణంబుల లోకపా♦లురను జూచి
యనియె మీరును భీమనా♦యకుని వీట, సిద్ధశివలింగములఁ బ్రతి♦ష్ఠింపవలయు.

—ఇంద్రుఁడు దేవతలకు శివలింగమాహాత్మ్యంబుఁ జెప్పుట.—

సీ. శ్రీకంఠగుని బ్రతి♦ష్ఠించు నెవ్వఁడు వాఁడు, పాపియైనను శంభు♦పదముఁ గాంచు
శివలింగపదయాత్ర ♦ శివలింగసంవీక్ష, శివలింగసంస్పృష్టి ♦ శివసమర్చ

నాకలోకాధి రా♦జ్యైకకారణములొ, నయమార సాధార♦ణస్థలములఁ
గళ్యాణభోగమో♦క్షనివాసమైనయిూ, దక్షవాటీపుర ♦ స్థానభూమిఁ
తే. జెప్పనేటికి సకలసం♦సిద్ధిఁ గోరి, దక్షిణాంభోనిధానంబు ♦ తటమునందు
సంప్రతిష్ఠింపుఁ డీశానుఁ ♦ జంద్రమౌళి, విశ్వలోకాధినాథు నో♦విబుధులార. ౯౯

కం. సిద్ధించు మీ కభీష్టము, సిద్ధ మిది యమర్త్యులార ♦ శీఘ్రమున జటా
సిద్ధశశి మహోపనిష, త్సిద్ధాంతరహస్యమును బ్ర♦తిష్ఠింపుఁ డిఁకన్. ౧౦౦

తే. దర్శనముకంటె మేలు సం♦స్పర్శనంబు, సంస్పృశించుటకంటెన♦ర్చనము లెస్స
యర్చనము సేయుకంటెను ♦ నంతఫలద, మసితగళుని బ్రతిష్ఠించు♦టమరులార. ౧౦౧

సీ. సకలలోకప్రపం♦చమును లింగమయంబు, త్రిజగంబు లింగప్ర♦తిష్ఠితంబు
సంభవస్థితిలయ♦స్థానంబు లింగంబు, లీనార్థగమకంబు ♦ లింగ మనఁగ
లింగప్రసాదంబు ♦ లేక సిద్ధింపవు, భోగమోక్షంబు లే♦ యోగములును
లింగాజ్ఞ వెలిగాఁగ ♦ లేశమాత్రంబును, సంచలింపదు పో తృ♦ణాంచలంబు
తే. మంటినైనను లింగంబు♦ మలిచి కొలుఁడు, ఇసుకనైనను లింగంబు♦ నేర్చి కొలుఁడు
పేఁడనైనను లింగంబుఁ ♦ బెట్టి కొలుఁడు, నీటనైనను లింగంబు♦ నిలిపి కొలుఁడు. ౧౦౨

వ. అని యుపన్యసించి యింద్రుండు తానును లోకపాలకులును దివిజులునుం దమ
తమ పేర శివలింగంబులఁ బ్రతిష్ఠించిరి. ౧౦౩

మ. హిమధామార్ధజటాకిరీటుఁ డభవుం♦డిం ద్రేశ్వరుం డింద్రుచే
నమరవ్రాతముచేతఁ గూడఁగఁ బ్రతి♦ష్ఠాంతంబునం భక్తిసం
భ్రమతాత్పర్యసమగ్రుచేఁ గయికొనెన్ ♦ బాథోధివధ్వాపగా
విమలస్వర్ణసరోజపూజ హృదయా♦విర్భూతసంతుష్టుఁడై. ౧౦౪

ఉ. ఆగమమంత్రతంత్రములు ♦ సాంగములై నడుమంగ సర్వవి
ద్యాగురుఁడైన ప్రెగ్గడ బృ♦హస్పతి సోడుగ వీతిహోత్రది
గ్భాగమునం బురందరుఁడు ♦ భక్తిఘటించిన వాసవేశ్వరున్
భోగివిభూషణుం గొలుచు ♦ పుణ్యుల కబ్బును భోగమోక్షముల్. ౧౦౫

తే. ఇంద్రుఁ డేఁటేఁట జాతర♦ కేగుదెంచి, సప్తగోదావరమున సు♦స్నాతుఁ డగుచు
భుజగభూషణు నింద్రేశుఁ♦ బూజసేయు, ధవళమందారతరుపుష్ప♦దామములను.

కం. ఇంద్రప్రతిష్ఠితుం డగు, నింద్రేశ్వరుఁ గొలువ నెవ్వఁ ♦ డేకాగ్రతమై
గుంద్రమతి సప్తసింధువు,నం ద్రిషవణమాడునతఁడు ♦ నాకం బెక్కున్. ౧౦౬

కం. సకృదాలోకనమున నుతి, సకృదర్చన సకృదుపాస ♦ సకృద్దానతులన్
సకృదాలయప్రదక్షిణ, సకృజ్జపంబుల మహేంద్ర♦శంభుఁడు మెచ్చున్. ౧౦౭

తే. ఇంద్రపదభోగ మెవ్వఁడే♦నభిలషించు, నాతఁ డింద్రేశ్వరేశ్వరు♦నాలయమునఁ
బ్రణవపంచాక్షరీమంత్ర♦పాఠనియతి, నమ్మహాఫల మొందుఁ ద♦త్త్వార్థ మిదియు. ౧౦౯

తే. స్నానదానాగ్నిహోత్రదీ♦క్షావిధాన, మంత్రవాదములెనక♦ర్తంబులొకటి
కోటిగుణితంబు శ్రీదక్ష♦వాటియందు, సప్తగోదావరేంద్రేశ♦ సవిధభూమి. ౧౧౦

వ. అటమీఁద సిద్ధేశ్వరస్థానంబు సిద్ధలింగాధిష్ఠితంబు ధర్మార్థకామమోక్షపురుషార్థ సంసిద్ధికై యాసిద్ధలింగంబు సిద్ధులచేతఁ బ్రతిష్ఠింపంబడి సిద్ధసాధ్యగంధర్వ గీర్వాణ విద్యాధరారాధ్యంబై యుండు నా స్థానంబు దక్షయజ్ఞప్రాగ్వంశక్షేత్రంబు. ౧౧౧

కం. జపహోమదానయజ్ఞము, లుపవాసాదివ్రతంబు♦ లొక్కొక్కటి కో
టిపరిమితంబులు సిద్ధే, శపదంబున సాధకులకు♦ సత్యం బరయన్. ౧౧౨

వ. మఱి యోగీశ్వరంబను స్థానంబునందు యోగీశ్వరేశ్వరుండు సనకసనందనాది యోగీశ్వరులచేతఁ బ్రతిష్ఠితుండని చెప్పంబడును. ౧౧౩

గీ. అది భవాబ్ధితరణి♦ యదిసాధకత్రాత, కల్పవృక్ష మది జ♦గత్ప్రసిద్ధ
మది యుపాసకులకు♦ నణిమాదికైశ్వర్య, లాభమునకుఁ గరత♦లంబుపసిఁడి. ౧౧౪

సీ. మంకణుం డను మహా♦మౌనియోగీశ్వర, శ్రీమహాదేవుని♦ శివు భజించి
బ్రహ్మసాక్షాత్కార♦ పర్యంతమైనప్ర,బోధసంపదముక్తి♦ పొలముగాంచె
నాకమాఱు సప్తసిం♦ధూదకంబులఁ గ్రుంకి, నరుఁడు యోగీశ్వరే♦శ్వరునిగాంచ
నణిమాదికాష్టసి♦ద్ధైశ్వర్యసంసిద్ధిఁ, బొందు యోగీశుద♦ర్శనమధరుని
తే. సప్తగోదావరమునీట♦ జలకమార్చి, పుష్పగంధాక్షతంబులఁ♦ బూజచేసి
కలిభవంబైన కలుషంబుఁ♦గ్రాఁచిపుచ్చి,మర్త్యుఁడొందును వేగం బ♦మర్త్యపదవి. 115

వ. మఱియు యమేశ్వరలింగంబు యమప్రతిష్ఠితంబు సకృద్దర్శనమాత్రంబున మర్త్యుండు యమభయంబునం బాయు వెండియు. ౧౧౬

సీ. యజ్ఞతటాకంబు♦నందుఁ గ్రుంకులు వెట్టి, బ్రహ్మర్షిపితృశ్రే♦ష్ఠుఁ బ్రస్తరించి
యమలింగసన్నిధి♦ నష్టోత్తరసహస్ర, సంఖ్య మృత్యుంజయు♦ జపముఁ జేసి
జపవిధానమునందు♦ నరవిమృత్యుంజయు, నపమృత్యుభయశాంతి♦ నర్థి నడుగ
నపమృత్యుదేవతా♦ హంకారభవమైన, సంత్రాస మొందఁడు♦ సాధకుండు
తే. శ్రాద్ధపిండోదకాదివి♦శ్రాణనముల, శ్రీయమేశ్వరతీర్థానఁ♦ జేసి మనుజుఁ
డుద్ధరించును నరకకూ♦పోదరముల, బెగ్గడిలు నేడుతరముల♦ పితృగణముల. ౧౧౭

కం శ్రీకాళేశ్వరుసన్నిధి, నేకాంతము జపముద్రేల్మి♦ యాగియు శ్రాద్ధం
బేకైకము కోటిగుణం, బై కలిగించును సమగ్ర♦మైనఫలంబుల్. ౧౧౮ ✓

తే. వీరభద్రాదిదేవతా ♦ వీరగణము, శంభులింగంబు నిలిపెఁ బ్ర♦శస్తవేళ
దక్షవాటీఁదదాఖ్యసం♦స్థాపనమున, వీరభద్రేశుఁడయ్యెన ♦ వేల్పుఱేఁడు. ౧౧౯

కం. శ్రీవీరభద్రలింగము, సేవించిన మానవుండు ♦ చిరకాలమునం
గేవలగాణాపత్యము, హావిభవము నొందు శివుని ♦ యాస్థానమునన్. ౧౨౦

తే. వీరభద్రేశదేవతా ♦ విభునియాజ్ఞఁ, గలుగుధర్మార్థకామమో♦క్షములుజనుల
కక్షయంబైన దక్షవా♦టాభిధాన, భోగమోక్షరమాజన్మ ♦ భూమియందు. ౧౨౧

తే. అగ్నిహోత్రంబు దాన మ♦ధ్యయనజపము, లాదియగునిత్యనైమిత్తి♦కాదివిధులు
బహుఫలంబుల నొసఁగు స♦ద్భక్తియుక్తి, దక్షవాటికవీరభ♦ద్రస్థలమున. ౧౨౨

ఉ. యాగతటాకతీర్థమున♦యందును సంబుధసార్వభౌమది
గ్భాగవిభూషణం బయిన ♦ పద్దినియందును దీర్థమాడి ని
ష్ఠాగరిమంబునం ద్రిపుర♦శాసను దక్షపురోపకంఠభా
త్రీగృహమేధిఁ గొల్వఁడు ప్ర♦తిష్ఠితభర్గుని వీరభద్రునిన్. ౧౨౩

వ. తొల్లి బ్రహ్మాదు లగు దేవతలు సురేంద్రవిహితవిభవుండైన భీమనాథేశ్వరు దర్శించు వేడుకంజేసి బ్రహ్మలోకంబుననుండి భోగమోక్షక్షేత్రంబైన దక్షారామంబునకు వచ్చి సప్తగోదావరంబునఁ బంచతీర్థంబులాడి పంద్రెండు దివ్యలింగస్థానంబులు దర్శించి యమృతమయస్వయంభూజ్యోతిర్లింగమూర్తి నిఖిలదేవతాచక్రవర్తి యగు భీమేశ్వరేశ్వరు దర్శించి పరమానందకందళితస్వాంతులై యిట్లనిరి. ౧౨౪

బ్రహ్మాదులు భీమేశ్వరు వర్ణించుట.

శా. ఆహా! యింతమనోహరంబగునె ద♦క్షారామ ముర్వీటిలో
నీహారాంశుకళాకిరీటుండు భవా♦నీభర్త దివ్యాప్సరో
వ్యూహంబుల్ ప్రతిసంధ్యముం గొలువఁగా ♦ నున్నాఁడు గోదావరీ
వాహిన్యబ్ధిసమీరపానకలనా ♦ వర్ధిష్ణుకేయూరుఁడై. ౧౨౫

కం. ముంగిటను సప్తసింధువు, చెంగటఁ గ్రతుసరసి నడుమ ♦ శ్రీభీమమహా
లింగము దక్షారామము, సంగతి నెన్నంగఁ బురము ♦ జగతిం గలదే. ౧౨౬

తే. శివశివా యెంత భాగ్యంబు ♦ చేసినారొ, దక్షవాటీపురీమహా♦స్థానజనులు
కన్నులారంగ వీక్షించు♦చున్నవారు, భీమనాథేశ్వరేశ్వర ♦ స్వామిమూర్తి. ౧౨౭

చం. అహహా! దయారసానుగత♦మైన మనంబున దక్షవాటికా
గృహపతి భీమనాయకుఁడు ♦ కీటపతంగసరీసృపాళికిన్
సహజగళత్సమీరముగు ♦ సంకటకాలము వీనులం దను
గ్రహమొనరించునట్టి మధు♦రంబగు తారకమంత్రరాజమున్. ౧౨౮

సీ. భీమనాథేశ్వర ♦ శ్రీమన్మహాలింగ, భాస్వత్పరబ్రహ్మ ♦ భవనమునకుఁ
కల్పాంతసమయభీ ♦ కరసాగరాద్ధత్య, భీతత్రిలోకమ ♦ హాతరికిని
ద్వాదశక్షేత్రతీ ♦ ర్థపలాశమండల, వ్యాకోచనవపుండ ♦ రీకమునకు
జంబూతరుద్వీప ♦ సర్వసర్వంసహా, పాటీరలేపనై ♦ పథ్యమునకు
గీ. శివకళత్రమునకు శివ ♦ క్షేత్రమునకు, శివునిమూర్తికి శ్రీసదా ♦ శివునికీర్తి
కితరతీర్థంబు సరిపోల్ప ♦ నెట్లువచ్చు, దక్షవాటంబునకు మహా ♦ స్థానమునకు. ౧౨౯

కం. మంకణమహామునీశ్వర, సంకల్పవితీర్ణకల్ప ♦ శాఖికి భువనా
లంకృతికి దక్షవాటికి, శంకరనటనటననాట్య ♦ శాలకు జేజే. ౧౩౦

కం. కాశీప్రతిబింబమునకుఁ, గాశీప్రతినిధికిఁ గాశి ♦ కాప్రకృతికినిం
గాశీప్రతిమకు దక్షిణ, కాశికి శ్రీదక్షవాటి ♦ కటకంబునకున్. ౧౩౧

కం. మోక్షస్థానంబునకుం, దక్షారామమున కమృత ♦ ధామంబునకుం
దక్షాధ్వరక్రియోచిత, దీక్షాక్షేత్రమున కభవు ♦ దేవికి జేజే. ౧౩౨

వ. అని నమస్కరించి శతానందుండు. ౧౩౩

మ. శివలింగంబుఁ బ్రతిష్ఠచేసి కణఁకన్ ♦ శ్రీసప్తగోదావరాం
బువులం జేసెను మంత్రపూర్వకముగాఁ ♦ బుణ్యాభిషేకంబు నై
భవముల్ పెక్కువిధంబులం జరపె శ్రీ ♦ బ్రహ్మేశ్వరుం డంబుజో
ద్భవవంద్యుం డది యాదిగాఁ గరుణమైఁ ♦ బాలించు భక్తావళిన్. ౧౩౪

వ. అంత దేవసిద్ధసాధ్యవిద్యాధరగంధర్వోరగాదులును దమతమ నామధేయంబుల లింగంబులఁ బ్రతిష్ఠించిరి తదనంతరంబ. ౧౩౫

సీ. బ్రహ్మప్రతిష్ఠితు ♦ బాలేందుశేఖరుఁ, బురుహూతుఁ డతిభక్తిఁ ♦ బూజచేసె
నలువయర్చించె నా ♦ నాప్రకారంబుల, హరిహయస్థాపితుం ♦ డగుమహేశు
దక్షవాటికఁ జూచి ♦ దక్షప్రజాపతిఁ, బొగడె నల్మోర్ల నం ♦ భోజభవుఁడు
ప్రణమిల్లె దక్షుఁడు ♦ భారతీభర్తకు, నాత్మప్రశంసకు ♦ నణఁగి మదిని
తే. వేల్పులందఱుదానును ♦ నిల్పినట్టి, శంభులింగంబులకు మ్రొక్కి ♦ చనిరి దివికి
సరసిజాసనుచే నను ♦ జ్ఞాతులగుచు, సత్యలోకంబునకు నర్థిఁ ♦ జనియె విధియు. ౧౩౬

కం. బ్రహ్మప్రతిష్ఠితుండగు, బ్రహ్మేశ్వరదేవుఁ గొలుచు ♦ భాగ్యాఢ్యులకుం
బ్రహ్మక్షత్రాదులకును, బ్రహ్మచ్యుతశంభుభవన ♦ పదవులు గలుగున్. ౧౩౭

కం. అధ్యయనశ్రుతదానత పోధ్యానసమాధిమంత్ర ♦ పూజాదిమహా
విధ్యనుసంధానమున న, సాధ్యంబులు లేవు బ్రహ్మ ♦ శంకరుసనవిన్. ౧౩౮

వ. మఱియుఁ గపాలేశ్వరస్థానంబు. ౧౩౯

ఉ. చిక్కటి కాలభైరవుని ♦ చేతవిధాతృకపాలపాత్ర యే
చక్కటియందు జాఱిపడె ♦ సప్తనదీతటభీమభూమియం
దక్కనుఁ బ్రవించిన శ♦శాంకకిరీటుఁ గపాలి శంభు స
మ్యక్కృతిఁ గొల్చు మానవుల ♦ మానుగఁ జేరవు పాతకౌఘముల్. ౧౪౦

తే. ఆకపాలమోచ♦నాభిధానం బైన, పుణ్యతీర్థరాజ♦మునను జలుపఁ
గడిఁది గోటిఫలముఁ ♦ గాంచునొక్కొక్కటి, దానహోమయజ్ఞ♦తంత్రవిధులు.

చం. అట వరుణేశ్వరం బన న♦నాదిఁ బ్రచేతసుచేత వాహినీ
తటమునఁ దొంటి నిల్పఁబడి ♦ దక్షమహాశకరారవిందసం
పుటమునకుం బరాటకము పోలె♦ వెలింగెడు బాలతారకా
విటమకుటావతంసునకు♦ విశ్రుతకారణ మై తపోనిధీ. ౧౪౨

తే. వరుణలింగంబునకుఁ దీర్ఘ♦వారిధార, వేయిఘటముల నభిషేక ♦ విధయొనర్ప
వఱపువోసంబు వాయంగ ♦ వానగురియుఁ, గొంత్రలంబందు నారబ♦కోటులెల్ల.

ఉ. కుక్కుటపక్షిసంఘము లు♦కుంఠితభక్తిఁ బ్రదక్షిణంబు స
మ్యక్కృతిఁ జేసి యవ్వని కృ♦పాతిశయంబున మోక్షసత్పదం
బెక్క సమస్తలోకములు ♦ కెల్లఁ బ్రియుం డగుణేందుశేఖరుం
గుక్కుటనాథదేవు ఫణి♦కుండలునిం గొలువుండు మానవుల్. ౧౪౪

తే. ఒక్కపక్షంబులెంతయు ♦ నుర్విమోవ
గుడిఁ బ్రదక్షిణ మొనరించు ♦ కుక్కుటముల
కక్షయంబగు మోక్షమై♦యయ్యరొనఁగె
నట్టిశివుఁ గుక్కుటేశ్వరు ♦ నాశ్రయింతు. ౧౪౫

కం. చరణాయుధేశ్వరేశ్వరు, శరణాగతకల్పతరువు ♦ సంపూర్ణమహా
కరుణానగుణాలయునిం, గరుణామృతకిరణధరుని ♦ దర్శింపవనా. ౧౪౬

కం. కోణార్కక్షేత్రము వా,రాణశి కేదారతీర్థ♦రాజము కుంభీ
కోణంబు కుక్కుటేశ, స్థాణుస్థానంబు మోక్ష♦ధామములెందున్. ౧౪౭

తే. అచటదానంబుహోమ♦మధ్యయనవిధులు
శ్రాద్ధమును దేవతాసమ♦ర్చనము వ్రతము
లొక్కటొక్కటి కోటిగు♦ణోపలబ్ధి
సంభవించును సతతంబు ♦ సాధకులకు. ౧౪౮

వ. మఱియు సోమేశ్వరతీర్థంబు సర్వదేవతా నమస్కృతంబు. ౧౪౯ V

కం. అమృతమయుఁ డైనసోముఁడు, సమయంబున నే మహేశు♦సంస్థాపించెన్
విమలసుధాజ్యోతిర్లిం,గము సోమేశ్వరుని గరళ♦కంఠు భజింతున్. ౧౫౦

సీ. సోమతీర్థమునందు ♦ సుస్నాన మొనరించి, శ్రీసోమశంబు భ♦జించు ధన్యుఁ
డిహజన్మమునయందు♦నేపాప మొనరించెఁ, బాప మెద్ది యొనర్చెఁ♦బ్రాగ్జన్మమున
నదియశేషంబును ♦ నాశనంబునఁ బాసి, దేహాంతమునఁ గూడుఁ ♦ద్రిపురహరుని
ద్యాగంబు భోగంబు ♦ దానంబు సత్యంబు, భాగ్యంబు కీర్తి సౌ♦భాగ్యలక్ష్మి
తే. బుద్ధి తప్పిన సత్యాంత♦వృద్ధిఁ బొందు, సతతధర్మంబు నిచ్చు న♦క్షయఫలంబుఁ
దతఫలంబులు పితౄర్థ♦దైహికములు, సత్య మిది సోమనాథప్ర♦సాదమహిమ.

కం. సురలును విద్యాధరులును, గరుడోరగకిన్నరులును ♦ గంధర్వులు కిం
పురుషులు యక్షులు సోమే,శ్వరదేవునిఁ గొల్తు రధిక ♦ వరభక్తిమెయిన్. ౧౫౨

వ. మఱియు మాహేశ్వరతీర్థంబు సర్వదేవమనుష్యావృతంబు మునిసిద్ధచారణవిద్యాధరుల
చేతఁ బ్రతిష్ఠితం బైనయది పితృపిండదానం బేకవింశతికులంబులకుఁ దృప్తికరంబు.

తే. సప్తగోదావరంబును ♦ సారతీర్థ, ముత్తమోత్తమ మందు ♦ మనుష్యుండు చేయు
శ్రాద్ధతిలతర్పణాదు ల♦క్షయఫలములు, తత్సదాసేవనము శివ♦స్థానదంబు. ౧౫౩

తే. దత్తమిష్టంబు హుతము సుధీ♦తంబు నగుల, కచట నక్షయఫలముఁ జే♦యాంగఁజాలు
శ్రాద్ధపిండప్రదానాది ♦ సకలవిధులు, నందు ఫలియించు నగ్గయ♦యందుఁబోలె. 155

కం. మఱి రామేశ్వరతీర్థము, కఱకంఠుని కాటపట్టు ♦ కామితఫలముల్
తఱుఁగనిధాన్యములగుచును, నెఱయంగ ఫలించు నందు ♦ నిష్ఠయుఁ గలుగున్. 156

కం. శ్రీసత్రపాదయుగళీ, శ్రీరామేశ్వరసమీప♦సీమం బితృయ
జ్ఞారంభం బొనరింప న,పారఫలప్రాప్తిచెందుఁ ♦ బంచజనులకున్. ౧౫౭

తే. ప్రథిత మగు సప్తగోదావ♦రంబునకును, నభవునకు భీమనాథున ♦ కంతరమున
నేమి సుకృతంబు చేసిన♦నేకతంబ, వేయు విధముల ఫలియించు♦వేయునేల. ౧౫౮

సీ. వినుము పారాశర్య ♦ వేవేలమాటలుఁ, బనియేమి తీర్థముల్ ♦ పదియురెండు
నని చెప్పనేల ద♦క్షారామసంజ్ఞలోఁ, దీర్ఘంబుగాని ప్ర♦దేశమెద్ది
సప్తగోదావరో♦త్సంగస్థలమునకుఁ, గాశి కేదార మ♦క్షయవటంబు
తరముగా కితరతీ♦ర్థములు సాటియె, భోగమోక్షములకుఁ ♦ బుట్టినిల్లు
తే. సత్రవాటిక భీమేశ్వ♦రునినివాస, మందు రామేశ్వరస్థాన ♦ మభ్యధికము
రామతీర్థంబునందు సా♦రంబుసాటి, ధర్మ మర్థంబు రుద్రపా♦దస్థలంబు. ౧౫౯

అగస్త్యుండు వ్యాసునకుఁ బంచతీర్థంబుల వివరించుట.

వ. మఱియుఁ బంచతీర్థంబులు వివరించెద సవహితుండవై యాకర్ణింపుము. ౧౬౦

చం. అహిపతికంకణుండు తన ♦ యల్లుఁడుగా మదిఁ గోరి నిష్ఠతోఁ
దుహినధరాధరేంద్రుఁడు చ♦తుర్దశదివ్యమహాబ్దముల్ సుదు

స్నహముగఁ జేసె నయ్యెడఁ బ్ర♦చండతపం బచట్ల శివుం డను
గ్రహమున నుగ్ధవించె నని ♦ క్రచ్చుఱఁ బల్కుఁ బురాణసంహితల్. ౧౬౧
కం. అదియాదిగఁ దీర్థంబులు, పదియును రెండయినఁ దీర్థ ♦ పాలీజాతం
బదియు కడునెక్కు నై యు,న్నది సప్తతటంబునందు♦న మునివర్యా. ౧౬౨
కం. లంకించి యుపంధతీపతి, మంకణునకుఁ జెప్పె ననుఁగు ♦ మామకు గిరికిన్
సంకల్పసిద్ధిదుండగు, శంకరుఁ డఖిలార్థిపారి♦జాతంబనుచున్. ౧౬౩
కం. గిరిసార్వభౌమకన్యా, కరగ్రహణసుముంగళైక ♦ కౌతుకసంప
త్పరిపూర్ణహృదయు శంకరుఁ, గరుణాకింకరుని నురగ ♦ కంకణుఁ గొలుతున్. ౧౬౪
కం. నీహారభూధరేశ్వరు, నీహారమణీయమూర్తి ♦ నిందుకరహిమా
నీహారసీరకుముదను, హాహారసమానకాంతి ♦ నభివర్ణింతున్. ౧౬౫
సీ. భూధరేశ్వరతీర్థ♦మునఁ గృతస్నానుఁడై, భూధరేశ్వరుఁ గొల్చు♦బోధఘనుఁడు
నిత్యమంగళుఁడు ని♦ర్జిత్ప్రభ దుండును, లక్ష్మీవిలాసైక ♦ లక్ష్మియుతుఁడు
నగుఁ దీర్థములలోన ♦ సత్యోత్తమం బైన, తీర్థంబు భుక్తిము♦క్తిప్రదంబు
మంగళమంగళా♦త్మకము కళ్యాణక, ళ్యాణస్వరూప మి ♦ యాస్పదంబు
తే. ధరణిధరనాయకునకుఁ బ్ర♦త్యక్ష మైన, యవ్విహారపాత్రునగరము♦ధ్యాహ్నవేళ
భోగఘంటాస్వనము విన్న ♦ భూజనులకు, నవల వినవచ్చు ముక్తిక♦ళ్యాణఘంట.
మ. హిమవద్భూధరసార్వభౌమవరవి♦శ్వేశోపహారక్రియా
క్రమసంతాడితఘంటికాఘుణఘుణ♦త్కారంబు విన్నట్టి యు
త్తమపుణ్యుండు వినండు ప్రాణపవనో♦త్క్రాంతివ్యథావేళ దు
ర్దమమైనస్వతవాహ్యఘోరమహిష♦గ్రైవేయఘంటాధ్వనుల్. ౧౬౭
తే. శ్రాద్ధపిండప్రదానాది ♦ సకలవిధులు, నొక్కటొక్కటికోటిగు♦ణోదయమునఁ
దృప్తిఁ గల్పించు దివిపితృ♦దేవతలకు, ధరణిధరరాజశంభుతీ♦ర్థంబునందు. ౧౬౮
తే. సప్తగోదావరముఁ దెచ్చి ♦ సప్తమునులు, సప్తసప్తేందుశిఖివిలో♦చనుని నిలిపి
రమ్మహాశంభులింగ మ♦భ్యర్చితులకుఁ, గామితార్థప్రదానైక ♦ కల్పకంబు. ౧౬౯
కం. ఒకమాటు జలకమార్చిన, నొకమాటొకపువ్వుపూవాళి ♦ నునిచిన నొకమా
టకుటిలమతి గుడిఁ దిరిగిన, సకలేప్సితముల నతండు ♦ సంపాదించున్. ౧౭౦
తే. భీమనాథేశ్వరునిపార్శ్వ ♦ భూమియందుఁ, బంచశివలింగములకు నా♦స్పదములైన
పంచతీర్థంబులును నాడు♦పంచజనులు,పాయుదురు పంచవిధమహా♦పాతకముల.
తే. అందు వాపితటాక కు♦ల్యాదులందుఁ, దీర్థమాడ వివేకి బు♦ద్ధిం దలంపఁ
బంచతీర్థంబు లందిచ్చుఁ ♦ బంచజనుల, కాత్మసలిలావగాహపు♦ణ్యాతిశయము. ౧౭౨

వ. అగస్త్యేశ్వర, రామేశ్వర, నాకులేశ్వర, గణేశ్వర, పాతాళభైరవేశ్వరులను దేవతాపంచకంబుఁ బంచతీర్థంబులను దర్శించి మానవుఁడు పంద్రెండు పుణ్యతీర్థంబులు దర్శించిన ఫలంబులందు మూలస్థానేశ్వరలింగం బాదిమూలం బద్దివ్యలింగంబు దర్శించి భీమమండలంబునందు శివలింగస్థానంబు లెన్నిగల వన్నియు దర్శించిన ఫలంబు గైకొను వెండియు. ౧౭౩

తే. సప్తగోదావరము భీమ♦శంకరునిని, నాకులేశస్వయంభుఁ బి♦నాకపాణి
రుద్రపాదంబులును సమా♦రూఢభక్తిఁ, దలఁతు రెవ్వారు వారపో♦ధన్యమతులు. 17

వ. అని దక్షారామమాహాత్మ్యంబును భీమలింగమహిమంబును సప్తగోదావరప్రశస్తి యుద్దావశతీర్థప్రభావంబును బంచతీర్థప్రయోజనంబును వినిపించి కుంభసంభవుండు. ౧౭౫

తే. భీమనాథునిఁ ద్రిభువన♦స్వామిఁ గొలువఁ
బోదమే యిప్డు మధ్యాహ్న♦భోగవేళ
నడెవిజృంభించె నాట్యసౌ♦ధాంతరమున
నృత్యజగఝంకృతమృదంగ♦నిస్వనంబు. ౧౭౬

వ. అని పలికి యనంతరం బయ్యిరువురు రాజమార్గంబున. ౧౭౭

అగస్త్యవ్యాసులు భీమేశ్వరాలయంబుఁ బ్రవేశించుట.

సీ. త్రిపురసంహారంబు ♦ దివిజనాయకభుజా, స్తంభదంభోళిసం♦స్తంభనంబు
గరళకూటమహాగ్ని ♦ కబళనాటోపంబు, దక్షాధ్వరక్రియా♦ధ్వంసనంబు
మత్స్యలాంఛనదర్ప ♦ మథనసంరంభంబు, దేవదారువనప్ర♦దేశవిహృతి
మహలింగమూర్తివి♦స్ఫురణవిలాసంబుఁ, గాత్యాయనీకర♦గ్రహణకేలి

తే. గండభేరుండదానవ ♦ ఖండనంబు, దండపాణిజలంధరాం♦ధకవధంబుఁ
బాడు గంధర్వపతులచే ♦ భరతమైన, మొగలివాకిలి సొచ్చి ర♦మ్మునివృషభులు.

సీ. పంచాంగశుద్ధిగాఁ ♦ బరిఢవించుచు భృంగి, మతినాడు నెందేని ♦ ప్రతిదినంబు
త్రిదశవర్గంబు ము♦ప్పదిమూఁడుకోట్లును, నేకదేశమున నెం♦దేనియుండుఁ
బలుకుపూఁబోణి య♦ర్వదినాల్గుకళలతో, విహరించు నెందేని ♦ విశ్వమూపు
సాని యీశానియై ♦ సవరించు నెందేని, మహితపింఛాలీల ♦ మరులు వీట

తే. నెద్ది కైలాసశిఖరికిఁ ♦ బెద్దయుద్ది, పాలమున్నీటి కెయ్యది ♦ ప్రసవభూమి
చంద్రలోకంబునకు నెద్ది ♦ సాటిమట్టి, భవునికళ్యాణమండ♦పంబుఁ గనిరి. ౧౭౯

ఉ. దానికిఁ దూర్పుదిక్కున సు♦ధాకరబింబసహస్రకోటిశో
భానిభకాంతితో గగన ♦ భాగము రాయుచు భీమనాయకే

శానమహాట్టహాసరుచి ♦ సంపద సొంపువహించి నట్టిశ్రీ
భానుజవైరిమండపము ♦ భవ్యమునీంద్రులు గాంచి రయ్యెడన్. ౧౫౦

వ. అనంతరం బా బహిర్గేహప్రదేశంబున. ౧౫౧

తే. నిఖిలపరివారదేవతా ♦ నివహములకు, వందన మొనర్చి రుత్తర ♦ ద్వారభూమి
శశికళామండనునకును ♦ శంకరునకుఁ, జేసి రభివాదనంబులు ♦ సిద్ధమునులు. ౧౫౨

ఉ. తండముభుజార్గళాకలిత ♦ తప్తమహాకలధౌతఘంటికా
మండితవేత్రదండధరు ♦ మగ్నభీతినశాత్పలాయితా
ఖండలముఖ్యదైవతని ♦ కాయముసంయమిభాగధేయముం
ఖండపరశుమోసలను ♦ ఖంబునఁ జొచ్చిరి శైవపుంగవుల్. ౧౫౩

వ. ప్రవేశించి భక్తిశ్రద్ధానుపూర్వకంబుగా నంతర్భవనప్రదక్షిణంబు చేయునప్పుడు
తిరుచుట్టు మాలికయందు. ౧౫౪

సీ. వణఁకుగుబ్బలిరాచ ♦ వారికూరిమికన్య, భీమయ్య శుద్ధాంత ♦ భామఁ గొలిచి
కంధరంబుననుండి ♦ గంధసింధురమైన, గుజ్జువేల్పుఁ గుమార ♦ గురుని గొలిచి
కైవల్యనిధికి దు♦ర్గామహాదేవికి, సర్వమంగళకు నం♦జలిఘటించి
యాశాతటీపట ♦ లీశాటికాకటు, వటుకభైరవు నిష్ట ♦ వరదుఁ జూచి

తే. నలువసేవించి యిందిరా ♦ నాథుఁ గాంచి, యితరపరివారదేవతా ♦ వితతి కెల్ల
నేటికోళ్ళిచ్చియెక్కి ర♦ మ్మేటిమునులు, మృదునిహాటకశైలంబు ♦ మీఁదినిలువు.

శా. సందర్శించిరి భీమనాథుఁ ద్రిజగ♦త్సమ్మోహనాకారు న
ర్ధేందూత్తంసుని దక్షిణాబ్ధిలహరీ ♦ హేలావిహారక్రమా
స్పందామూగతగంధవాహపరిష♦త్పాతాతిరేకస్ఫుర
త్తుందిస్వాంగకదంబసౌరకటకా♦స్తోకేష్ట బాహార్గళున్. ౧౫౬

కం. దృష్టించి భక్తిపరతను, సాష్టాంగం బెరఁగి యమ్మ♦హాదేవుని నా
శిష్టమునుల్ పూజించిరి, యష్టాపదనిర్మితంబు ♦ లగుకుసుమములన్. ౧౫౭

ఉ. కేవలభక్తిసంపదలు ♦ గీలుకొనన్ హృదయాంబుజంబులన్
దేవరకుం గృపానిధికి ♦ దేవశిఖామణి కర్థిసప్తగో
దావరవాహినీకనక ♦ తామరసంబులఁ బూజచేసెమై
త్రావరుణుండు దానును బ♦రాశరిసూనుఁడుఁ గూడి వేడుకన్. ౧౫౮

వ. అప్పుడు పారాశర్యుండు పెన్నిధానంబుఁగన్న పేదయుం బోలెఁ బరమానందం
బునుం బొంది కుంభసంభవుం జూచి మునీంద్రా నీప్రసాదంబున భీమమండలం
బవలోకించితి, ద్వాదశక్షేత్రతీర్థంబులు చూచితిఁ, బంచతీర్థంబులాడితి, దక్షా
రామంబుఁ గంటి, భీమేశ్వరు దర్శించితి, ధన్యుఁడనైతిఁ గృతార్థుండనైతి నింక

నీవు పత్నిసహితంబుగా నేవలనైన నుండి తపంబు సేయుము. నేనును విశ్వనాథ
విరచితావమాన ఖేదంబువాయ నీస్వామిని సేవించెద నని పలికి సముచిత ప్రకా
రంబున నమ్మహాత్ముని వీడుకొలిపి యనంతరంబ శిష్యులుం దానును. ౧౮౯

వ్యాసుఁడు భీమేశ్వరార్చనంబు సలుపుట.

సీ. పంచతీర్థములాడి ♦ భవలింగసన్నిధిఁ, బ్రాసాదపంచాక్ష♦రము జపించి
సొరిదినల్దిక్కుల ♦ సోమేశ్వరములందు, భక్తిఁ బ్రదక్షిణం ♦ బాచరించి
కుక్కుటేశ్వరుకేళ ♦ కూళి నుద్భవమైన, మణికర్ణికఁ నొనర్చి ♦ మజ్జనంబు
నోంకారపురత్రికూ♦టోదరస్థితులైన, హరిహరబ్రహ్మల ♦ నభినుతించి
తే. తుల్యగోదావరీనదిఁ ♦ దోయనిధిని, సప్తగోదావరంబున ♦ స్నానమాడి
యాచరించు శివార్చనం ♦ బనుదినంబు, దక్షవాటికనుండి స♦త్యవతిసుతుఁడు. ౧౯౦

కం. భీమేశ్వరమహిమంబున, నామోదముతోడ నోల♦లాడుచు నుండున్
భీమేశ్వరచరణారుణ, తామరసంబులకు సంత♦తముఁ బ్రణమిల్లున్. ౧౯౧

సీ. మాతృగర్భాకార ♦ జాతఖేదము వాయ, హరునిగర్భాగార ♦ మాశ్రయించుఁ
బరమేశ్వరార్చనా ♦ పరత నించుక తన్ను, నత్యంతధన్యుఁగా ♦ నాత్మఁదలఁచు
హర్షించి హర శివ ♦ త్ర్యంబకాచలగర్భ, భవయంచు రోమాంచ ♦ పటలిఁ దాల్చుఁ
గరతాళకలన శం♦కరగీతములు వాడు, లజ్జాభిమానంబు ♦ లుజ్జగించి
తే. భీమభీమేశ్వరేశ్వర ♦ భీమనాథ, దక్షవాటిపురాధ్యక్ష ♦ దర్పకారి
సప్తగోదావరోత్సంగ ♦ జయమహేశ, నన్నురక్షింపు మనుచు వి♦న్నపము సేయు. ౧౯

కం. బాలోన్నతపిశాచక, శాలంబనమునఁ జరించు ♦ నంగడివీథిన్
ప్రేలాపోన్మత్తఁ గంటే, కాలునిపాదములమీఁదఁ ♦ గలుగువిరాళిన్. ౧౯౩

సీ. పరిరంభ మొనరించు ♦ బాహాద్వయంబున, దేవదేవునిసుధా ♦ దివ్యమూర్తిఁ
దాఁకించుకొను జటా♦స్తబకంబు విరియంగఁ, బానవట్టముతోడ ♦ ఫాలతలము
గురుదక్షపురితోడఁ ♦ గూడఁ బట్టసమున, కంగప్రదక్షిణం ♦ బాచరించుఁ
బాతాళభైరవ ♦ ప్రముఖనానాదిశా, పరివారదేవతా ♦ ప్రతతిఁ దెలుచుఁ
తే. గాశికాపట్టనద్రోహిఁ ♦ గావు మభవ, విశ్వపతిదూషితుని బ్రోవు ♦ విశ్వనాథ
కల్లచేసితి రక్షింపు ♦ కాలకంఠ, యనుచుఁ బ్రార్థించు భీమనా♦యకునిఁ దపసి. ౧౯

సీ. అఘముల కొండుప్రా♦యశ్చిత్తములు లేవు, నిన్నుఁ జూచుటకంటె ♦ నీలకంఠ
నీమండలంబున ♦ నిఖిలజంతువులకుఁ, దారకం బల భ్రాంతి ♦ దశను దోఁచుఁ
గలియుగంబునయందుఁ ♦ గడుదుర్లభంబులు, భవదీయదర్శన ♦ స్పర్శనములు
నీదక్షవాటికా ♦ నిలయంబునందుండు, జనులకు భోగమో♦క్షములు వలఁతి

తే. శిష్యులును నేను మిమ్ముఁ గొ♦ల్చెదము భక్తి, విశ్వపతికోపమునఁ గాశి ♦ వెడలివచ్చి
తరసి రక్షింపు మమ్ముఁ ద♦యార్ద్రహృదయ, శాంతభీమేశ్వరేశ్వర ♦ స్వామినాథ. ౧౯౫
వ. అని నుతియించుఁ గృష్ణద్వైపాయనుండు భక్తితృష్ణాతిశయంబున. ౧౯౬

— వ్యాసుఁ డీశ్వరు నుతించుట. —

సీ. దేవదేవునకు నా♦దికి నాదియగువాని, కంబికాపతికి ద♦క్షాధ్వరారి
కహితపురత్రయా♦ధ్యక్షసంహరునకు, హరిలోచనాంబుజా♦భ్యర్చితునకు
బ్రహ్మాదిదేవతో♦పాస్యసన్మూర్తికి, నమృతమూర్తికిని స్వ♦యంభువునకు
నిగమార్థవిద్యోప♦నిషదంగనామౌళి, చుంబితశ్రీచర♦ణాంబుజునకు
తే. భోగమోక్షంబు లతిపాప♦బద్ధులకును, గరుణ నొసఁగెడు ప్రత్యక్ష♦కల్పశాఖి
కఖిలగంధర్వయక్షసి♦ద్ధాదిదివ్య, వంద్యునకు మ్రొక్కెదను భక్త♦వత్సలునకు. 197
సీ. శ్రీభీమనాయక♦ శివనామధేయంబుఁ, జింతింపనేర్చిన♦ జిహ్వ జిహ్వ
దక్షవాటీపురా♦ధ్యక్షమోహనమూర్తిఁ, జూడంగనేర్చిన♦ చూపు చూపు
దక్షిణాంబుధితట♦స్థాయిపావనకీర్తి, చే నింపనేర్చిన♦ చెవులు చెవులు
తారకబ్రహ్మవి♦ద్యాదాతయౌదల, విరులు పూన్పఁగనేర్చు♦ కరము కరము
తే. ధవళకరశేఖరునకుఁ బ్ర♦దక్షిణంబు, నర్థిఁ దిరుగంగనేర్చిన♦ యడుగు లడుగు
లంబికానాయకధ్యాన♦హర్షజలధి, మధ్యమునఁ దేలియాడెడు♦ మనసు మనసు. 198
ఉ. మాటలు పెక్కులేటికిని♦ మందరభూధరమంథనక్రియా
పాటలఘూర్ణమానజల♦భారమహోదధికాలకూటసం
ఘాటకృపీటసంభవశి♦ఖావికటస్ఫుటవిస్ఫులింగవి
స్ఫోటపవిత్రసద్భువన♦భూతభయాపహు నాశ్రయించెదన్. ౧౯౯
స్రగ్ధర. కౌక్షింభర్యంబు దీర్పం♦ గడుపున కిడుదుం♦ గాలసంప్రాప్తభిక్ష
న్వీక్షింతుం బోధశక్తి♦ న్విషయముల మదిన్♦ నిస్పృహత్వంబు దాల్తున్
దక్షారామాధినాథున్♦ ధవళవరకరో♦త్తంసజూటీవిటంకు
న్వీక్షింతున్ భీమనాథుం♦ద్రిభువననమితున్♦ నేత్రముల్ తృప్తిపొందన్. ౨౦౦
శా. అష్టాశీతిసహస్రసంయమిజన♦వ్యాకీర్ణతీరద్వయీ
జుష్టోదంచితసప్తసింధుసలిల♦స్రోతోవగాహక్రియా
తుష్టస్వాంతుఁడనై భజింతుఁ గరుణా♦దుగ్ధాబ్ధి భీమేశ్వరున్
దృష్టాదృష్టఫలప్రదానవిభవా♦ధిష్ఠానచేతస్కునిన్. ౨౦౧
ఉత్సాహము. యక్షసిద్ధసాధ్యఖేవి♦హార గరుడకిన్నరా
ధ్యక్షమణికిరీటకోటి♦ తరుణికిరణమంజరీ

ప్రేక్షణీయచరణకములు ♦ భీమనాథదేవునిఁ
దక్షవాటికాపురైక♦ధాము నాశ్రయించెదన్. ౨౦౨

ఉత్సాహము. నిష్ఠతో భజింతు భీము♦నిం భుజంగహారునిం
దిష్టునిం దభీష్టసంప్ర♦తిష్ఠునిం గరిష్ఠు భూ
యిష్ఠు దక్షవాటికాస్థ♦లీశు దేవతాకుల
జ్యేష్ఠునిం వసిష్ఠముఖ్య ♦ శిష్టమునిజనార్చితున్. ౨౦౩

లయగ్రాహి.

నీరమున మ్రొక్కెదను ♦ హేమగిరిచాపునకు♦సామజజలంధరము♦ఖామరవిరోధి
గ్రామమదహారి కభి♦రామశుభనిర్మలసు♦ధామయశరీరునకుఁ ♦ గామితవితీర్ణ
శ్రీమహిమశాలికి జ♦రామరణదోషహరి ♦ శామునినిజాంఘ్రియుగ♦భీమ్యతికి దక్షా
రామపురధామునకుఁ♦గోమలజటామకుట♦ధామహిమధామునకు ♦ భీమునకు భక్తిన్.

సీ. కొలుతు సద్యోజాతుఁ ♦ గోమలైంచవతనుఁ, బెద్దగుబ్బలిరాజు ♦ బెండ్లికొడుకు 204
సేవింతు శ్రీవామ ♦ దేవు మహాదేవు, నేడులోకంబులు ♦ నేలుతేనిఁ
దెలుతుఁ దత్పురుషు నిం♦దీవరవరనీల, చారుకంధరుని బ♦హుశ్యల్లలాటుఁ
బ్రణుతింతు నీశాను ♦ ఫాలనేత్రానల, జ్వాలాసమాలీఢ ♦ శంబరారి
తే. సర్గసంసారఘోరాన్యుని ♦ సంస్తుతింతు, సర్గసంసారహేతువు ♦ సంస్మరింతు
సర్గసంసారరూపిని ♦ సంశ్రయింతు, నభవు భీమేశ్వరేశ్వరు ♦ నభిలషింతు. ౨౦౫

సీ. ఎవ్వనియాజ్ఞ నీ♦రేడులోకంబులు, వర్తించు నట్టి దే♦వరకుఁగాక
గ్రహతారకములు ని♦క్కముగ నెవ్వని యాజ్ఞ, వర్తిల్లునట్టి దే♦వరకుఁగాక
మనువులుపదునాల్గు♦రును యదాజ్ఞాయుక్తి, వర్తింతురట్టి దే♦వరకుఁగాక
భువనపాలకులు య♦దూర్భూతాజ్ఞాయుక్తి, వర్తింతురట్టి♦ దేవరకుఁగాక
తే. ధూర్జటికిఁగాక భీమనా♦థునకుఁగాక, నిఖిలకామ్యకల్యాణ ♦ నిధికిఁగాక
యన్యదైవంబులకు నేల ♦ యధికభక్తి, సంఘటింతుఁ గరాంబుజాం ♦ జలిపుటంబు.

కం. క్షమియింపు భీమనాయక, కమలభవాద్యమరరాజ ♦ కాంచనముకుటీ
సముదయమణిఘృణిరేఖా, కమనీయపదాంబుజోప ♦ కంఠోద్దేశా. ౨౦౭

కం. కావుము దక్షారామపురీవల్లభ భీమనాథ ♦ త్రిజగదధీశా
కైవల్యభోగలక్ష్మీ, ప్రావీణ్యప్రదకటాక్ష ♦ భక్తాధీనా ౨౦౮

కం. కృపగల్గి భీమనాయక, యపరాధము సైఁపు తండ్రి ♦ నేడువో కావో
కృపగల్గి సుతుఁడు చేసిన, యపరాధము తండ్రి సైఁచు ♦ టన్నాంబె కదా. ౨౦౯

వ. అని ప్రార్థించి భక్త్యావేశంబున గద్గదస్వరకంఠుండును బాష్పాకులలోచనుండును రోమాంచపటలకంచుకితనిఖిలానయవుండును నై నెండియును. ౨౧౦

సీ. గరళకూటవినీల♦కంఠాయ శంభవే, మదనాంతకాయోన్న♦మశ్శివాయ
కాద్రివేయాధిప♦గ్రైవేయభూషాయ, మధుభిత్సఖాయోన్న♦మశ్శివాయ
కుంభినీధరసుతా♦కుచకుంభపరిరంభ, మహాలోలుపాయోన్న♦మశ్శివాయ
వేదాదినిశ్శేష♦విద్యావధూమౌళి, మణికపలాయోన్న♦మశ్శివాయ

తే. గంధదంతావళజలంధ♦రాంధకారి, విబుధపరిపంథివాహినీ♦నిబిడగర్వ
బంధఘోరాంధకారసం♦భారకిరణ, మాలినేశాశ్వతాయోన్న♦మశ్శివాయ. ౨౧౧

వ. ఓం జయజయ దేవదేవ గంధర్వసిద్ధవిద్యాధరచారణకిన్నరకింపురుషు లహంపూర్వికాసంఫుల్లపుటంబు లగుచేతస్సంపుటంబులం బుటబుట నగుభక్తివిశేషంబుల శేషాహికటకభూషావిశేషాభిరామంబు లగుమీ కోమలశ్రీపాదకిసలయంబుల ఘుసృణమణికోటీర కోటీవిటంక సందానితమందారమాలికామకరందబిందుధారాధోరణీప్రవాహంబుల నహరహంబును నభిషేకింతురు; కంఠేకాలా! మీ కంఠమూలంబునం గలుగ దండకైనడిం గనుపట్టు కరాళ కాలకూటవిషమషీకళంకపంకచ్ఛాయాచ్ఛటాగుళుచ్ఛంబులవలన నిఖిలలోకసంరక్షణంబు సిగమువ్యాఖ్యాతంబు; మహానటా! మీజటాజూటపటలంబున డిగిన వియద్గంగానిర్ఝరస్రోతశ్శిలాకానికాయంబులఁ ద్రిలోకీ కంఠోపకంఠంబుల తారహారవల్లీమతల్లిభంగి నంగీకరింతు; శంకరా! నీవు సంకర్షణరుద్రావతారంబునఁ బాతాళగోళంబు వెడలి విషదహనవిస్ఫులింగవికటదంష్ట్రాటంకకటకటత్కారఘోరంబును జిహ్వాలంబును నగువదనగహ్వరంబునఁ బుండరీకభవాండపిండంబులొండొండ నణంగఁ గవిసి మ్రింగుదు; ధూర్జటీ! విలయపర్జన్యగర్జాడంబరంబున విడంబించు కహకహాట్టహాసంబునఁ బిట్టుధట్టించి యవష్టంభసంభారదుర్వారగర్వారంభసముజ్జృంభితంబగుజంభారిభుజార్గళవిజృంభణంబు హస్తధృతదంభోళితోడ నస్తంభించితి; ధనదసఖా! నిఖిలకకుభవధిపరిధివలయంబులఁ గలయఁ గనత్కనకనఖశిలాకానికాయచ్ఛాయాదాయాదంబు లగుసముజ్జ్వలజ్వాలాజాలంబులు విజృంభింప ననలస్తంభదివ్యలింగాకారంబున నావిర్భవించి నిలువుభూభువన చక్రవాళపర్యంతం బాక్రమించి పెరిఁగినప్పుడు విరించి రాయంచయుఁ గైటభారి కిటియును నై యెగసి యుడిగియును దుదమొదలు దెలియరైరి; రుద్రా! నీవు భద్రదేవద్రుమాటవీవాటియందు దిసమొలదూఁబఱదిండివిమిండజంగంబవై ఋషులపుణ్యాంగనల యాలువులపాంగరంగస్థలీలాస్యలంపటంబు లగుకటాక్షవీక్షణంబుల హరించుచు భిక్షాటనక్రీడను నటించితి; చండీశ్వరా! నీవు మేరుకోదండంబునఁ బుండరీకాక్షకాండంబు దొడిగి కుండలిజ్వాలావల్లరీఝల్లరీఝంకారంబునఁ బంకరువాభవాండంబు బీటగిల్ల నిశాటపుటభేదనంబు లొక్కయేటున ఛటచ్ఛటల నేసితివి; నీల

లోహితా! యహరహోవధిసంధ్యా సమయారంభంబుల నుద్దేశదినావసానంబుల
నానందంబుగాఁ బరిఢవించు జగఝ్ఝంకారంబైన యారభటితాండవసముద్దండ
పాదభ్రమణవిభ్రమంబునఁ ద్రిభువనభయంకరంబు గావించితి; సర్వజ్ఞా! నిర్వి
కల్పంబు నిరస్తసమస్తోపాధికంబును సత్యజ్ఞానానందంబునకు నికేతనంబును నగు
నిష్కళంకస్వరూపం బగు వేదానువచనశాంతిదాంతిక్షాంతిశ్రవణనిధిధ్యాసనాదు
లగుసాధనంబుల నిర్ణిరోధనిరవగాఢనిరవబోధకత్వవిభాగంబునం దక్షీభవించి
ముముక్షులు లాభలక్ష్యంబును నభీక్షణంబును నభీప్సితంబును ననుభవింతురు;
భర్గా! భార్గవభృంగ్వంగిరసప్రధాననానామునిసమూహవిహితచరితాఘమర్షణ
స్నానాహ్నికౌఘయు నిజజలావగాహాపహానిఖిలాఘయు జాహ్నవీసపత్నియు నగు
గోదావరీమహానది నీకుం గేలివిహారం బగు కేళాకూళి; నిటలనయనా! గిటగిటని నడు
గునడుగు నడుఁకునడుములు, వెఱఁదలగు తెలికన్నులును నెఱికురులును, వలుదకుచ
ములును గలిగిననవిల్తునకుఁ బసగలపసిండి మెఱుంగు ములుకులనం గలికిచిలుకల
కొలుకులగుబిసరుహదళనయనలు ముసురుకొని బలిసి నిలిచి కొలువఁ బ్రతిసం
క్రమణహారోత్సవాదులయందుఁ బేరోలగం బవధరింతువు; శర్వా! నీవు శర్వరీ
సార్వభౌము నొక్కహజ్జునగుజ్జురూపంబునమట్టితివి; కుసుమశరమథనా! బిసరు
హాభవుని కిసలయోష్ఠి నాసికాతలప్రమాణంబు నఖశిఖాగ్రంబున మొదలంటం
జిదిమితి; వృషభధ్వజా! నీవు పూషుండను పేరి రవిపండ్లుగాల గుద్దితి; యీశ్వరా!
నీవు వైశ్వానరుని సప్తజిహ్వాపల్లవంబులు పెల్లగిలగిల్లితి; విరూపాక్షా! నీవు దక్షప్రజా
పతికంఠంబున మేషంబు తల నిల్పితి; మృగవ్యాధా! నీవధ్వరమృగంబు మస్తకంబు
నభస్తలంబున వ్రేలంగట్టితి; ముక్కంటీ! నీకు మ్రొక్కెదను; శివా! నీకు నవాంజలి;
భవా! నీకు నభివాదనంబు; పాండురాంగా! నీకు వందనంబు; రాజశేఖరా! నీకు
జేజే; హరా! నీకు జోహారు; గిరీశా! నీకు వరివస్య; యష్టమూర్తీ! నీకుఁ బ్రతిష్ఠ;
యీశానా! నీకు దాస్యంబు; త్రిపురహరా! నీకుపాసన; మృడా! నీకు శరణు;
మృత్యుంజయా! నీకుఁ బ్రపత్తి; ప్రమథాధిపా! నీకు నారాధనంబు; పినాకీ! నీకు
నమస్కారంబు; కైలాసనిలయా! నీకుఁ గోపులు; పశ్యల్లలాటా! నీకు నేటికోళ్ళు;
గౌరీమనోహరా! నీకు నమస్కారంబు; జయజయ జలంధరాంతకా! గంధసింధు
రాదిదనుజకంధరా పీఠధమనీగళితరక్తధారాభిషిక్తప్రచండఖండపరశుభిండివాల
శూలప్రముఖబహువిధప్రహరణపరంపరాభీలమహాకారా! జయజయ జగత్సం
భారకుంభకల్పనాకుంభకారా! కుంభీనసభూషణభీషణభూత ప్రేతపిశాచశాకినీ
ఢాకినీప్రౌఢపరివారా! జయజయ వియద్వాయుధరణితరణిశీతభానుబృహద్భాను
సలిలయజమానమూర్తికల్పితాష్టభేదప్రపంచిత విశ్వప్రపంచపంచవదనపంచాక్షరీ

మూలమంత్రకారణపాంచభౌతికవ్యవహారా! నిర్మల జ్యోతిర్లింగమయమంగళా
కారా! జయజయ సప్తపాతాళ భువనవిష్కంభనిర్భేదనసమాసాదితావిర్భావభావ
జనసంహారా! సర్వమంగళాకుచకలశపాళికేళీతూలికాకారమకరికాముద్రికాభిమ
ముద్రితోరఃప్రదేశమహేశ! జయజయ భక్తభావనాసులభస్వభావనాతీతపావనా
కారధావళ్యవిగ్రహా! శ్రీమన్మహాదేవ! దేవదేవతారాధ్య! దక్షవాటీపురాధ్యక్షా!
ఆపద్ధ్వాంతదివాకరా! పరమదయాకరా! జయజయ శ్రీభీమేశ్వరా! నమస్తేనమస్తే
నమః. ౨౧౨

మ. అనుచుం దాండవమాడుచుండె శివభక్త్యావేశలీలార్భటి
న్మునిశార్దూలము దక్షవాటినడుమన్ సోల్లజటాభాగుఁడై
వినిపించెన్ నశరీరభారతి నభోవీథీవిటంకంబునన్
నినురక్షించెను భీమనాయకుఁడు కానీనా! సుఖంబుండుమీ. ౨౧౩

తే. కాచె నీతప్పు కల్మషకంధరుండు, శశికరశేఖరుండు రక్షించె నిన్ను
భీమనాథుని ద్రిభువనస్వామిఁ గొలుము, కార్యసంసిద్ధిఁ బొందెదు కానినేయ.

వ. అని యివ్విధంబున నశరీరవాణి పలికిన విని యత్యంతర్వాణి శర్వాణీవల్లభుం
దలంచి పునఃపునః ప్రణామంబులు చేసి నితాంతసంతోషతరంగితాంతరంగుండై.

సీ. పైల! దక్షారామపతి భీమనాథుండు, మనపాలికల్పకక్షోణిజమ్మయ్యె
నో సుమంతుఁడ! దక్షిణోద్యానవాటికా, నిలయుండు మనపాలిఫలముసువ్వె
జైమినీ! దేవతాసార్వభౌముఁడు విగ్రహాత్ముండు ప్రత్యక్షమయ్యెఁజువ్వె
దేవల! సప్తగోదావరతీరైక, వాసుండు మనవంక వ్రాలెఁజువ్వె

తే. భారతాదిబహుగ్రంథపారవశ్య, యోగిజనమేజయుండ! యీ యుగమునఁ
దంబికాభర్త యఖిలకళ్యాణములును, మనకుఁ గృపసేయఁగలఁడు సమ్మదముతోడ.

వ. ఇంకఁ గృతార్థులమైతి మని శిష్యవర్గంబునుం దానును దక్షారామంబున నభి
రామంబైన పరమజ్ఞానానందసుఖం బనుభవించుచుండె. ౨౧౪

కం. శ్రీరామాయణమును దక్షారామాయణముఁ గలిమలాపహములు స
త్సారనుతులు వాల్మీకికిఁ, బారాశర్యునకు వినుతపాత్రములయ్యెన్. ౨౧౫

వ. అని చెప్పిన విని యభినందించుటయు భీమేశ్వరమాహాత్మ్యంబు వినువేడ్కం బరమే
శ్వరుం డుద్భవించిన విధంబును సప్తఋషులు సప్తగోదావరంబుఁ దెచ్చిన విధం
బును నాస్వామిని బ్రతిష్ఠచేసిన భంగియు, నెఱింగింపవే యని ప్రార్థించిన. ౨౧౬

శా. గాంధర్వోపనిషన్నతంగ రసవత్కావ్యానుసారానుధా
రంధర్యాపరభోజరాజ రమణీ ప్రద్యుమ్న దోర్వీర్యగ
ర్వాంధారాతివరూథినీపరివృఢ ప్రాణానిలాహారవా
తాంధక్రూరకృపాణ రాజహితకార్యారంభపారంగతా. ౨౧౭

కం. దక్షారామవధూటీ, వక్షోరుహామృగమదాది♦ వాంఛితవిలస
ద్వక్షఃకవాటబాంధవ, రక్షావిధివజ్రపంజ♦ర కృపాజలధీ. ౨౨౧

పంచచామరము. అభంగవీరవిక్రమార్క♦ యాజిగాండివాయుధా
ప్రభాతకాలభానుసన్ని♦భ ప్రభావిభాస్వరా
యిభద్విషుగ్రవిక్రమా; స♦మిద్ధనర్తనభ్రము
న్నభస్సరిత్పయఃపృషద్గ♦ణాచ్ఛవిస్ఫురద్యశా. ౨౨౨

గద్య. ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర సుకవిజనవిధేయ శ్రీనాథ నామధేయప్రణీతంబైన భీమేశ్వరపురాణం బనుమహాప్రబంధంబునందుఁ దృతీయాశ్వాసము.

శ్రీరస్తు.

శ్రీరామాయనమః.

శ్రీమహాగణాధిపతయేనమః.

శ్రీమాణిక్యాంబాసమేత శ్రీ భీమేశ్వరస్వామినేనమః.

శ్రీ భీమేశ్వరపురాణము.

చతుర్థాశ్వాసము.

శ్రీధామ యశేషదిశా
సాధాగ్రస్ఫటికకుంభ ♦ సంభారకళా
సాధీయస్స్మితకీర్తి బు
ధాధార యరేటియన్న♦యామాత్యమణీ. ౧

వ. అక్కథకుండు శౌనకాది మహామునుల కిట్లనియె. ౨

గీ. బాదరాయణునకుఁ గుంభ♦భవుఁడు చెప్పి
నట్టి యాత్రాక్రమం బిది♦యనఘులార
యమరమునినారదుఁడు మునీం♦ద్రాదులకును
నర్థిఁజెప్పినపరిపాటి♦యదివినుండు. ౩

వ. మీర లడిగినయర్థంబుఁ బర్యాయక్రమంబున వినిపించెద. ౪

తే. పోయె వారణాశికి బాద♦రాయణుండు, శిష్యులును దాను గైవల్య♦సిద్ధిఁగోరి
మనము పోదము గాకంచు♦మనసు వేడ్క,నరిగి రభ్యర్హితులు వసి♦ష్ఠాదిమునులు.

కం. యాత్రాజిగీషఁ బుణ్య, క్షేత్రంబులమీఁదఁ దీర్థ ♦ సేవాపరులై
మైత్రావరుణబృహస్ప,త్యత్రిభరద్వాజముఖ్య♦లగుమునివృషభుల్. ౬

ఉ. కాశికి నేగుదెంచి మణి♦కర్ణికయందుఁ బ్రయాగయందు నా
కాశనదీప్రవాహమునఁ ♦ గాయము దొప్పఁగఁదోఁగి శంభు వి
శ్వేశు శశాంకశేఖరు న♦నేకవిధంబులఁ గొల్చి సంతత
క్లేశవినాశహేతువునఁ ♦ గేవలతాసుఖ మిచ్చఁ గోరుచున్. ౭

కం. కేవలతాయకరంబును, భావలతావాటిమలయ ♦ పవనాగమమై
కేవలతాలీలావతి, కే వల తాకాశి మరగు♦కృతమతి మనసా. ౮

వ. అని కాశీనగరంబునందుఁ గైవల్యాపేక్షఁ బెద్దగాలం బుండ నిశ్చయించి సాత్యవ
తేయు నెవకి యెచ్చటం గానక. ౯

శా. కాశీస్థాననివాసులన్ యతులభి♦జ్ఞానవృత్తులం గాంచి పా
రాశర్యుం డెటఁ బోయె నంచు నడుగం♦ బ్రహ్మావిహీనాత్మకుం
డాశుంఠుం డెటఁబోయెనో యెఱుఁగ మ♦య్యా మీరు పోపొండు వి
శ్వేశద్రోహి నెఱుంగ నేమపని వాఁ♦డెచ్చోటికిం బోయెనో. ౧౦

వ. అని సాత్యవతేయుండు చేసిన యపరాధంబు తేటపడం జెప్పిన. ౧౧

తే. కూడుపెట్టక యేన్నాళ్లు♦కుతిలపఱచి, గాసిసేయుట యిది తప్పు♦గాదె తనకు
నెదురు కెదురేల కోపించె♦నిందుధరుఁడు, అకట గుర్తెఱ్ఱ బాపరా♦యణునిమీఁద.

కం. ద్వైపాయనముని వెడలం, ద్రోహించిన కోపగాఁడు♦ధూర్జటి యౌరా
శ్రీపతి మనలను ననుకం, పాపరుఁడై యిచట నేల♦బ్రతుకఁగ నిచ్చున్. ౧౩

వ. కృష్ణద్వైపాయనుఁడు తోడిప లోకంబు గాక యనుచు నమ్మునిలోకంబు కాశికానగ
రంబు వెలువడి శాఖోపశాఖల నతని చొప్పుపట్టికొని దక్షారామంబు ప్రవేశించి.

తే. తీర్థయాత్రాక్రమంబులు♦తెలియలేక, నారదుండు నానాపురా♦ణజ్ఞుఁడగుట
నతనిఁ బూజించి యందఱు♦నడిగి రప్పు, డత్రిజమదగ్నిభృగువసి♦ష్ఠాదిమునులు.

మత్తకోకిలము. నీవెఱుంగనితీర్థముల్ ధర♦ణీతలంబున లేవు స
ద్భావ మొప్పఁగఁ జెప్పు దైవత♦తాపసోత్తమ తీర్థయా
త్రావిధానము దక్షవాటిక♦థాక్రమంబును సప్తగో
దావరప్రథితంబు భీమస♦దాశివోత్సవు లీలయున్. ౧౬

వ. అని యడిగిన నారదుం డిట్లనియె. ౧౭

తే. అఖిలతీర్థోత్తమోత్తమం♦బనఘులార, పావనం బైనసప్తగో♦దావరంబు
తనకుఁ దాన మహానదీ♦తటమునందు, నెలకొనియున్నాఁడు భీమేశ్వ♦రేశ్వరుండు. ౧౮

తే. సప్తగోదావరంబు ని♦ర్ఘరమనంగ భీమనాథేశ్వరస్వామి♦వెలుపనంగ
ధర్మపరులార శబ్దభే♦దంబ గాని, యర్థభేదంబు లేదు ప♦దార్థసరణి. ౧౯

తే. విమలమతి సప్తగోదావ♦రమునఁ గ్రుంకి, సప్తసప్తిప్రతిష్ఠఁ బ్ర♦సన్నుఁడైన
భీమనాథేశ్వరేశ్వర♦స్వామిఁ జూచు, మనుజులకుఁ బాయు సప్తజ♦న్మములయఘము.

వ. సప్తగోదావరస్నానమంత్రద్వయ శ్లోకములు. ౨౧

శ్లో. సప్తగోదావరం తీర్థం సర్వతీర్థోత్తమోత్తమమ్
అత్రసన్నిహితో రుద్రో భీమనాథేశ్వరేశ్వరః. ౨౨

శ్లో. నమస్తే భీమనాథాయ, సప్తగోదావరాంభసే
పాపేంధనాగ్నయేతుభ్యం, నిమజ్జామి హర త్వయి. ౨౩

ఉ. ఆతతభక్తిభావమున♦నాదియుగంబున సప్తసంయము
ల్గౌతమముఖ్యు లైందవక♦శాధరు భీమయదేవు భక్తివి

స్థాపించి బ్రతిష్ఠచేసి యాభి♦షేకజలార్థము తోడితెచ్చి ర
న్నీతసమస్తతీర్థమయి ♦ విశ్రుతి కెక్కిన సప్తసింధువున్. ౨౪

మ. తనతీరంబునఁ బాయకున్నఁ దనపా♦థఃపూరముల్ గ్రోలినం
దనవీచీతతిఁ దేలినం దనమరు♦ద్వ్రాతంబు సేవించినం
దనుఁ గీర్తించిన లోకపావనునిఁగా ♦ ధన్యాత్ముఁగాఁ బుణ్యుఁగా
నొనరించున్ నరు సప్తసింధు వది యం♦హోభంజనప్రౌఢిమన్. ౨౫

కం. నూడిం దాస్వాదింపుం, డాడుఁడు భీమేశ్వరేశ్వ♦రాకృతిఁ దటినీ
చూడారత్నము జలధి, క్రోడాభరణంబు సప్త♦గోదావరమున్. ౨౬

సీ. పాతాళశ్రీకాల ♦ భైరవస్వామికి, నందికి నభివాద♦నం బొనర్చి
నాకులేశ్వరదేవు♦నకుఁ దాండవాకారు, గణనాయకునకును ♦ బ్రణతిచేసి
కొమరసామిని విష్ణుఁ♦గొల్చివిరూపాక్షు., నాగేంద్రులకు వంద♦నంబునడిపి
నీహారగిరినంద♦నికిమహాలింగంబు, భీమనాథేశ్వర♦స్వామికెరఁగి

తే. మర్త్యుఁడేకాదశేంద్రియ ♦ మదవికార, సంభృతములైయనన్యైక♦సాధ్యములయి
జన్మజన్మాంతరంబులఁ ♦ జాగుచుండు, కల్మషంబులఁ బాయుఁద♦త్క్షణమునంద ౨౭

శా. జ్ఞానాజ్ఞానకృతంబు లైన యఘముల్ ♦ సర్వంబునొక్కత్తున
న్నాను న్నానవకోటి శుద్ధరగతి♦స్సప్తాసగాతీరసం
స్థానావాసుని రామనాథుని జటా♦ఝూటాటవీవాటికా
స్థానాధిష్ఠితదుగ్ధకంఠనవము♦గ్ధస్నిగ్ధకీర్తిద్యుతిన్. ౨౮

తే. ద్వాదశక్షేత్రశివలింగ♦దర్శనమున, నెట్టి సుకృతంబు సిద్ధించు♦నట్టిసుకృత
మాక్షణంబున సిద్ధించు ♦ దక్షవాటి, రామనాథేశుఁగన్నులా♦రంగఁగనిన. ౨౯

తే. ద్వాదశక్షేత్రతీర్థయా♦త్రాభివృద్ధి, నిర్జితేంద్రియులైసేయ ♦ నేర్చు రేని
పాపములుచేసినట్టి ని♦ర్భాగ్యులైన, డాయఁ బోవరు జమునిప♦ట్టనముగవిని. ౩౦

ఉ. దక్షిణకాశికాతుహిన♦ధామకిరీటునిదిక్కు సీమగా
దక్షపురంబునందు బహు♦ధామములన్ శివలింగముల్ సహ
స్రాక్షహుతాశనాదివివి♦ధామరముఖ్యప్రతిష్ఠితంబులై
లక్షలసంఖ్యలున్నవి య♦లక్ష్యములయ్యును గానవచ్చియున్. ౩౧

సీ. నలవ దగ్నిష్టోమ ♦ వాజపేయాదుల, ధూమపానముఁ జేసి ♦ దుఃఖపడఁగఁ
దీర్థసేవార్థమై ♦ దేశాంతరంబులు. గాలుచేష్వడఁ దన♦ కేల తిరుగ
నశ్వగోమహిషమూ♦హ్యసువర్ణవస్త్రంబు, లెన్ని వెచ్చించిన ♦ నేమిఫలము
సంతతంబును గృచ్ఛ్ర ♦ చాంద్రాయణాదుల, నరటుచునుంట యె♦వ్వరికిమెచ్చు

తే. దూరముననుండి తలఁచిన ♦ దురితహరుని, జేరికొలిచిన సకలార్థ ♦ సిద్ధికరుని
నంత్యమావస్థమోక్షదీ♦క్షైకగురుని, భీమనాథేశ్వరేశ్వర♦స్వామిఁ గొలుఁడు. ౩౨

సీ. నేఁ గొమ్ముటేనుఁగు ♦ నే విహంగంబను, నేస్తబ్రోమంబ ♦ నేను గాటియ
నేను బకంబను ♦ నేను గర్కటకంబ, నే నచ్ఛభల్లంబ ♦ నేను నక్క
నేను మండూకంబ ♦ నేను గించుళికంబ, నేను గీటంబ ♦ నే వానరంబ
నే శుకకీటంబ ♦ నేఁ బుండరీకంబ, నే ఖంజరీటంబ ♦ నేను దోమ
తే. నేను మానిసి మున్నంచు ♦ నేకతమున, నొండొరులతోడఁ దను జెప్పుఁ ♦ గొండుకుబుసుఁ
దారకబ్రహ్మమణిపేటి ♦ దక్షవాటి, సంభవించిన ప్రత్యగ్ర ♦ చంద్రధరులు. ౩౩
తే. అఖిలతీర్థప్రదేశంబు ♦ లుపవు లిండ్లు, యజ్ఞవాటిక నల్లకాం ♦ డనువిభేద
మించుకయు లేదు భీమనా ♦ థేశభూమి, జంతువులు శంభులగుదురు ♦ చచ్చినపుడు.
శా. సాక్షాద్దక్షిణకాశికానగరి ద ♦ క్షస్థాన మవ్వీటిలో
మోక్షార్థాక్షరదీక్ష నక్షయసుఖం ♦ బుం బ్రాణికిన్ సత్కృపా
వీక్షాసంకలితానురాగుఁడగుచున్ ♦ విశ్వేశుచందంబునం
ద్ర్యక్షుండీశుఁడు భీమనాథుఁ డొసఁగుం ♦ బ్రాణావసానంబునన్. ౩౪
శా. శ్రీభీమేశ్వరపాదపీఠవిలుఠ ♦ చ్ఛ్రీసప్తగోదావర
వ్యాభుగ్నోర్మిపరంపరాఘుమఘుమ ♦ ప్రారంభకోలాహల
క్షోభోద్వేజితపాతకౌఘము జగ ♦ చ్చూడావతంసంబు ల
క్ష్మీభద్రాసన మొప్పు దక్షనగరీ ♦ క్షేత్రంబు ధాత్రీస్థలిన్. ౩౫
వ. అని నారదుండు చెప్పిన విని తపోధనులు భీమనాథుమాహాత్మ్యంబునకు దక్షారా
మప్రభావంబునకు సప్తగోదావరమహిమంబునకు విస్మయంబందియు దర్శించియు
నమస్కరించియు ధన్యులైన యాత్మారాము లస్మహారామంబునఁ జరియించువా
రునునగుచు సత్యవతీసుతుం గాంచి దక్షారామాయణుండైన బాదరాయణువలన
నప్పుణ్యస్థానంబున మఱియుం గల యశేషవిశేషంబు లెఱింగి. ౩౬
చం. అటఁ జనియొక్కచోటఁ గమ ♦ లాసనబంధము పూని వాహినీ
తటమున బిల్వకానన ల ♦ తాగృహమధ్యమునందు నాసికా
పుటశిఖరాగ్రదృష్టి యగు ♦ పుణ్యుని గాంచిరి మౌనిపుంగవుల్
ఘటమున నుద్భవించిన య ♦ గస్త్య యశోనిధి నిల్వలాంతకున్. ౩౭
వ. తదనంతరంబ యతనితో సల్లాపంబులు నపనయించి తీర్థమాహాత్మ్యంబడిగిన
నతం డిట్లనియె. ౩౮

అగస్త్యుఁడు తీర్థమాహాత్మ్యంబుఁ జెప్పుట.

సీ. జహ్నుకన్యాతీర ♦ సన్నివేశమునకు, దక్షిణాంభోరాశి ♦ తటముసాటి
కమనీయమణికర్ణి ♦ కాప్రవాహమునకు, సప్తగోదావర ♦ జలముసాటి

కటకరక్షకుఁ డైన ♦ కాలభైరవునకుఁ, బ్రకటపాతాళభై♦రవుఁడు సాటి
విశ్వాధిపతి యైన ♦ విశ్వనాయకునకు, భీమనాథేశ్వర♦స్వామి సాటి

తే. మోక్షవిభవంబునకు సాటి♦మోక్షలక్ష్మి
భోగమహిమంబునకు సాటి♦భోగమహిమ
వారణాశికి శ్రీదక్ష♦వాటమునకుఁ
దారతమ్యంబుఁ జర్చింప ♦ ధర్మ మగునె. ౮౦

తే. తరమె వర్ణింప సప్తగో♦దావరంబు
సలిలకల్లోలశిఖరహ♦స్తంబు లెత్తి
పాతకంబులఁ జంకించు♦బహువిధముల
ఘుమఘుమారంభహుంకార♦ఘోష మెసఁగ. ౮౧

వ. అని కుంభసంభవుండు చెప్పిన విని యమ్మహాత్ము వీడ్కొని నగరప్రదక్షిణపూర్వకంబుగా భీమేశ్వరు దర్శించి కృతార్థులై యొక్కరమ్యస్థలంబున నమ్మహామునులు గూర్చుండిరి యనంతరంబ. ౮౨

ఉ. ఆమునిమండలంబునకు ♦ నంజలిబంధముతోఁ బ్రదక్షిణ
ప్రామనమస్కృతుల్ గడపి ♦ గారవమారఁగ మంకణుండు ఋ
క్సామయజుర్విశారదుఁడు ♦ శైవపురాణకథారహస్యగో
ష్ఠీముదితాంతరంగుఁడు ప్ర♦సిద్ధుఁడు భక్తి దలిర్ప నిట్లనున్. ౮౩

సీ. పరమపుణ్యుఁడ నైతి ♦ భాగ్యవంతుఁడ నైతి, ధన్యుండ నైతి నా♦తపసు పండెఁ
దీర్థంబు లన్నియుఁ ♦ దిరిగి చూడఁగఁ జాల, నొక్కజన్మమున నీ ♦ యుర్విలోన
దిగ్దేశముల సర్వ♦తీర్థంబులను నాడి, తీర్థభూతత్వప్ర ♦ తిష్ఠఁ గన్న
మిమ్ముందఱను గంటి ♦ మీకృపాబలమున, నేను దీర్ఘము నైతి ♦ నింత నిజము

తే. భీమనాథమాహాత్మ్యంబు♦పెంపు వినఁగ, వేడ్క యగుచుండు నాకు నీ♦వేళయందుఁ
బ్రార్థనము చేసి వేఁడెద ♦ భవ్యులార, యానతీఁదగు నాకు మీ♦లోన నొకఁడు.

వ. అనిన విని యందఱు వసిష్ఠమహామునిం బ్రార్థించిన సకలమునిజనానుమతంబునఁ గుంభసంభవుని నియోగంబున నప్పుడు మైత్రావరుణుండు మంకణున కిట్లనియె.

కం. భీమ మగు గరళకూటము, భూమియు గగనమును దిశలఁ ♦ బొడచూపినచో
భీమగతి మ్రింగెఁ గావున, భీమేశ్వరుఁ డయ్యె నితఁడు ♦ బిరుదాంకమునన్. ౮౬

వ. అనిన విని మంకణుండు పంకజాసనసంభవునితో మునీంద్రా దక్షవాటికాధీశ్వరుండు కాలకూటంబు నెబ్భంగి నుపసంహరించె నక్కథాక్రమంబు పరిపాటిం దేటపడ నాకెఱింగింపవే యనుటయు నతం డిట్లని చెప్పం దొడంగెఁ దొల్లి జలం

⁂ క్షీరసాగర మథనకము ప్రారంభము. ⁂

ధరాంధకమహిషాసుర బిడాలాక్షధూమ్రాక్ష గంధసింధురాసురవిద్యున్మాలితారక బలిబాణపౌలోమనివాతకవచకాలకేయాదులగురాక్షసులును బాకశాసనపావకపరేతరాజపలలాశిప్రాచేతసపవనపౌలస్త్యపశుపతి ప్రధాను లగు వేల్పులును దమలోన దాయాదసంబంధంబునం బొడమినవైరానుబంధంబునం బరస్పరవిజిగీషులై రోషంబున నెడుసువేలంబులు పెట్టి కట్టుపకాసులై ప్రతిఘటించి కొట్టుకొని యున్న సమయంబున. ౪౭

సీ. దివ్యాయుధములైదు ♦ ధృతిచేతనంబులై, శత్రుసంహారంబు ♦ సంస్తుతింపఁ [ద
బులుఁగురేఁడుకరాబ్జ♦ములు రెండుమొగిడించి, భ్రూలతాదేశంబు ♦ పోలుపునర
సౌఖశాయనికులై ♦ సనకాదియోగీంద్రు, లనురాగవీక్షణం♦బభిలషింప
నూరురంభాస్తంభ ♦ యుగళంబుపైనుంచి, లక్ష్మి శ్రీపాదప♦ల్లవములొత్తఁ

తే. బన్నగాధీశభోగత♦ల్పంబు మీఁదఁ, దత్ఫణారత్నదీప్తిమై ♦ తళుకుఁ జూపఁ
బాలమున్నీటిలో నిద్ర♦మేలుకొన్న, హరికిఁ బొడసూప నేతెంచె♦హరిహయుండు.

వ. ఇట్లు చనుదెంచి. ౪౯

తే. ఒంటి నేతెంచి మంతనం♦బుండి నిలిచి, చక్రధరుతోడ హితకార్య ♦ చర్చచేసి
యేగె దేవేంద్రుడిగుచెవి ♦ నెఱుఁగకుండ, సిద్ధసంకల్పుఁడై యాత్మ♦శిబిరమునకు.

వ. తదనంతరం బాశ్రీమన్నారాయణుండును. ౫౧

కం. ఓవెఱ్ఱులార యేటికి, నీవెడఁగు విచారములు స♦హింపఁగ రాదా
యేవారికైన మేలా, చావు లతర్కితములుగ్ర♦సంగ్రామములన్. ౫౨

తే. కుడిచికూర్చుండి మీరేల ♦ కొఱఁతయైన, కుమ్ములాడెదరో యన్న♦దమ్ములార
గోత్రక్రొవ్వియు సెలగట్టెఁ ♦ గోటికినట్లు,కటకటా మీవివేకంబు♦గాడుపడఁగ.

ఉ. భద్రము మీకుఁగావలె స♦పారముగా సురదైత్యులార గా
విద్రవ ముజ్జగింపుఁడు వి♦వేకము పాకము దప్పకుండఁగా
భద్రసువర్ణపీఠికల♦పైఁ గొలువుండి త్రిలోకరాజ్యమ
చ్ఛిద్రముగాఁగనేలుట వి♦శేషమొ చచ్చుట తా విశేషమో. ౫౪

వ. అది గావున సుధాపానంబున జరామరణంబు లుజ్జగించి సుఖం బనుభవింపుఁడు క్షీరసముద్రమథనంబునం గాని సుధారసంబు సంభవింపదు గావున. ౫౫

శా. క్షీరాంభోధి మథింపఁ గావలయు న♦క్షీణప్రతాపప్రభా
వారంభంబున నాదికచ్ఛపము మూ♦లాధారకుండంబుగా
సారోదారము మందరాచలము చం♦చన్మంథదండంబుగా
గారాపూర రసాతలాధిపతిదృ♦క్కర్ణుండు సూత్రంబుగన్. ౫౬

గీ. అనిన శౌరిపల్కు ♦ వినిసన్నుతించి యా, దేవతలును బూర్వ ♦ దేవతలును
నమృతమథనమునకు ♦ నారంభమొనరించి, రుల్లమునఁ బ్రమోద ♦ముప్పతిల్ల.
శా. బాహాస్తంభచతుష్టయుంబున మురప్రధ్వంసి లంఘించి యు
త్సాహంబొప్పఁగ నెత్తె మందరమహీ♦ధ్రంబుద్ధతిం గూటసం
దోహంబుల్ ద్రుహిణాండకర్పరము ను♦ద్ఘాలింప దిక్సీమలం
గ్రాహింపం బతయాళునిష్ఠురమహా♦గండోపలధ్వానముల్. ౫౮
సీ. కపటకచ్ఛపమైన ♦ కైటభాంతకుపేఁపు, కొమరు మీఱినచుట్ట ♦ కుదురుగాఁగ
నారసాతలమూల♦మైనమందరమహా, ధరణీధరంబుమం♦థానకముగ
దందశూకాన్వయా ♦ ధ్యక్షుండు వాసుకి, తతపరిగ్రహణసూ♦త్రంబుగాఁగ
నావహప్రవహాదు ♦ లగుమారుతంబులు, తగులఁగట్టినయూక ♦ త్రాళ్లుగాఁగ
తే. బలిపురోగములగు దైత్య ♦ పరివృఢులును, దివిజనాయకుఁడాదిగా ♦ దేవతలును
దరిచి రంభోధిఘుమఘుమ♦ధ్వానరవము, భువనగోళంబుదిక్కులు♦చెవుడువడఁగ.
వ. ఇవ్విధంబున సురాసురవ్యూహంబు లుత్సాహంబులు నుదంబులు ముదంబులు శౌర్యంబులు ధైర్యంబులు క్రౌర్యంబులు వీర్యంబులు హుంకారంబులు హుంకారంబు లుల్లాసంబులు ప్రహాసంబులు బలంబులు చలంబులు జవంబులు రవంబులు నదల్పులు విదల్పులు వీకులు తాఁకులు జూఁకలు కూఁకలు మూఁకలు పేఁకలు తెగింపులు నగింపులు నింపులు సొంపులు పెంపులు గుంపులు పరువులు మురువులు గెలియ మెఱయ బాహావష్టంభసంరంభవిజృంభణంబునఁ దరతరంబు తరువందరువఁ దరిత్రాడు పాఁపఱేనియొడలి మలకలుపులు విడి తెగులునడి దిర్దిరందిరుగు మందరగిరి కందరాఘాతంబులం గలగుండువడి కరిమకరితిమింగిల మత్స్యకచ్ఛపఘులీకుళీరంబులు సవ్యాపసవ్యయాతాయాత పరిభ్రమణంబులచేత విచేతనావస్థఁ బరిభ్రమించి యంతర్మగ్నంబులగుచు పయఃపయోధరంబులు తెక్కలు ముణుఁచుకొని ప్రుంగి యణంగి తరంబులనొదుగ దుగ్ధార్ణవంబు ఘూర్ణమానంబయ్యె నప్పుడు భుజంగపుంగవవదన నాసానిష్ఠ్యూతనిష్ఠురవిషనిశ్శ్వాసపవన ధారాసంధుక్షణంబున నభిస్యంధ జ్వలనంబు ప్రజ్వలించెనో యన భుగభుగధ్వని తోడం గూడి సుడిగొననెగయుక్రొంబొగల వెంబడి విస్ఫులింగంబు లాస్ఫాటించి దిక్కులంజూఱ పుచ్చంజిచ్చు పెచ్చుపెరిఁగి కోమలతమతమాలపల్లవంబుల యుల్లాసంబు నుల్లసంబాడు నల్లనినాలుకలు విషం బుమియుచుంగమియుచు భృంగసంకాశంబును నీలజీమూతసన్నిభంబును గల్పాంతసమయవహ్నికల్పంబును గాలమృత్యుప్రతిమంబును యుగాంతాగ్నివర్ణసంబును నై చటచ్ఛటాశబ్దంబులతో నసహ్యవిష జిహ్వాలకలాపంబులు బ్రహ్మాండకర్పరంబునప్పళింప నిప్పులు చెదరి

చదలు దరిఁగొల్పు నుల్కాపాతంబులుం బోలెదిక్కులఁ జురజుర స్రుక్కి లావెక్క
సప్తపాతాళభువనచక్రవాళంబు ఘురఘురం బొక్కవెక్కసంబయి కోలాహలాభీలం
బయి హాలాహలం బుద్భవించిన. ౬౦

సీ. పంకజప్రభవుఁ డ ♦ బ్రహ్మణ్యమొనరించెఁ, దాలసన్నిభభుజా♦స్తంభ మెత్తి
తరిత్రాడు విడిచి బృం♦దారకాసురకోటి, పంచబంగాళమై ♦ పాఱిపోయె
హాహానినాదకో♦లాహలోత్తాలమై, త్రైలోక్యమునుభీతిఁ ♦ దల్లడిల్లెఁ
గనకవర్ణుండైన ♦ కైటభాసురవైరి, పొగనూరినల్లనై ♦ బొగ్గుపడియెఁ

తే. బెటిలె బ్రహ్మాండభాండంబు♦ చిటిలెదిక్కు
లురలె పాతాళభువనంబు♦లుదిలె నభము
మేటి ధాటీజనితకాల ♦ కూటవిషము
చిచ్చు విడివడి యంతంత♦ పెచ్చుపెరుఁగ. ౬౧

వ. అప్పుడు మిసిమింతు డనుంగాక పయోధిప్రాంతంబున దక్షవాటంబున హాటక
సింహాసనాసీనుం డయిన లలాటలోచను భవబంధమోచను సోమశేఖరుని శర
ణంబుసొచ్చి హరివిరించి పురందరాది బృందారకు లిట్లనిరి. ౬౨

చం. అభయము పార్వతీశ యభ♦యంబు మహేశ శశాంకశేఖరా
యభయము శూలపాణి యభ♦యంబు మదాంధకృతాంతమర్దనా
యభయము ఫాలనేత్ర యభ♦యంబు కృపామయదివ్యమానసా
యభయము భీమనాథ యభ♦యం బభయం బభయంబు శంకరా. ౬౩

తే. అనిభయభ్రాంతు లగు మశ♦క్రాదిసురలు, బలిభుగోగము లగు దైత్య♦పరివృఢులును
శరణుచొచ్చిన నభయహ♦స్తంబుసాఁచి, వెఱవకుం డుఁడు మీ రని♦విశ్వవిభుఁడు.

శివుఁడు హాలాహలము మ్రింగుట.

మ. పటుహుంకారమహాట్టహాసకలనం ♦ బాతాళభూస్వర్గసం
కటసన్నాహసముద్భవం బయినయా ♦ కాకోలకాలాగ్ని ధూ
ర్జటి హస్తాబ్జమునందుఁ గైకొనియె నా ♦ జ్వాలాకులక్ష్వేళ మ
ప్పటివేళ న్మదభృంగమయ్యె శశిభృ♦త్పాణాబ్జమధ్యంబునన్. ౬౫

కం. కటకమగువిషము విషధర, కటకం బగుకేలఁ బూని ♦ కౌతూహలియై
ఘుటికాసంసిద్ధుఁడు రస, ఘుటికయునుం బోలె శివుఁడు ♦ గుటుకన మ్రింగెన్. ౬౬

కం. అపుడు హిమాచలకన్యక, యుపగూహన మాచరించు ♦ నొఱపునఁ జుట్టెం
ద్రిపురాంతకుకంఠంబునఁ, దపనీయచ్ఛాయ నొప్పు ♦ తనదోర్వల్లిన్. ౬౭

ఉ. చుట్టిబిగించిపట్టె పుర♦సూదన యీ గరళాగ్నిఁ గంధరా
ఘట్టమునందు నిల్పు మది♦గాక దిగంబడనిచ్చితేని లో

పట్టునయున్నలోకముల ♦ భస్మముసేయు వెలార్చితేని వె
ల్పట్టునను న్నలోకముల ♦ భస్మముచేయు నిజంబు చెప్పితిన్. ౬౮

వ. అనుటయు. ౬౯

శా. శంభుం డంబికపల్కుఁ గైకొని జగ♦త్సంరక్షణార్థంబు సం
స్తంభించెన్ నిజకంఠగోళమున వి♦శ్వక్షోభసంత్రాససం
రంభారంభవిజృంభణోత్కటకలా♦రౌద్రంబుఁ గాకోలమున్
జంభారాతి మణిప్రకల్పితవిశే♦షానిర్విశేషంబుగన్. ౭౦

వ. అప్పుడు మహాదేవుని దేవత లిట్లని స్తుతియించిరి. ౭౧

దేవత లీశ్వరుని స్తుతించుట.

సీ. సచరాచరం బైన ♦ జగము రక్షించితి, హాలాహలానలం ♦ బారగించి
శరణాగతత్రాణ ♦ పరతంత్రభావంబు, నిఖిలలోకేశ్వర ♦ నీకె యొప్పు
భువనైకరక్షణ ♦ వ్యవహారచిహ్నకు, గుఱుతయ్యె నీకంఠ ♦ కోణచిహ్న
త్రైలోక్యభీమంబుఁ ♦ గాలకూటము మ్రింగి, కైకొంటి భీమాఖ్యఁ ♦ గాలకంఠ

తే. యఖిలదిక్పాలకులును నీ ♦ యాజ్ఞవారు, నీదునిశ్వాసపవనంబు ♦ నిగమరాశి
యమరకులసార్వభౌమ లో♦కాభిరామ, దక్షవాటీపురీకేలి ♦ ధామ భీమ. ౭౨

తే. దేవదేవ మహాదేవ ♦ దివిజవంద్య, సర్వలోకైకరక్షణ ♦ చతుర శర్వ
హాలహాలకూటసంపర్క ♦ నీలకంఠ, మ్రొక్కెదము దేవికిని నీకు ♦ ముకుముత్తోడ.

మ. బహిరంతస్స్థితలోకరక్షణకళా ♦ పారీణ శైలాత్మజన్
బహిరంతస్స్థితలోకరక్షణకళా ♦ పారీణుని న్దేవర
స్పృహణీయస్థిరసత్కృపాగుణనిధా♦నం బైనదాక్షాయణి
స్పృహణీయస్థిరసత్కృపానిధి నిను ♦ న్వర్ణింతు మే మీశ్వరా. ౭౪

తే. సంహరించితి భువనశో♦షకమువిషము, నభయమిచ్చితిరక్షించి ♦ యఖిలజగము
శాంతమయ్యె నరిష్ట మి♦ష్టంబు ప్రబలె, దక్షిణాబ్ధితటావని ♦ ధామ భీమ ౭౫

కం. ధరణియు గగనము దిక్కులు, దరికొని మండెడు విషాగ్నిఁ ♦ దత్క్షణమాత్రం
గరిమున ధరించి మ్రింగిన, నియమధృతి నీక యొప్పు ♦ నీలగ్రీవా. ౭౬

ఉ. ఆయతసత్కృపామహిమ♦హాలహలాగ్నిభయంబు నీమహో
పాయముచేతఁ బాపితివి ♦ ప్రాణులవాఁడవు దక్షవాటికా
నాయక భీమలింగ శమ♦నం బొనరించితి గాక యింతకుం
గోయిలవన్నెఁ జెంది మఱిఁ ♦ గ్రొక్కదె శంకర వోనె లోకముల్. ౭౭

కం. లోకత్రయైకసంర, క్షాకల్పన మాచరింప ♦ సదృశులు వేల్పుల్
నీ కితరులు లే రధికులు, లేకుండుటఁ జెప్పనేల ♦ లేఖాధ్యక్షా. ౭౮

తే. మమ్ము రక్షించి తని యేల ♦ మాటిమాటి, కభినుతింపంగ దక్షవా♦టాధినాథ
తల్లిచంద్రులు రక్షింపఁ ♦ దలఁపకుండ్రె, ప్రజల భీమేశ బహువిధో♦పద్రవముల.

సీ. శ్రీభీమనాయకా ♦ శివ మమ్ము రక్షింపు, విశ్వేశనాథ దే♦వియును నీవు
శ్రీనీలకంధరా ♦ శేషాహిభూషణ, మమ్ము రక్షింపు మ♦స్త యును నీవు
రక్షింపు మమ్ము శ్రీ♦దక్షవాటీశ్వరా, వేదాంతవేద్య దే♦వియును నీవు
దక్షిణాంబుధితటీ♦ధామ నిర్జితకామ, మమ్ము రక్షింపు మ♦న్నయును నీవు

తే. వేడ్క రక్షింపు దేవ దే♦వియును నీవు, ప్రతిభ రక్షింపు గిరిశ యం♦బయును నీవు
దుగ్ధపాథోధిభవవిని♦ర్ధూమధామ, కాలకూటాగ్నిసంహార♦కారి యభవ. ౮౦

కం. శరణము భజింతు మభవుని, శరణము భజియింతు మర్ధ♦చంద్రాభరణున్
శరణము భజింతు మీశుని, శరణము భజియింతు మద్రి♦జావల్లభునిన్. ౮౧

తే. సిరియు వాణియు మొదలైన ♦ సురపురంధ్రు, లట్టుగడుపునుదల్లఁగా ♦ నభిలషించి
నియమమునఁ గొల్తు రెవ్వని♦నిత్యకలన, నట్టిభీమేశు నినుఁ గొల్తు♦మహరహంబు.

సీ. విశ్వంబు సృజియించు♦విధి మహేంద్రుఁడుఁ గొను, వివిధాధ్వరముల హ♦విర్విభాగ
మగ్నియాహుతిమోయు♦నమరసంఘమునకుఁ, బాపపుణ్యంబు లే♦ర్పఱచు యముఁ
ప్రత్యవాయములచే ♦ బ్రతుకు రాక్షసతతి, వర్షించుఁ బర్జన్య ♦ వరుణమూర్తి [డు
గ్రహచక్రవాళంబు ♦ గాలి మోపుచు మోనుఁ, గొండ్రు సంస్తుతి♦గ్గునఁ బితరులు

తే. నవనిధానములును యక్ష♦నాథుఁ డేలు, నాసదాశివుఁ డీశానుఁ♦డై తనర్చుఁ
బరఁగ నేనాజ్ఞ నింద్రియ♦ప్రతతి నడుచు, నట్టిభీమేశ్వరుఁడు మాకు♦నభయ మొసఁగు.

సీ. వరుణుఁ డెవ్వని యాజ్ఞ ♦ వారాశిఁ బాలించు, గాలి యెవ్వని యాజ్ఞఁ♦గంప మొందు
నవనిధానములుంచిం♦తారత్నసురభులు, యక్షరా జెవ్వని ♦ యాజ్ఞ నేలు
నెవ్వని యాజ్ఞ నర్కేందుగ్రహంబులు, చదలమార్గంబున ♦ సంచరించు
శైలకాననవార్ధి ♦ సహితమౌనీధాత్రి, నహినాథుఁ డెవ్వని ♦ యాజ్ఞఁ దాల్చు

తే. నట్టి భీమేశు వేదవే♦దాంతవేద్యు, సర్వకేయూరదేవతా ♦ సార్వభౌము
సప్తగోదావరోత్సంగ ♦ సన్నివిష్టు, నాశ్రయింతుము నిన్నుఁ జం♦ద్రార్ధమౌళి. ౮౪

వ. దేవదేవ మహాదేవ సదాశివ యీశ యీశాన తత్పురుష యఘోర సద్యోజాత వామదేవాఖ్యాన పంచవదన మూర్తివిశేష ప్రకృతిప్రధానకారణ! మీకు సాష్టాంగ నమస్కారంబు. ౮౫

కం. నీమహిమార్ణవమునకుచు, సీమాంతము గలదె రాజ♦శేఖర దక్షా
రామపురధామ శంకర, భీమేశ్వర నీలకంఠ ♦ పేశలకరుణా. ౮౬

వ. అని యనేకప్రకారంబుల బృందారకదైత్యులు తన్నుఁ బ్రస్తుతింపఁ గాలకూటంబు హరించిన పంచాననుం డగు భీమేశ్వరుండు హరి విరించి పురందరాదుల నాలోకించి యిట్లనియె. ౮౭

శివునియాజ్ఞను సురాసురులు విఘ్నేశుని బూజించి పాల్కడలిఁ దరియించి చంద్రాదులఁ బడయుట.

తే. మనము విఘ్నేశు సేవింప ♦ మఱచినార, మతని సేవింపకున్న నే♦లా ఫలించు
నఖిలకార్యంబులును నవ♦శ్యముఫలించు, నర్థిఁ గార్యార్థసిద్ధి నర్చ ♦ ననుసరింప. ౮౮

మ. అని యంభోధితటోపకంఠమున ద♦క్షారామమధ్యంబునన్
ఘనునిం దాండవవిఘ్ననాయకు మహా♦కాయున్ సముత్తుంగకాం
చనసంకాశు ననేకరత్నఖచిత ♦ స్వర్ణాగ్రసింహాసనం
బునఁ గూర్చుండఁగఁ బెట్టి భక్తిపరతం♦బూజించి రవ్యగ్రులై. ౮౯

సీ. జలకమార్చె బలారి ♦ సప్తగోదావర, సలిలధారాహేమ ♦ కలశసమితిఁ
గర్పూరకస్తూరి ♦ కాగంధసారంబు, నలఁదె వైవస్వతుం ♦ డంగకములఁ
బ్రన్నఁగాఁ బెనగొన్న♦బ్రహ్మసూత్రంబులఁ, బసపూన్చి యర్పించెఁ ♦ బద్మభవుఁడు
పారిజాతకతరు ♦ ప్రసవమాల్యంబులు, వక్షస్థలంబున ♦ వైచె శౌరి

తే. ధూమకేతుండుమహిసాక్షి ♦ ధూపమిచ్చెఁ, బూన్చె యక్షాధిపతిమణి♦భూషణముల
నంధకాసురుఁ డిడియె దూ♦ర్వాంకురములు, వీచెఁ బవనుండు కుంచియ♦ విఘ్నపతికి.

వ. అనంతరం బామోదకాపూపపాయసఘృతమధుక్షీరశర్కరానూపజంబూకపిత్థ
చూతఖర్జూరకదళీనారికేళఫలపుండ్రేక్షుసమన్వితంబుగా మహోపహారంబులఁ
గల్పించి వేల్పులుఁ బ్రావేల్పులును ననల్పభావనావిశేషంబుల నశేషవిధంబుల
మూషకవాహనునకుఁ బ్రదక్షిణంబులు ప్రణామంబులుం జేసి వలగొని క్రమ్మఱప
యోనిధి మథనంబునకుఁ బ్రారంభించిన. ౯౦

తే. మందరాచలమంథాన♦మథ్యమాన, దుగ్ధపాథోధిలో సము♦ద్భూతమయ్యె
బాలశశిరేఖ యసురులుఁ ♦ వేలుపులును, నిచ్చి రవ్వస్తు వర్థి భీ♦మేశ్వరునకు. ౯౨

వ. వెండియుఁ దరువందరువఁ గల్పతరువును నప్సరస్సతులును గౌస్తుభమాణిక్యం
బును నుచ్చైశ్శ్రవం బనుహయంబును నైరావతం బనుధవళగజంబును నాదిగా
సకలకామదంబులు సర్వమంగళాస్పదంబులు నిఖిలభువనమోహనంబులు నైన
పదార్థంబు లుద్భవించెఁ దదనంతరంబ. ౯౩

కం. తరతరమ దరువఁ దరువం, దరియం దుదయంబు నొందె ♦ ధన్వంతరి సా
గరమునఁ గడుగరగరనై, కరమునఁ గరమరుదు నమృత♦కలశముఁ దానున్. ౯౪

సీ. సంపూర్ణపూర్ణిమా ♦ చంద్రబింబంబుతోఁ, బుట్టెఁ దెల్లనితమ్మి ♦ పువ్వుమొగ్గ
విరిసె నొయ్యొయ్యన ♦ వేలావనీవాటి, పవమానకోమలా ♦ స్ఫాలనమున
వాసించె నఖిలది♦గ్వలయంబు మధురవి, స్ఫార కేసరధూళి ♦ సౌరభములు
సంభోజమధ్యంబు ♦ నందుద్భవంబొందె, మహితకాంతిచ్ఛటా ♦ మండలంబు

తే. అందుమణికర్ణికాగ్రసిం♦హాసనమున, లక్ష్మియుదయించిహస్తప♦ల్లవమునందుఁ
బసిఁడిపూదండఁబూ♦జించెఁ బద్మనయను, నర్థివరియించెలీలాస్వ♦యంవరమున.

దేవాసురు లమృతమునకై పోరుటయు శ్రీమన్నారాయణుండు దేవాసురుల వంచించుట.

ఉ. అంతులుమీఱి మిక్కిలిగ♦ర్వాఁగతనంబున దొమ్మిచేసి దు
ర్దాంతపరాక్రమోన్నతులు ♦ దానవదైత్యులు వేల్పువెజ్జు ధ
న్వంతరిచేతి దుగ్ధమయ ♦ వార్థిసుధారసపూర్ణకుంభముల్
సంతనకట్టి పుచ్చుకొని ♦ చయ్యన నేగిరి నిర్విశంకతన్. ౯౬

వ. అప్పుడు. ౯౭

కం. నారాయణుండు మాయా, నారీరూపమునఁ గపట ♦ నాటకలీలం
బారాయణత హరించె సు, రారులచే నమృతకలశ ♦ మాసమయమునన్. ౯౮

చం. అమృతముఁ గోలుపోయి విబు♦ధారులు గంధగజాసురాంధక
ప్రముఖులు మోములందు విన♦బాటు దలిర్పఁగఁ గూడియున్నచో
నమరఁగ నారదుండు గగ♦నాగ్రమునం జనుదెంచి వారికిం
బ్రమదముతోడ నిట్లనుచుఁ ♦ బల్కెను వాక్పరిపాటి యొప్పఁగన్. ౯౯

నారదోక్తినసురు లీశ్వరుని బూజించి వరంబులు వడసి లోకముల బాధించుట.

శా. రక్షోనాయకులార నిర్జరవర ♦ వ్రాతంబుచేతన్ సుధా
భిక్షాపాత్రము వోయెసంచు మదిలో ♦ బెగ్గిల్లఁగా నేటికిన్
రక్షార్థంబు భజింపరాదె యభవుం ♦ ద్రైలోక్యకుక్షింభరున్
దక్షారామపురాధినాథుని సుధా♦ధామాగ్రచూడామణిన్. ౧౦౦

కం. అని నారదుండు పల్కఁగ, విని యందఱు భీమనాథు ♦ విశ్వేశ్వరునిన్
ఘనభక్తి దక్షమునిరా, డ్వనమధ్యమునందుఁగొల్చి ♦ వర్ధితబలులై. ౧౦౧

మ. త్రిపురావాసులతోడఁ గూడి కడిమిన్ ♦ దేవాహితుల్ లోకముల్
తపియింపంగఁ దపంబు చేసిరి దృఢ♦స్థైర్యంబు పాటించి పా
శుపతాచారనిరూఢి నందఱును సం♦శుద్ధాంతరంగంబులం
దుపమాతీతుని భీమనాయకుని నా♦ద్యున్ శంభు సేవించుచున్. ౧౦౨

సీ. అరుణోదయంబున ♦ నాకాశవాహినీ, హేమాంబుజంబుల ♦ నిందుధరుని
మిహిరోదయంబున ♦ మహిసాక్షిగుగ్గుల, ధూపధూమంబుల ♦ దురితహరుని
సంగవంబున గంధ ♦ సారకుంకుమచంద్ర, జంబాలమునఁ బుష్ప♦చాపమథను
మధ్యాహ్నమునఁ బక్వ♦మధురాన్నపాయసా, పూపాజ్యదధిఫలం♦బులఁ ద్రినేత్రుఁ

తే. బరఁగుసంధ్యాగమంబునఁ ♦ బటహశంఖ, ఝల్లరీనాదడమరుఝ♦ ర్ఝరుల మ్రోఁత
నర్ధరాత్రంబులందు వీ♦ ణారవముల, హరుని బూజింతు రతిభక్తి ♦ నసురవరులు.

శా. పంచబ్రహ్మషడంగమంత్రములనుం ♦ బ్రాసాదపంచాక్షరిం
బంచాస్యుం గనకాబ్జబిల్వపత్రముల న♦ భ్యర్చింతు రవ్యగ్రత
న్వంచుం గొంచెయనుంగుఁ బెండ్లికొడుకు ♦ న్వర్ణింతు రేకాగ్రతం
బంచద్వేదపురాణమంత్రముల ని♦ ష్ఠాయుక్తి నక్తంచరుల్. ౧౦౪

వ. ఇవ్విధంబున నిష్టార్థప్రదుం డైనయమ్మహాదేవు శ్రీభీమనాథు సేవించి యద్దేవుని ప్రసాదంబున ననశ్వరంబును నత్యూర్జితంబును నసాధారణంబును నగు నైశ్వర్యం బునుం బొంది. ౧౦౫

తే. అపుడు గర్వించి నిర్జించి ♦ రఖిలజనుల, నిర్జరుల బాధ పెట్టిరి ♦ నిరపరాధ
మప్రతీకమహాప్రతా♦ పాతిరేక, నిర్విశంకావలేపులై ♦ పూర్వసురులు. ౧౦౬

బ్రహ్మవిష్ణ్వాదులు శివునికడ కేగి మొఱవెట్టుట.

సీ. వజ్రహస్తుని చేతి ♦ వజ్రాయుధముజాగ్ర, దుద్దీప్తి పాడఱి ♦ మొద్దువోయె
నతితీక్ష్ణతరమైన ♦ యాశుశుక్షణి తేజ, మింగాలతేజమై ♦ యింకిపోయెఁ
జండభీషణమైన ♦ జముగదాదండంబు, బిఱుసంతయును బాసి ♦ బెండుపడియెఁ
బాథోధివల్లభు ♦ పాశవల్లి మతల్లి, దర్పంబు దిగఁద్రావి ♦ త్రాడుపడియె

తే. గాలి దూలెను ధనపతి♦ ఘనతయణఁగె, గ్రహములకు నిగ్రహము పుట్టెఁ ♦ గాలవశతఁ
గాలకేయాదిరాక్షస ♦ గణములెల్ల, భీమలింగంబు కృపఁ బెచ్చు ♦ పెరుఁగునపుడు.

వ. అప్పుడు హరివిరించులు పురందరాదులతోడ నక్తంచరుల చేతఁ బంచకరపాట్లునడి యంతఃకరణంబులఁ జింతించి రాయంచనుం గాంచనవర్ణగరుడం జలంబగుపులుఁగు తేనినెక్కి దక్షిణజలధిపంచ దక్షారామంబున నధివసించిన మంచుఁగొండయల్లునిఁ బంచబాణవిరోధిని డాయంజనుదెంచి పంచాక్షరీపంచబ్రహ్మమంత్రంబుల మంత్రోచ్చారణపూర్వకంబుగా సాష్టాంగదండప్రణామంబులాచరించి ప్రపంచ రక్షణార్థంబుగా నిట్లని స్తుతియించిరి. ౧౦౭

సీ. అవధారు దేవ ద♦ క్షారామవల్లభ, సప్తగోదావరో♦ త్సంగనిలయ
కాలకూటానల ♦ జ్వాలానలముఁ బాపి, సుమ్మురక్షించిన ♦ సుహితకరుణ
భీమేశ్వరేశ్వర ♦ స్వామి మహాదేవ, త్రిపురదైత్యుల బాధ ♦ దీలువడితి
మత్యంతదుఃఖము ♦ లనుభవించితిమి య, నాథులమైతిమ ♦ నాథనాథ

తే. మొదల దేవాసురులను గాచి ♦ పిదప సురలఁ, గాచి పిమ్మట నసులఁ ♦ గాచినాఁడ
విక్రమముఁ గావుపరుస ♦ భోగీంద్రకటక, నీవెఱుంగవె ధర్మంబు ♦ నీలకంఠ. ౧౦౮

తే. చటులతరకాలకూటాగ్ని ♦ సంజహార్ష, పాల్కడలి నట్టనడుమ సం♦ప్రభవమైన
యమృతలింగంబవగునిన్ను ♦ నాశ్రయింతు, మభవ భీమేశ దక్షవా♦టాధినాథ.

కం. ప్రణవోత్తమాంగ ఫణిభూ, షణ గగనమణీందువహ్ని ♦ చక్షుస్త్రితయా
ఫణికట జితమనోభవ, యణిమాదివిశేషదా ప♦రాశ్రయవరదా. ౧౧౧

ఉత్సాహము. నీలకంఠ భక్తలోక♦నిధి భవాబ్ధితారకా
ఫాలభాగమత్కృపీట ♦ భవశిఖా హుతస్మరా
శూలపాణి మమ్ముఁ గరుణఁ♦జూడు త్రిపురదానవుల్
జాలిఁ బెట్టు చున్నవా ర♦సహ్యవిక్రమోద్ధతిన్. ౧౧౨

సీ. అర్కేందుహవ్యవా♦హానలోచనత్రయా, త్రిపురదైత్యుల బాధ ♦ నపనయింపు
మంబికాహృదయాంబు ♦ జాకరకలహంస, త్రిపురదైత్యుల బాధ ♦ నపనయింపు
నిత్యనిర్మలశుద్ధ ♦ నిరవద్యనిర్ద్వంద్వ, త్రిపురదైత్యుల బాధ ♦ నపనయింపు
దీప్తదీప్తాయుధ♦స్థిరమహాదోర్దండ, త్రిపురదైత్యుల బాధ ♦ నపనయింపు

తే. డమరుపట్టసపరశుఖ♦డ్గత్రిశూల, చాపఖట్వాంగధర నీవె ♦ శరణుమాకు
నన్యథాశరణంబు లే♦దభవ భీమ, యపనయింపుము త్రిపురాసు♦రాదిబాధ. ౧౧౩

కం. ముక్త విశుద్ధ నిరంజన, ముక్తప్రియ నిత్య యష్ట♦మూర్తి ప్రతాపో
ద్వృక్తత్రినగరపరివృఢ, నక్తంచరబాధమాన్పు ♦ నాగాభరణా. ౧౧౪

కం. దగ్ధస్మరాంగశంకర, ముగ్ధేందుకళాకలాప ♦ మూర్ధాయన సు
స్నిగ్ధవిధాతృకపాల, స్రగ్ధారి ఘటింపుత్రిపుర ♦ సంహారంబున్. ౧౧౫

కం. అవ్యయ సత్య క్షరాక్షర, సద్వంశ్య యనాదినిధన♦సర్వేశ్వర కృ
ష్ణద్వైపాయనశుకముఖ, విద్వన్నుత సంహరింప♦వే త్రిపురంబుల్. ౧౧౬

కం. సర్వేశ్వరసర్వాత్మక, *శర్వ సదాశివ మహేశ♦శాశ్వత రుద్రా
సర్వజ్ఞ భీమనాయక, గర్వాంధులనణఁపు త్రిపుర♦కర్బురపతులన్. ౧౧౭

సీ. ప్రణతార్తిహర దేవ ♦ పరమేశ దక్షవా, టాధీశ యభవమా♦కభయమిమ్ము†
మంత్రోపనిషదర్థ ♦ మన్మథాంతకగంధ, సింధురాసురవైరి ♦ సేమమిమ్ము
భక్తవత్సలశూల♦పాణి దక్షిణవార్ధి, వేలాతటీవాస ♦ విజయమిమ్ము
సంసారమాయాను ♦ షంగశాశ్వతతమ, స్కంధమార్తాండ మై♦శ్వర్యమిమ్ము

---

* శర్వభవానీశ శరణు ♦ జగదాధారా
సర్వంబుఁ దామెయనుచును, గర్వించిరి యసురులెల్ల ♦ గౌరీరమణా. పా.

† దానవసంఘమే ♦ తత్క్షణంబునఁ ద్రుంతు, ననుచును మాకిప్పు♦డభయమిమ్ము
మమ్ములఁగృపఁజూడు ♦ మన్మథాంతకగంధ, సింధురాసురవైరి ♦ సేమమిమ్ము. పా.

తే. సద్యస్సాక్షింపువామదే♦వా ప్రోవు, జయజయయాఘోరతత్పురు♦షజయమొసఁగు
భక్తబహుళాశాన శేముషు ♦ ప్రబలులైన, త్రిపురదైత్యులగర్వంబు ♦ ధిక్కరింపు.

శా. త్రైలోక్యంబు భుజాప్రతాపమున ని♦ర్వక్రంబుగా నేలుచున్
హేలాహుంకృతిఁ గామగత్రినగరీ ♦ హ్యాకస్యప్రచారంబులన్
నాలాయంబును మమ్ము వెట్టిగొనుచున్ ♦ వర్తించుచున్నారు మీ
రాలస్యం బొనరించినన్ బ్రతుక శ♦క్యం బెట్లు మాబోంట్లకున్. ౧౧౯

కం. లోకంబులు త్రిపురాసురు, లేకచ్ఛత్రంబుగాఁగ ♦ నేలఁగ నున్నా
రో కాలకంఠ యింకిటు, మా కాపులుగావు ధర్మ♦మార్గము దలఁగెన్. ౧౨౦

మ. అభయం బిందుకళాకిరీట శివదా♦యామ్నాయచూడామణీ
యిభరాట్చర్మపటీకటీర యభవా♦యీశాన మొత్తో గిరి
ప్రభవామానసపద్మ పద్మహిత య♦బ్రహ్మణ్యమాలింపు మా
కభిమానచ్యుతిపాటిలెం ద్రిపురదై♦త్యగ్రామణీశ్రేణిచేన్. ౧౨౧

కం. కగుణింపు దక్షవాటీ, పురనాయక భీమలింగ ♦ భోగికులేంద్రా
భరణవిషదహనభయమును, బురదనుజభయంబు సరియ ♦ భువనంబులకున్.

ఈశ్వరుఁడు త్రిపురాసురుల నిర్జించుట.

వ. అని యీప్రకారంబున బ్రహ్మవిష్ణువులు పురందరపురోగము లగుబృందారకుల తోడంగూడి యభినందించినం బరమానందంబునుం బొంది యబ్భువనగోప్త సప్తపాతాళభువనగర్భగోళంబునందుండి యావిర్భవంబునొందిన దివ్యస్వయంభూజ్యోతిర్లింగమూర్తి భీమేశ్వరుండు నిర్వికల్పంబును నిరస్తసమస్తోపాధికంబును నైన నిష్కళంకస్వరూపంబు విడిచి యారకూటపాటలంబై కుసుంభచ్ఛాయనగు జటాపటలంబును, బాండురపుండరీకముకుళడుండుభంబులను శంకనంకురింపం జేయంజాలు బ్రహ్మకపాలమాల్యంబును, జిఱునవ్వుజిగి మెఱుంగిడిన చెక్కుటద్దంబుల నీడచూచు నిద్దంపు నాగకుండలంబులును, గ్రొత్త యఱసంజ కెంజాయ రంజిలు కాఱుమొగులు కైవడిఁ జిలుపచిలుపని నెత్తురుల జొత్తిల్లిన పచ్చియేనికతోలుపచ్చడంబును, గంఠోత్కంఠభువన భవనరక్షణ దాక్షిణ్య లక్షణ కస్తూరికాలేపన నైపథ్యంబునుం బోని కాలకూటవిషమషీ కంఠంబును, సాయాహ్న సమయ సంఫుల్ల మల్లికాకుసుమసముల్లాసంబు నుల్లసంబాడు తెల్లని మేనును, మొఱకుఁదనంబున నేతెంచిన కఱకుచెఱకు విల్తునిజాఱఁబుచ్చినదైచిగురుతేలన నుప్పతిల్లుచు మినుమినుకు మను నులివేఁడి చూపువలనఁ గోపాటోపావార్యహవ్యవాహనాడంబరం బగుల లాటలోచనజ్వాలనంబు ప్రజ్వలించి నికటజటాటవీనాటంబు నాస్ఫోటించునోయని యవధ

రించిన చందంబున నందం బగుమందాకినీసలిలపూరసంభరితం బైన శాతకుంభ
కుంభంబునుంబోని కిరీటకటాహంబును, జంద్రఖండంబులుమూఁగినభంగి నంగీ
కరించినయకించన శశాంకరేఖాలంకారంబును, జెంగలువ తెక్కడాలుఁజక్క
నేలిన కేలియంగుటంబునం జనమస్తురఫుటంబుల మోపి నింగికి నెగయు నందచాఁ
చులీలాకురంగశాబకంబును గనుపట్టు సర్వకళాహంపంబు ధరియించి సర్వాంగ
శాకుచకలశలేపనానైపుణ్య కుంకుమాంగరాగవాసనాసనాథంబును, గరళకూట
పావకోత్పత్తినిరస్త మణికుప్రశస్తంబును నైన శ్రీహస్తంబు విస్తరించి యభ
యంబు ప్రసాదించి సజలజలధరధ్వానగంభీరోదారం బైన కంఠస్వనంబున నిట్లని
యానతిచ్చె. ౧౨౩

మ. అరవిందాసనతార్క్ష్యవాహనసహ ♦ ప్రాయోదిబృందారకుల్
చిరకాలంబును బట్టపాట్లు మదిలోఁ ♦ జింతించుచున్నారు ని
ర్భరదర్పోద్ధతులం బురాసురుల నే ♦ భంజించెదన్ మీకునుం
బరిపాటిన్ నమఁగొల్చి రండు సమర ♦ ప్రారంభసన్నద్ధులై. ౧౨౪

ఆ. అని ముహూర్తమాత్ర ♦ మద్దేవతాచక్ర, వర్తి దక్షవాటి ♦ వల్లభుండు
మనమునందుఁ దలఁచె ♦ మదనాంధకారాతి, శత్రునగరవిజయ ♦ సాధనంబు. ౧౨౫

వ. అనంతరంబ తదభిజ్ఞానప్రభామహామహిమంబునఁ దదాజ్ఞాతిశయంబున. ౧౨౬

సీ. జలరాశిమేఖలా ♦ వలయంబు రథమయ్యె, రవియుఁ జందురుఁడుఁ జ ♦ క్రంబు లైరి
శారదాజీవితే ♦ శ్వరుఁడు సారథియయ్యె, శ్రుతులు నాలుగును వా ♦ హనము లయ్యెఁ
బ్రణవమంత్రికాక ♦ రము ప్రతోదం బయ్యెఁ, దారకావీథి ప ♦ తాక యయ్యె
రత్నసానుధరాధ ♦ రము ధనుర్లత యయ్యె, నాగప్రధానుండు ♦ నారియయ్యె

తే. గంధవాహంబు లేఁడును ♦ గలులుగాఁగ, విలయకాలానలజ్వాల ♦ ములికి గాఁగ
లచ్చిచనుదోయికుంకుము ♦ బచ్చవయుగఁ, బాలమున్నీటియల్లుండు ♦ బాణమయ్యె.

వ. ఇవ్విధంబున సకలసాధనంబులు సన్నిహితంబు లైనక్షణంబ దక్షారామంబున
నయనాభిరాముండు భీమేశ్వరుండు త్రిపురవిజయార్థంబు దివ్యస్యందనం బెక్కి
నప్పుడు. ౧౨౭

సీ. సరిబ్రాహ్మి మొదలైన ♦ సప్తమాతృకలు దన్నూడ సేసలు చల్లె ♦ గోఁగులమ్మ
పసిఁడివేత్రము పట్టె ♦ పాతాళభైరవుం, దందందసందడి ♦ నపనయించె
దివ్యదుందుభినాద ♦ దీర్ఘగర్జితములోఁ, గురిసెమిన్నునునుండి ♦ కుసుమవృష్టి
జయజయధ్వని దేవ ♦ సంయమీశ్వరకోటి, సంఘటించెఁ గరాంబు ♦ జంబు నొసలఁ

తే. ద్రిపురసంహార మొనరింప ♦ దీక్షచేసి, భీమనాథేశ్వరేశ్వర ♦ స్వామి శివుఁడు
దక్షవాటీవిభుఁడు మేరు ♦ ధనువు పట్టి, యేచి పంటవలంతి తే ♦ రెక్కునపుడు. ౧౨౮

సీ. కమ్మినూకినమాత్ర ♦ కలధౌతమునుబోలెఁ, జక్కఁగ నిక్కమై ♦ సొక్కమాన
నంతరాంతరములం ♦ దస్థిబృందంబులు, పెళపెళమనియెడు ♦ గిలుకు లెసఁగెఁ
గగిలి బీటలువాఱి ♦ తగఁ దెత్తెఁ గుబుసంబు, తోరంపు నెల్లుల్లి♦పొరకలట్ల
మహానీలతరఁఘటా♦మండలంబులు లేఁత, చిగురుటాకుల ఛాయ ♦ జేకొనంగె
తే. హాటకాద్రిధనుర్దండ ♦ కూటకోటి, వంచి బాహావలేపమ♦ర్యాదలీలఁ
గాలకంఠుండు త్రిపురసం♦క్షయమొనర్ప, నెక్కుపెట్టినయప్పుడు భో♦గీశ్వరునకు.
కం. ముక్కంటి మేరుచాపం, బెక్కిడి నారించెఁ బన్న ♦ గేంద్రగుణంబుల్
మక్కువ హిమగిరికన్యక, క్రిక్కిఱిసిన కుచములలము ♦ కేలుందమ్మిన్. ౧౩౧
కం. తాటించి నిటలనయనుఁడు, హాటకగిరిచాపవల్లి ♦ నహిశింజిని నా
స్ఫోటించెఁ దక్కఁ దోరము, హాటంకృతి కమలజాండ ♦ మటఁ బగులంగన్. ౧౩౨
మ. గిరిశస్థూలభుజాపరీతవిభవ ♦ క్రీడాసమాస్ఫాలిత
స్థిరబాణాసనగూఢపాద్గుణలతా ♦ దీర్ఘోగ్రఘోషంబునన్
ధరణీచక్రము దిర్దిరం దిరిగెఁ బా♦తాళంబు ఘూర్ణిల్లె నం
బరముం దిక్కులు వ్రయ్యలయ్యెఁ బగిలెన్ ♦ బ్రహ్మాండభాండంబులున్. ౧౩౩
కం. మృడుఁడు కనకాద్రిచాపము, గుడుసువడం దివియఁ గూడి ♦ కుశలప్రశ్నం
బడిగిరి యొండొరులను గని, కడకొమ్ములు నున్న యదితి ♦ కద్రువతనయుల్. ౧౩౪
కం. తెగనిండ ఫాలనయనుఁడు, నగచాపము దిగిచినప్పుడు ♦ నాగేంద్రుండు
బ్బిగువున మొగంబులవగుటఁ, బొగలెగయఁగ విషము భుగులు♦భుగులనఁ గ్రక్కెన్.
కం. విషధరపరిస్పృథనాసా, సుషిరవినిశ్వాసపవన ♦ ధూత్కారరవ
ద్విషవహ్నిజ్వాలంబులు, వృషభధ్వజుచేతి కొండవింట ♦ జనించెన్. ౧౩౬
కం. శ్రీకంఠకఠినభుజపరి, ఘాకృష్టసువర్ణగిరిశ ♦ రాసనమౌర్వీ
కాకోదరముఖసంభవ, కాకోలానలము ముద్దె♦గము దరికొనియెన్. ౧౩౭
కం. కటుకాముఖహస్తంబున, నిటలాక్షుఁడు కొండవిల్లు ♦ నెవ్వడిఁ దివియన్
ఘటియిల్లె నురగరాజ, స్ఫటహాలాహలకృపీట ♦ భవకీలలటన్. ౧౩౮
వ. ఇవ్విధంబున భీమనాథుండు త్రిపురదమనారంభసంరంభంబున శాతకుంభకుంభిని
ధరకోదండం బుద్దండభుజాదండచండిమంబునఁ గుడుసుపడం దిగిచినఁ దత్సమా
కృష్టభారంబున భుజంగపుంగవుండు వేయుపడగలను విషంబుఁ గ్రక్కఁ గ్రక్క
న్నవనవ నాసారంధ్రసముదీర్ణసంభవం బయిన మహోల్కకూటవిషంబు కృపీట
భవజిహ్వాకలాపంబులు గ్రోయుచుఁ దోయధిమథనంబున సంభవించినహాలా
హాలంబునుం బోలెఁ బ్రజ్వరిల్లి సముజ్జ్వలజ్వాలాజాలంబులఁ ద్రైలోక్యంబు
నాక్రమింపందొణంగినం దెగ యుడిపి ఖట్వాంగపాణి యుత్తమాంగంబు జాడించి

గంగాంభఃప్రవాహనిర్ఝరవారిపూరంబులు చల్లియు వామలోచనహిమధామకిరణ వ్రాతంబులం బ్రోక్షించియు నమ్మహోపద్రవం బుపశమింపం జేసి దుర్గాసహాయుండును విఘ్నరాజప్రసాదోపలబ్ధసంభావితుండును నై విషమలక్ష్యంబులయిన త్రిపురంబులు వీక్షించి వెండియు నాది నారాయణునిం బురాణపురుషునిఁ బురుషోత్తము ననాదినిధనుని బాణంబు చేసి యరింబోసి పాశుపతాస్త్రమంత్రకంబుగా నభిమంత్రించి యాకర్ణాంతంబుగాఁ దిగిచి లలాటేక్షణజ్వాలాజాలంబు మును ముట్టనిగిడించి బిట్టుహుంకరించి యట్టహాసంబు చేసి యేసిన నమ్మహాస్త్రంబు. ౧౩౯

సీ. కరపల్లవంబులు ♦ గబళించుఁ గబళించి, ప్రబలనితంబభా♦రముల వ్రాలుఁ
జెక్కుటద్దములపైఁ ♦ జెరలాడుఁ జెరలాడి, శ్రవణావతంసము♦జగులుముట్టు
వలిచన్నుఁగవలపైఁ ♦ బొలసాడుఁ బొలసాడి, నాభిరంధ్రములపై ♦ నటన సేయు
వేణీభరములపై ♦ విహరించు విహరించి, బింబాధరములపై ♦ బిత్తరించు

తే. నభవు కరముక్తనారాయ♦ణాస్త్రవహ్ని, కాముకునికోమలాంతసం♦గంబు పగిదిఁ
దగులమిఁ ద్రుంగఁ ద్రిపురదై♦తేయరాజ, సదనశుద్ధాంతభామినీ ♦ జనములందు.

కం. లోహమయదైత్యనగరీ, గేహంబులు హరశరాగ్ని ♦ కీలాజ్వాలా
దాహమునఁ గరఁగి మూఁడుసమూహములై పెద్దపెద్ద ♦ ముద్దలునయ్యెన్. ౧౪౧

వ. అంత. ౧౪౨

సీ. భస్మరేణువులయ్యెఁ ♦ బ్రాకారగోపుర, ప్రాసాదకుట్టిమ ♦ ప్రాంగణములు
మసిబూడిదయ్యెని♦ర్మల కేళిదీర్ఘికా, కమలినీకహ్లార ♦ కైరవములు
దగ్ధమయ్యెను సమ♦స్తప్రశస్తమహాస, భాభ్యంతరాంతఃపు♦రాంగణములు
దూళయ్యె మాకంతో ♦ ద్ధూతపుష్పపరాగ, వాసనాదిశలగు ♦ వనచయములు

తే. కాలకంఠభుజాదండ ♦ గర్భభార, కుండలీకృతమేరుకో♦దండపరిధి
వలయనిష్ఠ్యూతకైటభ♦ధ్వంసిబాణ, దహనసంధానమునఁ బుర♦త్రయమునందు.

కం. ఫాలేక్షణాస్త్రవహ్ని, జ్వాలాజాలముల నసుర♦పరనగరంబుల్
కాలిన నప్పుడు కాలక, కాలాంతకలింగ మొకటి ♦ కడు నొప్పారెన్. ౧౪౪

తే. ఆదిలింగోద్భవమునాఁటి ♦ యభవుభంగి, నింగిమోచిన యాశంభు ♦ లింగమూర్తి
భీమవరవహ్నిపురములఁ ♦ బ్రేల్చునపుడు, నగ్ని సెగదాఁకకేమియు ♦ సడలకుండె.

మ. అసురాధీశసమర్పితంబులగు లీ♦లారామకల్పద్రుమ
ప్రసవంబుల్ కసుగందవయ్యె విలస♦త్పాటీరగోరోచనా
ఘుసృణాలేపనపంకితాకలనమై ♦ గుంఫించె నారాయణా
స్త్రసముజ్జృంభణభీమలింగమునకుం ♦ దైతేయరాట్స్వామికిన్. ౧౪౬

వ. ఇవ్విధంబుననున్నం జూచి భీమేశ్వరుండు ఋక్సామయజురథర్వణవేదపారాయణ తురంగకంబును రవిశశాంకరథాంగకంబును గమలభవసారథికంబునునగు విశ్వరథం బెక్కి భుజంగమరాజశింజినీకం బయిన కాంచనధరాధరధనుర్దండంబును బుండరీకాక్షు బాణంబును సంధించి పురత్రయంబుల దహించి విజయలక్ష్మిం బరిగ్రహించి విశ్వావసుప్రధాన నానాగంధర్వజేగీయమాన భుజావధానుండై ప్రమోదాతిశయంబున. ౧౮౭

శా. ఆడెం దాండవ మార్భటీపటహాలీ ♦ లాటోప విస్ఫూర్జిత
క్రీడాడంబరముల్లసిల్ల గరళ ♦ గ్రీవుండు జూటాటవీ
క్రోడాఘూతకఠోరకోటకరుటీ ♦ కోటీఘురచ్ఛింధువీ
చీడోలాపటలీపరిస్ఫుటతర ♦ స్ఫీతధ్వనిప్రౌఢిమన్. ౧౮౮

వ. ఇట్లు త్రిపురవిజయానంతరంబునం గృతాంతదమనుండు వెండియు. ౧౮౯

చం. డమరుకడిండిమప్రకట ♦ ఠంకృతియుం గరనాట్యహాసవి
భ్రమమును దాండవారభట ♦ పాటవముం ఘటియిల్ల మాతృకా
సముదయభూతభైరవపి ♦ శాచనిశాచరఢాకినీగణ
ప్రమథసమూహముల్ పొగడ ♦ భర్గుండు సంతస మంది నెంతయున్. ౧౯౦

వ. అనంతరం బాయంబికావల్లభుండు జాంబూనదశైలకోదండం బెక్కుడించి యథాస్థానంబున నునిచి నారి యగుపాపతేనిని విశ్వంభరాభరణంబునకు నియోగించి క్షీరాంభోరాశితూణీరంబున వైకుంఠబాణంబు చేర్చి వేల్పుల వీడ్కొలిపి బ్రహ్మను సత్యలోకంబున నునిచి వేదంబులం దన నిట్టూర్పు గాడ్పులలోనం గలిపి చంద్రసూర్యులం గాలంబుగడుప నియోగించి కృతకృత్యుండై త్రిపురదైతేయుల కుల దైవతంబైన యద్దివ్యలింగంబును బంచబ్రహ్మ సంచాక్షరీపంచతత్వ పంచభూతమయంబగుటం జేసి పంచఖండంబులుగా ఖండించి కృష్ణవేణీమహానదీతీరంబున ధరణాలకోటయను గ్రామంబున నమరేశ్వరునిచేతం బ్రతిష్ఠితంబగుటం జేసి యమరలింగంబునాం బ్రసిద్ధంబైన యమరారామంబును గౌతమీ తీరంబున దక్షిణకూలంబున గుణపూడియనుగ్రామంబున సోమునిచేతం బ్రతిష్ఠితంబు సేయంబడుటం జేసి సోమలింగంబనం బ్రఖ్యాతంబైన సోమారామంబును బాలకోటయను గ్రామంబున శ్రీరామచంద్రునిచేం బ్రతిష్ఠితంబగుటం జేసి రామలింగంబునాం బ్రసిద్ధంబైన క్షీరారామంబును జాళుక్యవంశరాజధానియగు చాళుక్యభీమ వరనామగ్రామంబునం గుమారరత్నంబైన కుమారస్వామిచేతం బ్రతిష్ఠితంబగుటం జేసి కుమార భీమలింగంబనం బ్రఖ్యాతంబునొందిన భీమారామంబును మొదలి మామ యగుదక్షప్రజాపతి యునికిపట్టైన యారామంబగుట దక్షారామంబున

శివసన్నిధానంబై దానుండునట్టుగా నీప్రకారంబున భోగమోక్షప్రదంబులైన పంచారామంబులను బ్రతిష్ఠనొందించి తాను ను దక్షవాటంబున మున్నీటిసీటంబున విశుద్ధస్ఫటిక సంకాశంబును ద్రిదశలోకభామినీవిలోక నచ్ఛాభ్యాగులు చ్ఛాచ్ఛ జ్యోత్స్నాభిషిక్తయుక్తాంగంబగు శ్రీభీమేశ్వరలింగంబునం దధివసించె నిది త్రిపురవిజయోపాఖ్యానంబు దీని వినినను బఠించిన వ్రాసినఁ బ్రశ్నచేసిన బోధించినవారికి సకలపాతకనివర్తనంబై భుక్తిముక్తులు గలుగును సకల కళ్యాణకరంబనిన విని. ౧౫౧

ఉ. అప్పుడు సప్తదివ్యమును ◆ లంచితభక్తిరసప్రయుక్తులై
చప్పటతాళము ల్మొరయ ◆ సంస్తుతిపూర్వముగాఁగ నాడుచుఁ
ముప్పిరిగొన్న మోదమున ◆ మ్రొక్కుచు మైఁ బులకాంకురావళుల్
కుప్పలుగా భజించిరి య◆కుంఠితభావన భీమలింగమున్. ౧౫౨

సీ. ఆఖండపంచకం ◆ బాఖండలాదిక, విబుధమండల నిషే◆వితము చంద్ర
మార్తాండశతకోటి ◆ మహనీయ తేజంబు, కుండలిగ్రామణి ◆ కుండలంబు
పుండరీకత్వక్ప్ర◆కాండజాతిమండిత, కటిమండలంబు శ్రీ◆ఖండఘటిత
పాండురబ్రహ్మాక ◆ పాలసంపుటము బ్ర, హ్మాండకోటిస్ఫుర ◆ దమృతపిండ
తే. మభవ ముద్భవ మాద్యంబ◆నాదినిధన, మప్రమేయం బజయ్యంబు ◆ నప్రధర్ష్య
మఖిల వేదాంత వేద్య ◆ మత్యంతభక్తి, భావనాయుక్తి గలవారి ◆ పాలిసురభి. ౧౫౩

శా. ఎంచన్ బెక్కు విశేషముల్ ధరణిలో ◆ నింపారుచున్నట్టి శ్రీ
పంచారామములందు దక్షిణమహా◆పాథోధితీరంబునన్
బంచబ్రహ్మమయానుభూతప్రకటశుం◆భ ద్దివ్యలింగాకృతిన్
మంచుంగుబ్బలియల్లుఁ డొప్పెసఁగు భీ◆మస్వామి యుద్దాముఁడై. ౧౫౪

శ్లో. కాశీక్షేత్రమృతోజీవి పునర్జన్మశివాకృతిః
చిత్రం దక్షపురీజీవీ నజన్మనశివాకృతిః. ౧

శ్లో. మత్తోనాస్త్యపరందైవం నదేవి గిరిజా సమా
దక్షారామాత్పరంక్షేత్రం నభూతన్నభవిష్యతి. ౨

శ్లో. రత్యంతరేమూత్రపురీషమధ్యే । చండాలవేశ్మన్యథవాశ్మశానే
కృతప్రయత్నోప్యకృతప్రయత్నో । శ్రీదక్షపుర్యాద్వపనోపిముక్తః ॥ ౩

వ. అట్టి దివ్యక్షేత్రంబునందు. ౧౫౫

కం. ఆలింగమూర్తి శర్వ, జ్వాలామాలాకరాళ ◆ సందీప్తంబై
యాలోకింపంబడినం, దేలిరి యానందజలధి ◆ దివ్యమునీంద్రుల్. ౧౫౬

తే. సంస్మితం బైనమదనశా♦సనునిముఖము
చూచి యానందమునఁబొంది ♦ సురలుమునులు
రాక్షసకృతావరోధసం♦రంభ మింకఁ
దమకు లేదని తెలిసిరి ♦ తత్త్వబుద్ధి. ౧౫౭

శా. కారాగారనిబద్ధ లైన దివిష♦త్కాంతాజనుల్ వారికిం
గారా మైనతనూజులుం బతులు దుః♦ఖంబాఱఁ గోదావరీ
వారిం దీర్థములాడి కాంచిరి జగ♦ద్వంద్యుం బురారాతి ద
క్షారామాధిపు భీమనాయకుఁ ద్రిలో♦కాహ్లాదసంధాయకున్. ౧౫౮

వ. తదనంతరం బాభరద్వాజాదిమహామునులు శివున కర్ఘ్యపాద్యాచమనీయార్థంబు భీమనాథమహాదేవునిసమీపంబున గోదావరీవాహినిం బ్రవహింపఁజేయువారై ప్రారంభించి. ౧౫౯

సీ. పంచభూతమయంబు ♦ పరమపంచబ్రహ్మ, తత్త్వతేజస్సము ♦ ద్భాసితంబు
పంచాక్షరీమహా ♦ పరమంత్రమూలంబు, శాశ్వతంబజరంబ ♦ నశ్వరంబు
భైమేశ్వరంబు శో♦భన మాదిమధ్యాంత, శూన్యంబు సకలంబు ♦ శుద్ధబుద్ధ
మనవద్య మదచ్ఛేద్య♦మక్షోభ్య మఖిలది, గ్దేశకాలాపరి ♦ క్షీణమనఘ

తే. మంబరముమోచి యున్నలిం♦గంబుఁ జూచి, సంప్రతిష్ఠ యొనర్పంగ ♦ సమ్మతించి
కాలమీక్షించితగినల♦గ్నంబుఁ జూచి, సకలసంభార నిచయంబు♦సంగ్రహించి.

తే. గౌతమీగంగఁ బాపి యి♦క్కడికి నొక్క, సిద్ధవాహినిఁ బ్రవహింపఁ♦జేసికాని
లింగసంస్థాపనంబుఁగ♦ల్పింపమనుచుఁ, బరమసంయమములేద్వ్వరుఁ ♦ బ్రతినవట్టి.

సీ. ఆలగ్నవేళకు ♦ నమృతదివ్యస్వయం, భూమహాలింగకే ♦ మూర్తియైన
శ్రీభీమనాథుని ♦ శీతాంశుశేఖరు, నభిషేక మొనరింప ♦ నభిలషించి
కదలి సప్తర్షులు ♦ గౌతమాదులుశిష్య, సహితంబుకడుభక్తి ♦ సంభ్రమమున
దక్షవాటీపుర♦స్థానంబునందుండి, యేగియంతంతఁగ♦ట్టెదురఁ గనిరి

తే. గౌతమీగంగ నాలోల♦ఘనతరంగఁ, గేలిడోలావిహారసం♦క్రీడమాన
చక్రవాకబకక్రౌంచ ♦ సారసాళి, హంసకారండవాదిమా♦ద్యద్విహంగ. ౧౬౨

కం. గౌతమకన్యాతటినిఁ, బ్రీతిఁ బయఃపానమాచ♦రించిన మనుజ
వ్రాత మొనర్పదుమరల, స్మాతృపయోధరపయఃక♦ణాస్వాదనమున్. ౧౬౩

వ. అని మునీంద్రులు తమలోన వెండియు నొండొరులం గనుంగొని. ౧౬౪

తే. కంటిరే ఘోరపాతకౌ♦ఘముల నెల్లఁ, గడిమి జంకించుచున్నది ♦ గంగ యిపుడు
వీచికాహస్తవిన్యాస ♦ విభ్రమముల, ఘుమఘుమధ్వానహుంకార♦ఘోషమెసఁగ.

తే. యక్షగంధర్వసిద్ధవి♦ద్యాధరోర, గామరవ్రాతభరితోభ♦యప్రతీర
పృథివియెల్లను రక్షించు♦పేరఁటాలు, మమ్ము రక్షించు గోదావ♦రమ్మ యెపుడు.
తే. అమృత మైనపయోధార ♦ నహరహంబు, సృష్టిఁ గల జంతుకోట్ల ర♦క్షింతు వీవు
జనని వౌటకునేమి సం♦శయము చెపుమ, గౌతమీగంగ యాలోల♦ఘనతరంగ.
కం. త్రైలోక్యవరద పావన, నాళీకాసనకరాబ్జ ♦ నవమణికుండీ
కూలంకషసలిలామృత, పాలింపు గిరీశజాయ ♦ పర్వతతనయా. ౧౬౮
కం. గోదావరి గోదావరి, గోదావరి యంచుఁ బల్కు ♦ గుణవంతులకున్
గోదావరితల్లి సం, పాదింతుగదమ్మ నీవు ♦ భవ్యశుభంబుల్. ౧౬౯
కం. కంబుశశిరజతశుక్తివి, డంబసితచ్ఛాయకలిత ♦ డంబరములు నీ
యంబువు లమృతోపమరుచు, లంబా మా కొసఁగుఁగాత ♦ నభ్యుదయంబుల్.
శా. ఆపాతాళగభీరనీరకసుధా♦హారామలచ్ఛాయకున్
ద్వీపాలంకృతికి న్మహేంద్రనగరీ ♦ నిశ్శ్రేణికాయష్టికిం
దాపోపాయవిధావిహర్త్రికి మహో♦దన్వాన్మృధాలింగన
వ్యాపారప్రతిపన్నసౌఖ్యకును సా♦ష్టాంగంబు గంగమ్మకున్. ౧౭౧
శా. రంభోమూకరశాతకుంభఘటధా♦రాపూరణప్రక్రియా
గంభీరక్వణసాంద్రభిన్నకరిరా♦డ్గండూషనిర్భిన్నకు
న్సంభావించి నమస్కరింతుము త్రిసం♦ధ్యంబున్ మునంబొప్ప నీ
కంభోజాసనకుండికాంబుజననీ ♦ హంసాభ గోదావరీ ౧౭౨
కం. గౌతమికిన్ బంచమహా, పాతకపటలాంధకార ♦ పాటనవిధిరా
డ్గౌతమికి నమస్కారం, బౌతతనుతిఁ జేయుదము ప్ర♦యత్నంబెసఁగన్. ౧౭౩
వ. అని ప్రార్థించి యిట్లనిరి. ౧౭౪
సీ. విచ్చేయవమ్మ శ్రీ♦వృషభవాహనధర, సామజకటమదా ♦ సారధార
పయనంబుగావమ్మ ♦ భర్గజటాటవీ, కుటజశాఖాశిఖా ♦ కోరకంబ
వావమ్మ యాదిమ♦బ్రహ్మాదోఃపల్లవ, స్థితకమండలుపుణ్య ♦ తీర్థజలమ
లేవమ్మ విశ్వంభ ♦ రావధూటీకంఠ, తారమౌక్తికహార ♦ ధామకంబ
తే. తెరలతో వీచికలతోడఁ ♦ దరులతోడ, విమలడిండీరఖండసం♦దములతోడ
మురువు లీవియు నామోద♦మునుజవంబు, వడువునొప్పంగ గంగమ్మ♦నడువవమ్మ.
మ. అదె మాస్వామి సుధారసోద్భవుఁడు ద♦క్షారామభీమేశుఁ డ
భ్యుదయంబొంది ప్రతిష్ఠఁ గైకొనెడు నం♦భోరాశితీరంబునన్
బదమా షట్పదమాలికాపరిలస♦త్పాథోధునీసంపదా
స్పదనానాసలిలప్రవాహాలహరీ ♦ సంభారగోదావరీ. ౧౭౫

శ్రీ భీమనాథేశ్వరుఁడు దనకుఁదాన ప్రతిష్ఠితుండగుట.

తే. తాను దలఁచిన శుభవేళ ♦ దప్పకుండ, సంప్రతిష్ఠితుండై సము♦ర్చనము గొన్న
యమృతలింగంబు భీమనా♦యకునిఁ జూచి, చాల విస్మయ మందిరి ♦ సప్తమునులు.
వ. ఇట్లాశ్చర్యంబునుం బొంది. ౧౯౬
ఉ. తాము వినిశ్చయించిన ప్ర♦ధానముహూర్తము దప్పకుండఁ గా
మారి ప్రతిష్ఠఁ బొందుటకు ♦ నాత్మల సంతసముల్ వహించి యె
వ్వారొకొ మమ్ముఁ గైకొనక ♦ వారక మే మొనరింప నున్న సం
స్కారము తారచేసి రెడ♦సందున నంచుఁ గలంగి యెంతయున్. ౧౯౭
తే. రోషసంరంభములును సం♦తోషములును
హృదయములఁ బిక్కటిలనున్న ♦ ఋషులకడకు
నంతరిక్షంబు నందుండి♦ యతిరయమున
భానుమంతుండు భక్తిసం♦భ్రమము లెసఁగ. ౧౯౮
వ. వచ్చి యభివాదనంబుచేసి ముకుళితకరకమలుండై కమలమిత్రుం డమ్మహామునుల
కిట్లనియె. ౧౯౯
చం. పరమమునీంద్రులార మిముఁ ♦ బ్రార్థనసేయుచు విన్నవించెదన్
గరుణ దలిర్ప మీరు చనవుఁ ♦ గైకొని నన్ను ననుగ్రహింపుఁ డీ
తెరువున మీకు వంకిలులు ♦ దీర్పఁగఁ గాలవిలంబమైన దా
హరుఁడు ప్రతిష్ఠితుండు నగు ♦ నప్పుడు నే నటు పూజచేసితిన్. ౨౦౦
కం. మీ రొనరించు ప్రతిష్ఠా, ప్రారంభము నాకుఁ జేయ ♦ నలవియె శ్రీద
క్షారామవిభుఁడు జగదా, ధారుఁడు గైకొనియెఁ దనకుఁ ♦ దానప్రతిష్ఠన్. ౨౦౧
కం. మేలెట్టి దట్టి శోభన, కాలము సరిగడచెనేని ♦ కావని కంతే
గాలుఁడు కారుణ్యసము, న్నీలితమతిఁ దనకుఁదాన ♦ నిలువంబడియెన్. ౨౦౨
మ. తనకుం దాన ప్రతిష్ఠితుండయిన యీ ♦ దక్షాధ్వరధ్వంసి నే
మును పూజించితిఁ బిమ్మటన్ హరియు నం♦భోజాతగర్భుండునుం
గని కైసేసిరి యంతమీఁద సురలున్ ♦ గంధర్వులుం జేరి య
ర్చనముల్ చేసిరి మీరుఁ జేయుఁడు తగన్ ♦ సమ్యక్సమారాధనల్. ౨౦౩
తే. అనిన సంయములును గాల♦యాపనమునఁ, జంద్రశేఖరు సంప్రతి♦ష్ఠాపనంబు
తమకు సిద్ధింపకునికి సం♦తాపమొందఁ, బలికె నాకాశవాణి వి♦స్పష్టఫణితి. ౨౦౪
ఉ. ఓ పరమర్షులార కరు♦ణోదధి యిందువతంసుఁ డాత్మసం
స్థాపితుఁ డయ్యె మీ దెసఁ బ్ర♦సాదముపేర్మి భవత్ప్రయత్నసం
స్థాపితుఁడైనవాఁడ యిది ♦ సత్యము మీరు మనంబులోన సం
తాపముఁ బొందకుండుఁడు ప్ర♦ధానము భక్తియె కాదె యిమ్మహిన్. ౨౦౫

తే. అల్పమే మీకు చేసిన ♦ యట్టి భక్తి, యభవమూర్ధాభిషేకార్థ ♦ మధికభక్తిఁ
దెచ్చితిరి గౌతమీమహా ♦ దివ్యతటినిఁ, బావనీకృతలోకంబ భూ ♦ భాగమునకు. ౨౦౬

మ. అభిమానించిన మీర లేడ్వురుఁ బ్రతి ♦ ష్ఠారంభకాలంబునం
దభిషేకించిన తిగ్మభానుఁడును నే ♦ కార్థక్రియ న్మించువాం
డ్రు భవార్చారతి నెంచ మీర లెనమం ♦ డ్రుం నిల్పినా రంబికా
విభునిన్ సత్యము నేను చెప్పితి నభో ♦ వీథీపటంకంబునన్. ౨౦౭

తే. మీర లెనమండ్రు భుజగేంద్ర ♦ హారునకును, భక్తిఁ బూజింపఁ బెట్టుఁడు ♦ పాశుపతులు
వారి పేరిష్టమూర్తులు ♦ గౌరవమున, వాసుదాసులగ నష్ట లె ♦ న్నలైన. ౨౦౮

తే. అష్టమూర్తివిశిష్టాఖ్య ♦ యప్రసూతుఁ, డష్టదేవాటివాడైన ♦ నభవుఁ డంట
వేదశాస్త్రపురాణసం ♦ వేద్యమైన, నితఁడు డష్టంపు గాండు భీ ♦ మేశుఁ డంట ౨౦౯

వ. అని యాకాశవాణి మీరలును మాహ్యండ్రును సముని యుద్దేశించి పల్కిన విని
హర్షంబునొంది మహాత్ములు నభోమణి నభినందించి యాకాశమను దాముగ హేమ
కుంభంబుల సప్తగోదావర ప్రవాహంబు పూరంబులు దెచ్చి యమ్మభవు నభిషే
కించి పూజించిరి; సప్తర్షిసమానీతగావున నమ్మహానదికి సప్తగోదావరాహ్వయంబు
సంభవించెనని చెప్పుటయు శ్రీభీమేశ్వరమహాదేవు మాహాత్మ్యంబు విన వేడ్క
యయ్యెడు నయ్యాశానుపుణ్యకథావిధానంబు వినిపింపవే యనుటయు. ౨౧౦

మ. అవనీభారధురీణ రీణరిపుసై ♦ న్యాధీశ ధీశక్తినై
భవలీలాజితకావ్య కావ్యరచనా ♦ పారీణ తాపాస వా
సవభోగప్రతిమాన మానవినయా ♦ చారార్థసంభార భా
రవిసంకాశ మహాకవీంద్ర పరిష ♦ త్ప్రస్తూయమానోదయా. ౨౧౧

కం. కాశ్యపగోత్రపవిత్ర య, వశ్యా మధరాధరోద్భ ♦ వాధపభక్తా
వేశ్యాకటాక్షదీక్షా, వశ్యనిహోగాపహాసిత ♦ వాసవతనయా. ౨౧౨

మాలినీ. కమలభవవధూటీ ♦ కంఠకహ్లారమాలా
సముదితమధుహారా ♦ సౌరభాసారలక్ష్మీ
సమధికరుచిసంప ♦ త్సార సారస్వత శ్రీ
హిమితసుకవికోధీ ♦ ర్ధ్యత్సరోజాతజాతా. ౨౧౩

గద్య ఇది శ్రీకమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర సుకవిజనవిధేయ సకలవిద్యాస
నాథ శ్రీనాథనామధేయ ప్రణీతం బైన శ్రీభీమేశ్వరపురాణం బనుమహాప్రబంధం
బునందుఁ జతుర్థాశ్వాసము.

శ్రీరస్తు.

శ్రీరామాయనమః.

శ్రీమహాగణాధిపతయేనమః.

శ్రీ మాణిక్యాంబాసమేత శ్రీ భీమేశ్వరస్వామినేనమః.

శ్రీ భీమేశ్వరపురాణము.

పంచమాశ్వాసము.

శ్రీవత్సలాంఛనోపమ
భావభవాకార మంత్రి ♦ పరమేశ్వర పా
రావారనిభగభీరా
దేవాధిపసుప్రసన్న ♦ దేవయయన్నా. ౧

వ. అక్కథకుండు శౌనకాదిమహామునుల కిట్లనియె. ౨

తే. ధర్మపారాయణుండునై ♦ త్రావగుణుఁడు, సెండియును నిట్టులనిచెప్పె ♦ విశదఫణితి
గాఢసమ్మోదభవనేత్ర ♦ కంకణునకు, ముంకణునకాత్తధృతభోగి ♦ కంకణునకు. ౩

వ. అనంతరం బావివస్వతుం డాత్మప్రతిష్ఠితం బైన యద్దివ్యలింగంబునందు శివసన్ని
ధానంబు సేయఁదలంచి. ౪

సూర్యుండు కైలాసమున కరిగి శివుని దక్షారామమునకుఁ దోడి తెచ్చుట.

సీ. ద్యోస్థలీనక్షత్ర ♦ ధూళిపాళీకేళి, చుళికితస్వర్ణదీ ♦ జలచరములు
వైజయంతీపట ♦ వ్యాక్షేపసంభూత, మారుతోద్ధూతేందు ♦ మండలములు
సింహికాసుతకంఠ ♦ సీమాపునర్దంష్ట, చక్రధారావ్యథా ♦ ప్రక్రమములు
రథరథ్యనిశ్వాస ♦ రంహస్సముద్భ్రాంత, గగనగంగాతరం ♦ గచ్ఛటములు

తే. నైనప్రస్థానవేగంబు ♦ లలిశయిల్ల, నభ్రఘంటాపథంబున ♦ నరుగువాఁడు
గతికినొకమూర్తిఁ జాలించి ♦ కదలిచనియె, శీఘ్రమునద్వాదశాత్ముండు ♦ శివునిగిరికి.

ఉ. భాసురయక్షనాథదిగు ♦ పాంతకలాపవిలాస మైనకై
లాసము చక్కటిం జదల ♦ లాఘవమొప్ప రథంబు డిగ్గి వి
శ్వాసపురస్సరంబుగ ది ♦ వాకరుఁ డిందుకళాకిరీటునా
వాసముఁ జేరవచ్చి తల ♦ వాకిట వారితుఁ డయ్యె నందిచేన్. ౬

వ. ఇట్లు వారింపంబడి. ౭

తే. విపులశాఖాశిఖామంత్ర • వితతి నిను(డు, సంస్తుతించెను నందికే•శ్వరునిఁ బ్రీతి
బ్రహ్మవిష్ణుపురందర • ప్రముఖులైన, వేల్పులును నట్లుపొగడఁగా • వృషభరాజు. ౮

వ. ఇట్లు పొగడినఁ బ్రసన్నుండై నందికేశ్వరుండు గొనిపోనం బోయి కోపకుటి లనిటలతటఘటితభీషణభ్రుకుటి భంగాభంగముఖముఖర భయంకర భృంగిభృం గిరిటహుంకృతిభయమానవిబుధసంతానానుసంధానంబు లైనకక్ష్యాంతరంబులు ప్రవేశించి ముంగట వేదవేదాంతవిద్యావందితచరణారవిందుండును జండకిరణశశి మండల ప్రభావిభాసమానఫణామణిగణాభి రామకుండలితకుండలిపతి కుండలాలం కారమండితగండస్థలుండును బ్రళయకాలదహనదగ్ధభువనభవనభస్మాలేపధవళిత దేహుండును నఖండబ్రహ్మాండ భాండశతకోటివిలయకాలమృతశతధృతిమండ మాలికాభూషణుండును నైయున్నయప్పుడా ప్రదీప్తంబుగాఁ గొన్ని సచరాచర బ్రహ్మపారాయణంబులు పఠియించునవియును గొన్ని ఋగ్వేదంబు గుణియించునవి యును గొన్ని యజురామ్నాయం బామ్రేడించునవియును గొన్ని సామవేదంబుఁ జదువునవియును గొన్ని యథర్వణవేదం బాధ్యానంబొనరించునవియును సంస్తుతి యించునవియును నట్టహాసంబు సేయునవియును నైన యావిధిశిరంబులచేతం గ్రుచ్చినదండ పుండరీకముకుళమండితదండంబునుంబోలె ప్రకాశింపఁ గంఠ కోణంబునఁ గింతకోపరినీలంబుమంబోని కాలకూటంబున సంఘటిల్లు భ్రాంతి సంతమసంబునకు ఖద్యోతంబులునుంబోలె విద్యోతించు కంకణాశీవిషవిషానల విస్ఫులింగంబులవలన దుర్నిరీక్ష్యుండగుచు వికటజటాటవీజూటకుహార విహార మాణస్నిగ్ధపరిముగ్ధతరలహారిపవనపూరితంబులైన యాపీఠవిధిశిరఃకర్పటికందరకో డంబులఁ బాటిల్లు ఘుమఘుమాఘోషంబుభీషణభూషాభుజంగంబుల నిద్రాము ద్రాగ్రంథినిగ్రహింపఁ గెంజడముడి బిగియించి నెట్టియంబు చుట్టిన జగజెట్టిపాప జేనియూదలమాణిక్యంబుల తురంగలి మెఱుంగులు వెనువెంట మింటదాఁకను జరిగి ధగద్ధగనిగనిగ వెలుఁగుటంజేసి యప్పుడప్పుడ యనలస్తంభంబున నావిర్భ వించినభంగి నంగీకరించుచు నగ్రగరళపరిమళాఘ్రాణంబునంజేసి మూర్ఛిల్లిన విధంబున నిరంతరధ్యాన స్తిమితలోచనులైయుభయపార్శ్వంబుల సనకసనందన సనత్సుజాతాది యోగీశ్వరులు పరివేష్టింప శేఖరశశాంకునకుఁ గ్రొత్తగాఁ గాళ రాత్రికళత్రంబును గల్పించినట్లు పొలిసిన పచ్చియేనికతోలు పచ్చడంబు జంగాళం బుగా వైచుకొని చరణభూషణశేషాహిశిఖామణి ప్రతిబింబితాంబరుం డగుటంజేసి ఘోరవిషవితరణమహాపరాధక్షమకై పయోధివచ్చి పాదంబులపయింబడిన భావం బు భజియింప ధారాజలబిందుసంతురంబునుంబోని వారణాసురకుంభకూటవిదార ణంబునహత్తిన ముత్తియంబులతోడఁ జాల నాభీలం బగుత్రిశూలంబు కేలం గీలు

కొల్చి కతిపయసమయశిరస్ఫాలనంబు సంఘట్టిత శ్రీపాదారవిందంబునం దాపించిన బిరు
దుకటకంబున ఘటియింపఁబడి వెలుంగు యాదఃపతి మేదోమృతంబు జిడ్డున గడ్డు
కొనిన పూషాదిత్యుపలుఁ వరుసయంతంబున నుప్పతిల్లు త్రుళ్లుమాణిక్యంబులు పెల్లు
గనుల్లసిల్లవిలసిల్లుచు విశ్వజగదుత్పత్తి గుప్తివిపత్తికారి యగు పురారిం గనుంగొని
జయజయశబ్ద పూర్వకంబుగా సంస్తుతి యొనర్చి ముకుళితకరారవిందుండై. ౯

తే. బ్రహ్మవిష్ణుమహేంద్రాది ◆ పరివృఢునకు, నద్రిరాజన్యకన్యాస ◆ మన్వితునకుఁ
బ్రమథగణభూతబేతాళ ◆ పరివృతునకు, హరున కినుఁడు నమస్కార ◆ మాచరించె.

వ. ఇట్లు ప్రణామానంతరంబున భాస్వంతుండు గౌరీకాంతునకు నిజాగమనప్రయోజ
నం బెఱింగించినఁ దదనంతరంబ. ౧౧

ఆ. ఇనునితోడిచెలిమి ◆ నిభరాజవదనుండు, విన్నపంబు చేసె ◆ విశ్వపతికి
నమృతమథనవేళ ◆ నావిర్భవుండైన, భుజగహారుఁ జూడఁ ◆ బోద మనుచు. ౧౨

సీ. విఘ్నాధినాథుండు ◆ విన్నవించినమీఁదఁ, బర్వతాత్మజ విన్న ◆ పంబు చేసెఁ
బర్వతాత్మజ విన్న ◆ పంబొనరించిన, వెనుకఁ గ్రౌంచఘ్నుండు ◆ విన్నవించెఁ
గ్రౌంచఘ్నుఁ డటు విన్న ◆ వించినయత్తఱి, నుతివిన్నవించెను ◆ మాతృగణము
బ్రాహ్మ్యాదిమాతృవ ◆ర్గము విన్నవించిన, వెండియు భూతముల్ ◆ విన్నవించె
తే. నిందుధరునకుఁ గైలాస ◆ మందిరునకు, నభవ విచ్చేయు రవికిఁ బ్రి ◆ యంబు గాఁగ
నమృతవారాశినుదయించి ◆ యంధ్రభూమి, దక్షపురినున్న యాదివ్య ◆ తనువుఁ జూడ.

వ. అని యిట్లు విన్నవించిన విఘ్నేశ్వరుని మీఁది యనుగ్రహంబునను భవాని
మీఁది కూర్మిని గుమారునిమీఁది ప్రేమానుబంధంబునను బ్రాహ్మ్యాదిమాతృగ
ణంబులమీఁది ప్రీతిని భూతంబులమీఁది యాదరాతిశయంబునను భాస్వంతుని
మీఁది సంతోషంబునను మధ్యమలోకగమనోద్యుక్తుండై హరివిరించులం జూచి
మహాదేవుం డిట్లనియె. ౧౪

మహాదేవుఁడు ప్రమథగణసమేతుఁడై దక్షారామమునకుఁ బోవుట.

మ. కలవారందఱు దక్షవాటిగమనో ◆ త్కంఠాసముత్సాహదో
హలులై నారు సహస్రభానుఁడును న ◆ భ్యర్థించుచున్నాఁడు మం
గళదివ్యామృతలింగదర్శనమునుం ◆ గర్తవ్య మంధ్రక్షమా
స్థలికిం బోదమె యూసుహృత్కకు వినో ◆ దంబుల్ పరీక్షింపఁగన్. ౧౫

తే. పాయ కొకచోటఁ జదికిలఁ ◆ బడఁగ నుండ, నైనఫలమేమి యటు వినో ◆ దార్థ మరిగి
సంచరింతము గాక యీ ◆ జలజహితుని, ధర్మ మార్జిత్యము నుబొంద ◆ దక్షపురిని.

వ. అని యానతిచ్చి యాక్షణంబ. ౧౬

కం. చాటింపఁ బంచెఁ జంద్రకి,రీటుఁడు కైలాసనగపు♦రీవీథుల ఘం
టాటంకృతితో దక్షుని, వాటికిఁ బయనంబు ప్రమథ♦వరులకు ననుచున్. ౧౮

వ. అప్పుడు భవాని భవుసన్నిధిఁ జేతులు మొగిచి యిట్లని విన్నవించె. ౧౯

తే. పుట్టినిలుగాన నాకు నె♦ప్పుడును బ్రేమ, దక్షవాటికమీఁద నెం♦తయు ఘనంబు
సన్నిధానంబు సేయుమో ♦ చంద్రమౌళి, యస్మహాపురిభీమలిం♦గంబుమీఁద. ౨౦

తే. ఉత్తరంబునఁ గాశీపు♦రోత్తమంబు, మోక్షలక్ష్మికి నెబ్బంగి ♦ మూలమయ్యె
దక్షిణంబున నాభంగి ♦ దక్షవాటి, మూల మాఁగావుతను భోగ♦మోక్షములకు.

తే. కుంటి కుదుపు లశక్తులు ♦ కుష్ఠరోగు, లంధులును వృద్ధులును బాలు♦రాదిగాఁగఁ
గాశికరుగంగ లేని బి♦కారులెల్ల, మోక్షమును బొందుదురుగాక ♦ దక్షవాటి ౨౨

మ. కలిదోషంబున నిష్ఠురాత్మకులుసర్వ ♦ గామాంధులుం బాపక
ర్ములు నజ్ఞానదవాగ్నిదగ్ధులును నై ♦ ప్రోద్యన్మహారౌరవా
వలిఁ గూలంగల దుష్టమానసులకుం ♦ వారాణశీలభ్యమై
కలుగుంగావుత ముక్తి దక్షపురి నీ ♦ కారుణ్యసంభావనన్. ౨౩

తే. సర్వలోకంబులకును మో♦క్షదుండవైన, నీవు సన్నిహితుండవై ♦ నిల్చినపుడు
దక్షిణాపథ కాశి శ్రీ దక్షవాటి, భువనమాన్యంబ కద నాదు♦పుట్టినిల్లు. ౨౪

వ. అని విన్నవించిన యనంతరంబ యంబికావల్లభుండు మందగాచలకూటంబునం
బోల్చి సంస్తుతిమాత్రంబునం బొడచూపి నిల్చిన వృషభంబు నెక్కి యథోచితం
బుగా నమందానందంబున గిరిరాజనందన వెనుకదెస నిలిచియుం గౌఁగిలించు
కొనియుండఁ దమతమ వాహనంబుల నారోహణంబు చేసి బ్రహ్మాదులు పరివే
ష్టించి చనుదేర శంసితవ్రతులైన యక్షసురసిద్ధసాధ్యులు ముందటం గెలనబలసి
యేతేర హృద్యంబులగు గద్యపద్యంబులు తుంబురునారదాదులు పఠింప వేదఘో
షంబులు జయజయశబ్దంబులు వేణువీణాకాహళాదిపంచమహావాద్యనాదంబులు
కుంజరబృంహితంబులు తురంగహేషితంబులు చెలంగ మూషకారూఢుండై వినా
యకుండు మున్నాడి నడువ సుబ్రహ్మణ్యుండు మయూరవాహనుండై కదిసికొలువ
వసురుద్రాదిత్యులు దుర్గావీరభద్రభైరవులు నంతరాంతరంబులఁ జండీశ్వరాద్య
సంఖ్యాతప్రమథగణంబులు బలసికొలువ కైలాసభవనంబుననుండి యక్షీణవిభ
వంబున దక్షారామంబు డాయంజను దెంచునప్పుడు. ౨౫

తే. పొగడి రందు నికుంభకుం♦భోదరులును
బెరసి భద్రమహాకాళి ♦ భృంగిరిటులు
పాయుఁ బగళంబు తొలఁగు వి♦చ్చేయుఁడనుచుఁ
పార్శ్వములయందు మిగుల నా♦ర్భటము సేయ. ౨౬

వ. అంత నీలకంఠుఁడు పురోపకంఠంబునకు విచ్చేయునప్పుడు. ౨౭

గీ. విషమకఠిననిమ్నవీథీ♦విటంకంబు, నంతరాంతరముల ♦ నరసియరసి
యక్షకర్దమమున ♦ యక్షేశ్వరాదులు, సవరచేసి రథిక ♦ సంభ్రమమున. ౨౮

కం ఘుసృణప్రసూనరసమునఁ, బసపుంజూర్ణముఁ జంద్ర♦పాంసులముక్తా
విసరములఁ సురలొనర్చిరి, పసగా శంఖాబ్జముఖ్య ♦ బహుచిత్రంబుల్. ౨౯

వ. వెండియు సువర్ణారవిందసందానితసుందరసుందారమాలికాభిరామంబును సం
స్తంభితశాతకుంభ దండమండితధ్వజపటశోభితంబును నానావిపణిమార్గన్యస్త సం
ఘటిత మాణిక్యమయూఖరేఖాకిమ్మీరితసకలదిశాముఖంబును వరవిశేషవిభవలక్ష్మీ
ధామంబును నగు దక్షారామంబుఁ బ్రవేశించునప్పుడు. ౩౦

శివుఁడు దక్షారామంబుఁ బ్రవేశించుట.

ఉ. అక్షతగంధపుష్పఫలహారి ♦ హిరణ్మయపాత్రహస్తలై
దక్షపురీవిలాసినులు ♦ తామరసాయతలోచనల్ సహ
స్రాక్షుఁడు భీమలింగమున ♦ కర్పణచేసిన యప్సరల్ విరూ
పాక్షు నెదుర్కొనం జనిరి ♦ యందియ లంద్రుల ఘల్లుఘల్లనన్. ౩౧

తే. భావహావవిలాస వి♦భ్రమము లమరఁ, జంద్రశేఖరు నగరియ♦చ్చరలపిండు
తగ సమర్పించె నర్ఘ్యాది ♦ దంపతులకు, రత్నదీపాంకురముల నీ♦రాజనములు. ౩౨

ఉ. శైలతనూజ తోడుగఁ బ్ర♦సాదగుణంబున మాటిమాటికిన్
మేలములాడుచున్ నిజస♦మీపమునన్ గుహమాతృభద్రకుం
డాలముఖప్రధానగణ♦నాథులు గొల్వఁగ భాంతిశాలి
లక్ష్మీలలనేశ్వరుల్ గదిసి♦చెప్పెడు విన్నప మాలకించుచున్. ౩౩

తే. భూమి దక్షిణపాథోధి ♦ పుణ్యసీమఁ, బ్రజలు చేసిన భాగ్యమై ♦ భవసమృద్ధి
శ్రీమహాదేవుకరుణాని♦రీక్షణంబు, గౌరిముఖరాజలక్ష్మియుఁ ♦ గానఁబడియె. ౩౪

శా. సంతోషించిరి దక్షిణాపథజనుల్ ♦ సాక్షాద్విరూపాక్షునిం
గాంతాసంయుతునందివాహు శశిరే♦ఖాజూటకోటీరు వే
దాంతాభ్యర్చితపాదపంకజుని ద♦క్షారామమధ్యంబునం
దంతన్ సంభృతసౌఖ్యుఁ గంటిమిదె క♦న్నారంగ నం చెంతయున్. ౩౫

కం. నాగేంద్రకర్ణకుండలు, నాగేంద్రత్వక్కటీరు ♦ నగరాజసుతా
సౌగంధ్యలలితదక్షిణ, భాగుం గనుఁగొంటి మిట్టి♦భాగ్యము గలదే. ౩౬

గీ. అని సమస్తజనంబులు ♦ నభినుతింప, నల్లనల్లన వెంచేసె ♦ నంధకారి
దక్షవాటికఘంటాప♦థంబునందు, హరిశతానందశక్రాది ♦ సురలు గొలువ. ౩౭

వ. ఇట్లు భీమేశ్వరసదనాంతరంబుం బ్రవేశించి. ౩౮

తే. గారవించెను విధి శిరఃకంపమునను, నాదరించెఁ బ్రియోక్తుల ♦ నబ్జనాభు
మించుమందస్మితమున మ♦న్నించె శక్రు, హరుఁడు గరుణించె సురలఁగ♦టాక్షదృష్టి.

చం. సకలదిశాముఖంబులుఁ బ్ర♦సన్నములయ్యెఁ బ్రదక్షిణార్చియై
యకలుషలీలఁ గైకొనియె ♦ హవ్యవహుండు హవిర్విభాగముం
బ్రకటితసౌఖ్యకారియయి ♦ వాయక వీచె సమీరణంబు త్ర్యం
బకుఁ డట భీమనాయకుని ♦ మందిరమధ్యముఁ జొచ్చునత్తఱిన్. ౮౦

సీ. గంగాజలాపూర్ణ♦గాంగేయమయకుంభ, హస్తాబ్జములఁ గొంద♦ఱప్సరసలు
ఫలపుష్పకిసలయ ♦ ప్రచురపాత్రవిశేష, హస్తాబ్జములఁ గొంద♦ఱప్సరసలు
నిర్మలానేకమా♦ణిక్యనీరాజన, హస్తాబ్జములఁ గొంద♦ఱప్సరసలు
లాజాక్షతాదిక♦ల్యాణవస్తువ్రాత, హస్తాబ్జములఁ గొంద♦ఱప్సరసలు

తే. నాటపాటలఁ బ్రొక్కుల ♦ నభినుతులను, నర్థిసేవించి రొక్కకొంద♦ఱప్సరసలు
అపుడు రెండవకైలాస♦మనఁగ నొప్పె, నభవుఁడే తేర భీమనా♦యకునినగరు. ౮౧

వ. మఱియు ననేకప్రకారంబుల దివ్యాంగనారచితోపచారంబు లంగీకరించుచు నాంగీరసవత్సరశోభనలగ్నంబున మును లాశీర్వాదంబులు చెలంగ నందివాహనంబు డిగ్గి నిజభుజావలంబనావతీర్ణయగు నపర్ణాహస్తాబ్జంబు కరపల్లవంబున నవలంబించి మున్నట జలధరవాహుఁడు వేత్రహస్తుండై నడవ నెఱంగలుగజడియు మార్గశీర్ష శుద్ధచతుర్దశియందు రోహిణీనక్షత్రంబున సిద్ధయోగంబున యోగీశ్వరేశ్వరుండు. ౮౨

తే. దాఁటెఁ బ్రాసాదదేహళి ♦ దర్పకారి, ధరణిధరరాజపుత్రి కై♦దండ యొసఁగ
నమ్మహాదేవి కుచమండ♦లమ్ము సోఁకి, యంగకంబులఁ బులకంబు♦లంకురింప. ౮౩

వ. అప్పుడు. ౮౪

ఉ. తా మును చేసినాఁడ నొక ♦ తప్పని చిత్తములోఁ దలంచునో
యేమనునో తనుం గనిన ♦ నీశ్వరుఁ డంచు భయంబుతోన యా
స్వామికి నర్చనం బొసఁగె ♦ శంబరశత్రుఁడు దక్షవాటికా
ధామవిలాసదీర్ఘికలఁ ♦ దన్వగఁ బూచిన హల్లకంబులన్. ౮౫

తే. మును కటాక్షైకవీక్షణాం♦భోరుహముల, నర్చనము లిచ్చి రఖిలలో♦కాధిపునకు
శివునిఁ బూజించి రప్సర♦స్త్రీలు పిదప, హస్తపంకజపుష్పోప♦హారములను. ౮౬

తే. కామమును లోభమును ముక్తి♦కాంతయందు
మోహమదములు బాలక♦ముగ్ధలందు
నధికపాపాత్ములం దధ♦ర్మాత్ములందుఁ
గ్రోధమాత్సర్యములు జన♦కోటికొదవె. ౮౭

వ. అనంతరం బా శివుం డభ్యంతరమందిరంబునఁ బ్రవేశించి హరివిరించి ప్రముఖ బృందారకులచేత మధుపర్కాద్యుపచారంబులు గైకొని కక్ష్యాంతరంబులు గడచి గర్భగృహమండపంబునందు నాత్మగత్మస్వరూపంబైన శ్రీభీమనాథ మహాదేవ స్వయంభూజ్యోతిస్సుధామయమహాలింగంబు నాగమోక్తప్రకారంబుల నర్చించి యాపాదమస్తకంబు తద్రూపంబు ముహూర్తమాత్రంబు చింతించి. ౪౮

శ్రీకంఠుఁడు దక్షారామ భీమేశుతో నైక్యతం బొరయుట.

శా. కైలాసాచలకేలిమందిరుఁడు శ్రీకంఠుండు సోత్కంఠుఁడై
ప్రాలేయాచలరాజకన్యకయుఁ దా బ్రహ్మాదిదేవవ్రజం
బాలోకింపఁగ నైక్యతం బొరసె దక్షారామభీమేశుతోఁ
ద్రైలోక్యంబును దివ్యలింగశివతాదాత్మ్యంబు వర్ణింపఁగన్. ౪౯

సీ. అవ్యయం బనవద్య మాద్య మచ్యుత మజం, బవ్యక్త మప్రమేయం బనంగఁ
బరఁగి కైలాసభూధర సమాగత మైన, తేజంబుతోఁ గూడి తేజరిల్లె
దక్షవాటీపురాధ్యక్షు భీమేశ్వర, శ్రీస్వయంభూదివ్య సిద్ధలింగ
మమృతపాథోధ మధ్యాంతస్సముద్భూత, మమలపరంజ్యోతి రాదికంబు

తే. భువనబీజంబు కైవల్యభోగదాయి, యఖిలకల్యాణకారి విశ్వాద్భుతంబు
పూజఁగొనియెను మురభిదంబుజభవాది, దేవతాకోటిచే సంప్రతిష్ఠఁ బొంది.

వ. బ్రాహ్మీప్రధానసప్తమాతృకలును నందిమహాకాళాదిప్రమథగణంబులును హరివిరించిప్రముఖబృందారకులును పురందరాదిలోకపాలకులును వసురుద్రాదిత్య మరుద్విశ్వేదేవాశ్వినిదేవతలును సిద్ధసాధ్యులును విద్యాధరోరగులును గ్రహనక్షత్రతారకంబులును బిత్రుగణంబులును మూర్తంబులును నమూర్తంబులు నగుచరాచరంబులన్నియు నానారత్నగంధపుష్పధూపదీప నైవేద్యాదులు సమర్పించి ప్రదక్షిణంబు లాచరించి నమస్కరించి స్తుతియించిరి. తదనంతరంబ వెండియు. ౫౧

లక్ష్మ్యాదులు శ్రీభీమేశుని స్తుతించుట.

కం. సిరివాణిగౌరిసతియు,స్సరసలరుంధతియహల్యశచి మొదలగు స
త్పరమపతివ్రత లర్చించిరి దక్షారామనిలయు శ్రీభీమేశున్. ౫౨

వ. ఇట్లు పూజచేసి పరమపతివ్రతలు ముకుళితకరాంబుజలై శ్రీదక్షవాటీపురాధ్యక్ష భీమేశ్వర భీమనాథ భీమశంకర భీమలింగ మహాదివ్యలింగ యవాఙ్మానసగోచర సనకసనందనసనత్కుమార సనత్సుజాతాదియోగీంద్రులు నపారంబైన నీమహిమఁ గొని గూడనేర, రటుగావున మిమ్ము స్తోత్రంబు సేయ మాబోంట్లతరంబె? నిర్గుణుండవు సగుణుండవు గుణాతీతుండవు గుణాధ్యక్షుండవు నీవొక్కగుణంబున

బ్రహ్మవై సృజియింతు వాక్కుణంబున విష్ణుండవై పాలింతు వాక్కుణంబున రుద్రుండవై సంహరింతువు, సర్వభూతాంతరాత్మభావనా, పరమపావనా, నీవు చంద్రసూర్యాత్మదీధితవై యహోరాత్రస్వరూపంబున వర్తింతువు, పృథివ్యాపస్తేజోవాయురాకాశాది పంచభూతాత్మకజీవాత్మక స్వరూపంబున వర్తింతువు సర్వభూతాత్మ ప్రవిష్టుండవు, సర్వేంద్రియగుణాధారా, సర్వేంద్రియవర్జిత సర్వసర్వాత్మక రూపంబున సర్వంబు ననుభవింతువు, సర్వశక్త్యాత్మక సర్వభూతగుహాశయ యని నమోనమశ్శబ్దంబులతోడ నిన్ను శ్రుతులు సంస్తుతించు శుద్ధుండవు బుద్ధుండవు సుఖివి సదానందుండవు సదాముక్తుండవు నుముఁబోటి కామిను లల్పబుద్ధులు మిమ్ముఁ బ్రస్తుతింపఁగలవారలా క్షమియింపు క్షమియింపుము రక్షింపు రక్షింపు మగోచరచరిత్ర యగోచరబలాబల మహర్షియోగీంద్రులకు దుర్లభుండవు సంసారి వసంసారివి భవుండ వభవుండవు మంగళుండ వమంగళుండవు భుజంగభూషణా, నిన్ను నీవ యెఱుంగుదువు సర్వాతీతుండవు, తాపసప్రియుండవు, తపోలభ్యుండవు నిజకర్మనిష్ఠులైన కర్మఠులు నిన్ను భజియింతురు నీకుఁ బ్రణామంబులు సేయుదురు జ్ఞానంబున నొండె నజ్ఞానంబున నొండె నీ మహిమార్ణవంబున మునింగి దరిచేరం దెరు వెఱుంగక నీవే తక్క నితఃపరం బెఱుంగక మా యాత్మశుద్ధికొఱకుఁ దోఁచినట్లు వర్ణించెదముగాని శక్తిగలిగి కాదు దేవదేవ మహాదేవ దేవతాసార్వభౌమా దేవాదిదేవ దేవదేవేశ మహాలింగ తపోవిశేషంబునం బర్వతాత్మజ నీదేహంబున సగపాలుగొనియె నీ దేవికి నమస్కారంబు నీకు వందనంబు కటాక్షింపుమని ప్రార్థించిరి. తదనంతరంబ యో సర్వమంగళా భువనేశ్వరి సర్వమంగళదాయినీ నీకు మ్రొక్కెదము మమ్ము రక్షింపుమని మహాదేవికిం గేలుదోయి నొసలిపయిం గీలించి యో మహాదేవ మహానుభావ శశాంకశేఖర నమస్తే నమస్తే నమ యని యనేకప్రకారంబుల స్తుతియించిన. ౫౩

చం. వికటజటాకుటుంగమున ♦ వెన్నెలఱేని ధరించి పేనుల
బ్రకటితనాగకుండలభ♦రంబులు వ్రేలఁగ సుప్రసన్నుఁడై
వికవికనవ్వుచుం గరము ♦ వేడుకతోఁ బొడచూపె భీమనా
యకుఁడు మహాపతివ్రతల ♦ కంబికతోఁ గరుణాగుణంబునన్. ౫౪

తే. ఇట్లు ప్రాదుర్భవించి స♦ర్వేశ్వరుండు, వరము లెన్నని యాపతి♦వ్రతల కొసఁగి
యంత నంతర్హితుండయ్యె ♦ నఖిలమునులు, గానఁ గానంగ భీమలిం♦గంబువందు.

వ. అప్పుడు సమీపవర్తియగు బృహస్పతికి దివస్పతి యిట్లనియె. ౫౬

దివస్పతి బృహస్పతిని దానములఁగూర్చి యడుగుట.

కం. దాతృత్వము దానంబును, దాతవ్యం బనఁగ నెద్ది ♦ ధర్మవిధిజ్ఞా
దాతవ్యం బెయ్యది వి,ఖ్యాతము భవ్యానుజన్మ ♦ యానతియీవే. ౫౭

కం. దేవతలకు బ్రాహ్మణులకు, నీవలయు పదార్థ మెద్ది ♦ యొసఁగింపఁదగుం
జీవా బహుదాతవ్యలు, గావున రాజులకుఁ దెలియఁ♦గాఁ దగవగుఁబో. ౫౮

వ. అనిన విని వాస్తోష్పతికి గీష్పతి యిట్లనియె. ౫౯

భూదానమహిమ.

కం. పురుహూత భూమిదానము, పరమము దానములయందు ♦ బహువస్తుతతుల్
ధరణీతలమునయందును, విరళంబై యొపుడునుద్భ♦వించుటకతనన్. ౬౦

కం. సర్వపదార్థాశయమగు, నుర్వి మహీసురుల కిచ్చు ♦ నుత్తముల కగుఁ
సర్వప్రదానఫలమును, గీర్వాణాధీశ యేటి♦కి స్సంశయముల్. ౬౧

చం. రజతము కాంచనంబు నవ♦రత్నములుం వనముల్ తటాకముల్
గజతురగాదిజంతువులు ♦ గంధము పువ్వులుఁ బండ్లుఁ దేనియల్
ద్విజునకు వేలువేల కడు ♦ వేడుక నిచ్చుటకంటెఁ బ్రీతిఁ ద
త్ప్రజననకారణంబగు ధ♦రాస్థల మిచ్చుట యిచ్చు టన్నియున్. ౬౨

తే. ధరణిసర్వగుణోపేత ♦ ధాన్యజనని, సస్యశాలిని నెవ్వాఁడు ♦ శాంతబుద్ధిఁ
బాత్రమునకిచ్చు నతనికి♦ధాత్రియుండు,సంతకాలంబు సకలసౌ♦ఖ్యములు గలుగు.

సీ. కృతదక్షిణంబు ల♦గ్నిష్టోమములు పెక్కు, యజనించునట్టి పు♦ణ్యాత్ములకును
జ్ఞానదయాసత్య ♦ సంతతవిజితేంద్రి, యత్వముల్ గురుదేవ♦తార్చనములు
మొదలుగాఁగలపుణ్య♦ములు సేయుధన్యుల, కధికుండు భూప్రదుం♦డం డ్రుబుధులు
పరమపాతివ్రత్య♦పరిపాటి పాటించు, తరుణికంటె మహిప్ర♦దాత పెద్ద [బుధుండు

తే. వాఁ డనూనగోత్రుండును ♦ వాఁడుఘనుఁడు, వాఁడు పుణ్యగరిష్ఠుండు ♦ వాఁడు
వాఁడు విశ్రాంతిమంతుండు♦వాఁడు దాత, యెవ్వఁడే వేదవిప్రున♦కిచ్చు ధరణి.

తే. కాలమృత్యువు వెసఁదోలి♦కలనవెలచు,నహిమరోచియు నెండగా♦యంగ నణఁగు
నగ్ని శంకించు నెరమంట ♦ లప్పళింప, భూమిదానంబొనర్చిన ♦ పుణ్యతముని.

కం. స్వామిహిత మొప్పఁగను సం,గ్రామమున శరపరంప♦రలు పయిఁ గురియం
గా మృతిఁ బొందిన శూరుఁడు, భూమీదాతకుఁ బ్రభావ♦మునఁ గట్టుపడున్.

తే. అయిదుతరములపూర్వుల♦నవులమీఁద
నందఱనుగాచు నూర్ధ్వలో♦కాలయములఁ
గమియఁబండిన వివిధస♦స్యములతోడి
యవనిదానంబుచేయు పు♦ణ్యాత్మకుండు. ౬౭

కం. అనుములు గోధూమంబులు, మినుములు సెనగలును బండు♦ మేదిని భూదే
వున కిచ్చు నెవ్వఁ డతనికి, ననపాయస్వర్గసౌఖ్య♦మబ్బు మహేంద్రా. ౬౮

ఉ. హాటకపీఠికాధవళ ♦ హర్మ్యసుధావళశంఖకాహళీ
ఘోటసితాతపత్త్రములు ♦ క్రొత్తమెఱుఁగులు వానిభామినుల్
మేటిధనంబు వస్త్రములు ♦ మేదినియీఁగికి నెంచిచూచినం
సాటికి రావుగాన నిది ♦ సత్ఫల మభ్రమునాథవాహనా. ౧౯

తే. శ్వేతపక్షంబులోపలఁ ♦ బెరుఁగునట్లు, దినదినంబును నీహార ♦ దీప్తి దీప్తి
నవ్విధంబునఁ బెరుఁగు ని♦త్యాభివృద్ధిఁ, బంటపంటకుభూదాన ♦ భర్తఫలము. ౨౦

తే. పాతకము చేసియైనను ♦ బరితపించి, ధరణిదానంబు చేసిన♦ధన్యుఁ డడఁచు
నయ్యఘముఁ దథ్య మిదినిర్జ♦రాధినాథ, కుబుసమూడ్చెడి మేటినా♦గువునుబోలె.

తే. ఒకఁడు హయమేధ మొనరించు ♦ నొక్కఁ డొకఁడు
భూమిదానంబొనర్చుని ♦ పురుషులందుఁ
దారతమ్యంబు లేదండ్రు ♦ తత్త్వవిదులు
ధర్మములు రెండు నొక్క వి♦ధంబకాన. ౨౧

ఉ. కాంచనకింకిణీయుతము ♦ కామగమంబును దేవతాప్సర
శ్చంచలలోచనానికర ♦ సంకులముం బ్రముదావహంబునై
మించిన దివ్యయానమున ♦ మీఁదిజగంబులఁ గ్రీడసల్పు ని
ర్వంచన భూమిదాత యగు ♦ వాఁడు పురందర పెక్కువర్షముల్. ౨౩

కం. భూమికి సరియగు వస్తువు, భూమికి సరియైన విధియు ♦ భూమీదాన
స్వామికి సరియగు పుణ్యుఁడు, లేమికి సందియ మొకింత♦లేదు మహేంద్రా. ౨౪

తే. భూమిదానంబె దాన♦మంభోవగమన, సూనృతమె సారధర్మంబు ♦ సురవరేణ్య
యనృతమె పాతకంబు స♦హస్రనయన, తెలియఁజెప్పితినీకు సం♦దియము వలదు.

దివస్పతి శ్రీభీమేశ్వరునకు భీమమండలంబు సమర్పించుట.

వ. అనిన విని దివస్పతి బృహస్పతిం బూజించి యతని యుపదేశంబున భక్తి శ్రద్ధా తాత్పర్యవిశ్వాసంబులు మనంబునం బెనంగొన భూమీమండలంబు సస్యంబును సోద్యానంబును సకూపంబును సతటాకంబును సపద్మాకరంబును సదక్షిణంబును సశాస్త్రోక్తంబును గా ధారాపురస్సరంబుగా శ్రీభీమేశ్వర శ్రీమన్మహాదేవునకు సమర్పించి యామహీసన్నివేశంబునకు భీమమండలంబను నామంబు గల్పించె నది యెట్లనిన. ౨౬.

ఉ. అంబుధి మేర తూర్పునకు ♦ నబ్ధియ సీమ యటు యామ్యదిగ్విభా
గంబునకుం బ్రతీచికిని ♦ గౌతమి సీమ యుదీచికిం బ్రమా
ణంబు త్రియోజనంబు సుర♦నాథుఁడు దక్షిణకాశి భీమలిం
గంబున కేకభోగముగఁ ♦ గట్టడచేసె వసుంధరాస్థలిన్. ౨౭

తే. తుల్యభాగాతరంగిణి ♦ తోడఁగూడఁ, గణ్వవాహినితోఁ గూడఁ ♦ గనకరత్న
దివ్యపరిధానసహితంబు ♦ దేవభర్త, ధరణిభీమేశ్వరున కిచ్చె ♦ ధారపోసి. ౭౮

తే. దాత త్రైలోక్యభర్త నృ♦పధ్వస్తవృందు, దేయ మంభోధిగౌతమీ ♦ తీరభూమి
త్రిపురవిధ్వంసనుండు ప్ర♦తిగ్రహీత, యింత యొప్పునె పరికింప ♦ నీసమృద్ధి. ౭౯

వ. ఇవ్విధంబునఁ బాకశాసనుండు పురశాసనుం డగు శ్రీభీమేశ్వర శ్రీమన్మహాదేవునకు నంగరాగాదిభోగవైభవ వినోదార్థంబుగా గజాశ్వదాసదాసీగాణిక్య మాణిక్యగోధేనుసహితంబుగా భీమమండలంబు దక్షారామసమేతంబుగా సమర్పించి చాతుర్వర్ణ్యంబును రప్పించి యిట్లనియె. ౮౦

సీ. ఓమహాజనులార ♦ భీమమండలమహా, గ్రామఖండికభట్ట ♦ కాత్రవైశ్య
వాస్తవ్యులార వి♦శ్వాసపూర్వకముగా, సావధానమనస్కు♦లైవినుండు
ప్రాగ్దిశకును యామ్య♦పశ్చిమంబులకును, నంభోధిగౌతము♦లవధిచిహ్న
లుత్తరమున మూఁడు♦యోజనంబుల తుద, పొలిమేర యిది చక్ర♦వలయరేఖ

తే. యీమహాక్షేత్ర మేను స♦ర్వేశ్వరునకు, నిందుధరునకు దక్షవా♦టీశ్వరునకు
నిచ్చితిని ధారపోసి భీ♦మేశ్వరునకు, నాసుధాకరతారకా♦హస్కరముగ. ౮౧

ఆ. పలుకొం డ్రు మీర ♦ లేపురాంతకునకుఁ, బృథివియాగిబిక్ష ♦ బిక్షతరము
బ్రతుకుఁ డాశ్రయించి ♦ ఫణిరాజకుండలు, భీమనాథదేవు ♦ భూమిజనులు. ౮౨

వ. అని యీప్రకారంబునఁ దెల్పుడు సేయుము. ౮౩

చం. సురపతి మార్గశీర్షమున ♦ శుద్ధచతుర్థశినాఁడు రోహిణిం
బొరసిన సిద్ధయోగమున ♦ భూతలమిచ్చెఁ బయోధిగౌతముల్
గనుగఁ దుల్యభాగయును ♦ గంద్రెడు లోనుగ దక్షవాటికా
వరునకు భీమనాథునకు ♦ వారవధూత్రిశతద్వయంబుతోన్. ౮౪

వ. ఇట్లిచ్చి ధర్మశాసనంబు వ్రాయించె నది యె ట్లనిన. ౮౫

ఉ. ఇప్పటి భూమిపాలురును ♦ నింకిట రాఁగలభూమిపాలురుం
దప్పకుఁడయ్య మత్ప్రవిహి♦తస్థిరభూతలదానధర్మ మె
ల్లప్పుడు మీకు నయ్యెడుఁ జి♦రాయువు భాగ్యము వైభవంబుచే
నొప్పగుసుప్రతాపము సు♦ఖోన్నతి గంధగజాదిలక్ష్మియున్. ౮౬

వ. అని వెండియు. ౮౭

సీ. కట్టించెఁ బట్టన♦ష్టా విభాగముపైఁడిఁ, గల్పించె వప్రంబుఁ ♦ గాంచనమున
మలిపించె బంగార♦ముల దేవగృహములు, కూర్పించె నట్టిండ్లు ♦ కుందనమున
నిర్మించెఁ బ్రాసాద♦నివహంబు గనకానఁ, బాటించె గవఁకులు ♦ హాటకమున
రచియించెఁ గార్తస్వ♦రమున గోపురములు, కీలించెఁ గేలిదీ♦ర్ఘికలు భూరి

తే. నాటె మందారతరువులు ♦ తోఁటలందు, వలఁతిసురభులఁ గేలార ♦ ములకునిచ్చెఁ
బోసె సిద్ధరసంబును ♦ బుష్కరిణులఁ, గణఁక నింద్రుండు దక్షిణ ♦ కాశియందు. ౮౮

తే. ఏకభోగంబుగాఁగ నే ♦ లేఁబుగరుసు, గడలిసీమయు గౌతమీ ♦ గంగమేర
కప్పురపుఁగ్రోవి కాశ్మీర ♦ ఖండ మవధి, యేలె విశ్వకుటుంబి భీ ♦ మేశ్వరుండు. ౮౯

మ. సరిసామంతుఁడు శ్రీకుమారవనికా ♦ చాళుక్యభీమేశ్వరే
శ్వరదేవుం డుపకంఠబాంధవుఁడు శ్రీ ♦ సంవేద్యరాడ్భైరవుం
డిరవుంబొగ్వను బల్వలేశుఁడు మృకం ♦ డేశుండుగా నేలె ని
ద్ధరణీమండలి భీమనాథుఁడు నిరా ♦ తంకప్రతాపోద్ధతిన్. ౯౦

తే కట్టెఁబట్టంబు యువరాజు ♦ గజముఖునికి, రాణివాసంబుతుహినాద్రి ♦ రాజతనయ
కూర్చిసైన్యాధినాథుండు ♦ గోమరసామి, యిలకుఁ బతి యైనదక్షవా ♦ టీశ్వరునకు.

శా. శ్రీకంఠుండు త్రిలింగభూవలయముల్ ♦ శ్రీభీమనాథేశ్వరుం
డేకచ్ఛత్రముగా సమస్తభువనా ♦ధీశుండు పాలింపఁ గాఁ
బ్రాకోన్ముద్రితమాధవీనిచికల ♦ ప్రత్యగ్రసౌరభ్యల
క్ష్మీకం బైనవసంతకాల ముదయిం ♦ చెన్ సౌఖ్యసంధాయియై. ౯౨

వసంతర్తు వర్ణనము.

తే. సకలదైవతమండల ♦ సార్వభౌము, దక్షిణాపథకాశికా ♦ ధవునిఁ గొల్వఁ
గుసుమవిసరంబుఁ గానుకఁ ♦ గొంచువచ్చె, నఖిలఋతుచక్రవర్తి మ ♦ ధ్వాగమంబు.

తే. కమిచె సురపొన్న వనలక్ష్మి ♦ కబరిమీఁద, సంతరించినముత్యాల ♦ జల్లివోలెఁ
బూచె సంపెంగలారామ ♦ భూమియందుఁ, గుసుమనారాచుచిచ్చుల ♦ కోలవోలె.

శా. హేమంతావధిసంప్రబోధగుణవుల్ ♦ హృజ్జాతతేజోగ్నిధా
య్యామంత్రాక్షరముల్ పికీరగిరవ ♦ న్యామందవాతూలముల్
వేమాఱుం గలశీతనూభవధూ ♦ వేణీభరాంతఃప్రసూ
నామోదగ్రహయాళువుల్ పొలసె ద ♦ క్షాగామమధ్యంబునన్. ౯౫

చం. దిగదిగఁ జేరవచ్చి రతి ♦ దేవి యుపాయముఁ బొందకున్నకై
తగవున రత్నకుండలక ♦ దంబకముం దను వేఁడిపుచ్చుకోఁ
దెగువ మనోభవుండు తియ ♦ తియ్యనిసింగిణివింటికొప్పునన్
దగిలిచె దక్షవాటివని ♦ తాచికురంబులఁబోలు శింజినిన్. ౯౬

తే. పాంథనివహంబు పాలియు ♦ త్పాతకారి, ధూమకేతువుఁబోలి పె ♦ న్దోఁటనడుమ
విరిసెఁ గ్రొవ్వారినాగ ♦ కేసరఘుఁబువ్వు, మీఁదిధూమంబుభంగిఁదు ♦ మ్మెదలు వెడలె.

శా. సందుగ్ధార్ణవచంద్రమండలశిఖి ♦ జ్వాలాతటిద్వల్లరీ
కందర్పేక్షుశరాసనాచ్యుతతనూ ♦ గంధర్వవంశోద్భవల్

హిందోళంబునఁ బాడి రచ్చరలు భీ♦మేశుం ద్రిలోకాధిపుఙ్
మందారద్రుమవాటి ముందు సుమనో♦మైరేయముల్ గ్రోలుచున్. ౯౮

మ. అళికోలాహలసంభ్రమంబును శుక♦వ్యాజృంభముఙ్ శారికా
కులసల్లాపములుఙ్ విహారవిపిన♦క్షోణీవిభాగంబునం
గల పుంస్కోకిలకంఠకోమలకుహూ♦కార ప్రపంచంబుతోఁ
దలఁపించెఙ్ రతికాంతమూలరథినీ♦ధాటీసమారంభమున్. ౯౯

వ. మఱియును దత్సమయంబున భువనోత్సంగమంగళాలంకారంబైన దక్షారామం
బునఁ బరిసరారామంబులయందుఁ బరమపరిపాకభిదుర ఫలాపీడదాడిమీక్రోడ
నీడాక్రీడచ్ఛుకక్రోశయూథంబును, బరిస్ఫురితామ్రచూత చూడాతామ్రకిసలయా
మ్రేడితనదపసామ్రాజ్యపూజ్యంబును, నవకుసుమమధుపానహర్షితపుష్పతరుపు
ష్పితలావణ్యవిశేషంబును, నవదేవతాతాళవృంతాయమానదళనిచయరోచనామే
చక మోచారణ్యంబును, బరిసరావనిరుహనివహావకులపనసనిస్రంస్యమానశీధుర
సధునీజంబాలజాలవనవిభాగంబును, నవచపలచంచరీకచక్రచరణతాడన చంచల
చంపకదాడిమీప్రసవమంజరీరజఃపుంజసముత్పుంజనికుంజంబును, గంధసారగిరి
గంధవాహప్రవాహలహరికావిహారబహుళితభూతనూత క్రముకకుహళీగర్భనిర్భ
రామోద మేదురంబును నగుచు జగదాహ్లాదంబు సంపాదించుచు విజృంభించిన.

సీ. కర్పూరకస్తూరి♦కలఁ గోట నిర్మించి, కుంకుమద్రవమునఁ♦గొమ్మఁ దీర్చి
యగురుజంబాలంబు♦నందు బెందడి చేసి, పన్నీటివెల్లునఁ♦బరిఖఁ దాల్చి
పవడంపుఁ జివురుల♦గవఁకు లుత్పాదించి, తమ్మిరేకుల బోను♦తలుపు లెత్తి
రత్నాంకురంబుల♦రంగవల్లి రచించి, పట్టుపుట్టంబులఁ♦బడగ లెత్తి
తే. లలితశృంగారరచన న♦లంకరంచి, విబుధగంధర్వ లాముని♦వేళలందు
భీమనాథునినగరియా♦రామరేఖఁ, బూజచేసిరి సహకార♦భూరుహముల. ౧౦౧

కం. కిసలయరసజిగ్రహిషా, వ్యసనాకులపికకుహూభ♦వత్పంచమమై
కుసుమసమయావతారము, రసముంచెను జగములంగ♦రాగాంబునిధిఙ్. ౧౦౨

ఉ. జాదురజాదురంబు మృదు♦చర్చరిగీతులు వారుణీరసా
స్వాదమదాతిరేకములఁ♦జంద్రిక కాయఁగ దక్షవాటికా
వేదులమీఁదటఙ్ గనక♦వీణలు మీటుచుఁ బాడి రచ్చరల్
మోద మెలర్పఁగా భువన♦మోహనవిగ్రహు భీమనాథునిన్. ౧౦౩

చం. అనునగు కౌనుదీఁగె లసి♦యాడఁ బయోధరముల్ వణంకఁగాఁ
గనకమరాళకీరకల♦కంఠము యారరథాధిరూఢలై

వనితలు భీమనాయకుని ♦ వారక యేసిరి కమ్మఁదేనియల్
చినుకు పసిండి లేఁజెఱకు ♦ సింగిణివిండ్లను బుష్పబాణముల్. ౧౦౪

వ. తదనంతరంబ. ౧౦౫

ఉ. చంచలనేత్ర హేమరథ ♦ సౌధశిరోగృహకూటకోటిపైఁ
గాంచనపత్రపద్మమునఁ ♦ గర్ణికమధ్యమునందు నిల్వ ని
ర్వంచన నేసె నంతఁబరి♦నర్తనచిత్రవిలాసలీల న
ర్తించుచుఁ బుష్పబాణముల ♦ దేవశిఖామణి భీమనాథునిన్. ౧౦౬

తే. ఆజ్ఞ నాటించెఁ గేలివి♦హారములకు, భీమనాథుండు దేవతా♦గ్రామిణులకు
గంధకర్పూరకస్తూరి ♦ కాప్రశస్త వస్తుకోటులు నొసఁగె స♦వారితముగ. ౧౦౭

వ. అప్పు డప్పురంబున నంగనాజనంబులు. ౧౦౮

మ. జిలుగుం జెంద్రికవన్నెచేలలును గా♦శ్మీరాంగరాగంబులున్
వలిముత్యంబులభూషణంబులును భా♦స్వత్కేతకీపత్రికా
విలసద్వేణులుఁ జొక్కమై మెఱయఁగా♦ వేల్పుంజకోరేక్షణల్
లలి భీమేశ్వరు రాజశేఖరునిఁ గొ♦ల్వన్వచ్చి రొక్కుమ్మడిన్. ౧౦౯

శా. బీజాపూరఫలేక్షుచాపమణికుం♦భీమేచకేందీవరాం
భోజంబుల్ సమయోచితంబులుగ శం♦భుం జేరి కుంభస్థలీ
రాజార్ధాభరణంబు దక్షనగరీ ♦ రామాసముత్తుంగవ
క్షోజద్వంద్వశిఖాంకురస్ఫురణఁగై♦కొన్విఘ్నరాజర్థిలిన్. ౧౧౦

తే. సానికూఁతుల పల్లవో♦ష్ఠములఁబోలు, దాసనపుఁబువ్వుకండఁ గం♦ధర ధరించి
పసిఁడిబుఱ్ఱటకొమ్ము చే♦పట్టివచ్చె, భవునిఁగొలువంగఁ బాతాళ♦భైరవుండు. ౧౧౧

చం. ముగఁటిమిఁ జెంద్రగుజ్జురస♦మంటినవామపదాంబుజంబుపై
నిగళము నాసురాసురవి♦నిర్జితమౌ బిగువందె ఘల్లనం
బొగడలు బొండుమల్లియలు ♦ పొన్నలు పావడచొళ్ళెయంబునన్
నిగిడిచి వీరభద్రుఁడు చ♦నన్ శశిమౌళిసమీపభూమికిన్. ౧౧౨

వ. అప్పుడు బ్రహ్మాదిదేవతలును నింద్రాద్యష్టదిక్పాలకులును నందిభృంగిరిటికుంభనికుంభకుంభోదరచండీశ్వరమహాకాళప్రముఖు లగునసంఖ్యాతప్రమథులును సురగరుడోరగకిన్నరగంధర్వసిద్ధసాధ్యవిద్యాధర రాక్షసులును భూతబేతాళశాకినీడాకినీగణంబులును సమయోచితాలంకారంబులఁ గైసేసి వృషకేతునిం గొలిచి యుండి రంత. ౧౧౩

శా. ప్రీత్యుత్ఫుల్లనఫాలనేత్రుఁడగు శ్రీ♦భీమేశ్వరస్వామి ని
ప్రత్యూహం బగుసౌహృదంబున హరి♦బ్రహ్మాదులన్ భ్రూలతా

ప్రత్యుదోబ్ధనసంజ్ఞచేసి కనుగి♦ర్పం జాగె గంగోదకా
హత్యాక్షేపహృతి ప్రపంచములు ద♦క్షారామమధ్యంబునన్. ౧౧౪

సీ. హేమరాశముగఁ జల్లె♦ నెలనాఁగ యొక్కర్తు, కుంభోదకునిమీఁదఁ ♦ గుసుమరజముఁ
గుటిలకుంతల భృంగి♦రిటిమోమునం దొర్తు, తాఁకించె నొసలగం♦ధంబుఁ బసుపు
పటంబు లక్షించి♦నైజ గంధఘటుంపె, వీరభద్రుని నొక్క♦నీరజాక్షి
చెవిలోనఁ బొఱింగఁ♦జిమ్మె గొజ్జఁగనీటఁ, గాలభైరవు నొక్క♦కలువకంటి
తే. కొమ్మయొక్కతె యుందంపఁ♦గోమరసామి
యాదలలయందు జవ్వాది♦యసలుగలిపెఁ
బునుఁగు మణికుంభమున నించి♦పోసె
నొక్కపొలఁతి విఘ్నేశ్వరుని కుంభ♦బొజ్జమీఁద. ౧౧౫

ఉ. నేతుల నూనెలం బసుపు♦నీరునఁ గుంకుమచెందిరంబులన్
నూతనగంధసారముల♦ను న్నానరించిరి కేలితంత్రముల్
కౌతుక మొప్ప దక్షనగ♦రాపురవీథుల భూతకోటితో
మాతృకగోఁగు నూకసతి ♦ మంగమదేవియు ఘట్టతల్లియున్. ౧౧౬

వ. అంత. ౧౧౭

తే. మాళవీదేవి శ్రీభద్ర♦కాళిమీఁదఁ, బరిమళముతోడి చిఱుబంతి ♦ పసుపుఁ జల్లె
గాజుకుప్పెఁ గస్తూరి ♦ కాజలంబు, కర్ణికారాంబపై నించెఁ ♦ గన్నమోటి. ౧౧౮

ఉ. ఘట్టతనూస్తతిం గరిము♦ఖంబునఁ బిలిచి గౌతమీనదిం
బుట్టిన సత్ప్రవాహజల♦పూరముఁ ద్రుస్సన నూఁదుచుం బురీ
హట్టమున న్మహాత్సవ వి♦హారము సల్పెను గౌరిదేవితో
ల్పుట్టిగణేశ్వరుండు సుర♦భామిను లోలమునం దొడుంగఁగన్. ౧౧౯

మ. ప్రమదంబింపెసలారి మేనకయు రం♦భామంజుఘోషాతిలో
త్తమలున్ వెండియుఁ గల్గునప్సరసలుం♦ దారాధిపోత్తంసునిన్
బ్రమదం జల్లిరి గంధసారమునను♦ బన్నీటఁ గ్మాశీరపం
కమునన్ సంకుమదంబునం బునుఁగునం ♦ గర్పూరఖండంబులన్. ౧౨౦

తే. అచ్యుతునిమీఁదఁ జల్లె దు♦గ్ధాబ్ధికన్య, భారతీదేవి పద్మజు♦పైనఁ జల్లె
శచిమహేంద్రునిఁ జల్లె వ♦సంతకేలి, గంధకర్పూరకస్తూరి ♦ కాజలంబు. ౧౨౧

మ. అగురుం గుంకుమధూళియుం దిమురసం♦ధ్యారాగ సంస్పృష్టముం
గగనాభోగము సంధ్యకాలమునఁ నా♦ గాస్పింప నాభంగికిం
దగియెం జుక్కలువోలెఁ దాండవగణా♦ధ్యక్షుండు తుండంబున
న్నిగయం జల్లిన సప్తసింధుజలవే♦ణీబిందుసందోహముల్. ౧౨౨

వ. అట్టియెడ మున్ను కిన్నరులు చల్లినఁ బెల్లునెఱసిన ఘుసృణకుసుమకేసరధూళీపా ళియు, విద్యాధరసందోహంబులు ఉవ్విళం జిందిన మవ్వంపుఁ జెందిరంబును మచ్చరించి విచ్చలవిడి హెచ్చుగా నచ్చరలు చిమ్మినఁ గ్రమ్ము కుసుంభాంభః పూరంబును, నంగనాజనంబులపై నుడిసి తడిసి యార్ద్రాంగరాగశీకరాసారవాహిని యగుగంధవాహప్రవాహంబును, ధారాళకరాళరక్తచందనాంబు సంసిక్తవసుంధరాభాగంబును, గలయం గెంపు పెంపు సంపాదింప నకాండసంధ్య నావహించిన నందుచితవ్యవహారయోగ్యంబులై పొడచూపిన యంధకారంబునుం బోలె గంధర్వకరవికీర్యమాణకస్తూరికారేణువిసరంబులవలనను గుసుమకస్తూరికాసాంధ్యరాగాంధకారంబులకుఁ దోడై పొడచూపనేతెంచు చుక్కలచక్కఁదనంబున కుందోఁబుట్టైన హాయలవనా పాణిపల్లవవిక్షిప్తంబులైన పచ్చకప్పురంబు పలుకులును, జెవరలంబోవరకపోలాసలంబులవలన రోలంబనికురుంబంబులు నెగయుటయును బరస్పరసంసర్గావశంబున వశంబులు సముద్ధతినిగుడించు పసిండితమ్మిమొగడలు మెండుమండుటయునుంగా మూర్తింబగు మకరకేతనభుజప్రతాపదావానలంబు ఘటచ్ఛటాశబ్దంబుల చాడ్పునఁ జెలంగుచున్న యక్షకర్దమప్రక్షిప్తలాతూకరంత సంఘట్టనస్వనంబుల వలనను దొట్టితొట్టి యొడనెడగుడువులుగట్టిన సజ్జకపు గొజ్జంగనీటనందుఁ బ్రతిబింబించు నప్సరఃకాంతల వదనారవిందంబులు గోపులం బడి తేలియాడువాడని చేమంతిబంతులనడువునై కొలంకుల చందంబు నొందం బువ్వాని కరిగెడికొందుమతుమ్మెదకమపులను గదిరి తొరంగు గుహ్యాకమండలీకృత ఘుంద్రేక్షుకోదండ స్పృష్టనిష్ఠ్యూతనూతనకువలయాస్త్రంబులవలనను నిశాటకర హాటముఖనఖసముల్లిఖితంబైన సంకుమదపంకంబువలనను, నలుదెసల నంతంత జాఱిపడియున్న కమలమృణాలకాండంబువలనను, వరంబును బదిలంబుగా నమర్చిన కేదారంబు తెఱంగుఁదోఁచుటకునీడై చతురహాలికుండు జల్లువగువపుముకు నంపు మొలకల చెలువునం బెల్లుమల్లు ప్రమథగణవిభ్రష్టవినుతహారయష్టిముక్తాఫలంబులవలనను వసంతర్త్వారంభంబు త్రిభువనశృక్ప్రియతమం బయ్యె నయ్య వసరంబున. ౧౨౩

తే. బహుళకస్తూరికా మేఘ ♦ పటలమునకు, శీకరాసారమయ్యె గొ ♦ జ్జంగనీరు
వలువవడగండ్లునయ్యె న ♦ వ్వర్షమునకుఁ, గామినులుచల్లు కహ్లార ♦ ఖండవితతి.

వ. ఇవ్విధంబున వసంతోత్సవం బవధరించి భీమేశ్వరుండు హరిబ్రహ్మాది దేవతలకు నింద్రాద్యష్టదిక్పాలకులకు నరకిన్నరకింపురుషసిద్ధసాధ్యగంధర్వయక్షరాక్షసగణంబులకు భృంగిరిటికుంభనికుంభకుంభోదర వీరభద్రకుమారవిఘ్నేశ్వర నందిమహాకాళ పాతాళభైరవకాళభైరవాదిప్రఖ్యాతప్రమథులకు బ్రాహ్మ్యాది మాతృవర్గంబు

లకు శక్తిచతుష్టయంబునకు శ్రీమహాలక్ష్మీసరస్వతీశచీదేవీప్రభృతి పరమపతివ్రతా తిలకంబులకునప్సరస్స్త్రీలకు సముచితప్రకారంబులఁ గట్నంబు లిప్పించి దివ్యశ్రీ స్వయంభూత జ్యోతిర్లింగమూర్తిశక్తిసహితంబు పరమానందంబునం బొందె ననం తరంబు సప్తఋషులు గంగాజలసప్తగోదావరీజలంబుల నభిషేకించి పూజించి భీమలిం గంబు నిట్లని ప్రత్యేకంబు ప్రత్యేకంబు స్తుతియించిరి. ౧.౨౫

సప్తముని స్తోత్రము.

తే. వేయి ముఖములుగలకాద్ర♦వేయవిభుఁడు
నెఱయశక్తుండు గాఁడఁట ♦ నిన్నుఁ బొగడ
నేకముఖమునఁ బొగడంగ ♦ నెట్లు నేర్తు
నిన్ను శ్రీదక్షవాటికా ♦ నీలకంఠ. ౧౨౬

కం. మిహిరలవంబులఁ దారా,గ్రహనక్షత్రముల నచ్చ ♦ గణుతింప భవ
న్మహిమార్ణవగుణరత్నము, లహికంకణ యెవరికైన ♦ నలవియె పొగడన్. ౧౨౭

తే. అధికమైనతపంబు మూ♦ల్యంబుగాఁగ, నర్ధదేహంబు గౌరికి ♦ నలముకొన్న
జాణ దేవరనిను నాత్మ ♦ సంస్తుతింతు, దక్షిణాపథకాశికా♦ధామ భీమ. ౧౨౮

కం. ఎవ్వని కిరీటమునకుం, బువ్వై కడునొప్పు నన్న♦భోవాహిని లే
జవ్వనపుఁదుహినరుచితో, నవ్వేలుపు భీమనాథు ♦ నభివర్ణింతున్. ౧౨౯

కం. అర్ధకపాలము కేలను, నర్ధనిశాసార్వభౌముఁ ♦ డౌదల నెపమున్
అర్ధాంగలక్ష్మిగౌరియు, వర్ధిల్లఁగ నొప్పు భక్త♦వత్సలుఁ గొలుతున్. ౧౩౦

కం. సాధారణమతి సహజత,పోధనుఁగాఁ దలఁచి రతివి♦భుం డెవ్వనిదృ
క్క్రోధాగ్నికి నింధనమగు, నాధూర్జటి నహరహంబు ♦ నభివర్ణింతున్. ౧౩౧

కం. అస్తంగమితసురద్విష, హస్తన్యస్తత్రిశూలు ♦ నంతర్విధి సం
విస్మృతవిజ్ఞానోదయుఁ, గస్తూరీసదృశనీల♦కంఠునిఁ దలఁతున్. ౧౩౨

తే. విశ్వునకు శాశ్వతునకు వి♦శ్వేశ్వరునకు, విశ్వరూపాత్మకునకు మ♦హేశ్వరునకు
శ్రీస్వయంభూమహాసుధా♦సిద్ధలింగ, భీమనాథేశ్వరునకు న♦ర్పింతు మనసు. ౧౩౩

తే. భీమ భీమేశ్వరేశ్వర♦భీమనాథ, భవ భవారణ్యపావక ♦ భవ్యమూర్తి
భర్గ ఫాలాక్ష భసితాంగ♦ఫణివిభూష, శిఖిశిఖాభాసమాన భ♦జింతునిన్ను. ౧౩౪

తే. శర్వు సర్వేశ్వరేశ్వరు♦సర్వవంద్యు, శర్వు సర్వప్రదాయకు ♦ సర్వధాత
శర్వుసర్వంసహామహీ♦చక్రధరుని, శర్వు వర్ణింతు దేవతా♦సార్వభౌము. ౧౩౫

శా. వేదాతీతుని వేదవేద్యుని శివున్ ♦ వేదాంతవేద్యున్ భవున్
వేదాంతోపనిషద్రహస్యముఁ జతు♦ర్వేదీవిహారాలయున్

వేదాంగాదిపురాణముఖ్యవిలస♦ ద్విద్యాగమప్రక్రియా
వేది న్నిన్ను భజింతు నెన్నునమునన్ ♦ విశ్వేశ భీమేశ్వరా. ౧౩౬

కం. కామేశ్వరు నీశ్వరునిం, గామితఫలదానకల్ప♦కము౯ గామరిపు౯
గామాతీతుని దేవ, గ్రామణి నిను నాశ్రయింతు ♦ గౌరీరమణా. ౧౩౭

కం. ఆనందజ్యోతిని౯ బర, మానందానందమూర్తి ♦ సర్వజ్ఞుని౯ త్రిలో
కానందామృతదాయి మ,హానందుని వృషభవాహు ♦ నభివర్ణింతున్. ౧౩౮

సీ. ఓమహాలింగంబ ♦ యోమహాదేవుండ, యోమహాత్ముండ దేవ ♦ యోమహేశ
యోమహాసంపత్ప్ర♦దోగదీక్షాదక్ష, యోమహాపాపేంధ ♦ నౌఘదహన
నీమూర్తిసంస్మృతి ♦ నీనామసంస్మృతి, నీకథాశ్రవణంబు ♦ నిఖిలదురిత
యూథాంధకారసూ♦ర్యోదయం బఖిలక,ల్యాణనికాయసం♦ప్రాప్తిహేతు

తే. వంబికాకుచకుంభ స్వ♦యంగరాగ, పరిమళాసారవాసిత ♦ బాహుమధ్య
దక్షిణాపథ కాశికాం♦తర్విహార, గిరిశ శ్రీభీమనాథ ర♦క్షింపు మమ్ము. ౧౩౯

వ. అని సప్తఋషులు సంస్తుతించిరి తదనంతరంబ యరుంధతీదేవియు హంసవాహన
పశుసఖిచండికాపరిచారికాసముదయంబును ననేకప్రకారంబుల౯ బ్రశంసించి
యథాశక్తిం బూజించిరి. ౧౪౦

కం. ఈ సప్తమునిస్తోత్రము, వ్రాసిన౯ జదివినను వినిన ♦ వర్ణించిన౯ గై
లాసపతి దక్షవాటిని, వాసుండు జనులకు నభీష్ట♦వరము లొసంగున్. ౧౪౧

వ. అనిన విని మంకణుండు మునీంద్రా సదాశివభక్తిమాహాత్మ్యం బింకను నాకెఱింగిం
పవే యని యడుగుటయు వసిష్ఠమునీంద్రుం డిట్లనియె. ౧౪౨

గీ. కల్పవృక్షం బదేటికి ♦ గామధేను, వమృతమేల యిష్టార్థ♦సంపదలకు
నిశ్చయంబుగ మనసులో ♦ నిల్చెనేని, చాలదా మర్త్యు రక్షింప ♦ శంభుభక్తి. ౧౪౩

గీ. శంభుపదభక్తులకు వినా♦శంబు లేదు, కదియ వీశానుభక్తుల౯ ♦ గల్మషములు
నాదియందు౯ బ్రతిజ్ఞగా♦నానతిచ్చె౯, జంద్రచూడుండు నిజభక్త♦జనముగూర్చి.

సీ. భోగీంద్రభూషణు ♦ భూతిదిగ్ధాంగుని, నాభీలశూలాయు ♦ ధాగ్రహస్తు౯
గాకోలవిషనీల♦కంధరాభాగుని, గజచర్మపరిధాన ♦ కటివిభాగు౯
దాండవాడంబరో♦ద్దండదివ్యాకారు, నజవిష్ణువిబుధాధి ♦ పాభివంద్యు
గంగాతరంగసం ♦ కలితోత్తమాంగుని౯, ద్రైలోక్యరక్షా ప్ర♦దానదక్షు

తే. నీశు నాకారునొండె నొం♦డేవిభూతి, పతినిరాకారుఁగాఁజూచి♦బహువిధముల౯
బూజసేయంగ నేర్చిన ♦ పుణ్యమతులు, వారు శివభక్తులందు రి♦వ్వసుధలోన.

కం. శివధనము మ్రుచ్చిలించిన, శివధన మన్యాయవృత్తి౯ ♦ జెడిపోవంగా౯
దవులక యుపేక్షచేసిన, శివభక్తి ద్రోహమండ్రు ♦ శివభక్తివిదుల్. ౧౪౬

గీ. శివునికై భిక్షచేసి యా♦ర్జించినట్టి, ద్రవ్య మావంత యేనియుఁ ♦ దా స్పృశింప
కభవునకు నెవ్వఁ డొనరించు♦నర్పణంబు, వాఁడు శివభక్తముఖ్యుఁడు♦వసుధలోన.

కం. మాటలు వేయును నేటికి, హాటకధాన్యాదిశివప♦దార్థముల యెడం
జేటునకోర్వమి తుదిఁ బరి, పాటించినశంభుభక్తి♦పథము మునీంద్రా. ౧౪౮

సీ. మహనీయసంప్రీతి ♦ మద్భక్తజనముల, నాదరించుచునుండు ♦ నతఁ డొకండు
ఫలములుఁ బక్వాన్న♦ములుమాకునర్పింప, కనుభవింపక యుండు ♦ నతఁ డొకండు
పంచాక్షరీమంత్ర♦పాఠంబు నిత్యంబు, నాచరించుచునుండు ♦ నతఁ డొకండు
నన్నుఁ బ్రస్తుతించునా♦నాపురాణంబులు, సతత మావర్తించు ♦ నతఁ డొకండు

తే. శిలలఁ గాష్ఠంబులను మృత్తి♦కలను నిసుక
లింగముల నెస్సగాఁగఁ గ♦ల్పించి భక్తి
నర్చనము సేయునతఁ డొకం♦డనుచుఁ జెప్పు
శివుఁడు భక్తవిమర్శన♦ చేయునపుడు. ౧౪౯

వ. అదియునుంగాక రాగద్వేషఝషసంకులంబును గామక్రోధలోభమోహమదమాత్సర్యమహాగ్రాహాకులంబును బుణ్యపాపతోయమహాప్రవాహంబును నైన యీ సంసారమహాంభోరాశియందుఁ గర్మచోదితము లైనజంతువులు మునుంగుచుఁ దేలుచుం గొంతతడవు సుఖంబును గొంతతడవు దుఃఖంబును ననుభవించుచునుండును. కలియుగంబున శివభక్తి యుత్పన్నంబై యుండు. ౧౫౦

గీ. అతివిశుద్ధాత్మ! చతురంఘ్రిఁ ♦ గృతయుగమునఁ
ద్రేతఁ బాదత్రయమున వ♦ర్తించుచుండి
ద్వాపరంబునయందుఁ బా♦దముల రెంట
వెలయు శివభక్తి యొకకాలఁ ♦ గలియుగమున. ౧౫౧

గీ. కలియుగంబున ధర్మంబు ♦ కలవుగాన, నందు ధర్మంబుఁ జేసిన ♦ యతఁడు ఘనుఁడు
నిండు వేసవి మరుభూమి ♦ నిర్మలముగఁ, బేర్మి సలిలాన్నసత్త్రంబుఁ ♦ బెట్టినట్లు. ౧౫౨

వ. అని మఱియు నొక ప్రశ్నంబు చెప్పెదఁ బూర్వకాలంబున. ౧౫౩

గీ. అభవు నొకనాఁడు ప్రార్థించి ♦ యడిగె గౌరి, కలియుగంబున శివభక్తి♦ గ్రాఁగిపోవు
నఖిలలోకహితంబుగా ♦ నానతిమ్ము, భక్తివిజ్ఞానయోగంబు ♦ ఫాలనయన. ౧౫౪

వ. అని భవాని విన్నవించిన మహేశ్వరుండు. ౧౫౫

గౌరికి మహేశ్వరుండు భక్తివిజ్ఞానయోగంబుఁ జెప్పుట.

గీ. అడుగవలసినయర్థంబ♦ యడిగితీవు, క్రాఁగియుండెడు శివభక్తి ♦ కలియుగమునఁ
బాపకర్ముఁడ కాని యె♦వ్వాఁడు లేఁడు, పుణ్యకర్ముఁడు వికసితాం♦భోజనయన. ౧౫౬

సీ. ఎప్పుడు కలియుగం♦బేతెంచుఁ గ్రమవృత్తిఁ, బాపంబులన్నియుఁ♦బ్రబలుచుండుఁ
బాపంబు లోకభంగిఁ ♦ బ్రక్షయంబొందిన, నామీఁద దృఢభక్తి ♦ నాటుకొనును
నామీఁద దృఢభక్తి ♦ నాటుకొన్నప్పుడు, ధర్మంబు వర్తించుఁ ♦ దరతరంబు
ధర్మంబు వృద్ధిఁబొం♦దఁగఁ జిత్తమునఁబట్టు, లింగార్చనావిధి ♦ మంగళంబు
గీ. అంతట విభూతి యలఁదంగ ♦ నాసపుట్టు, నంతమీఁదటఁ గల్గు రు♦ద్రాక్షకలన
పాశుపతమటమీఁదను ♦ బదిలపడును, ముక్తిలతికకు నదిగదా ♦ మూలదుంప. ౧౫౭
వ. మఱియు నొక్కటిచెప్పెద సదాచారనిరతు లైనబ్రహ్మక్షత్త్రియవైశ్యులును ద్విజన్మ
శుశ్రూషాపరులై సత్యవాదు లైనశూద్రులును బతివ్రత లైనపుణ్యస్త్రీలును నాత్మ
దర్శనంబునకు నధికారులు విశేషించి. ౧౫౮
గీ. రాగవైషమ్యములు లేక ♦ ప్రజ్ఞగలిగి, మనములోన విరక్తి యె♦వ్వనికిఁగలుగు
వాఁడె యధికారి బ్రహ్మకై♦వల్యమునకు, వీఁడువాఁడని కులశుద్ధి ♦ వెదుకవలదు.
సీ. బహుజన్మసంశుద్ధి ♦ భాగ్యసంపదఁగాని, యోగవిద్యాశక్తి ♦ నూన దాత్మ
యోగసామగ్రికి ♦ నుచితసాధనములు, వాయుమార్గవిశుద్ధ♦వర్తనములు
నాడీపరంపరా♦క్రోశవాయుజయంబు, బలము చేతస్స్థితి♦భాగ్యమునకుఁ
జిత్తంబు తనయాజ్ఞ♦చేసివర్తించెనే, నిట్టట్టనఁగఁజాల ♦ వింద్రియములు
గీ. యమనియమములు నాసన♦ప్రాణనియతి
ధ్యానమును ధారణంబుఁ బ్ర♦త్యాహృతంబు
ననసమాధియు నాఁగ న♦ష్టాంగకలన
బ్రహ్మయోగంబు విలసిల్లుఁ ♦ బద్మనేత్ర. ౧౬౦
గీ. దేవి! సద్గురునాథోప♦దిష్టసరణి, మనుజుఁ డష్టాంగయోగంబు♦ననువుపఱిచి
యంతనద్వైతభక్తిఁగృ♦తార్థుఁడగుచు, నన్నుఁగని ఘోరభవబంధ♦నంబుఁ బాయు.
వ. రజ్జుజ్ఞానంబున సర్పభ్రాంతి నివృత్తి యగుచందంబున యోగంబున నన్ను నాత్మం
గను కారణంబున నవిద్యానివృత్తియగు ననినఁ గృతాంజలియై త్రిపురహర! యో
గం బెయ్యది? బ్రహ్మజ్ఞానం బెయ్యది? యానతీవే యనుటయు. ౧౬౨
గీ. శమము దమము తపంబును ♦ శ్రద్ధతాల్మి
యుపరతి సమాధానమనఁగ ని♦ర్మలవివేక
సాధనములాఱు దెసవులు♦సంఘటిల్లు
మోక్షమునకంద్రు నిగమార్థ♦మూలవిదులు. ౧౬౩
గీ. బలిమిమైనింద్రియంబులఁ♦బట్టి తెచ్చు, నదిసుమీయిందువదన ప్ర♦త్యాహరణము
సర్వసంసారదుఃఖప్ర♦శాంతిహేతు, వేకచిత్తప్రకారంబు ♦ నిదియసూవె. ౧౬౪
వ. ధ్యానంబు సాకారనిరాకారంబులు సూవె. ౧౬౫

గీ. నిర్గుణుని నిత్యశుద్ధుని ♦ నిర్వికారు, నాత్మఁ గనుట నిరాకార♦మనఁగఁబరఁగు
శేషనదిచంద్రరేఖాది ♦ చిహ్నధారి, ననుఁదలంచుట సాకార♦మనఁగ వెలయు.
కం. గురుఁడే యభవుఁ డభవుఁడే, గురుఁడని యభవునకు గురున♦కును భేదమెదం
బరికింపక శిష్యున కే, గురుఁడ నభవుఁడనయి వాని♦కోర్కులు దీర్తున్. ౧౬౭
గీ. రాజసముమాని శిష్యుండు ♦ ప్రకటభక్తి
గురునిఁ గొలువంగఁదగు రాజుఁ♦గొలిచినట్లు
వినయమొప్పంగ నిశ్శోక♦వృత్తిసౌఖ్య
నిభృతుఁడందుఁ ద్రివర్గంబు ♦ నీరజాక్షి. ౧౬౮
గీ. సర్వభూతములందును ♦ సమతఁ బూని, సత్త్వనిధుఁడయి యెవ్వాఁడు♦సంచరించు
నతఁడు శివభక్తుఁ డాతని ♦ నాదరింతు, నెట్టివేళలయందుఁ బూ♦ర్ణేందువదన.
సీ. పాపంబుపుణ్యంబు ♦ పాథఃప్రపూరంబు, దుర్వారమైనట్టి ♦ దుఃఖ మసుసు
కాంతాదిసుఖము సై♦కతవేదికాస్థలి, కందర్పవికృతులు ♦ కరడములును
ప్రాణభయంబు న♦క్రకుళీరనివహముల్, చేతోవికారముల్ ♦ క్షితిధరములు
బహుళదారిద్ర్యంబు ♦ బడబాగ్నిపింఛంబు, విషయాభిలాషంబు ♦ విషముగాఁగ
గీ. సనుధికంబైనసంసార♦జలధియందు, మునుఁగుచును దేలుచును గడ♦ముట్టఁబడని
జనులకెల్లను మత్పాద♦సరసిజములు, తెప్పయైయుద్ధరించు ని♦ందీవరాక్షి. ౧౭౦
కం. కామక్రోధావేశ, వ్యామోహాదుల నిజాన్వ♦యాచారంబుల్
వైముఖ్యమునొందించుచుఁ, బామరసంసారజలధిఁ ♦ బడుదురు కుమతుల్. ౧౭౧
కం. సుఖముల దుఃఖంబులుగా, సుఖములుగా దుఃఖములను ♦ జూతురు కుమతుల్
సుఖదుఃఖసమతఁ జూచిన, నఖిలభవాంభోధిఁ గడుతు ♦ రంబుజవదనా. ౧౭౨
సీ. మనసుఁ గామక్రోధ♦మదలోభముల కిచ్చి, సడలింతు రన్వయా♦చారసరణి
నన్వయాచారంబు ♦ లట్లుమాసి చనంగ, వర్తింతు రన్యాయ♦వర్తనమున
నన్యాయవర్తనం ♦ బదికారణముగాఁగఁ, బడిమునుంగుదు రుగ్ర♦భవపయోధి
భవపయోనిధిలోనఁ ♦ బడియుండి కాంతురు, నరకకూపమున ను♦న్మజ్జనంబు
గీ. నిరయమునఁ బెద్దకాలంబు ♦ నిష్కృతిఁబొంది, యిలకు వచ్చి జనింతురు♦హీనజాతి
హీనజాతి జనించిపా♦పానువృత్తిఁ, బాపులగుచుందురటనధః♦పాతమునను.
గీ. ఎట్టి హీనాత్మునకునైన ♦ నేన శరణ, మెట్టిపుణ్యాత్మునకునైన ♦ నేనదిక్కు
నన్ను వర్ణింపమేలు మా♦నవుల కెందు, సత్య మిదినమ్ము హిమధామ♦చారువదన.
వ. అనిన విని భవాని యెద్దాని నెఱింగి భవార్ణవంబువలన నిర్ముక్తులై పురాతనయోగీంద్రులు సనకసనందన సనత్కుమారసనత్సుజాతాదులు నిశ్శ్రేయసంబునొందిరమ్మహాజ్ఞానంబు సవిస్తరంబుగా నానతిమ్మనిన నమ్మహాదేవుం డిట్లనియె. ౧౭౫

మాలిని. శమదమపరినిష్ఠా ♦ సర్వభూతానుకంపా
సమనిగమనివృత్తి ♦ జ్ఞానవృత్తిప్రశాంతుల్
కమలదళనిభాక్షీ ♦ కల్గినం గల్గు నయ్యు
త్తమునకుఁ జిరకాల ♦ స్థాయికైవల్యలక్ష్మీల్. ౧౭౬

గీ. చిత్తమునఁదుష్టియును నతు ♦ ష్టియును లేక
యొకలిలోనన్య గృహమందు ♦ నున్నభంగి
నిస్పృహుండయి యుండంగ ♦ నేర్చె నేని
యతఁడు ముక్తుండు పద్మప ♦ త్రాయతాక్షి. ౧౭౭

గీ. అవనిగగనాగ్నివాయుజ ♦ లాదు లైన
ప్రకృతిసంభూతముల వికా ♦ రములఁ బాసి
యున్న నామూర్తిఁ బొడఁగాన ♦ నొప్పు నేని
కతఁడు ముక్తుండు సుమ్ము హై ♦ మాద్రితనయ. ౧౭౮

వ. నిత్యానిత్యవివేకుండును నీషణత్రయవిరహితుండును సమాధిషట్కసంపన్నుండు
ను నంతరరిషడ్వర్గవివర్జితుండును నగువాఁడు ముముక్షుండు. ౧౭౯

గీ. తత్పదార్థంబు పరమాత్మ ♦ తలియఁ బోలె, త్వంపదార్థంబు జీవుండు ♦ తలఁచిచూడఁ
దత్త్వమారయ వేదసూ ♦ త్రంబులోని, యర్థమది చిత్తమందుసీ ♦ వలవరింపు. ౧౮౦

గీ. ప్రత్యభిజ్ఞాన మనియెడి ♦ ప్రత్యయమున, విశ్రుతంబైన యాత్మ భా ♦ వింపవలయుఁ
బెద్దకాలంబునకుఁ గన్న ♦ ప్రియునయస్య, నానవాల్పట్టి తెలిసిన ♦ యట్లవోలె.

గీ. త్రాడుఁజూచి భ్రాంతి ♦ సర్పమకంబని, యాత్మవలనఁ దలఁచి ♦ నట్లవోలె
వేదశాస్త్రజనిత ♦ విజ్ఞానబలమునఁ, దెలివివడసి యాత్మఁ ♦ దెలియవలయు. ౧౮౨

వ. నిత్యంబు సర్వగతంబు కూటస్థం బేకంబుదోషవర్జితంబు భ్రాంతివశంబున భిన్నం
బై తోఁచు, ఘటాకాశంబు మహాకాశంబు భిన్నంబుగానేర్చునే? జీవేశ్వరులకు
భేదం బెక్కడిది? పృథివ్యాపస్తేజోవాయురాకాశంబులు శబ్దస్పర్శరూపరసగంధం
బులుమాయాసంసారప్రపంచంబు లేను సదాసాక్షిస్వరూపకుండనైన జీవుండనని
సమాధినిష్ఠులైన పెద్దలు తెలిసికొని పరమనిర్వృతి ననుభవింతురు. ౧౮౩

సీ. ప్రణవాత్మవర్ణరూ ♦ పస్పర్శనామూర్తి, ప్రణవంబు మూఁడక్ష ♦ రములు గలది
యది పరబ్రహ్మ మే ♦ కాక్షరంబున నొప్పు, నది ఋగ్యజుస్సామ ♦ ములందు నిలిచె
ననులోమకము లుదా ♦ త్తాదిస్వరములు కా, లంబులువర్ణత్ర ♦ యంబులవియు
వర్ణత్రయంబు స ♦ ర్వంబు నంతర్భావ, మొందుట యది యోమ ♦ సందియంబు

గీ. గతినకారము కారము ♦ కారములను, నాత్మమాయయు జీవాత్మ ♦ నాటుకొల్పి
జీవు నీశ్వరబుద్ధి భ ♦ జింపవలయు, ధృతి దలఁగనీక యెప్పుడు ♦ మతివివేక. ౧౮౪

సీ. చైతన్య మెప్పుడు ♦ సర్వంబుఁ దానయై, విలసిల్లుచుండు న♦ వ్వేళఁగాని
విశ్వభూతములను ♦ వీక్షించుఁ దనయందుఁ, బరిపాటి నెప్పుడ♦ ప్పాటఁగాని
సకలభూతములకు ♦ సంతసంబునుఁబొంది, యెపుడు వర్తించుఁ దా♦నపుడుగాని
యఖిలలోకములకు ♦ నధ్యక్షుఁడైకను, నధ్యక్షుఁ డెప్పుడ♦ య్యదనఁగాని
గీ. తన్నుఁ గేవలమాత్మగాఁ ♦ దలఁచియిష్ట, మతిశయము పృథముగఁ జూచు♦ నపుడుగాని
జన్మదుఃఖజరావ్యాధి♦ శాంతికరము, బ్రహ్మవిజ్ఞాన మారక ♦ పట్టువడదు. ౧౮౫
గీ. జ్ఞానసంపదఁగాని మో♦క్షంబు లేదు, కర్మశతమున నేనియో ♦ నిర్మలాత్మ!
జ్ఞానమునఁగ వేదాంతవి♦జ్ఞాన మబల!, యితరవిజ్ఞాన మజ్ఞాన♦మెంచిచూడ. ౧౮౬
కం. జ్ఞానాభ్యాసం బల్పంబైన మహాపాతకముల ♦ హరియించును గం
జానన! దీపంబించుక, యైనను హరియించుఁ గాదె ♦ యంధతమంబుల్. ౧౮౭
గీ. వహ్ని సందీప్తమై మహా♦వనమునందు సరసనీరసతరుల భ♦ స్మంబుసేయు
బ్రహ్మవిజ్ఞానమును నట్ల ♦ ప్రజ్వరిల్లి, శుభము నశుభము నొకటిగా♦నుడిపికాల్చు.
గీ. జలజపత్త్రంబు తనమీఁదఁ♦జల్లియున్న, యుదకబిందులతోఁ గూడ♦కున్నయట్లు
బ్రహ్మవిజ్ఞాని తనమీఁదఁ ♦ బడినయట్టి, విషయమలమునఁబడకుండు♦విమలచరిత.
గీ. భక్షితంబైనవిష మెల్లఁ♦గుక్షినడఁగు, విమలమణిమాలమంత్రౌష♦ధముల చేత
ననుభవించినవిషయంబు ♦ లట్లయడఁగు, బ్రహ్మవిజ్ఞానమునఁ జేసి ♦ పరవ మునికి.
శా. పూవుంబోఁణి! విశాలలక్ష్మిఁగనుచుం ♦ బుష్పంబు మూర్కొంచు వీ
ణావాద్యంబులు వించు నిష్టమధురా♦న్నంబర్థి సేవించును
న్సవేభంగుల నిల్చుచు న్నడచుచు♦న్నిద్రించు చోఁ గుహేశ్వరా!
నీవే కర్తవు మ్మటన్నపురుషు♦న్వోధింప వేదోషముల్. ౧౯౧
గీ. జ్ఞానవైరాగ్యసంపన్నుఁ♦డయిన పెద్ద, నెఱుఁగలేక యపహసించు ♦ నెవ్వఁడేని
వాఁడు గాల్పంగఁబడుఁ దీవ్ర♦వహ్నిశిఖల, రౌరవాదికఘోర నా♦రకములందు.
సీ. సజ్జనుండైన దు♦ర్జనుఁడైన మూర్ఖైనఁ, బండితుఁడైన నా♦తండె ఘనుఁడు
నిరపేక్షుఁ డాతండు ♦ నిర్వైరుఁ డాతండు, సమదృష్టి యాతండు♦ శాంతుఁడతఁడు
రా జిలజనులచేఁ ♦ బూజఁగైకొనుమాండ్కి, నతఁడు దేవతలచే ♦ నర్చఁగాంచు
నతనిపాదాబ్జంబు ♦ లంటినభూభాగ, మఖిలతీర్థములకు ♦ నభ్యధికము
గీ. వానిజన్మంబు జన్మ ము♦వాఁడు సుకృతి, వాఁడు ప్రోక్కినయి ల్లిల్లు♦వాఁడు దైవ
మేకొఱంతయు లేకుండు ♦ నింతి! యెఱుఁగు, బ్రహ్మవిజ్ఞానమునయశీలి♦భాగ్యశాలి.
గీ. ఎవ్వనింటికి బ్రహ్మజ్ఞుఁ ♦ డేగుదెంచుఁ, బ్రియముఁగాఁ గన్యమునుగల్గి♦భిక్షగొనఁగ
వానిఁ బిత్రుదేవతలు హర్ష♦వైభవమునఁ, బొగడుదురు కేలిమన్నా♦భోగకముగ.

కం. అనుభవపర్యంతం బెవ్వనిచిత్తము తత్త్వవీథి ♦ నర్తించు మహా
త్ముని నాతనిఁ బొడఁగను సజ్జనులకు నాక్షణము కిల్బి♦షములు లడంగున్. ౧౯౫

గీ. అన్వయము పావనంబు కృ♦తార్థుఁడతఁడు, పుణ్యవతి వార్ధి వేష్టిత♦భూతధాత్రిఁ
జెలఁగి యోలాడు నెవ్వని♦చిత్తవృత్తి, సచ్చిదానందమయసుధా♦సాగరమున. ౧౯౬

గీ. శ్రద్ధ గురుభక్తివిశ్వాస ♦ సౌష్ఠవంబు, జరగెనేఁ గల్గు వేదాంత♦సంగ్రహంబు
జరగదా లేదుసత్యంబు ♦ సత్యమిదియు, బహువిధోక్తులవనయింపు♦బ్రహ్మమిదియు.

వ. ఈ యర్థంబులు దేవతాగురువిశ్వాసంబులు గలవారికిఁగాని ప్రకాశింప వని భవా
నికి భవుఁ డుపదేశించె నని సుంకణునకు వసిష్ఠుండు చెప్పె నని శౌనకాది మహా
మునులకు సూతుండు వివరించె. ౧౯౮

శా. ఆకల్పస్థిరధర్మవైభవ! దిశా♦హర్మ్యాగ్రసంస్థాపితా
స్తోకస్ఫాటికకుంభవిభ్రమధురా♦శుంభద్యశోమండలా!
రాకాచంద్రమసోవిరాజ నవభ♦ద్రా! వీరభద్రేశ్వర
క్ష్మాకాంతాగ్రజవేమభూధవకృపా ♦ సంవర్ధితప్రాభవా. ౧౯౯

కం. లింగనమంత్రిసహోదర, గంగాధరదివ్యచరణ ♦ కమలనివాసా
భంగాపరతంత్ర! సమిత్రంగార్జున! యిందుధరధ♦రాధరధీరా. ౨౦౦

మాలిని. రవినిభశుభతేజా ♦ రామమాంబాతనూజా
దివిజగురుచరిత్రా ♦ దేవయామాత్యపుత్రా
భువనభవనకీర్తీ ♦ పుష్పకోదండమూర్తీ
ప్రవిమలగుణసంగా ♦ రాయవేశ్యాభుజంగా. ౨౦౧

గద్య. ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర సుకవిజనవిధేయ సకల
విద్యాసనాథ శ్రీనాథనామధేయప్రణీతం బైన శ్రీభీమేశ్వరపురాణం బనుమహా
ప్రబంధంబునందుఁ బంచమాశ్వాసము.

శ్రీరస్తు.
శ్రీరామాయనమః.
శ్రీమహాగణాధిపతయేనమః.
శ్రీ మాణిక్యాంబాసమేత శ్రీ భీమేశ్వరస్వామినేనమః.

శ్రీ భీమేశ్వరపురాణము.

షష్ఠాశ్వాసము.

శ్రీమహిత దక్షవాటీ
భీమేశ్వరపాదపద్మ♦పీఠాతిరసా
సామర్థ్యసుప్రవృద్ధమ
హామహిమా! బెండపూఁడి♦యన్నామాత్యా. ౧

వ. అక్కథకుండు శౌనకాది మహామునుల కిట్లని చెప్పందొడంగె. ౨

సీ. వినుఁడు సద్యోముక్తి♦విభవైకకారణం, బామ్నాయవిద్యార♦హస్యపథము
దక్షవాటీమహా♦స్థానమాహాత్మ్యంబు, వెండియుఁ బరిపాటి ♦ విస్తరింతు
నాదిలోకేశ్వరి ♦ యఖిలతత్త్వేశ్వరి, భోగమోక్షఫలాను♦భూతధాత్రి
సంపూర్ణవిజ్ఞాన♦శాలిని కల్యాణి, శైలేంద్రతనయ హ♦స్తములు మొగిచి
గీ. పశుపతికి నిట్టులని విన్న♦పంబుచేసె, దేవదేవ! జగన్నాథ♦దివిజవంద్య!
దేవతిర్యఙ్మనుష్యాది ♦ దీనసంస్థ, యభవ! కృప నాదు విన్నపం♦బవధరింపు. ౩

వ. సద్యోముక్తిదం బెయ్యది? పుణ్యస్థానం బెయ్యది? యానతిం డనుటయు జగద్ధితా
ర్థంబుగా నా వృషభధ్వజుండు భవాని నభినందించి యిట్లని యానతిచ్చె. ౪

కం. సద్యోముక్తికరంబును, సద్యస్సౌఖ్యప్రదంబు ♦ సద్యోదురిత
ప్రోద్యమభంగకరంబును, సద్యస్సకలార్థసిద్ధి ♦ సంపాదియునై. ౫

సీ. దర్శనమాత్ర నే♦దైవతగ్రామణి, జనులకు భోగమో♦క్షము లొసంగు
నమృతాబ్ధిమధ్యంబు♦నందు నేవేల్పు తేఁ, దుర్వి లింగాకృతి ♦ నుదయమొందె
మార్తాండుచే సప్త♦మౌనిముఖ్యులచేఁ బ్ర, తిష్ఠఁ గైకొనియె నే ♦ దివ్యమూర్తి
యన్నరస్త్రీసుకటా♦క్షావలోకనకళా, పాత్రేయ మెవనికిఁ ♦ బ్రాహ్మణికము
గీ. విశ్వపతి భీమనాథనా♦మేశ్వరుండు, శివుఁ డతండు వసించు నే♦క్షేత్రసీమ
నట్టి శ్రీదక్షవాటీమ♦హాపురంబు, భుక్తిముక్తికి రెంటికిఁ ♦ బుట్టినిల్లు. ౬

వ. తొల్లి కృతయుగంబున నమ్మహాస్థానంబున సంశ్రితవ్రతులును త్రికాలవిహితా
చరితస్నానులును భస్మోద్ధూళితసర్వాంగులును రుద్రాక్షమాలికాభరణులును జటా

వల్కలధారులను శంభులింగార్చనాపరాయణులును నగుమహామునులు పెద్దకాలంబు ఘోరతపంబుఁ జేసిన నత్తపోధనులయుత్తమతపంబునకుఁ జిత్తంబునఁ బ్రసాదంబు వహించి మంకణసంకల్పకల్పవృక్షం బగునయ్యహికంకణుండు ప్రత్యక్షంబైన నద్దక్షవాటికాధ్యక్షుని సాక్షాత్కారంబు వీక్షించి పరమహర్షులు హర్షోత్కర్షంబునొంది యనంతర దండప్రణామంబు లాచరించి హస్తారవిందంబులు మొగిడ్చి యిట్లనిరి. ౭

గీ. ఓసదాశివ! యోదేవ ♦ యోమహాత్మ!
యోవిరూపాక్ష! యోమహా ♦ దేవ! యభవ!
వరముఁ గృపసేయు మీదక్ష ♦ వాటమునకు
మ్రొక్కెదము మేము నీపాదాం ♦ భోజములకు. ౮

కం. సద్యోభోగశ్రీయును, సద్యఃకైవల్యవిభవ ♦ సౌలభ్యంబు
న్విద్యాసముద్యమంబు న, విద్యానాశంబు దక్షు ♦ వీటికిఁగలయున్. ౯

చం. అనఁగనఁ బ్రహృష్టచిత్తుఁడయి ♦ యర్ధశశాంకకిరీటుఁ డప్పు డి
ట్లను దగనూర్ధ్వరేతసుల ♦ కమ్మునిముఖ్యులకు న్విశుద్ధవ
ర్తనులకు నిచ్చితి న్వరము ♦ దక్షునివీటికి దక్షవాటికి
న్ననుపమరత్నపేటికి మ ♦ నఃప్రమదావహవస్తుకోటికిన్. ౧౦

గీ. ఎల్లకాలంబునుండెద ♦ నిచట నేను, మొదలి మామామయారామ ♦ పదమునందు
వెండిగుబ్బలిపై వేడ్క ♦ పిడుకొల్పి, మేరునగరాజుపైఁ జాల ♦ మెచ్చువవలి. ౧౧

సీ. అగ్రజుండైనను ♦ నంత్యజుండైనను, బాఁపోఁడియైనను ♦ బురుషుఁడైనఁ
బరమమూర్ఖుండైనఁ ♦ బండితుండైనను, దారిద్ర్యగుండైన ♦ ధనికుఁడైనఁ
బలవంతుఁడైనను ♦ బలహీనుఁడైనను, బ్రాయంపువాఁడైనఁ ♦ బంగునైన
నాస్తికుండైనను ♦ ననృతవాదియునైనఁ, బరఁగ గార్దభమైనఁ ♦ బందియైనఁ

తే. కీటకంబైన బకమైనఁ ♦ గ్రిమియునైనఁ, బాదపంబైనఁ దృణమైనఁ ♦ బ్రాణరహిత
మై రహించి దక్షవనచతు ♦ ర్ద్వారసీమఁ, బొందుఁ గైవల్యకల్యాణ ♦ భోగలక్ష్మి. ౧౨

ఉ. ప్రాణవియోగవేళ నర ♦ పక్షిమృగాళికి దక్షవాటికా
క్షోణినిఁ దారకంబుఁ బుర ♦ సూదనుఁ డానతియిచ్చుచుండఁగన్
బాణిబిసప్రసూనములఁ ♦ బయ్యెద నొయ్యన వీచుచుండు శ
ర్వాణి త్రిలోకమాత బల ♦ వన్మరణశ్రమభారశాంతికిన్. ౧౩

తే. తూర్పుదిశకును లవణపా ♦ థోధి సీమ, దక్షిణమునకు వృద్ధగౌ ♦ తమియె సీమ
పడమటికి రాజమాహేంద్ర ♦ పట్టనంబు, ద్యుమ్నపతిదిక్కునకు సీమ ♦ తుల్యభాగ.

వ. ఈ క్రమంబున సీమావిభాగంబు లేర్పడిన భీమమండలంబు భుక్తిముక్తిప్రదంబు. వహ్నిసంయోగంబున శుష్కకాష్ఠంబులు హారణంబైనచందంబున దర్శనమా

త్రంబునఁ బాపౌఘంబును నదిభస్మీభావంబునుం బొందింపంజాలును. ప్రాణవియోగకాలంబున జంతుకోటికిం గాలకంధరుండు తారకబ్రహ్మవిద్యారహస్యార్థంబుపదేశించును. కానిమాత్రంబైన ధనంబును బిడికెఁడు ధాన్యంబైన నిచ్చు దాతకుననంతఫలంబుచెందు. శ్రద్ధాసమన్వితంబుగా శివయోగికిం బెట్టిన భోజనంబును నిచ్చిన వస్త్రంబును భవబంధవిధ్వంసనంబులు. జపహోమదానతపోధ్యానసమాధియోగంబులు గలుగుపుణ్యులకుం గొలఁదిలేదు. హిమవత్పర్వతంబునఁ గోటివర్షంబులు తపంబుచేసినఫలంబు ఘటికార్ధోపవాసమాత్రంబునను, వారణాసియందుఁ గోటిబ్రాహ్మణులకు భోజనంబు పెట్టిన ఫలంబు భిక్షునకు నొక్కభిక్ష యిడినమాత్రంబునను, కురుక్షేత్రంబున సూర్యగ్రహణకాలంబునందులాపురుషదానంబు చేసినఫలంబు నొక్క భూసురాతిథికభ్యాగతికి శివయోగులకుఁ బెట్టిన భోజనమాత్రంబునను, దక్షవాటికాపుణ్యక్షేత్రంబున సంభవించు.

తే. భీమలింగంబు త్రిభువన♦స్వామియెపుడు, సన్నిధానంబుఁ గైకొని♦యున్నకతనఁ
దీర్థములలోన నుత్తమ♦తీర్థమయ్యె, దక్షిణానందవనవాటి ♦ దక్షవాటి. ౧౮

తే. ఘనత శివగంగయును సప్త♦గంగయునఁగఁ, గూపములు రెండు దక్షవా♦టీపురమున
మొదలియది పాపములనెల్ల♦నుడుపఁజాలు, నొకటిపితృదేవతలఁదృప్తి♦నొనుపనోపు.

ఆ. అని వరంబు లిచ్చి ♦ యంతర్హితుం డయ్యె, నిందుమౌళి ఋషుల♦కెట్ట యెదుట
వార లోన్నమశ్శి♦వాయ యంచుఁ బఠించి, రొక్కమొగిని దిశలు ♦ పిక్కటిల్ల.

సీ. పంచాక్షరీమంత్ర ♦ పారాయణంబులు, పఠియించుచును స్పష్ట♦ఫణితితోడ
నెచ్చటికేగిరో ♦ యెఱుఁగకయున్నార, మెచటికి విచ్చేయ♦కిచట నుండు
మనుచుఁ బ్రార్థింపంగ♦నౌఁగాకయనిపల్కి, ఋషులుచూడఁగఁ జూడ♦నిందుధరుఁడు
భీమనాథేశ్వరు ♦ కామితార్థప్రదు, కామితదివ్యలిం♦గంబుఁ జొచ్చె

తే. మెఱుఁగు మెఱచినపగిదిని♦మెఱయదీప్తి, నద్భుతంబును బొందిరి♦యపుడువారు
గౌరి! యిది భీమలింగంబు♦గౌరవంబు, దక్షవాటీపురీమహా♦స్థానమునను. ౧౯

వ. అనంతరం బమ్మునీశ్వరులు నియమశ్రద్ధాతాత్పర్యంబు లొప్పసప్తర్షిసమానీతయగు గోదావరిఁ గనుంగొని పరమానందంబున. ౨౦

శ్లో. దేవి! శంభోర్జటాజూట, నివాసిని! శివప్రియే!
లోకరక్షణకార్యార్థ, ముద్భూతాయై నమోస్తు తే. ౨౧

శ్లో. ఏకేనైవస్వరూపేణ, భీమనాథస్యసన్నిధౌ
సదా సన్నిహితా స్యత్ర, గోదావరి! నమోస్తు తే. ౨౨

కం. అని సంస్తుతించి యందఱు, మునిగణములు మంకణముని♦మునుకొని వికచ
త్కనకారవిందసౌరభ, ఖని యగునయ్యేటినీటఁ ♦ గౌతుకమొప్పన్. ౨౩

వ. అఘమర్షణస్నానమాడిరి. ౨౪

తే. అఖిలకాలంబు నొక్కప్రవాహంబుతోడ, భీమలింగంబు సేవించి బెరసి ప్రేమ
యొరసి మదినుబ్బు పాతాళ మొరసి పారి, సప్తసింధువు మున్నీటి సంక్రమించె.

తే. భీమలింగంబుమ్రోల గాంభీర్యసలిల, పూరమగుచుండు నేకాలమును సమృద్ధి
దనిపి తగఁ బాఱుచుండు నిత్యమ్ము ఘనము, దారజలనిధి సప్తగోదావరంబు. ౨౫

ఉ. ఏటమునింగి లేచి పరమేశ్వరుమందిరసౌధవాటికా
హాటకకుంభముల్ గని షడక్షరమంత్రము జిహ్వఁ గూర్చి వా
చాటత సత్యతత్త్వఁ డగు శాంభవయోగివరేణ్యుఁ డేలజం
జాటపుసంసృతిం బొరలి చచ్చుచుఁ బుట్టుచునుండుఁ భార్గవతి. ౨౬

చం. కొడుకులు నీవు నేఁ బ్రముఖకోటి విరించిసరోజలోచనుం
డుడుగణరాజ ఖేచరమహోరగకిన్నరసిద్ధసాధ్యులె
ప్పుడు గొలువంగ వైభవము పొంపిరివోవఁగ దక్షవాటినుం
డెడు శివు భీమనాయకుఁ దటిన్యవతంసు భజింపమేలగున్. ౨౭

కం. సప్తాశ్వసంప్రతిష్ఠుని, సప్తమునీశ్వరప్రధానసంస్తుతు నంత
ర్గుప్తస్వరూపుఁ ద్రిభువన, గోప్తను భీమేశ్వరేశుఁ గొలువుము తరుణీ. ౨౮

వ. భీమనాథమహాస్థానంబు సర్వకామార్థసాధకంబు; సంవత్సరంబును గొలువ ముక్తిప్రదాయకంబు. సూర్యుండు మేషరాశియందుఁ జిత్రానక్షత్రంబున వసియించియుండు చైత్రమాసంబున సప్తగోదావరంబునఁ బ్రాతస్స్నానంబుఁ జేసి యథాశక్తి పిత్రులకుఁ దగినదానంబు లొసఁగి, భీమనాథుండను నగునాకు నమస్కారాభిషేకపూజానైవేద్యంబు లాచరించి నగుండు సక్తభోజియయ్యెను నట్లె భానుఁడు వృషభరాశియందు విశాఖానక్షత్రంబు నాశ్రయించియుండు వైశాఖమాసంబునను, ప్రభాకరుం డుమిథునంబునందు జ్యేష్ఠానక్షత్రంబునందు నిలిచియుండు జ్యేష్ఠమాసంబునను, రవి కర్కాటకంబున భగదైవతంబైన నక్షత్రంబున నాషాఢమాసంబునఁ గూడియుండఁగను, శ్రావణమాసంబున శ్రవణనక్షత్రంబున సింహరాశియందు మార్తాండుఁడు నిలిచియుండఁగను, భాద్రపదమాసంబునఁ బూర్వాభాద్రానక్షత్రమునఁ గన్యారాశియందు భానుండుండఁగను, నాశ్వయుజమాసమున నశ్వినీనక్షత్రంబునందుఁ దులారాశియందుఁ జిత్రభానుండు నిలిచియుండఁగను, గార్తికమాసంబునఁ గృత్తికానక్షత్రంబున వృశ్చికరాశిని సూర్యుం డుండఁగను, మార్గశీర్షమాసంబున ధనూరాశియందు మృగశిరానక్షత్రంబున నభోమణి యుండఁగను, బుష్యమాసంబునఁ బుష్యనక్షత్రంబున మకరరాశియందు లోకబాంధవుఁ డుండఁగను, మాఘమాసంబున మఘానక్షత్రంబునఁ గుంభరాశి

యందు మిహిరుండుండఁగను, ఫాల్గునమాసంబున నుత్తరానక్షత్రంబున మీనరా
శినిం దినకరుండుండఁగను, బూర్వోక్తప్రకారంబున శైవవ్రతాచారంబులు నడ
పిన మనుజుండు, పాతకంబులవలన విముక్తుండగును; వెండియు యజ్ఞతీర్థం బను
తటాకంబు సకల తీర్థరాజంబు. ౩౦

సీ. మేషరాశిస్థుఁడై ♦ మిహిరుఁడుండఁగఁ బర్వ,తిథి స్నాతుఁడగుచుఁ ద ♦ త్తీర్థమందుఁ
దన యథాశక్తిఁ గాం ♦ చనము విప్రులకిచ్చి, పాతకంబులఁ బాయుఁ ♦ బంచజనుఁడు
వృషభంబునం దట్ల ♦ వెండి మార్తాండుండు, మిథునరాశిం దగ ♦ మెచ్చుమీఱు
స్థితిఁ గర్కటకరాశిఁ ♦ గృతసప్తగోదావ,రాభిషేకుఁడు దోష ♦ మపనయించుఁ

తే. దప్పకాషాఢసితచతు ♦ ర్దశిని సింహ, కన్యలను సూర్యసంగను ♦ కాలమునను
జన్మతారలయందున ♦ సంధులందు, యజ్ఞకుండపయస్స్నాన ♦ మఘహరంబు. ౩౧

తే. భానుమంతుండు తులమీఁదఁ ♦ బర్వళింప, యజ్ఞకుండతటాకంబు ♦ నందుఁ గ్రుంకి
బ్రహ్మహత్యాదులైన పా ♦ పనిచయములఁ, బంచబంగాళముగఁ దోలుఁ ♦ బంచజనుఁడు.

కం. ఆదిత్యుఁడు వృశ్చికమునఁ, బాదం బిడినట్టి వేళఁ ♦ బావనతిథి సూ
ర్యోదయమున యజ్ఞతటా,కోదకమునఁ గ్రుంకి మనుజుఁ ♦ డోడుచు నఘంబుల్. ౩౩

తే. ఇనుఁడు కోదండరాశియం ♦ దెక్కియుండ, పద్రనక్షత్రమునను మ ♦ర్త్యుండు నియతి
యజ్ఞకుండపయస్స్నాన ♦ మాచరించి, సృష్టిలోఁ దోలుఁ బాతక ♦ శ్రేణినెల్ల. ౩౪

తే. మకరరాశిస్థుఁడై భాను ♦ మంతుఁడుండఁ
బుష్యనక్షత్రమునఁ బ్రొద్దు ♦ పొడుచునపుడు
భానువాసరమున యజ్ఞ ♦ భద్రసరసిఁ
గ్రుంకి పాతకచయముల ♦ పొంక మణఁచు. ౩౫

కం. మాఘమునఁ గుంభరాశి ని, దాఘద్యుతియుండ సప్త ♦ తాపసవాహి
న్యోఘమున మునుఁగునరుఁ డఘ, లాఘవిఘటితుఁడగుచుండు ♦ హోవప్రార్థిన్.

తే. ఫాల్గునంబున నుత్తరా ♦ ఫల్గునిని, మీనరాశిని సూర్యుండు ♦ మెలఁగుచుండ
సప్తగోదావరాభిషే ♦ చనము సేయఁ, బాతకవ్రాతముల నెల్ల ♦ భంగపఱుచు. ౩౭

మ. ప్రతివేళం దగ మర్త్యుఁ డీక్రియఁ జరిం ♦ పంబాడి యంగీకృత
వ్రతుఁడై దక్షిణకాశియందు బహుళ ♦ స్వర్గాపవర్గార్థమై
శితికంఠప్రియమందిరంబయిన యీ ♦ క్షేత్రంబునం దెచ్చటన్
మృతుఁడై యున్ననరుండు పొందు గమిక ♦ శ్రీభూతకైవల్యమున్. ౩౮

కం. కనకంబణుమాత్రంబై, నను దక్షారామనగర ♦ నైకటికమహా
మునిసింధువుదరి దానం, బొనరించుట మేరుదాన ♦ మూర్విం దలఁపన్. ౩౯

తే. వర్తనం బెల్ల శంభుసే♦వావ్రతంబు, మాటలెల్లఁ బంచాక్షరీ♦మంత్రరాశి
భోగమోక్షనివాసైక ♦ భూమియైన, దక్షపురినున్నజనులకో♦తలిరుఁబోణి. ౪౦

వ. దక్షారామమాహాత్మ్యం బవాఙ్మానసగోచరంబు. భీమనాథ మహాదేవదివ్యశ్రీపాద పద్మసేవావ్రతంబువలన నెట్టి పాపకర్ముండును భోగమోక్షపదవీ సామ్రాజ్య పట్టాభిషేకమహాదివ్యపదవినొందు సర్వశాస్త్రసిద్ధాంతమతాంతరంబులకు సమ్మతంబైన యిమ్మహాస్థానం బేకవటీభూతంబు సద్యోముక్తిప్రదంబు సద్యఃపరిజ్ఞానసదనంబు సద్యఃకళాసమృద్ధిప్రదంబై యుండు ననిదయార్ద్రమానసుండై వృషభధ్వజుం డా దేవి నుద్దేశించి పార్వతి నీవడిగినయర్థంబు సర్వంబుసమర్థించితి. చిత్తంబున నవధానంబుసేయుమనినం బతికిఁ గరంబులు మొగిడిచి యుక్కి భవానిహార్షోత్కర్షంబునొందె, నీరహస్యంబేను గౌరీముఖంబున నెఱింగి ప్రసంగవశంబునం బ్రహ్మావేదులగు మీకు నుపదేశించితి. ౪౧

శా. సద్యోముక్తిప్రదంబు దక్షనగరీ♦స్థానంబు విశ్వేశ్వరుం
డాద్యుం డవ్యయుఁ డానతిచ్చె నిది వే♦దార్థంబు; సద్యోవిము
క్త్యుద్యోగం బనుపేక్షయైన నదిసుం ♦ డొండొక్క తీర్థంబు పు
ష్పోద్యానవ్యం బనఁ గాల మందుఁ గడుసక్ ♦ యోగంబు భావింపఁగన్. ౪౨

వ. మఱియు భీమలింగమాహాత్మ్యంబు భవకలుషనాశనంబు బ్రహ్మవిష్ణుపురందరాదులకుఁ గల్పకోటిశతంబులనైన నచియింపనలవిగాదు. అయినను నానేర్చు విధంబున నింక వర్ణించెద. ౪౩

తే. భువనములమూఁటియందును ♦ బొబ్బవిడుచు, నంతదాఁక నె యీశరతీ♦ర్థాదులెల్ల
నప్పుడు భేదంబు లేదని ♦ రవనిబొంద, దక్షవాటీపురీభీమ♦ధామమహిమ. ౪౪

సీ. దక్షుండుపొట్టేలి♦తల ధరించినయప్డు, భారతి ముక్కు గో♦ల్పడినయపుడు
పూషుపండ్లువదనంబు ♦ బోసివోయినయప్డు, విష్ణునిచక్రంబు ♦ విఱిగినపుడు
అగ్నినాలుకలేడు ♦ నౌడుమాసినయప్డు, ఉడురాజు పొట్టిగు♦జ్జుఱికినపుడు
జన్నంపుటిజ్జీసు♦ స్తకము ద్రెళ్లినయప్డు, వడివత్తులు చిమ్ము♦వడినయపుడు

తే. ప్రాణభయమునముక్తిసం♦భ్రమము మెఱయ
నమ్మహోత్పాతకాలంబు♦నందు మునులు
దైవగంధర్వసిద్ధవి♦ద్యాధరులును
నేమమునగొల్తు రెవ్వాని♦నెమ్మనమున. ౪౫

సీ దుగ్ధాబ్ధిమంథనో♦ద్భూతహాలాహల,జ్వలనమేచకకంఠ ♦ శరణు శరణు
గిరిచాపనిష్ఠ్యూత♦హరిశిలీముఖఖడ్గ,పురగోపురాట్టాల♦శరణు శరణు
సింధురాంధజలంధ♦రాంధకవ్యాఘ్రాది, సురకంటకధ్వంస ♦ శరణు శరణు
విలయసంధ్యాకాల♦వికటతాండవకేళి, జర్జర బ్రహ్మాండ ♦ శరణు శరణు

తే. శరణు ఖేచరదేవతా♦సార్వభౌమ, శరణు త్రైలోక్యసతతర ♦ ధౌరంధరీణ
శరణు దక్షిణకాశికా♦స్థానినిలయ, శరణు భీమేశశంకర ♦ శరణు శరణు. ౪౬

కం. హా! సన్నిస్థితినాశన, కర! సంసారాబ్ధితరణ♦ఘనతరచరణా
బుధహాస్లన! రక్షింపుము, శరణాగతులైనమమ్ముఁ ♦ జంద్రాభరణా. ౪౭

కం. అపరాధశతము లోఁగొను, మపరిమితకృపావిధేయ ♦ యార్తశరణ్యా
త్రిపురీకుసుమాభరణా, కపర్ది! జటాజూటకోటి ♦ ఘటితశశాంకా. ౪౮

తే. సుప్రకాశుండవగుమువి♦శ్వప్రకాశ, శర్వ! సర్వేశ! త్రిపురభం♦జన! గిరీశ!
యనుచు సందండనం బలు ♦ సభినుతింప, నచట భీమేశ్వరేశ్వరుం♦డభవుఁ డపుడు.

ఉ. సన్నిధి చేసి వారలకు♦ శాక్వరకేతుఁడు సుప్రసన్నుఁడై
యెన్నిక కెక్కఁగా వరము♦లిచ్చె ననేకము లింతనుండి నా
సన్నుత దక్షవాటిక స♦మస్తమహీవలయంబులోన నా
పన్నుఁగఁ దీర్థరాజపద♦భాజన మయ్యెడు నెల్లకాలమున్. ౫౦

కం. ఈ దక్షారామమునకు, మేదినిఁగల తీర్థకోటి ♦ మిగులక యుండున్
మేదురకరుణాగరిమను, సాదరముగ ఖచరసిద్ధ♦జనహితబుద్ధిన్. ౫౧

తే. దక్షుఁ గీర్తించి యాచంద్ర♦తారకంబు, దక్షవాటిక సకలతీ♦ర్థంబులందు
నుత్తమంబుగ వరమిచ్చి♦యుందు మిచట, నేప్పుగను నేరికి నిముందు♦ నేను నుమయు.

సీ. యజ్ఞకుండంబున♦యందుఁ దీర్థంబాడుఁ, బాయ కెవ్వండు నా♦భక్తుఁడతఁడు
గ్రుంకు తేపులు సప్త♦గోదావరంబునఁ, బాయ కెవ్వండు నా♦భక్తుఁ డతఁడు
ద్వాదశక్షేత్రయా♦త్రావిధాన మొనర్చుఁ, బాయ కెవ్వండు నా♦భక్తుఁడతఁడు
దక్షవాటీమహా♦స్థానంబునందుండుఁ, బాయ కెవ్వండు నా♦భక్తుఁ డతఁడు
తే. తెరువు నడిచెడు వారికి ♦ నిరవు చేసి, ధాన్యములు నెయ్యి నూనె వ♦స్త్రములు లవణ
మాదిగాఁగల యాత్రాప♦దార్థసమితిఁ, బాయ కెవ్వండు పెట్టు నా♦భక్తుఁడతఁడు.

కం. మాటలు వేయియు నేటికిఁ, జాటించెన్ శివుఁడు వేడ్క♦జగములలో ము
న్నీటి దరి దక్షవాటికి, సాటిగఁ దీర్థములు లేవు ♦ సత్యము సుండీ. ౫౪

తే. బ్రహ్మవిద్వాంసులకుఁ బాశు♦పతియతులకుఁ, బెట్టు ధనధాన్యవస్త్రాన్న♦భిక్ష మెవ్వఁ
డక్షయగుణంబుగాఁగ నీ♦దక్షవాటి, వాని కలవడు నిజము కై♦వల్యపదవి. ౫౫

తే. చప్పరం బొండె గుడి యొండెఁ ♦ జవికె యొండెఁ
గలుమఠం బొండె నిల్లొండెఁ ♦ గట్టి పెట్టి
బ్రహ్మయోగీశ్వరుని నుంచు ♦ భక్తి నెవ్వఁ
డతఁడు మాన్యుండు పూజ్యుండు ♦ నతులితముగ. ౫౬

వ. తొల్లి జలంధరగంధగజపుండరీకాంధకాసురాదు లగుమహాదైత్యులు భువనత్రయం బాక్రమించిన శక్రుండు భయభ్రాంతుండై దేవగణదేవమునిసిద్ధసాధ్యవిద్యాధరోరగగరుడగంధర్వకిన్నరకింపురుషాదులం గూడుకొని బ్రహ్మకు విన్నవించిన విరించియు వారిం దోడ్కొని పాలమున్నీటిలో ఫణిరాజతల్పంబుపైఁ బవ్వళించిన పాంచజన్యధరునకు విన్నపంబు చేసి సంస్తుతించినఁ గైటభారిహాటకగర్భుని విన్నపంబు నవధరించి చింతాభరంబున నొక్కింతవడ వూరకుండి పుండరీకాసనుం జూచి యి ట్లనియె. ౫౭

తే. వీరభద్రుండు చక్రంబు ♦ విఱిచి దక్ష
యాగమున నాఁడు భక్షించె ♦ నాగ్రహమునఁ
జెఱకు శర్కర పాకంబు చేసినట్టి
చక్కిలముఁబోలె ఘటఘటా ♦ శబ్దమొప్ప. ౫౮

ఉ. కోపము చిచ్చునం బడిన ♦ కూరిమితల్లి ఋణంబు దీఱ ను
ద్దీపతరాగ్రహంబునను ♦ దేవతలం గడుభంగపెట్టఁగా
నేపున నేను మార్కొని పయిం ♦ బఱతెంచినయంతమాత్రఁ గో
జాపరమేశ్వరా యనుచుఁ ♦ జక్రము మ్రింగిన నోహటించితిన్. ౫౯

తే. తెగున దక్షుని కంఠంబు ♦ ద్రెవ్వనేసి, త్రేళ్చెఁ దల నధ్వరాగ్నిని ♦ వీరభద్రుఁ
డా ప్రజాపతి మెడమీఁద నజుణంబ, నగుచుఁ బొట్టేలితలఁ దెచ్చి ♦ నాటుకొలిపె.

వ. అప్పు డవ్వీరభద్రుని తేజోవిశేషంబును గనుఁగొనఁ గన్నులు మిఱుమిట్లుగొన వెఱచఱచి యెలుంగుడించి తొలంగిత నాఁటనుండియు. ౬౧

శా. పట్టంగైదువు లేక విన్ననయి నా ♦ బాహార్గళుల్ చూడఁగా
యిట్టుంగాక సురేంద్ర! బాధపడి మీ ♦ రిబ్బంగి దుఃఖింపఁగాఁ
గట్టాహో యిటు మిన్నకుండుదునె ♦ శీఘ్రంబిప్డు భీమేశ్వరున్
ముట్టంగొల్చెదఁ జక్రలాభమునకై ♦ ముగ్ధేందుచూడామణిన్. ౬౨

వ. అని పలికి నలినసంభవేంద్రాదు లగునిర్జరులతోడంగూడి సరోరుహాక్షుండు దక్షారామంబునకు వచ్చి శివగంగాకూపంబునఁ ద్రిషవణస్నానంబు చేసి భస్మోద్ధూళితగాత్రుండును, త్రిపుండ్రాంకితమస్తకుండును, రుద్రాక్షమాలికాధరుండును జటావల్కలసంయుతుండును నై నిత్యంబును సహస్రపద్మంబులఁ బూజఁ గావించుచు భీమనాథేశ్వరేశ్వరు సేవించుచుండె నంతఁ గొంతకాలంబునకు. ౬౩

కం. ఈభంగి వేయుపద్మముల, నాభుజగాభరణు నెప్పు ♦ డర్చన సేయన్
శ్రీభీమేశుండు కమల, నాభుని మనమరయ నొక్క ♦ నలినము దాఁచెన్. ౬౪

తే. తొంబనూఱునుదొంబది ♦ తొమ్మిదియును
జలజములఁబూజచేసెను ♦ శార్ఙ్గపాణి
వేయిటికినొక్కపద్మంబు ♦ వెలితియైన
సహానియమంబునకు భంగ♦మయ్యెననుచు. ౬౫

చం. కటకకలాపసంఘటిత ♦ కస్తురికద్యుతిపాటవంబునం
జిటికినవ్రేలిగోరఁగొని ♦ చిత్తునఁదీసెను లోచనంబుఁ బ్ర
స్ఫుటకమలంబు వేగహరి ♦ పూన్చెఁ దటుక్కున దక్షనాటికా
కటకవిలాసినీవిటశి♦ఖామణికిం హరిణాంకమౌళికిన్. ౬౬

కం. కైటభవిరోధిభక్తిర, సాటోపంబెసఁగ వనరు♦హాలోకనము
ద్ఘాటించి భీమనాథుని, హాటకపదపీఠిలోన ♦ నాబ్జముఁ బెట్టెన్. ౬౭

మ. నిడువాలుంగుడికన్ను పాదములపై ♦ నేసుంబుతోఁ బెట్ట న
ప్పుడు ప్రత్యక్షముఁబొంది నీలగళుఁ డం♦భోజాక్షునిం జూచి నేఁ
గడుహర్షించితి నిచ్చెదన్వరము వే♦కైకొమ్ము నా నమ్రుఁడై
యడిగెం శౌరి జగత్త్రయోద్ధరణలీ♦లావక్రముం జక్రమున్. ౬౮

తే. భీమనాథుఁడు త్రిభువన♦స్వామియిచ్చె, నస్త్రకులదైవమనఁనొప్పు ♦ నాయుధంబు
హరికి నటమున్నయిచ్చెఁ జం♦ద్రార్ధమౌళి, వికచపద్మోపమం బైన ♦ నెపఁదకన్ను.

వ. ఇవ్విధంబున శ్రీభీమనాథ మహాదేవునివలనం జగద్విజయం బగుచక్రాయుధంబు వడసి కోటిసహస్రమార్తాండమండల తేజఃప్రభాప్రభావభాసమానం బైన యా రథాంగంబునమున్ను చెప్పంబడ్డవిబుధవిరోధులఖండించి యింద్రాదిప్రముఖనిఖిల బర్హిర్ముఖవ్రాతంబునకుఁ జేతఃప్రమోదం బాపాదించె నిది యమ్మహాదేవుని మహిమంబు. ౭౦

కం. శివగంగాజలముల నా, స్నానంబొనరించినట్టి ♦ పరమాత్ములు త
ద్దివసమున భీమనాథుని, నవలోకింపంగఁ గలుగు ♦ నభిమతసిద్ధుల్. ౭౧

తే. మదనవిధ్వంసితిరిచుట్టు ♦ మాలెయందు, దక్షిణపుదిక్కునందు మా♦ధవునిఁగాంచి
రహిని వేడుక విఘ్నాది♦రాజుఁజూచి, మనుజుఁ డిష్టార్థసిద్ధిసం♦పదలనొందు. ౭౨

తే. అష్టమీభానువాసరం♦బందునొండె, నొండెనేనిచతుర్దశి ♦ నిండుభక్తిఁ
బూజఁగావించియెవ్వఁడే ♦ భూమినున్న, దుర్గ సేవింపదురితంబు♦దొలఁగునండ్రు.

కం. తాండవభవువీక్షణమున, ఖండేందుశిఖావతంసు ♦ కట్టెదురుగఁదా
నుండెడుగౌరిని మంచుం, గొండసుతం బూజసేయఁ ♦ గోర్కులునిండున్. ౭౪

సీ. భూర్భువస్స్వర్లోక♦ములుమూఁడుభేదించి, బ్రహ్మాండభాండక♦ర్పరముదాఁకఁ
బెరిగిదిక్చక్రంబు ♦ పిక్కటిల్లఁగఁబట్టి, బలిసికుప్పసముతోఁ ♦ బాముపోలె

నిరవకాశంబుగా ♦ నిత్యసన్నిహితంబు, నగులింగమూర్తితో ♦ నుబ్బియుబ్బి
భీమనాథుఁడు మహా♦భీమాద్భుతప్రౌఢి, బహువిరాడ్రూపవి♦భ్రాజియయిన
తే. భయమునుం బొందిదేవతల్ ♦ ప్రస్తుతించి, యయ్యనీరూపమింతింత♦యనఁగరాదు
యేదిమొదలేదికడపల ♦ యేదిమధ్య, మెట్టునినుఁ బూజసేయుదు♦మిందఱమును.

వ. అనినం గారుణ్యసామ్రాజ్యపట్టాభిషిక్తుం డగునాజగజ్జెట్టివేల్పు బ్రహ్మాండగోళంబునకు మిక్కుటంబుగాఁ బెరిఁగిన దేహంబుఁ బొట్టిచేసి తిరుచుట్టుమాలికలోన గౌరీ, జనార్దన, రుద్ర, కేశవ, వినాయక, దుర్గాతాండవేశ్వర, నృత్యభైరవులను దేవతాసప్తకంబు పరివేష్టింప, సకలలోకానందకరపరదారగమనపాపహారేశ్వరులునై బుతిభాగంబున నధివసింప, నంతర్గర్భగృహంబులోపల మాణిక్యాదేవిసహితుండై సలిలనిధివృద్ధగంగాకౌంతేయసరిత్తుల్యభాగా హేలానదీసప్తగోదావరమాతృకాపరివృతసుందరంబున సుధ్యసలోకభాగధేయంబును, విబుధగంధర్వపతాకావేదియుఁ, బరిసరోద్యానవాటికాసరసకాసారకహ్లారకుసుమాళిపాళికాకుసుమధూళీ సుధూళీకాసౌరభాసార సంవాసితదశదిశాముఖంబును, మఖకుండితటాకసముద్దండపుండరీకషండమకరందబిందుగంధాంధావ్యగ్రసముదగ్ర మధుపమండలాహంకార ఝంకారకోలాహల కిరంబితమకరధ్వజభుజాదండమండలీకృత కుసుమకోదండశింజినీటంకారంబును, నాఖండలాదిదిక్పాలకభరితకలితగోపురప్రాంగణంబును, బాదుకాఖడ్గఘుటికారసరసాయనమూలికాంజనాకర్షణాదృశ్యాది విద్యాసిద్ధిక్షేత్రంబును, నత్ర్యాత్రేయాగస్త్యహారీతాంబరీషాసిత భార్గవ పరాశర పారాశర్య మాండవ్య మార్కండేయ మౌద్గల్య మంకణ శౌనక శాండిల్య మందపాల వత్స వసిష్ఠ వాధూలసవాలఖిల్య కౌండిన్య కాశ్యపకణ్వగాలవగాధి గార్గ్యప్రముఖ వాలఖిల్యాద్యష్టాశీతిసహస్రసంయమిసమాకీర్ణంబును, గణికాగాంబికాకరకమలపుటఘటితకనత్కనకమణిమయడమరుకథమథమధ్యానపర్జన్యగర్జాసముజ్జృంభిత గుహశిఖండితాండవంబును మార్కండేశ్వరకుండలాముఖసంవేద్యాంతర్వేదిచాళుక్య భీమేశ్వరప్రధాననానావిధశాఖోపశాఖాతీర్థసంబాధసంభరితంబునునై యఖిలభువనభవనాభిరామంబైన దక్షారామంబును గైలాసమేరుమందరంబులకంటెను, గాంచీ చిదంబర కాళహస్తి కాశి శ్రీశైలాది మహాస్థానంబులకంటెను, సేతు కేదారంబులకంటెను, నతిశయంబుగాఁ జేసి నాక్షేత్రంబునుమరగి గరళకరాటకృపీటభవజ్వాలానష్టంభంబు సంస్తంభించి, త్రిపురదైతేయమదవతీగండభాగమకరికాపత్త్రభంగంబులు దొలంగించి భీమలింగంబు సర్వమంగళాదేవియుం దాను లోకరక్షణార్థంబుగా నధిష్ఠించియుండును. ౭౬

తే. దేవదర్శనమాత్ర సం♦ధిల్లు భుక్తి, కొందఱకు దక్షవాటికా♦క్షోణియందు
దేవదర్శనమాత్ర సం♦ధిల్లు ముక్తి, కొందఱకు దక్షవాటికా♦క్షోణియందు. ౭౭

తే. గీతవాదిత్రనృత్యంబు ♦ కేవలంబు, శంభునకు సార్వకాలంబు♦ సంభ్రమింప
నప్సరస్త్రీల నర్పించె ♦ నాలునాలు, బాలలను యువతుల జంభ♦భంజనుండు.

శా. ఆవంశంబున సానికూఁతులయి ది♦వ్యస్త్రీలు దుగ్ధాబ్ధిమ
ధ్యావిర్భూతలు మీనకేతనుని పు♦ష్పాస్త్రంబు లెక్కాలముం
సేవానిష్ఠఁ గొల్తు రిందుధరునిన్ ♦ శ్రీదక్షవాటీశ్వరుం
గైవల్యాధిపు భీమనాథుని లస♦త్కారుణ్యపాథోనిధిన్. ౭౮

వ. మఱియు మహనీయ దేవగంధర్వాప్సరో వేశ్యాజాతిసంజాతకాంతాచికురతిమిరాంగ
సుమంగళవిభావరీ లలాటశశికళాపిలాసద్యుతి సుభ్రూలతాలాసికాలాస్యలలితరంగ
భూమియు, నయనశంబరానుబంధనవకందర్పపతాకయు, నధరబంధూకకుసుమ
యు, వికాసవిభ్రమశర ద్వైశాకంబుకమనీయకంఠయు, బిబ్బోకసరిదంబుధివేణి
యుఁ, భృకులతాచక్రవాకియుఁ, గరపల్లవస్ఫురణపర్యాయవల్లీమతల్లి పన్నగపరి
వృత్తునుం బోలెఁ బ్రకటితవిలాసపన్థలీలయుం బోలె, రతిసుఖసంపత్సంపాదనలం
పటకు ముదినియుం బోలె, రాజానుకూలదర్శన కేశభరంబునఁ గృష్ణవదన, వచో
మనోహరత్వంబున మంజుఘోష, మధ్యంబున మందోదరి, యూరుయుగళంబున
రంభ, కనకభూషణధారణంబున పద్మిని, సురతకళాకౌశలంబున దక్షిణ, తనువున
భద్ర, పుష్పాస్త్రద్వితీయజన్మభూమి కారుణ్యవతి, తారుణ్యవతి, కాంతిమతి, కమ
నీయవతి, వినయవతి, విభ్రమవతి, విజ్ఞానవతి, వితీర్ణవతి, త్రపావతి, భూషణవతి,
భూషణమరీచిజాలాకారవిగ్రహయగుట విద్యుద్దండంబువలనను బ్రసవపరిమళ
హారిణియగుటం బారిజాతకోరకంబులవలనను, నిశ్వాసామోద కారిణియగుట
మలయమారుతంబువలనను, నిఖిలేంద్రియామోద కారిణియగుట నటనామృతంబు
వలనను, మాధుర్యజన్మభూమియగుట నిక్షుకాండంబువలనను, బ్రభవించెనో
యనఁ బ్రశంసాస్పదంబైయుండు నవ్వంశంబునం దిందుముఖుల యాననచంద్ర
మండలంబుల యందభ్యర్ణరోహిణీ పాశశృంఖలోద్వృత్తినింబోలె లాంఛనహారి
ణంబు ప్రవేశింపవెఱచు; నాచంచలాక్షుల దృగంచలస్ఫురణంబు లించువిలు
కానికిం బంచబాణంబులు పువ్వులగుట నవ్వుటాలమాట; యప్పణంతుల లలాట
కస్తూరితిలకంబు దప్పకునకు ధవళాతపత్రంబు శశాంకబింబంబనుట బొంకు. ఆ
పువ్వుఁబోణుల కటిపంకకనుబొమ్మలె యంగజునకు సింగిణివింట్లల్లచెఱకు విల్ల
నుట కల్ల; యక్కోమ్యలుల నెత్తావి యూర్పుగాడ్పులె పుష్పబాణునకుఁ బ్రాణ
సఖులు చందనాచలసమీరణంబు సఖుండనుట యకారణచిత్తప్రశ్నావహంబు.

అది గావున మత్తమయూరికా నాయక గర్భజనిత లైన యామానులు సానురాగం
బున నీశానుని, భీమేశ్వరుని ఘుసృణముకుళితాపాంగంబులు కుంచితాకుంచిత
భ్రూతంబులు విస్మయోత్పాదనతానకంబులు, ప్రసన్నంబులు, ప్రేమరసపూర్ణ
త్రపావృతారంభంబులు, సలలితంబులు, పులకావళీకారణంబులు, భావజగర్భి
తంబులు, విస్తృతనిమేషంబులు నైనవీక్షణంబులం దదీయలావణ్యపూరంబానా
దింపవిధంబు నభినయించుచుం దెల్పుచందంబున హృదయంబు నాకర్షించుచా
ద్యపరం జామరవ్యజనపేటికాకరండపాదు కాముకురదీపికాసంగీత నాట్యాద్యుప
చారసేవావిశేషంబులం బ్రతిసంధ్యంబును బాల్యంకికా సేవాబహిర్విదయాది
భోగావసరసమయంబున సేవించుచుండుదురు. ౮౦

తే. దక్షవాటీపురీచతు♦ర్ద్వారములను, భీమమండలికాపుణ్య ♦ భూమియందు
శంభులింగప్రతిష్ఠలు ♦ సంఘటించి, యెల్ల వేల్పులు ప్రార్థించి ♦ రిందుధరుని.

వ. ప్రార్థించి శ్రీభీమేశ్వరమహాదేవునివలన నాత్మప్రతిష్ఠితశంభులింగంబులకు ననరం
బులడిగిన సర్వమహాపాతకుండు వారికోరినట్లు భుక్తిముక్తిప్రదానసామర్థ్యంబులు,
స్వలింగంబులకుం గలుగ ననుగ్రహించె. ౮౨

తే. స్తుతింపుచునకు భీమ♦శంకరునకు, దక్షమునీంద్రేశ్వరము పాప♦నాశనంబు
దృష్టిమాత్రన భుక్తిము♦క్తిప్రదంబు, దేవలోకాధిపతిసంప్ర♦తిష్ఠితంబు. ౮౩

కం. భీమయదేవుని దక్షిణ, భూమీభాగమున యజ్ఞ♦పురుషేశ్వరది
వ్యామృతలింగము భోగ, శ్రీముక్తివిభూతిదాయి ♦ సేవకతతికిన్. ౮౪

ఆ. అగ్నికుండ మనంగ ♦ నచ్చోటనున్నది, ధాత్రిభుక్తిముక్తి ♦ ధాతునీవి
దానం దీర్థమాడి ♦ తర్పణ మొనరింపం, బితరు లూర్ధ్వలోక♦గతులుగంద్రు. ౮౫

తే. సత్రికాతారకంబులం ♦ గీలుకొన్న, దినముసం దగ్నికుండికా ♦ తీర్థమాడి
శంభునగ్నీశ్వరునిం జూచు ♦ సజ్జనులకు, లలితకరతలధాత్రీఫ♦లంబుముక్తి. ౮౬

సీ. అగ్నీశ్వరుని ప్రాంత ♦ నగ్నికుండికకూప, తటదేశమునయందు ♦ దక్షకుండి
యదిసర్వపాపౌఘ ♦ ముదిరఝంఝానిలం, బాకూపమునకు యా♦మ్యంబునందు
దాక్షాయణీదేవి త్రైలోక్యజనయిత్రి, చలిగొండరాచూలి ♦ వెలసియుండు
దక్షకుండమునం దీ♦ర్థంబాడి యర్థితో, దాక్షాయణీదేవి ♦ దక్షపుత్రి

తే. నసితపక్షాష్టమీతిథి♦యందునొండె, మతిచతుర్దశియం దొండె ♦ మహితబుద్ధిం
జేసివందప్రణామంబు♦ సేయునరుండు, గాంచు మోక్షంబుం బ్రాణని♦ర్గతమునందు.

వ. ఆయుత్తరంబున వీరభద్రప్రతిష్ఠితంబు చెంగట నిబుతిలింగంబు భీమనాథేశ్వరు
నికిం బడమట వరుణప్రతిష్ఠితం బగు వరుణలింగంబు వరుణకుండంబునం దీర్థం
బాడి వరుణనక్షత్రంబున వరుణేశ్వరదేవుని దర్శించిననరుండు భవబంధనంబులం

బాయును; భీమేశ్వరు వాయవ్యదిగ్భాగంబున వాయుప్రతిష్ఠితం బగు వాయులింగంబుండు వాయుకుండంబునఁ దీర్థంబాడి వాయులింగంబును సందర్శించిన నరుండు మోక్షలక్ష్మిం గూడు; సోమేశ్వరలింగంబు సోమప్రతిష్ఠితంబు, సోమనక్షత్రంబున సోమకుండంబునఁ దీర్థంబాడి సోమేశ్వరదేవుని దర్శించిన నరుండు భుక్తిముక్తిసంసిద్ధిం బొందు. ౮౮

తే. బాదరాయణుఁ డత్యంత ♦ పరమనిష్ఠ, సప్తసింధుసమీపదే♦శంబునందుఁ
దపముఁ గావించి శంభుసం♦స్థాపనంబుఁ, జేసె నత్యంతభక్తివి♦శేష మమర. ౮౯

కం. పంచాక్షరమంత్రము జ, పించుచు సత్యవతిసుతుఁడు ♦ పెద్దయుఁ గాలం
బుంచిత యోగసమాధి భ, జంచెం దా సంప్రతిష్ఠ ♦ సేసినశంభున్. ౯౦

వ. ఒక్కనాఁ డమ్మహాదేవుండు త్రిగుణమూర్తులగు బ్రహ్మవిష్ణుమహేశానులచే సముపాస్యుండగును బాదరాయణునకుఁ బ్రత్యక్షం బగుటయు. ౯౧

మ. కురిసెం బుష్పపువాన సుస్వనఘలీ♦టోత్కారహాలాన్వితమై
విరిసెం దిక్కులు మందమందగతులన్ ♦ వీచె న్నభస్వంతుఁ డుర్
మొరసెం దుందుభు లొక్కుమ్మడి నభో♦మూర్ధావకాశంబునం
బొరసెన్ సమ్మద మెల్లలోకముల క♦ప్పుణ్యావహాకాలంబునన్. ౯౨

కం. ఆడిరి యచ్చరలేమలు, పాడిరి గంధర్వపతులు ♦ పరమమునీంద్రుల్
గూడిరి బహువిధములఁ గొని, యాడిరి యందంద నద్భు♦తావహభంగిన్. ౯౩

కం. కొందఱు తాండవమాడిరి, కొందఱు పరిహాసకేలిఁ ♦ గొఱలిరి మఱియుం
గొందఱు బాహాయుద్ధం, బందంద ఘటించి రస్త♦హాసంఘమునన్. ౯౪

వ. వ్యాసర్షి ననుగ్రహం బొసఁగి యప్పరమేశ్వరుండు కూడినయశేషమునులకు సర్వయోగీశ్వరులను సకలదేవతలను నుద్దేశించి యిట్లని యానతిచ్చె. ౯౫

కం. ఈ యున్నవారలందఱు, నాయానతి వినుఁడు నెమ్మ♦నంబుల లోనం
బాయం బెట్టుఁడు సంశయ, మీయర్థము వేదములకు ♦ నెక్కుడు సుండీ. ౯౬

తే. అర్కుఁ డెబ్భంగి నభమున♦కాభరణము, భువనముల కెల్ల నాభంగి♦భూషణంబు
దక్షవాటీపురము భోగ♦మోక్షవిభవ, పావనం బందు విశ్వాస♦పరులు గండ్రు. ౯౭

కం. త్రిభువనములయందును మా, కభిమతములు పెక్కులైన ♦ నారామము లం
దభిమానమింత సేయము, విభవాస్పద మైనదక్షు ♦ వీటిం బోలెన్. ౯౮

తే. వినుఁడు సత్యంబు సత్యంబు ♦ వెండి సత్య, మాత్మలో నవిచారించి ♦ యానతిత్తు
దక్షవాటంబు కంటెఁ దీ♦ర్థంబు నిఖిల, మేదినీమండలంబున ♦ లేదు లేదు. ౯౯

గీ. వాఁడిగోర్లొండెఁ గన్నులు ♦ దోఁడియైన, నడుగు లడిదంబు చేతఁ ద♦క్కడచియైన
నొండుకడ కేగుటలు మాని♦యుండవలయు, దక్కుమాటలు దక్షవా♦టంబునందు.

కం. తిష్ఠప్రాప్తునకైన వ, సిష్ఠప్రతిమానుఁడైన ♦ శిష్యునకైనన్
నిష్ఠాశ్వగలిగెనేనియు, నిష్ఠాకాలంబుముక్తి ♦ నియతం బచటన్. ౧౦౧

ఆ. బ్రహ్మహత్యసురా♦పానంబు గురుతల్ప, గమనమాదిగాఁగఁ ♦ గలుగునట్టి
పాతకంబులప్పుడె♦పాయు మానవులకు, దక్షవాటిభీము ♦ దర్శనమున. ౧౦౨

వ. అని యిట్లు స్కందమహాశి యానతిచ్చి యంతర్ధానంబుచేసెఁ తదనంతరం బాహరి విరించి పురందరాదులగు బృందారకులును సనకసనందనసనత్కుమారసనత్సుజాతులగు బ్రహ్మయోగీశ్వరులును, మార్కండేయ మాండవ్యపాల మాండల్య మాండవ్య మంకణాదులగుమహామునులును, బాదరాయణు నభినందించుచు, నిజస్థానంబులకుం జనిరి. ౧౦౩

సీ. సప్తగోదావరి♦స్నానంబు దానునా, ధానసేకనము పి♦తౄర్చనంబు
రాజగయాపిత్ర♦శ్రాద్ధంబు గౌరీజ, నార్దనసుప్రస ♦ న్నానుజపము
పరగమహాదివ్య♦భావనానార్చనా, భవనప్రదక్షిణ ♦ ప్రక్రమంబు
పంచాక్షరీమంత్ర♦పారాయణజపంబు, పాశుపతాచార ♦ పరమనియతి

తే. సమయురుదిసర్వదేవతా ♦ సార్వభౌము, భుక్తిముక్తిప్రదాయకు ♦ భువనభర్త
భీమనాథేశ్వరేశ్వరు ♦ స్వామిఁగొలుచు, భక్తులకునెల్ల నాగమ♦పద్ధతియిది. ౧౦౪

మ. పదారేశ్వరకుంభసంభవవిభుల్ ♦ ప్రాగ్దిగ్విభాగంబులం
బువిధ్వంసికి దూరదేశమునఁదా♦భోగంబునన్ శశ్వదా
పాణద్వారమునన్ మహామహిమచే ♦ వాయువ్యదిక్సీమ ను
ద్ధతన్ వాయుశివుండునుం బ్రమిగులం ♦ దాత్పర్యశ్రద్ధాగతిన్. ౧౦౫

సీ. దక్షవాటీమహా♦స్థానంబులో లేని, యమృత స్థానంబు♦నందు లేదు
దక్షవాటీమహా♦స్థానంబులో లేని, యగ్నిమేస్థానంబు♦నందు లేదు
దక్షవాటీమహా♦స్థానంబులో లేని, యమృతమేస్థానంబు♦నందు లేదు
దక్షవాటీమహా♦స్థానంబులో లేని, యజ్ఞమేస్థానంబు♦నందు లేదు

తే. దక్షవాటిక సకలతీ♦ర్థముల కిరవు, దక్షవాటిక సకలవి♦ద్యలకుగరిడి
దక్షవాటిక విభవంబు ♦ తానకంబు, దక్షవాటిక శివునియం♦తఃపురంబు

వ. ఇట్టిమహామహిమంబుగల దక్షారామంబున నభివసింపుదము, భీమమండలంబు దర్శింపుదము, సప్తగోదావరమున నాడుదము, వృద్ధగంగాజలంబులఁ దేలుదము తుల్యభాగాతోయంబుల మునుఁగుదుము, కృష్ణవాహిని నవగాహింతము, కౌంతేయంబున నోలలాడుదము, లవణపయోనిధి గంగాసంగమంబులం నభిషేకింతము, రంజని హర్షోత్కర్షంబున రోమహర్షణతనయుండు సూత్యాహాసంభవుండు నిఖిలపురాణవ్యాఖ్యానవైఖరీసమేతుం డైన సూతుండు పల్కినవిని నైమిశారణ్యపుణ్యా

క్షేత్రంబున ద్వాదశవార్షికపరిమితం బైన సత్త్రయాగంబునం గూడినశౌనకాది మహామునులు, యజ్ఞావసానసమయంబున శ్రీమన్మహాదేవుని సందర్శింపం జనిరి. ఇది పంచాశత్ఖండమండితంబును, సనత్కుమారసంహితాది బహుసంహితాసంధానంబును నైనస్కాందపురాణంబునందు గోదావరీఖండంబునందుం జెప్పంబడిన భీమఖండంబు, భీమేశ్వరమాహాత్మ్యంబును, భీమేశ్వరపురాణం బనంబరఁగు నిమ్మహాప్రబంధంబు వ్రాసినం, బఠించిన, వినినం, బుస్తకం బర్చనచేసిన, నారాధించిన, శ్రీభీమనాథేశ్వరుం డాయురారోగ్యైశ్వర్యంబులు, శాశ్వతమోక్షపదంబును గృపసేయు. ౧౦౭

ఉ. వైభవపాకశాసన! సు♦వర్ణ మహీధర ధైర్యసార! గే
హోభయవంశదీపక! స♦ముద్ధతపీకవిరోధిమండలి
క్షోభకరప్రతాప! ఫణి♦కుండలిభక్తనిధీ! దిగంతగం
ధేభకటస్రవన్మదస♦మృద్ధ్యయశఃపరివంబు నిత్యరా. ౧౦౮

కం. రామాంబానందన! సం, గ్రామజితధనంజయా! ప♦రాక్రమరామా
స్వామిద్రోహరగండ! సు, హామాత్యకిరీటశేఖ♦రామాత్యమణీ. ౧౦౯

భుజంగప్రయాతము. ప్రధూతాత్కార్యసామంత ♦ రతౌఘధురీణా
విధూతాంససేవాప్ర♦వృత్తాంతరంగా
సుధూళీసుధాసార ♦ మాధుర్యవాక్యా
బుధాగాధనాసార ♦ భోజావతారా ౧౧౦

గద్యము. ఇది శ్రీమత్కమలనాభపౌత్త్ర మారయామాత్యపుత్త్ర సుకవిజనవిధేయ సకల విద్యాసనాథ శ్రీనాథనామధేయప్రణీతం బైన శ్రీభీమేశ్వరపురాణంబను మహాప్రబంధంబునందు సర్వంబును షష్ఠాశ్వాసము.

శ్రీమాణిక్యాంబాసమేత శ్రీ భీమేశ్వరార్పణమస్తు.

శ్రీరామార్పణమస్తు.